సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 199
సోమవారం 9-10-2023
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'సామాన్యులకు వైద్యం ఏనాడూ ఖరీదుగా ఉండకూడదు. అందుకే అందరికీ ఆరోగ్యశ్రీ'


తడబడినా... గెలిచారు
ప్రపంచకప్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై ఆరు వికెట్లతో నెగ్గిన భారత్. -12లో



కార్డ్ లిమిట్ పెంచుకుంటున్నారా?
సీయూఆర్ 30 శాతం మించొద్దు.. లేదంటే క్రెడిట్ స్కోరుపై ప్రభావం -13లో


ఎన్నికల వ్యూహమే ఎజెండా?
లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ వ్యూహాలకు మరింత పదును పెట్టేందుకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ నేడు భేటీ కానుంది.
వివరాలు 6లో ▸


'ఆదిత్య' మార్గాన్ని చక్కదిద్ది...
ఆదిత్య–ఎల్1 ఉపగ్రహ మార్గాన్ని సరిదిద్దే ప్రక్రియను సజావుగా నిర్వహించినట్లు ఇస్రో ఆదివారం ప్రకటించింది.
వివరాలు 6లో ▸


బోర్డు పరీక్షలు.. ఏటా రెండుసార్లు
పది, పన్నెండో తరగతి బోర్డు పరీక్షలను వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఏటా రెండుసార్లు నిర్వహించాలని కేంద్రం నిర్ణయించింది.
వివరాలు 6లో ▸

'ప్రొఫెషనల్'గా బోధన!
దేశవ్యాప్తంగా చాలా కాలేజీల్లో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ కోర్సుల బోధన పక్కాగా సాగేలా చూడటంపై ఏఐసీటీఈ దృష్టిపెట్టింది.
వివరాలు 3లో ▸

న్యూస్‌రీల్

సికింద్రాబాద్ టు సిద్దిపేట నెలకు రూ.440


సికింద్రాబాద్ నుంచి సిద్దిపేటకు ఒకసారి వెళ్లి రావటానికి బస్సు చార్జీ రూ.280 అవుతుండగా అదే రైలులో నెలపాటు ప్రయాణించేందుకు రూ.440 చెల్లిస్తే సరిపోనుంది. ఈ మేరకు రైల్వేశాఖ సీజన్ టికెట్ తెచ్చింది.
- వివరాలు 3లో▶

2024 ఆఖరు నాటికి పూర్తి స్థాయిలో పసిడి ఉత్పత్తి


జొన్నగిరి బంగారు గనుల్లో వచ్చే ఏడాది అక్టోబర్–డిసెంబర్ నాటికి పూర్తిస్థాయిలో ఉత్పత్తి ప్రారంభం కాగలదని డెక్కన్ గోల్డ్ మైన్స్ ఎండీ హనుమ ప్రసాద్ తెలిపారు. ప్రస్తుతం నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని ఆయన వివరించారు.
- వివరాలు 13లో▶

జనగామ బరిలో నేనే ఉంటా: ముత్తిరెడ్డి


తెలంగాణ ఆర్టీసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టినా.. జనగామలో బీఆర్ఎస్ తరఫున బరిలో తానే ఉంటానని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు.
- వివరాలు 2లో▶

70 సీట్లకు ఓకే!

సగానికి పైగా స్థానాల్లో అభ్యర్థుల ఎంపిక పూర్తి చేసిన కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ

ఈ నెల 16న లేదా 18న తొలి జాబితా విడుదలకు కసరత్తు

- బస్సు యాత్ర తర్వాత ప్రకటించే యోచన కూడా...
- మిగతా సెగ్మెంట్లకు అభ్యర్థుల ఖరారుపై మరోసారి భేటీ
- ఏకాభిప్రాయం రానిచోట ఇద్దరేసి పేర్లతో పార్టీ సీఈసీకి ప్రతిపాదనలు.. దరఖాస్తులన్నీ పరిశీలించాం: రాక్రే
- ఖరారైన సీట్లలో.. సాగర్‌లో జానా కుమారుడికి, కంటోన్మెంట్ నుంచి గద్దర్ కుమార్తె వెన్నెలకు చాన్స్..
- ఉత్తమ్ దంపతులిద్దరికీ టికెట్లు.. పాలేరు నుంచి తుమ్మల, కొత్తగూడెంలో పొంగులేటి.. గజ్వేల్‌లో నర్సారెడ్డి, సిరిసిల్లలో కేకే మహేందర్‌రెడ్డి


ఆదివారం రాత్రి ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న రాక్రే. చిత్రంలో మధుయాష్కీగౌడ్ తదితరులు

సాక్షి, న్యూఢిల్లీ/ సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల కోసం అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ ఓ కొలిక్కి తెచ్చింది. రాజకీయ అనుభవం, కుల సమీకరణాలు, ఆర్థిక పరిస్థితులు, సర్వేలను బేరీజు వేసుకుంటూ దాదాపు 70 స్థానాల్లో అభ్యర్థులను కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ ఖరారు చేసింది. కమిటీ సభ్యుల మధ్య ఏకాభిప్రాయం కుదరని మిగతా సీట్లకు అభ్యర్థుల ఎంపికపై మరోసారి భేటీ అయి చర్చించాలని నిర్ణయించింది. ఏకాభిప్రాయం రాని స్థానాలకు ఇద్దరు చొప్పున పేర్లతో జాబితా సిద్ధం చేసి పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ)కి పంపాలని.. వారు ఇచ్చే మార్గదర్శకాలకు అనుగుణంగా పేర్లను ఖరారు చేయాలని తీర్మానించింది. ఇప్పటికే ఒక్కో పేరును ఖరారు చేసిన నియోజకవర్గాల జాబితాకు సీఈసీ అనుమతి తీసుకుని విడుదల చేయాలని నిర్ణయించింది. ఈ నెల 14 తర్వాత సీఈసీ భేటీ అయి అభ్యర్థుల జాబితాలను పరిశీలించనుందని.. ఈ నేపథ్యంలో ఈ నెల 16న లేక 18న తొలి జాబితాను విడుదల చేసే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. అయితే ఈ నెల 15 నుంచి ముఖ్య నేతలతో బస్సు యాత్ర చేపట్టాలని టీపీసీసీ నిర్ణయించడంతో.. ఆ బస్సు యాత్ర పూర్తయ్యాక అభ్యర్థుల జాబితాను ప్రకటించే ఆలోచన కూడా ఉందని అంటున్నాయి.

రేపు టీపీసీసీ పీఏసీ భేటీ
- బస్సుయాత్ర షెడ్యూల్, రూట్‌మ్యాప్ ఖరారయ్యే చాన్స్
- వేములవాడ రాజన్న సన్నిధి నుంచి యాత్ర ప్రారంభించే యోచన - 2లో

వాడీవేడిగా సమావేశం..

అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ ఆదివారం ఢిల్లీలోని కాంగ్రెస్ వార్‌రూమ్‌లో భేటీ అయింది. కమిటీ చైర్మన్ మురళీధరన్ అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో రాష్ట్ర వ్యవహారాల
మిగతా 2వ పేజీలో ▶

హెరాత్ ప్రావిన్సులో ఉన్న కష్మక్ గ్రామంలో భూకంప శిథిలాల కింద కొనసాగుతున్న గాలింపు చర్యలు


అఫ్గాన్ భూకంప మృతులు 2,000 పైనే...

మరో 9,240 మందికి గాయాలు

- తీవ్ర భూప్రకంపనలతో దెబ్బతిన్న హెరాత్ ప్రాంతం
- భారీ స్థాయిలో కుప్పకూలిన మట్టి ఇళ్లు.. ఎటుచూసినా శిథిలాలతో సహాయ చర్యలకు తీవ్ర ఆటంకం

- వివరాలు 6లో▶


హెరాత్‌లోని ఓ ఆస్పత్రిలో క్షతగాత్రులకు వైద్యం అందిస్తున్న దృశ్యం




గాజా వైపు నుంచి దూసుకొస్తున్న రాకెట్లను (కుడివైపు) ఐరన్‌డోమ్ యాంటీ మిసైల్ వ్యవస్థ ద్వారా పేల్చేస్తున్న ఇజ్రాయెల్

భీకర యుద్ధం

రెండో రోజుకు చేరిన ఇజ్రాయెల్, హమాస్ ఘర్షణ

- దక్షిణ ఇజ్రాయెల్‌లో పరస్పరం కాల్పులు
- గాజాపై రాకెట్ల వర్షం కురిపించిన ఇజ్రాయెల్ సైన్యం
- ఇజ్రాయెల్‌లో 600 మంది, గాజాలో 370 మంది మృతి
- బందీలుగా ఉన్న మహిళలపై ముష్కరుల అత్యాచారాలు
- వారు మూల్యం చెల్లించుకోక తప్పదని ప్రధాని నెతన్యాహూ హెచ్చరిక
- యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో ఏకమైన దేశంలోని రాజకీయ పార్టీలు.. సంక్షోభాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు వ్యూహాలపై కసరత్తు
- అత్యవసర ప్రభుత్వంలో భాగస్వాములుగా చేరేందుకు సంసిద్ధత

- వివరాలు 6లో▶


గాజా స్ట్రిప్‌లో గాయపడిన చిన్నారిని తరలిస్తున్న హమాస్ పోలీస్ అధికారి

రంగంలోకి లెబనాన్ హెజ్బుల్లా మిలిటెంట్లు
- వివరాలు 6లో▶

ఉద్యోగులకు కొత్త హెల్త్ స్కీం

ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు తీపికబురు చెప్పిన సీఎం కేసీఆర్

మరింత నాణ్యమైన వైద్యం అందించేందుకు హెల్త్‌కేర్ ట్రస్ట్

సర్కారు నిర్ణయంతో వారి కుటుంబ సభ్యులకూ ప్రయోజనం



సాక్షి, హైదరాబాద్: దసరాకు ముందే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సీఎం కేసీఆర్ తీపికబురు అందించారు. ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత, మరింత నాణ్యమైన వైద్యచికిత్స అందించేందుకు ఎంప్లాయీస్ హెల్త్‌స్కీమ్‌ను ప్రత్యేకంగా ఎంప్లాయి హెల్త్‌కేర్ ట్రస్ట్ (ఈహెచ్‌సీటీ) ఏర్పాటు చేసి అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు వైద్యారోగ్యశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రత్యేక ఆరోగ్య పథకం అమలు చేయాలని మొదటి పీఆర్సీ కమిషన్ ప్రభుత్వానికి సూచించింది. పథకం అమలుకు ప్రత్యేకట్రస్ట్ ఏర్పాటు చేసి ఉద్యోగులు, పెన్షనర్ల నుంచి కొంత మొత్తం, అంతే మొత్తంలో ప్రతినెలా ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్‌గా జమ చేయాలని పేర్కొంది. ఈ మేరకు తమ మూల వేతనంలో ఒక శాతం కాంట్రిబ్యూషన్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ప్రభుత్వానికి గతంలోనే విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో సీఎం కేసీఆర్ ఆదేశం మేరకు
మిగతా 3వ పేజీలో ▶

15 లేదా 16న బీజేపీ ఫస్ట్ లిస్ట్



- 14న అమావాస్య కావడంతో ఆ తర్వాత ప్రకటించాలన్న యోచనలో రాష్ట్ర నాయకత్వం
- ముఖ్యనేతల భేటీలో 38 అసెంబ్లీ స్థానాలు, అభ్యర్థులపై చర్చ
- 21 చోట్ల ఏకాభిప్రాయం.. మిగతావాటిపైనా త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం.. మొత్తం 119 స్థానాలకు మూడు విడతల్లో అభ్యర్థుల జాబితా ప్రకటన - వివరాలు 2లో▶








ఆదివారం రాత్రి సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ముదిరాజ్‌ల ఆత్మగౌరవ సభకు హాజరైన ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ఈటల. చిత్రంలో నీలం మధు ముదిరాజ్

ముదిరాజ్‌ల ఆత్మగౌరవం దెబ్బతీస్తున్న సీఎం కేసీఆర్

- జనాభా ప్రకారం 11 ఎమ్మెల్యే సీట్లు ముదిరాజ్‌లకు రావాలి
- ఆత్మగౌరవ సభలో ఈటల రాజేందర్

2లో



మీకు ఓటేస్తానా..! నాదొక ప్రశ్న



నగోయాలో కలుద్దాం!

క్రీడాభిమానులను గత 16 రోజులుగా అలరించిన ఆసియా క్రీడలకు ఆదివారం తెరపడింది. చైనాలోని హాంగ్జౌ నగరంలో జరిగిన 19వ ఆసియా క్రీడలు ఘనంగా ముగిశాయి. తదుపరి ఆసియా క్రీడలు 2026లో జపాన్‌లోని నగోయా నగరంలో జరుగుతాయి. మొత్తం 45 దేశాల నుంచి 40 క్రీడాంశాల్లో 12,407 మంది క్రీడాకారులు పోటీపడిన హాంగ్జౌ ఆసియా క్రీడల్లో చైనా 201 స్వర్ణాలు, 111 రజతాలు, 71 కాంస్యాలతో మొత్తం 383 పతకాలు సాధించి అగ్రస్థానాన్ని దక్కించుకుంది. 107 పతకాలతో భారత్ తమ అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసి నాలుగో స్థానంలో నిలిచింది. ఈ ఆసియా క్రీడల్లో 13 కొత్త ప్రపంచ రికార్డులు, 26 ఆసియా రికార్డులు, 97 ఆసియా క్రీడల రికార్డులు నమోదయ్యాయి.
- వివరాలు 12లో▶

ఆ పది జిల్లాల్లో.. సైబర్ దొంగలు!

ఇందులో రాజస్తాన్‌లోని భరత్‌పూర్ టాప్

ఢిల్లీ, రాజస్తాన్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో అడ్డాలు

80శాతం సైబర్ నేరాలకు పాల్పడుతున్నది ఆ జిల్లాల నుంచే..

ఫ్యూచర్ క్రైం రీసెర్చ్ ఫౌండేషన్ నివేదికలో వెల్లడి

- వివరాలు 3లో▶

10న ఆదిలాబాద్‌లో అమిత్ షా సభ

సాయంత్రం శంషాబాద్ సభ రద్దు.. వివిధ వర్గాల ముఖ్యులు, మేధావులతో భేటీ



సాక్షి, హైదరాబాద్: ఈ నెల 10న మధ్యాహ్నం ఒంటి గంటకు ఆదిలాబాద్‌లోని డైట్ కాలేజీ గ్రౌండ్స్‌లో జరగనున్న బహిరంగసభలో బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాల్గొనున్నారు. ఇప్పటికే ఈ నెల 1న మహబూబ్‌నగర్, 3న నిజామాబాద్‌లో నిర్వహించిన సభల ద్వారా రాష్ట్రంలో పార్టీపరంగా ప్రధాని మోదీ ఎన్నికల శంఖాన్ని పూరించిన విషయం తెలిసిందే. దీనికి కొనసాగింపుగా అమిత్ షా సభను బీజేపీ నిర్వహించనుంది. 10న రాజేంద్రనగర్ నియోజకవర్గపరిధిలోని శంషాబాద్‌లో అదేరోజు సాయంత్రం అమిత్ షా సభ నిర్వహించాలని తొలుత భావించింది. అయితే ఈ సభ రద్దు అయింది. దీనికి బదులు సికింద్రాబాద్ సిఖ్ విలేజీలోని ఇంపీరియల్ గార్డెన్‌లో జరిగే మేధావుల సదస్సులో అమిత్ షా పాల్గొనున్నారు. మేధావుల సదస్సు సక్సెస్‌పై ఆదివారం సాయంత్రం బీజేపీ కార్యాలయంలో లీగల్ సెల్‌తోపాటు ఇతర మేధావులతో కేంద్రమంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి భేటీ అయ్యారు. సదస్సుకు అన్ని వర్గాల మేధావులను ఆహ్వానించి మేనిఫెస్టోలో చేర్చాల్సిన అంశాలపై వారి నుంచి బీజేపీ సలహాలు తీసుకోనుంది. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఆదివారం మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే ఏం చేస్తుందో ఆదిలాబాద్ సభలో అమిత్ షా వివరిస్తారని అన్నారు. కేసీఆర్‌కు హఠావో, బీజేపీకో జీతావో.. తెలంగాణకో బచావో... అనేదే బీజేపీ నినాదామని చెప్పారు. ప్రధాని మోదీ దిష్టిబొమ్మలను ఎందుకు దగ్ధం చేస్తున్నారో కాంగ్రెస్ నేతలు చెప్పాలని డిమాండ్ చేశారు. 'రాష్ట్రాభివృద్ధి కోసం రూ.9 లక్షల కోట్లు ఇచ్చినందుకా, ఇటీవల రాష్ట్రానికి పసుపుబోర్డు, గిరిజన వర్సిటీ వంటివి ప్రకటించినందుకా, కృష్ణానదీలో తెలంగాణ నీటి వాటా ఖరారుకు ట్రిబ్యునల్ వేసినందుకా.. మోదీ దిష్టిబొమ్మలు దగ్ధం చేస్తున్నారు' అని నిలదీశారు.

బీజేపీ ఓబీసీ మోర్చా ఫిషర్‌మెన్ సెల్ కన్వీనర్‌గా మోహన్ కృష్ణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బీజేపీ ఓబీసీ మోర్చా ఫిషర్‌మెన్ సెల్ కన్వీనర్‌గా కాపర్తి మోహన్ కృష్ణ నియమితులయ్యారు. ఈమేరకు ఆయనకు ఆదివారం ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆలె భాస్కర్ నియామక పత్రాన్ని అందజేశారు. మోహన్‌కృష్ణ ఇదివరకు జాతీయ మత్స్య సహకార సమాఖ్య డైరెక్టర్‌గా పనిచేశారు. అంతకుముందు రంగారెడ్డి జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం వైస్‌చైర్మన్‌గా పనిచేశారు.

18 మందితో బీఎల్‌ఎఫ్ తొలి జాబితా

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో బహుజనులకు రాజ్యస్థాపనే లక్ష్యంగా బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్‌ఎఫ్) పనిచేస్తుందని ఆ పార్టీ చైర్మన్ నల్ల సూర్యప్రకాశ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే 18 మంది బీఎల్‌ఎఫ్ అభ్యర్థుల మొదటి జాబితాను విడుదల చేశారు. రాబోయే ఎన్నికలలో రాష్ట్రంలోని 119 సీట్లకు బీఎల్‌ఎఫ్ పోటీ చేస్తుందని వెల్లడించారు. ఎంసీపీ(యూ) అఖిల భారత ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్ మాట్లాడుతూ.. బీఎల్‌ఎఫ్ అభ్యర్థులను గెలిపించుకుని వారిని చట్టసభలకు పంపించి రాజ్యాధికారం సాధించాలని పిలుపునిచ్చారు.

బీఎల్‌ఎఫ్ అభ్యర్థుల తొలి జాబితా

• కామారెడ్డి-ఎస్. సిద్ధి రాములు • నాగార్జునసాగర్ - పోతుగంటి కాశి • మిర్యాలగూడ - వాస్కుల గోపి • హుజూర్‌నగర్ - వస్కుల సైదమ్మ • పరకాల - గోనె కుమారస్వామి • నర్సంపేట- పెద్దారపు రమేశ్ • ఖమ్మం - లిక్కి కృష్ణారావు యాదవ్ • నకిరేకల్ - నూనె వెంకటస్వామి • నిజాంబాద్ అర్బన్ - సబ్బని లత • వర్ధన్నపేట - మాస్ సావిత్రి • వరంగల్ పశ్చిమ -గడ్డం నాగార్జున • వరంగల్ తూర్పు- సుంచు జగదీశ్వర్ • పటాన్‌చెరు - కర్ర దానయ్య • తుంగతుర్తి - వీర పాపయ్య • అచ్చంపేట- ఎలిమినేటి శ్రీశైలం • తాండూర్ - మారోజు సునీల్ • జుక్కల్ - కర్రెవార్ నాగేశ్ • ఎల్బీనగర్ - రాయబండి పాండురంగాచారి.

నేటి భవితలో..

- ఎగ్జామ్ రివ్యూ: సివిల్స్ మెయిన్స్.. కటాఫ్ 750-800! సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్.. కేంద్రంలో ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ తదితర ఉన్నత స్థాయి సర్వీసుల్లోకి అభ్యర్థులను ఎంపిక చేసే ప్రతిష్టాత్మక పరీక్ష! 2023 సివిల్స్ నోటిఫికేషన్‌కు సంబంధించి ఈ ఎంపిక ప్రక్రియలో అత్యంత కీలకమైన రెండో దశ.. మెయిన్ పరీక్షలు ఇటీవలే ముగిసాయి. జనరల్ ఎస్సే మొదలు ఆప్షనల్ సబ్జెక్ట్ వరకూ.. ఏడు పేపర్లలో డిస్క్రిప్టివ్ విధానంలో పరీక్షలు జరిగాయి. ఈ నేపథ్యంలో.. సివిల్ సర్వీసెస్ మెయిన్ తీరుతెన్నులు, ఎలాంటి ప్రశ్నలు అడిగారు, కటాఫ్ అంచనా తదితర వివరాలు..
- గ్రూప్స్ ప్రత్యేకం-కరెంట్ అఫైర్స్: పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉపయోగపడేలా.. అంతర్జాతీయం, జాతీయం, రాష్ట్రీయం, వార్తల్లో వ్యక్తులు, అవార్డులు, క్రీడలు తదితర ముఖ్యాంశాలతో వీక్లీ కరెంట్ అఫైర్స్ రౌండప్
- విద్య, ఉద్యోగ సమాచారం

నేటి భవిత పేజీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ముదిరాజ్‌ల ఆత్మగౌరవం దెబ్బతీస్తున్న

సీఎం కేసీఆర్

బీఆర్‌ఎస్ నుంచి ఒక్క ఎమ్మెల్యే సీటూ ఇవ్వలేదు

- జనాభా ప్రకారం 11 ఎమ్మెల్యే సీట్లు ముదిరాజ్‌లకు రావాలి
- ఓట్లు మావే..సీట్లు మావే నినాదంతో బీసీలు ముందుకెళ్లాలి
- ఆత్మగౌరవ సభలో ఈటల రాజేందర్



పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం జరిగిన ఆత్మగౌరవ సభకు భారీగా హాజరైన ముదిరాజ్‌లు

హైదరాబాద్: ముదిరాజ్‌ల ఆత్మగౌరవం దెబ్బతీసేవిధంగా సీఎం కేసీఆర్ బీఆర్‌ఎస్ పార్టీ నుంచి ఒక్క ఎమ్మెల్యే సీటు కూడా కేటాయించలేదని హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం జరిగిన ముదిరాజ్‌ల ఆత్మగౌరవసభలో ఈటల మాట్లాడుతూ జనాభానిష్పత్తి ప్రకారం ముదిరాజ్‌లు 11 శాతం ఉన్నారని, పదకొండుమందికి ఎమ్మెల్యేలుగా అవకాశం దక్కాలని, ఇరవై ఏళ్ల నుంచి ఇద్దరు లేక ముగ్గురు ఎమ్మెల్యేలు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నారన్నారు. తెలంగాణలో బీసీలు 52 శాతం ఉంటే... 9 మంత్రి పదవులు రావాలని, కానీ మూడు మాత్రమే ఇచ్చారని చెప్పారు. ఒకశాతం జనాభా లేని జాతి నుంచి సీఎంతో పాటు నలుగురు మంత్రులు ఉన్నారన్నారు. మేము ఈ రాష్ట్రానికి ఏటా రూ.20 వేల కోట్ల ఆదాయం ఇస్తున్నామని, కానీ మీరు చేపపిల్లల పేరిట రూ. 500 కోట్లు ఖర్చు చేస్తున్నారని, చేపపిల్లలు కాదు నేరుగా నగదు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఓట్లు మావే సీట్లు మావే నినాదంతో బీసీలు ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. అన్ని పార్టీలు ముదిరాజ్‌లకు సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్‌ల ఆత్మగౌరవ సభను అడ్డుకునేందుకు అనేక ప్రయత్నాలు చేశారని, మీటింగ్‌కు వెళితే ప్రభుత్వ పథకాలు రావని బెదిరించారని ఈటల ఆరోపించారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా, అన్నింటిని ఎదుర్కొని ఆత్మగౌరవసభకు భారీగా తరలివచ్చారన్నారు. తన 20 ఏళ్ల రాజకీయ జీవితం అందరికీ తెలుసని తాను ప్రజల మనిషినని చెప్పారు. ఎన్ని కేసులు పెట్టినా, గుండాలు చంపుతామని బెదిరించినా వెనక్కి తగ్గలేదని, రాష్ట్రంలో అన్ని కులాల సమస్యలపై గొంతెత్తి పోరాడానని గుర్తు చేశారు. ముదిరాజ్‌లను బీసీ డి నుంచి బీసీ ఏలోకి మార్చాలని తాను ఎమ్మెల్యే అయిన మొదటిరోజు నుంచే కొట్లాడుతున్నానని, వైఎస్.రాజశేఖరరెడ్డి 2008 జడ్చర్ల సభలో ముదిరాజ్‌లను బీసీడి నుంచి బీసీ ఏలోకి మారుస్తా అని చెప్పారని, అదే సభలో మైనారిటీలకు 4 శాతం రిజర్వేషన్ ప్రకటించారన్నారు. అయితే బీసీ ఏ రిజర్వేషన్ ఒక్క సంవత్సరం మాత్రమే అమలైందని, మైనారిటీ వారు ఏడుగురు ఎమ్మెల్యేలుగా ఉన్నారని, సుప్రీంకోర్టుకు వెళ్లి వారు గెలిచారని, మనకు ఎవరు లేక పట్టించుకోవడం లేదని చెప్పారు.

మేం వేరే రాష్ట్రం నుంచి వచ్చామా : నీలం మధు

కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ ఏ పార్టీ అయినా మా ముదిరాజ్‌లను గుండెల్లో పెట్టుకొని ఎవరు ఎన్ని సీట్లు కేటాయిస్తారో, వారితోనే పొత్తు పెట్టుకొని వారితోనే ఉంటామని ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు నీలంమధు చెప్పారు. ఆరోజు తెలంగాణ ఆత్మగౌరవం కోసం ఎలా పోరాడామో.. అదే ఆత్మగౌరవం ముదిరాజ్ జాతికి దక్కేలా పోరాడతామన్నారు. బీసీల్లో 60 లక్షల మంది ఉన్న ముదిరాజ్‌లకు రాజకీయ గుర్తింపు లేదా..?మేము వేరే రాష్ట్రం నుంచి వచ్చామని అనుకుంటున్నారా అని ప్రశ్నించారు. ముదిరాజ్‌లందరం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఆత్మగౌరవ సభతో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ దద్దరిల్లింది. ఈటల రాజేందర్ ప్రసంగిస్తుండగా సభకు హాజరైన పలువురు సీఎం సీఎం అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట శంకర్, పులుమేడ రాజు, చొప్పారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

70 సీట్లకు ఓకే!



కాంగ్రెస్‌వార్ రూమ్ వద్ద విద్యార్థి సంఘాల నేతలతో కలసి ఆందోళన చేస్తున్న మానవతారాయ్

▶ మొదటి పేజీ తరువాయి
ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మధుయాష్కీగౌడ్, ఎన్నికల వ్యూహకర్త సునీల్ కనుగోలు, ఇతర కార్యదర్శులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గత నెలలో ఖరారు చేసిన కొన్ని స్థానాలు సహా మొత్తంగా 70 సీట్లలో అభ్యర్థులను ఖరారు చేసి.. ఒక్కో పేరుతో జాబితాను పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) ఆమోదానికి పంపాలని నిర్ణయించినట్లు తెలిసింది. సుమారు 10 గంటల పాటు సుదీర్ఘంగా జరిగిన ఈ భేటీ ఆసాంతం నేతల వాదనలు, అభిప్రాయాలతో వాడీవేడీగానే జరిగినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. కొన్ని నియోజకవర్గాలపై సభ్యుల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడం, ఇంకొన్ని చోట్ల కుల సమీకరణాలపై ఎవరి వాదన వారే వినిపించడంతో సమావేశం హీటెక్కినట్టు పేర్కొన్నాయి. ముఖ్యంగా డోర్నకల్, మహబూబాబాద్, జూబ్లీహిల్స్, ఆసిఫాబాద్, జనగాం, నారాయణఖేడ్, ఎల్లారెడ్డి, జుక్కల్, సికింద్రాబాద్, నర్సాపూర్ నియోజకవర్గాల అభ్యర్థుల ఖరారు అంశంపై నేతలు వేర్వేరు పేర్లను సూచించినట్టు తెలిసింది. సర్వేల ఆధారంగా గెలవగలిగే వారిని ఖరారు చేయాలని కొందరు సూచిస్తే.. సీనియారిటీ, పార్టీకి పనిచేసిన అనుభవం, ఆర్థిక, కుల సమీకరణాల ఆధారంగా ఎంపిక ఉండాలని ఇంకొందరు పట్టుబట్టినట్టు సమాచారం.

వీలైనంత త్వరగా తొలి జాబితా: ఠాక్రే

ఆదివారం రాత్రి స్క్రీనింగ్ కమిటీ భేటీ అనంతరం పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్ రావ్ ఠాక్రే మీడియాతో మాట్లాడారు. పార్టీ సీఈసీ సమావేశానికి ముందు మరోమారు స్క్రీనింగ్ కమిటీ భేటీ ఉంటుందని.. వీలైనంత త్వరగా అభ్యర్థుల జాబితాను సీఈసీకి అందిస్తామని చెప్పారు. త్వరలోనే తొలి జాబితాను విడుదల చేస్తామని వెల్లడించారు. వివిధ సామాజికవర్గాల నుంచి దరఖాస్తులు వచ్చాయని, పీసీసీ నుంచి ఒక జాబితా వచ్చిందని తెలిపారు. వచ్చిన అన్ని దరఖాస్తులను స్క్రీనింగ్ కమిటీ భేటీలో పరిశీలించామని.. అన్నివర్గాలకు తగిన ప్రాతినిధ్యం ఉండేలా చూస్తున్నామని వివరించారు. అయితే టికెట్ల ఖరారులో తుది నిర్ణయం పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీదేనని చెప్పారు. త్వరలో సీఈసీ సమావేశం ఉండే అవకాశం ఉందని, వారం, పది రోజుల్లో తొలి జాబితా విడుదల చేస్తామని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు.

ఉద్యమకారులకు టికెట్లు ఇవ్వాలంటూ..

టికెట్ల కేటాయింపులో తమకు ప్రాధాన్యం ఇవ్వాలంటూ ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి సంఘాల నేతలు, ఉద్యమకారులు కాంగ్రెస్ వార్‌రూమ్ ముందు నిరసనకు దిగారు. టికెట్లు ఆశిస్తున్న కురువ విజయ్‌కుమార్ (గద్వాల), మానవతారాయ్ (సత్తుపల్లి), పున్నా కైలాశ్ నేత (మునుగోడు), దుర్గం భాస్కర్ (చెన్నూరు), కేతూరి వెంకటేశ్ (కొల్లాపూర్), ఇతర నేతలు అక్కడ ఆందోళన చేశారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన తమకు టికెట్లు ఇవ్వాలని, ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌ను అమలు చేయాలని ప్లకార్డులు ప్రదర్శించారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జితేంద్రసింగ్ వారితో మాట్లాడి, అన్ని అంశాలను పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

తొలి జాబితాలో ఉండే అభ్యర్థులు ఇలా..
(పీసీసీ వర్గాల సమాచారం మేరకు)

1. కొడంగల్ - రేవంత్‌రెడ్డి
2. హుజూర్‌నగర్ - ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
3. కోదాడ - పద్మావతి
4. మధిర - భట్టి విక్రమార్క
5. మంథని - శ్రీధర్‌బాబు
6. జగిత్యాల - జీవన్‌రెడ్డి
7. ములుగు - సీతక్క
8. భద్రాచలం - పొదెం వీరయ్య
9. సంగారెడ్డి - జగ్గారెడ్డి
10. నల్లగొండ - కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
11. అలంపూర్ - సంపత్‌కుమార్
12. నాగార్జునసాగర్ - కుందూరు జైవీర్ రెడ్డి
13. కామారెడ్డి - షబ్బీర్ అలీ
14. పాలేరు - తుమ్మల నాగేశ్వర్‌రావు
15. కొత్తగూడెం - పొంగులేటి శ్రీనివాసరెడ్డి
16. పరిగి - రామ్మోహన్‌రెడ్డి
17. వికారాబాద్ - గడ్డం ప్రసాద్‌కుమార్
18. మహేశ్వరం - చిగురింత పారిజాత నర్సింహారెడ్డి
19. ఆలేరు - బీర్ల ఐలయ్య
20. దేవరకొండ - ఎన్.బాలూనాయక్
21. వేములవాడ - ఆది శ్రీనివాస్
22. ధర్మపురి - అడ్లూరి లక్ష్మణ్‌కుమార్
23. జడ్చర్ల - అనిరుధ్‌రెడ్డి
24. నాంపల్లి - ఫిరోజ్ ఖాన్
25. కోరుట్ల- జువ్వాడి నర్సింగ్‌రావు
26. అచ్చంపేట - వంశీకృష్ణ
27. జహీరాబాద్ - ఎ.చంద్రశేఖర్
28. ఆందోల్ - దామోదర రాజనర్సింహ
29. మంచిర్యాల - ప్రేమ్‌సాగర్‌రావు
30. కొల్లాపూర్ - జూపల్లి కృష్ణారావు
31. ఆదిలాబాద్ - కంది శ్రీనివాస్‌రెడ్డి
32. వరంగల్ ఈస్ట్ - కొండా సురేఖ
33. భూపాలపల్లి - గండ్ర సత్యనారాయణ
34. షాద్‌నగర్ - వీర్లపల్లి శంకర్
35. నిజామాబాద్ అర్బన్ - ధర్మపురి సంజయ్
36. ఎల్బీనగర్ - మధుయాష్కీగౌడ్
37. కల్వకుర్తి- కసిరెడ్డి నారాయణరెడ్డి
38. అశ్వారావుపేట- తాటి వెంకటేశ్వర్లు
39. పటాన్‌చెరు - కాట శ్రీనివాస్‌గౌడ్
40. సూర్యాపేట - ఆర్.దామోదర్‌రెడ్డి
41. గద్వాల - సరితా తిరుపతయ్య
42. నాగర్‌కర్నూల్ - కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి
43. మేడ్చల్ - తోటకూర జంగయ్య యాదవ్
44. ముషీరాబాద్ - అంజన్‌కుమార్ యాదవ్
45. శేరిలింగంపల్లి - రఘునాథ్ యాదవ్
47. ముథోల్ - ఆనందరావు పటేల్
48. బెల్లంపల్లి - గడ్డం వినోద్‌కుమార్
49. ఇల్లెందు - కోరం కనకయ్య
50. చొప్పదండి - మేడిపల్లి సత్యం
51. నారాయణపేట - ఎర్ర శేఖర్
52. రామగుండం - రాజ్‌ఠాకూర్
53. వరంగల్ వెస్ట్ - నాయిని రాజేందర్‌రెడ్డి
54. గజ్వేల్ - తూంకుంట నర్సారెడ్డి
55. నిర్మల్ - శ్రీహరిరావు
56. భువనగిరి - కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి
57. పెద్దపల్లి - విజయరమణారావు
58. నర్సంపేట - దొంతి మాధవరెడ్డి
59. పాలకుర్తి - హనుమాండ్ల ఝాన్సీ
60. మహబూబ్‌నగర్ - యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
61. ఇబ్రహీంపట్నం - మల్‌రెడ్డి రంగారెడ్డి
62. ఖానాపూర్ - ఎడ్మ బొజ్జు
63. బాల్కొండ - ఆరెంజ్ సునీల్‌రెడ్డి
64. రాజేంద్రనగర్ - జ్ఞానేశ్వర్ ముదిరాజ్
65. హుస్నాబాద్ - పొన్నం ప్రభాకర్
66. తాండూర్ - వై.మనోహర్‌రెడ్డి
67. సిరిసిల్ల - కేకే మహేందర్‌రెడ్డి
68. దుబ్బాక - చెరుకు శ్రీనివాస్‌రెడ్డి
69. మల్కాజ్‌గిరి - మైనంపల్లి హన్మంతరావు
70. కంటోన్మెంట్ - వెన్నెల (గద్దర్ కుమార్తె)

15 లేదా 16వ తేదీన బీజేపీ ఫస్ట్ లిస్ట్

- 14న అమావాస్య కావడంతో ఆ తర్వాత ప్రకటించాలన్న యోచనలో రాష్ట్ర నాయకత్వం
- 21 చోట్ల ఏకాభిప్రాయం.. మిగతావాటిపైనా త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం
- మొత్తం మూడు విడతల్లో అభ్యర్థుల జాబితా



సాక్షి , హైదరాబాద్: ఈ నెల 15 లేదా 16వ తేదీన 38 మంది అభ్యర్థులతో బీజేపీ తొలిజాబితాను ప్రకటించనున్నట్టు సమాచారం. ఈ నెల 14న అమావాస్య కావడంతో పాటు పితృపక్షం ఉండటంతో, అవి ముగిశాక అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల ఫస్ట్‌లిస్ట్‌ను విడుదల చేయాలని రాష్ట్ర నాయకత్వం యోచిస్తున్నట్టు తెలుస్తోంది. శనివారం దిల్‌కుశ అతిథిగృహంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ముఖ్యనేతల భేటీలో 38 స్థానాలు, అభ్యర్థులపై చర్చ జరిగినట్టు తెలిసింది. ఈ భేటీలో 21 స్థానాల్లో అభ్యర్థుల పేర్లపై స్పష్టత రాగా, త్వరలోనే మిగతా 17 సీట్లు, అభ్యర్థులపైనా కసరత్తు పూర్తవుతుందని చెబుతున్నారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్, సహ ఇన్‌చార్జి సునీల్ బన్సల్, రాష్ట్ర ముఖ్యనేతలు డా.కె.లక్ష్మణ్, బండి సంజయ్, డీకే అరుణ, ఈటల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యనేతల నుంచి ఆయా స్థానాలకు వారు ప్రతిపాదించే పేర్లతో జాబితాలు తీసుకుని, ఇతర జాబితాలతో వాటిని సరిపోల్చి కామన్‌గా ఉన్న పేర్లపై ఏకాభిప్రాయానికి వచ్చినట్టు చెబుతున్నారు. ఇదిలా ఉంటే.. రాష్ట్రంలోని మొత్తం 119 అసెంబ్లీ స్థానాలకు గాను మూడు విడతల్లో అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారని ముఖ్యనేతల సమాచారం. లోక్‌సభ ఎన్నికల కంటే ముందుగానే అసెంబ్లీ ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో రాష్ట్రపార్టీకి చెందిన ముఖ్యనేతలతో కూడా ఎమ్మెల్యే స్థానాలకు పోటీచేయించాలనే ఆలోచనతో జాతీయ, రాష్ట్ర నాయకత్వాలున్నాయని చెపుతున్నారు. అయితే కొందరు నేతలు కేవలం లోక్‌సభకు పోటీచేసేందుకే మొగ్గు చూపుతున్నట్టుగా ఇటీవల పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీనడ్డా ఇక్కడకు వచ్చిన సందర్భంగా ఆయనకు తెలియజేసినట్టు తెలుస్తోంది. దీంతోపాటు సీఎం కేసీఆర్, మంత్రులు, బీఆర్‌ఎస్ ముఖ్యనేతలు పోటీచేసే స్థానాల్లోనూ బీజేపీ నుంచి పేరున్న ముఖ్యనేతలను బరిలోకి దించాలనే ఆలోచనతోనూ నాయకత్వమున్నట్టు సమాచారం. దీనికి తగ్గట్టుగా ఆయా స్థానాల నుంచి ఎవరెవరిని పోటీకి నిలిపితే మంచిదనే దానిపైనా రాష్ట్రపార్టీ కసరత్తు నిర్వహిస్తున్నట్టు తెలిసింది. ఇందుకు సంబంధించి పార్టీనేతల పేర్లు ఇప్పుడే బయటపెట్టకుండా కొంత కాలం పాటు వేచి చూసే ధోరణిని అవలంబించాలనే ఆలోచనతో ముఖ్యనేతలున్నట్టు తెలుస్తోంది.

కేసీఆర్ పాలన స్వర్ణయుగం

- అన్ని రంగాల్లో తెలంగాణే అగ్రగామి
- ఎన్ఐఎస్ఏయూ సభ్యులతో కల్వకుంట్ల కవిత ఇష్టాగోష్టి



లండన్‌లో ఎన్ఐఎస్ఏయూ సభ్యులతో ఎమ్మెల్సీ కవిత

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో కేసీఆర్‌పాలన స్వర్ణయుగాన్ని తీసుకొచ్చిందని, అన్నిరంగాల్లో రాష్ట్రం అగ్రగామిగా నిలబడిందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. లండన్ పర్యటనలో ఉన్న ఆమె నేషనల్ ఇండియన్ స్టూడెంట్స్ అండ్ అలుమిని అసోసియేషన్ -యూకే (ఎన్ఐఎస్ఏయూ) సభ్యులతో సంభాషించారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు కవిత సమాధానాలు ఇచ్చారు. మహిళారిజర్వేషన్లు, తెలంగాణ అభివృద్ధి, తన రాజకీయ జీవితం తదితర అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. రాష్ట్రం ఏర్పడిన వెంటనే సకలజనుల సర్వే నిర్వహించి, ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతుల వివరాలు సేకరించడం ద్వారా, వారి జీవితాల్లో మార్పు తెచ్చారన్నారు. కేసీఆర్ ప్రభుత్వం కులవృత్తుల వారిని ప్రోత్సహించేందుకు కృషి చేసిన వివరాలు వెల్లడించారు. మైనారిటీలకు ప్రత్యేక రెసిడెన్షియల్ పాఠశాలల్లో నెలకొల్పడంతో వారిలో విద్య పట్ల ఆసక్తి పెరిగిందని, గతంలో ఎన్నడూ లేనంతగా పాఠశాలలకు హాజరుశాతం పెరిగిందన్నారు. సీఎం కృషి వల్ల తెలంగాణ ప్రగతిపథంలో నడుస్తోందని, సంపద సృష్టించి గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక పరిపుష్టి చేయాలన్నది తమ అధినేత కేసీఆర్ ఆలోచన అని తెలిపారు.

మహిళా రిజర్వేషన్ల కోసం పోరాటం

తాను ప్రజాజీవితంలోకి వచ్చిన తర్వాత తరచూ లేవనెత్తిన అంశాల్లో మహిళా రిజర్వేషన్ల అంశం ఒకటని తెలిపారు. మహిళా రిజర్వేషన్ల చట్టం అమలును డీలిమిటేషన్‌కు ముడిపెట్టడం సరికాదన్నారు. మహిళా రిజర్వేషన్లపై ప్రజల్లో అవగాహన వస్తోందని.. తెలంగాణ స్థానిక సంస్థల్లో 55-57 శాతం మహిళా ప్రజాప్రతినిధులు ఉన్నా, సమావేశాలు నిర్వహిస్తే ఎక్కువ పురుషులు కనిపిస్తారని, ఆ పరిస్థితి మారాలని చెప్పారు.

ప్రజల జీవితాల్లో మార్పు కోసమే రాజకీయాల్లోకి..

తెలంగాణ కోసం కరీంనగర్ ఎంపీ పదవికి రాజీనామా చేసి తిరిగి కేసీఆర్ పోటీ చేసినప్పుడు మొదటిసారి రాజకీయ ప్రచారం చేశానని కవిత గుర్తు చేశారు. ఓ గ్రామీణ మహిళ తనకు రూ. వెయ్యి ఆదాయం ఎక్కువగా వస్తే పిల్లలను చదివించుకోగలనని అన్నారని, ఆ సమయంలోనే ప్రజాజీవితంలోకి వచ్చి ప్రజల జీవితాల్లో మార్పు తేవడానికి కృషి చేయాలని నిర్ణయించుకున్నానని వెల్లడించారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చానన్నారు.

అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం | సహకరించడం లేదు

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని సన్మానిస్తున్న లాలాపేట బస్తీ సంక్షేమ సంఘాల నేతలు

లాలాపేట (హైదరాబాద్): హైదరాబాద్ నగర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వానికి సహకరించడం లేదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఆయన ఆదివారం తార్నాక డివిజన్ లాలాపేటలోని బస్తీలో పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీ వాసులంతా పలు సమస్యలను కేంద్రమంత్రి దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బస్తీ వాసులు కిషన్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... హైదరాబాద్ నగరంలోని బస్తీలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. హైదరాబాద్ మొత్తం సింగపూర్, డల్లాస్ అయినట్లు బీఆర్‌ఎస్ నేతలు మభ్యపెడుతున్నారని ఎద్దేవా చేశారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు, బంధులు వంటి పథకాల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో నాలుగు రైల్వే స్టేషన్ల నిర్మాణం చేపట్టిందన్నారు. చర్లపల్లిలో మరో టెర్మినల్ నిర్మాణంలో ఉందన్నారు. సికింద్రాబాద్, నాంపల్లి రైల్వేస్టేషన్లను ఆధునీకరిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ చుట్టూ ట్రిపుల్ ఆర్ రోడ్డును రూ.26 కోట్లతో మంజూరు చేశామన్నారు. సర్వే ఆఫ్ ఇండియా దగ్గర రూ.450 కోట్లతో నేషనల్ సైన్స్ సిటీని మంజూరు చేశామని కానీ దాని కోసం 25 ఎకరాల స్థలం కావాలంటే రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ పార్టీ కార్యాలయాలకు తప్ప ఇప్పటివరకు సైన్స్ సిటీకి స్థలం కేటాయించలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి బీజేపీ నేతలు బండ చంద్రారెడ్డి, రాము వర్మ పాల్గొన్నారు.

జనగామ బరిలో నేనే ఉంటా

టీఎస్ ఆర్టీసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి



ముత్తిరెడ్డిని అభినందిస్తున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్

జనగామ: తెలంగాణ ఆర్టీసీ సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టినా.. జనగామలో బీఆర్‌ఎస్ తరఫున బరిలో తానే ఉంటానని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. ఆదివారం టీఎస్‌ఆర్టీసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడానికి కుటుంబసభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి హైదరాబాద్ వెళ్లిన ముత్తిరెడ్డి.. కార్యక్రమం అనంతరం 'సాక్షి'తో ఫోన్‌లో మాట్లాడారు. సీఎం కేసీఆర్ నిర్ణయమే శిరోధార్యమని, ఆ మేరకే ఆర్టీసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టినట్లు చెప్పారు. అంతకుముందు ఆయన హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో ఆర్టీసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. కుటుంబ సభ్యులతో కలిసి దేవుళ్ల చిత్రపటాల వద్ద పూజలు నిర్వహించిన అనంతరం ఫైల్‌పై తొలి సంతకం చేశారు. సీఎం కేసీఆర్ తనపై నమ్మకం ఉంచి అప్పగించిన ఈ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ సంస్థ పురోగతికి కృషి చేస్తానన్నారు. సీనియర్ ఐపీఎస్ అధికారి సజ్జనార్ ఎండీగా ఉంటూ సంస్థను లాభాల బాట పట్టించేందుకు కృషి చేస్తున్నారని, తాను కూడా సంస్థ ఉద్యోగుల్లో ఒకడిగా వ్యవహరిస్తూ సంస్థ బాగుకు యత్నిస్తానని తెలిపారు. అనంతరం ఎండీ సజ్జనార్ ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి అభినందించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉన్నతాధికారులు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల కడుపు నింపుతుంటే | మీకు మంటెందుకు?

రేవంత్‌రెడ్డికి దాసోజు బహిరంగ లేఖ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం మానవీయ కోణంలో ప్రవేశపెట్టిన సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకంపై తెలంగాణ పీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి చేసిన విమర్శలు శోచనీయమని బీఆర్‌ఎస్ నాయకుడు దాసోజు శ్రవణ్ విమర్శించారు. పేదపిల్లల కడుపు నింపుతుంటే మీ కడుపులు ఎందుకు మండుతున్నాయని ప్రశ్నించారు. ఈ మేరకు రేవంత్‌రెడ్డికి ఆదివారం బహిరంగ లేఖ రాశారు. రేవంత్‌రెడ్డికి పేదింటి పిల్లల కడుపుమంట, బాధ తెలియదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే 23 లక్షల మంది పిల్లలకు ఈ పథకం ద్వారా బ్రేక్‌ఫాస్ట్ అందుతుందని తెలిపారు. ప్రభుత్వ బడి అంటే అద్భుతమైన భవనాలు, కమ్మటి ఫలహారంతో పాటు మంచి మధ్యాహ్న భోజనం, ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, ఉచితంగా యూనిఫామ్ బట్టలు అందిస్తున్న విద్యాదాత కేసీఆర్ అని కొనియాడారు. ఏ ఒక్క విద్యార్థి కూడా ఆకలి కారణంగా చదువుకు దూరం కాకూడదని సీఎం ఈ పథకానికి శ్రీకారం చుట్టారని శ్రవణ్ తెలిపారు. కూలీనాలీ చేసుకునే వారు, ఉద్యోగాలకు వెళ్లేవారు తమ పిల్లలకు ఏమీ తినిపించకుండా స్కూళ్లకు పంపే పరిస్థితి ఉందని, వారికి పౌష్టికాహారాన్ని అందించాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రారంభించారని వివరించారు. బ్రేక్‌ఫాస్ట్ పథకం విద్యార్థుల కడుపు నింపే కార్యక్రమం మాత్రమే కాదని, పాఠశాలల్లో డ్రాపవుట్స్ తగ్గించి, పిల్లలందరినీ బడిబాట పట్టించి, విద్యావ్యవస్థలో మార్పు తెచ్చే పథకమన్నారు.

రేపు టీపీసీసీ పీఏసీ భేటీ

- బస్సుయాత్ర షెడ్యూల్, రూట్‌మ్యాప్ ఖరారయ్యే చాన్స్
- రోజుకు మూడు నియోజకవర్గాల చొప్పున 10-12 రోజుల యాత్ర
- వేములవాడ రాజన్న సన్నిధి నుంచి ప్రారంభించే యోచన

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ(పీఏసీ) సమావేశం మంగళవారం జరగనుంది. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన బస్సుయాత్ర షెడ్యూల్, రూట్‌మ్యాప్ ఖరారు చేసేందుకు గాంధీభవన్‌లో భేటీ జరగనుంది. అభ్యర్థుల ఖరారుకు సంబంధించిన స్క్రీనింగ్ కమిటీ సమావేశం కూడా ఆదివారం ఢిల్లీలో ముగిసిన నేపథ్యంలో బస్సుయాత్ర, బహిరంగసభల నిర్వహణపై కాంగ్రెస్ పార్టీ దృష్టి సారించింది. అందులో భాగంగా ఈ నెల 15 నుంచి బస్సుయాత్ర మొదలు పెట్టనుంది. వేములవాడ రాజన్న సన్నిధి నుంచిగానీ, లేదంటే జోగుళాంబ గద్వాల నుంచిగానీ ఈ యాత్ర ప్రారంభం అవుతుందని తెలుస్తోంది. రోజుకు మూడు నియోజకవర్గాల చొప్పున 10-12 రోజులపాటు యాత్ర సాగే అవకాశాలున్నాయి. కాగా, ఈ యాత్రకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియా, రాహుల్, ప్రియాంకలతోపాటు కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ కూడా హాజరవుతారని టీపీసీసీ వర్గాలంటున్నాయి. యాత్రను ప్రియాంక ప్రారంభిస్తారని, వీలును బట్టి సోనియా లేదంటే రాహుల్ గాంధీ ముగింపు కార్యక్రమంలో పాల్గొంటారని తెలుస్తోంది. ఈ యాత్ర షెడ్యూల్‌తోపాటు రూట్‌మ్యాప్‌ను పీఏసీ ఖరారు చేయనుంది.

క్లుప్తంగా...


శ్రీనివాస్


అంబర్‌కిశోర్‌ఝా

ఇద్దరు ఐపీఎస్‌ల బదిలీ

- పోలీస్ అకాడమీ అడిషనల్ డైరెక్టర్‌గా శ్రీనివాస్
- రాచకొండ పోలీస్ కమిషనరేట్ జాయింట్ సీపీగా అంబర్‌కిశోర్‌ఝా

సాక్షి, హైదరాబాద్‌: ఇద్దరు ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అవినీతి నిరోధకశాఖ డైరెక్టర్ ఏఆర్ శ్రీనివాస్‌ను తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీ అడిషనల్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. డీఐజీ హోంగార్డ్స్, టెక్నికల్ సర్వీసెస్‌గా పనిచేస్తున్న 2009 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అంబర్ కిశోర్ ఝా రాచకొండ పోలీస్ కమిషనరేట్ జాయింట్ సీపీ(అడ్మినిస్ట్రేషన్)గా బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

దీపావళి బోనస్ రూ.85 వేలు

ప్రకటించిన కోల్ ఇండియా యాజమాన్యం



సింగరేణి(కొత్తగూడెం): బొగ్గు గని కార్మికులకు ప్రొడక్షన్ లింక్ రివార్డ్ (పీఎల్‌ఆర్) దీపావళి బోనస్‌ను కోల్ ఇండియా యాజమాన్యం ప్రకటించింది. కోల్ ఇండియా పరిధిలోని సుమారు 3.50 లక్షల మంది కార్మికులకు ఈ బోనస్ అందనుంది. ఈ మేరకు ఆదివారం ఢిల్లీలో కార్మిక సంఘాలతో నిర్వహించిన సమావేశంలో ఒక్కో కార్మికుడికి రూ.85 వేల చొప్పున చెల్లించాలని యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. గతేడాది దీపావళి బోనస్ రూ.76,500 చెల్లించగా, ఈ సంవత్సరం రూ.1.20 లక్షలు ఇవ్వాలని కార్మిక సంఘాలు పట్టుబట్టాయి. చివరకు గతేడాది కంటే రూ.8,500 పెంచి రూ.85 వేల చొప్పున చెల్లిస్తామని ప్రకటించింది. అయితే ఈ పీఎల్‌ఆర్ బోనస్‌ను సింగరేణి కార్మికులకు మాత్రం దీపావళికి వారం, పది రోజుల ముందు చెల్లిస్తుండగా, ఇతర ప్రాంతాలవారికి దసరా ముందు చెల్లిస్తున్నారు.

మార్క్‌ఫెడ్ ఎండీగా సత్యనారాయణరెడ్డి



సాక్షి, హైదరాబాద్‌: మార్క్‌ఫెడ్ ఎండీగా సీహెచ్‌పీ సత్యనారాయ ణరెడ్డిని రాష్ట్ర ప్రభు త్వం నియమించింది. ఈమేరకు వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి మంత్రి వద్ద ప్రైవేట్ సెక్రటరీగా పనిచేస్తున్న సత్యనారాయణరెడ్డి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు.

భారతీయులను క్షేమంగా తీసుకొస్తాం

కేంద్ర మంత్రి మీనాక్షి లేఖి



సాక్షి, అమరావతి/మంగళగిరి: ఇజ్రాయెల్‌లో ఉన్న భారతీయులను సురక్షితంగా భారత్‌కు తీసుకువచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలను పరిశీలిస్తున్నట్టు కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి మీనాక్షి లేఖి చెప్పారు. ఆమె ఆదివారం విజయవాడలో మీడియాతో మాట్లాడారు. ఇజ్రాయెల్‌లో కొనసాగుతున్న పరిణామాలను ప్రధానమంత్రి కార్యాలయం, విదేశాంగ శాఖ ఎప్పటికప్పుడు పరిశీలిస్తోందని, అక్కడ ఉన్న భారత పౌరులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో ఎంత మంది భారతీయులు ఉన్నారన్న విషయంపై ప్రస్తుతం తన వద్ద కచ్చితమైన సమాచారం లేదని, ఆ వివరాలన్నీ ఎంబసీ అధికారులు సేకరిస్తున్నారని వివరించారు.

నేటి నుంచి ఆర్జిత సేవలు ప్రారంభం



కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో సోమవారం నుంచి ఆర్జిత సేవలు యథావిధిగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో వెంకటేశు తెలిపారు. గత నెల 18న వినాయక చవితి రోజు నుంచి 21 రోజుల పాటు బ్రహ్మోత్సవాలు, ప్రత్యేక బ్రహ్మోత్సవాల నిర్వహణ నేపథ్యంలో ఆర్జిత సేవలు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. మళ్లీ సోమవారం ఉదయం 11 గంటల నుంచి తిరిగి స్వామివారి ఆర్జిత సేవలను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

'ప్రొఫెషనల్'గా బోధన!

కంప్యూటర్ కోర్సుల నిర్వహణపై ఏఐసీటీఈ ప్రత్యేక ఫోకస్

సాక్షి, హైదరాబాద్‌: దేశవ్యాప్తంగా చాలా కాలేజీల్లో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ కోర్సుల బోధన పక్కాగా సాగేలా చూడటంపై అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) దృష్టి పెట్టింది. కొత్త కోర్సులకు అనుగుణమైన నైపుణ్యాలు ఉన్న, సమర్థవంతంగా బోధించగల ఫ్యాకల్టీని కాలేజీలు నియమించుకోవడాన్ని తప్పనిసరి చేయనుంది. నాణ్యత ప్రమాణాల్లేని ఫ్యాకల్టీ ఉన్నట్టు గుర్తిస్తే.. సంబంధిత కాలేజీపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే కాలేజీ గుర్తింపు రద్దు చేయాలని భావిస్తోంది. ఈ దిశగా చేపట్టాల్సిన చర్యలు, అమలు చేయాల్సిన నిబంధనలతో కూడిన సమగ్ర నివేదికను రూపొందించింది. కేంద్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు దాన్ని పరిశీలించి, సూత్రప్రాయంగా అంగీకారం కూడా తెలిపారు. ఆ నివేదిక ప్రకారం.. కొత్తగా అందుబాటులోకి వస్తున్న కీలక కంప్యూటర్ కోర్సులను బోధిస్తున్న వారి అర్హతలను గుర్తింపు ఇచ్చే యూనివర్సిటీలే కాకుండా ఏఐసీటీఈ కూడా ప్రత్యేకంగా పరిశీలించనుంది. ఇందుకోసం కొన్ని బృందాలను ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ఈ సంస్కరణలను ఈ ఏడాది నుంచే అమల్లోకి తేవాలని భావించినా.. కొన్ని అనుమతుల దృష్ట్యా వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రవేశపెట్టాలని యోచిస్తున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. త్వరలోనే విధివిధానాలు ఖరారు చేసే అవకాశం ఉందని వెల్లడించాయి.



- దేశవ్యాప్తంగా కాలేజీల్లో బోధన విధానాలపై ప్రత్యేక నిబంధనలు
- అధ్యాపకుల అర్హతలేమిటో ముందే వెల్లడించాలి
- కోర్సులకు తగిన నైపుణ్యం ఉందో లేదో పరిశీలించాలి
- నాణ్యతా ప్రమాణాల్లేని ఫ్యాకల్టీ ఉంటే కాలేజీల అనుమతులు రద్దు
- ఏఐసీటీఈ నివేదికకు కేంద్ర విద్యాశాఖ సూత్రప్రాయ ఆమోదం
- వచ్చే విద్యా సంవత్సరం నుంచే అమల్లోకి.. విధివిధానాలపై త్వరలో స్పష్టత

ప్రొఫెషనల్స్‌తోనే పాఠాలు

ఇంజనీరింగ్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి కోర్సులను ప్రత్యేక నైపుణ్యంతో బోధించాల్సి ఉంటుందని ఏఐసీటీఈ స్పష్టం చేస్తోంది. చాలా కాలేజీల్లో గత రెండేళ్ల జరిపిన అధ్యయనంలో ఆ తరహా బోధన కనిపించలేదని పేర్కొంటోంది. కాలేజీలు ఎంటెక్ పూర్తి చేసిన సాధారణ ఫ్యాకల్టీతో కోర్సుల బోధన కొనసాగిస్తున్నాయి. వారు కృత్రిమ మేధ (ఏఐ), ఏఐఎంఎల్, డేటాసైన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి కోర్సులను ఆన్‌లైన్‌లో సెర్చ్‌చేసో, అప్పటికప్పుడు నేర్చుకునో బోధిస్తున్నారు. వారికి ప్రాక్టికల్ అనుభవం ఉండటం లేదు. అలాంటి వారు సమర్థవంతంగా బోధించలేరని ఏఐసీటీఈ అభిప్రాయానికి వచ్చింది. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నిపుణులంతా వృత్తిలో ప్రాక్టికల్ నాలెడ్జ్ ద్వారా నైపుణ్యం సంపాదించిన వాళ్లే. ఈ క్రమంలోనే వివిధ కంపెనీల్లో పనిచేస్తున్న నిపుణులను బోధనకు అనుమతిస్తూ ఏఐసీటీఈ నిర్ణయం తీసుకుంది. ఇక ముందు ప్రతీ కాలేజీలోనూ అలాంటి వారు తప్పనిసరిగా ఉండాలనే నిబంధన తెచ్చే ఆలోచన చేస్తోంది. ముఖ్యంగా వివిధ రంగాల్లో స్థిరపడ్డ పూర్వ విద్యార్థుల చేత పాఠాలు చెప్పించాలని భావిస్తోంది. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో దీనిని అమలు చేయాలని నిర్ణయించింది. కాలేజీలకు అనుబంధ గుర్తింపు ఇచ్చే ముందే కృత్రిమ మేధ, సైబర్ సెక్యూరిటీ, డేటాసైన్స్ కోర్సులు బోధించే అధ్యాపకుల వివరాలు తెప్పించుకుని.. వారికి అర్హత ఉంటేనే గుర్తింపు ఇవ్వాలనే నిబంధనను అమలు చేసేందుకు సిద్ధమవుతోంది.

కీలక కోర్సుల బోధనలో..

దేశవ్యాప్తంగా సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ వంటి సంప్రదాయ ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేవారి సంఖ్య తగ్గుతోంది. తెలంగాణలో 1.05 లక్షల ఇంజనీరింగ్ సీట్లు ఉంటే.. ఇందులో 58శాతం కంప్యూటర్ కోర్సులవే. సంప్రదాయ ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు 50 శాతం దాటడం లేదు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్, బ్లాక్ చైన్ టెక్నాలజీ వంటి సరికొత్త కోర్సులకు విద్యార్థులు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ కొత్త కోర్సులు మొదలై రెండేళ్లు గడుస్తున్నా చాలా కాలేజీల్లో బోధన సాధారణ కంప్యూటర్ సైన్స్ కోర్సుల మాదిరిగానే ఉంటోందని ఏఐసీటీఈ గుర్తించింది. ఇప్పటికే కంప్యూటర్ కోర్సులు చేసిన విద్యార్థుల్లో కేవలం 8 శాతం మందిలో మాత్రమే సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి అర్హత గల నైపుణ్యం ఉంటోందని తేల్చింది. ఈ నేపథ్యంలో బోధన విధానంలో గణనీయమైన మార్పుల దిశగా అడుగులు వేస్తోంది.

ప్రొఫెషనల్స్ సేవలు ఎంతో అవసరం



వివిధ కంపెనీల్లో పనిచేస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నిపుణులు సంబంధిత కోర్సు చేయకున్నా.. కావాల్సిన అనుభవం ఉంది. కాలేజీల్లో పనిచేసే కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ అధ్యాపకులకు ఎంటెక్ సర్టిఫికెట్లు ఉన్నా ఈ కోర్సులను బోధించే అనుభవం తక్కువ. అందుకే ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో కొత్త కంప్యూటర్ కోర్సులను బోధించేందుకు పూర్వ విద్యార్థుల సాయం తీసుకుంటున్నాం. అమెరికాలో ఓ ఏఐ ప్రొఫెషనల్ వారానికి కొన్ని గంటలు ఆన్‌లైన్ ద్వారా బోధిస్తున్నారు. స్థానికంగా ఉద్యోగాలు చేసేవారు నేరుగా క్లాసులు చెబుతారు. దీనివల్ల నాణ్యత పెరుగుతుంది. ఎంటెక్ చేసిన ఫ్యాకల్టీకి కూడా ప్రొఫెషనల్స్ ద్వారా క్లాసులు చెప్పించాలి. అప్పుడే భవిష్యత్‌లో కొత్త కోర్సులకు అధ్యాపకులు అందుబాటులో ఉంటారు.

– ప్రొఫెసర్ పి.లక్ష్మీనారాయణ, ఉస్మానియా వర్సిటీ రిజిస్ట్రార్

సరైన ఫ్యాకల్టీ లేకుండా అనుమతులు వద్దు



కొన్నేళ్లుగా ఇష్టానుసారం కంప్యూటర్ కోర్సులకు అనుమతి ఇస్తున్నారు. మరి ఆ కోర్సులను బోధించే వారు ఉన్నారా? లేదా? అనేది యూనివర్సిటీలు పరిశీలించాలి. లేకపోతే విద్యార్థులకు నష్టం జరుగుతుంది. నైపుణ్యం లేకుండా విద్యార్థులకు డిగ్రీలిస్తే, మార్కెట్లో వారు నిలబడటం కష్టం. ఈ విషయాన్ని అనేక సర్వేలు రుజువు చేస్తున్నాయి.

– అయినేని సంతోష్‌కుమార్, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీ సిబ్బంది సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

ఆ 10 జిల్లాల్లో సైబర్ దొంగలు

- ఇందులో రాజస్తాన్‌లోని భరత్‌పూర్ టాప్
- ఢిల్లీ, రాజస్తాన్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో అడ్డాలు
- 80శాతం సైబర్ నేరాలకు పాల్పడుతున్నది ఆ జిల్లాల నుంచే..
- ఎఫ్‌సీఆర్‌ఎఫ్ (ఫ్యూచర్ క్రైం రీసెర్చ్ ఫౌండేషన్) నివేదికలో వెల్లడి



సాక్షి, హైదరాబాద్‌: అవి నాలుగు రాష్ట్రాల్లోని పది జిల్లాలు.. అమాయకులకు గాలం వేస్తూ దోచుకుంటున్న సైబర్ నేరగాళ్లకు అడ్డాలు. దేశవ్యాప్తంగా నమోదవుతున్న సైబర్ నేరాల్లో 80శాతానికిపైగా ఆ పది జిల్లాల్లో స్థావరాలు ఏర్పాటు చేసుకున్న నేరగాళ్లు చేస్తున్నవే. ఢిల్లీ, రాజస్తాన్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఈ జిల్లాలు ఉన్నాయి. కేటుగాళ్లు ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి త్వరగా వెళ్లేపోయే వీలున్న జిల్లాల్లో అడ్డా వేసి, సైబర్ క్రైం పోలీసులకు చిక్కకుండా మోసాలకు పాల్పడుతున్నారు. అడపాదడపా తెలంగాణ పోలీసులు మినహా మిగతా రాష్ట్రాల పోలీసులు ఈ సైబర్ దొంగలను పట్టుకోలేకపోతున్నారు. ఎక్కువగా సైబర్ నేరగాళ్లు ఏ రాష్ట్రాల్లో, ఏ జిల్లాల్లో ఉంటున్నారన్న అంశంపై 'ఫ్యూచర్ క్రైం రీసెర్చ్ ఫౌండేషన్ (ఎఫ్‌సీఆర్‌ఎఫ్)'ఇటీవల విడుదల చేసిన తమ అధ్యయన నివేదికలో కీలక విషయాలు వెల్లడించింది. సైబర్ నేరగాళ్లకు కొత్త అడ్డాలుగా మారుతున్న ప్రాంతాల వివరాలనూ పేర్కొంది.

ఆ పది జిల్లాలే ఎందుకు?

సైబర్ నేరగాళ్లు ఆ పది జిల్లాల్లోనే ఎందుకు ఎక్కువగా ఉంటున్నారన్న దాని వెనుక కొన్ని కీలక అంశాలు ఉన్నాయి. ఈ పది జిల్లాలు ఆయా రాష్ట్రాల్లోని కీలక పట్టణాలకు సమీపంలో ఉండటం, సైబర్ సెక్యూరిటీ పరంగా అంతగా అభివృద్ధి చెందకపోవడం, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే వారు ఎక్కువగా ఉండటం వంటివి సైబర్ మోసగాళ్ల ముఠాలకు కలిసి వస్తున్నాయని నివేదిక తేల్చింది. ఆయా జిల్లాల్లో సరైన ఉపాధి లేక, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న స్థానికుల సిమ్‌కార్డులు, బ్యాంకు ఖాతాలను వాడుకుంటూ ఈ ఉచ్చులోకి సులభంగా దింపుతున్నాయని పేర్కొంది. ఈ పది జిల్లాల్లో చాలా వరకు దేశ రాజధాని ఢిల్లీకి సమీపంలోనివే. స్థానికంగా పోలీసులు ఈ సైబర్ నేరగాళ్లను గుర్తించలేకపోవడం, అవసరమైతే అప్పటికప్పుడు రాష్ట్రాలు మార్చేయడంతో పట్టుబడటం కష్టంగా మారుతోంది.

కొత్తగా సైబర్ క్రైం హాట్‌స్పాట్లుగా మారుతున్న ప్రాంతాలివీ..

అస్సాం (బార్పేట, ధుబ్రి, గోల్పార, మోరిగాన్, నగాన్), ఏపీ (చిత్తూర్), బిహార్ (బన్క, బెగుసరాయ్, జముయి, నలంద, పాట్నా, ససరామ్), ఢిల్లీ (అశోక్‌నగర్, ఉత్తమ్‌నగర్ వెస్ట్, న్యూఅశోక్ నగర్, హర్కేష్ నగర్ ఓక్లా, ఆర్‌కే పురం, ఆజాద్‌పురా), గుజరాత్ (అహ్మదాబాద్, సూరత్), హరియాణా (బివాని, మనోత, హసన్‌పూర్, పల్వల్), జార్ఖండ్ (లటేహర్, ధన్‌బాద్, సంత్‌పాల్ పరగణా, హజారీబాగ్, కుంతి, నారాయణపూర్, రాంచీ), కర్ణాటక (బెంగళూరు), మధ్యప్రదేశ్ (గుణా), మహారాష్ట్ర (ఔరంగాబాద్, ముంబై), ఒడిశా (బాలాసోర్, ధేన్‌కనల్, జజ్‌పూర్, మయూర్‌భంజ్), పంజాబ్ (ఫజికా, మొహలి), రాజస్థాన్ (బిదర్కా, బర్మార్, జైపూర్), తమిళనాడు (చెన్నై, కోయంబత్తూర్), తెలంగాణ (హైదరాబాద్, మహబూబ్‌నగర్), త్రిపుర (ధలాయ్), ఉత్తరప్రదేశ్ (బులందర్‌షహర్, ఘాజియాబాద్, ఝూన్సీ, కాన్పూర్, లక్నో, సీతాపూర్, గౌతమబుద్ధ నగర్), పశ్చిమ బెంగాల్ (పుర్బ బర్ధామన్, దుల్‌చండ్రియ, భద్రల్, దక్షిణ్ దినాజ్‌పూర్, బిర్భూమ్, బరుస్‌పురా, కోల్‌కతా, మల్దా, బరంపూర్).

ఏ రాష్ట్ర నేరగాళ్లు ఏ తరహా సైబర్ నేరాలు చేస్తున్నారు?

రాజస్తాన్: సెక్స్‌టార్షన్ (సోషల్ ఇంజనీరింగ్ వ్యూహాలతో ఫొటోలు, వీడియోలు, వాయిస్ మార్ఫింగ్ చేసి మోసగించడం), ఓఎల్‌ఎక్స్‌లో ఆన్‌లైన్ మార్కెటింగ్ పేరిట మోసాలు, కస్టమర్ కేర్ ఫ్రాడ్స్.

జార్ఖండ్: ఓటీపీ స్కామ్‌లు (మోసపూరిత పద్ధతుల్లో ఓటీపీలు సేకరించి మోసాలు), కేవైసీ అప్‌డేషన్, విద్యుత్ బిల్లుల పేరిట, కౌన్ బనేగా కరోడ్‌పతి పేరిట మోసాలు.

ఢిల్లీ: ఆన్‌లైన్ లోన్‌యాప్‌ల పేరిట వేధింపులు, ఆన్‌లైన్ గిఫ్ట్ పేరిట మోసాలు, మ్యాట్రిమోనియల్ మోసాలు, విద్యుత్ బిల్లులు, జాబ్, ఇన్వెస్ట్‌మెంట్ పేరిట మోసాలు.

ఉత్తరప్రదేశ్: ఫేక్ లింకులు (ఫిషింగ్), ఓటీపీ మోసాలు, సోషల్ ఇంజనీరింగ్ స్కామ్‌లు, డెబిట్, క్రెడిట్ కార్డుల పేరిట మోసాలు.

సైబర్ నేరగాళ్లు ఏ జిల్లాలో ఎంత శాతం?

జిల్లా	రాష్ట్రం	శాతం
భరత్‌పూర్	రాజస్తాన్	18
మధుర	ఉత్తరప్రదేశ్	12
నుహ్	హరియాణా	11
దేవఘర్	జార్ఖండ్	10
జామ్‌తారా	జార్ఖండ్	9.6
గుర్గావ్	హరియాణా	8.1
అల్వార్	రాజస్తాన్	5.1
బొకారో	జార్ఖండ్	2.4
కర్మతాండ్	జార్ఖండ్	2.4
గిరిద్	జార్ఖండ్	2.3

(దేశవ్యాప్తంగా నమోదైన సైబర్ నేరాలకు పాల్పడినవారి శాతం)

సికింద్రాబాద్ టు సిద్దిపేట రూ.440

- నెల రోజుల సీజన్ టికెట్‌ను ప్రవేశపెట్టిన రైల్వే శాఖ
- అతి తక్కువ ఖర్చుతో అపరిమిత ట్రిప్పుల ప్రయాణం



సాక్షి, హైదరాబాద్‌: సికింద్రాబాద్ జూబ్లీ బస్ స్టేషన్ నుంచి సిద్దిపేటకు ఎక్స్‌ప్రెస్ బస్ చార్జి రూ.140. వెళ్లి రావటానికి రూ.280. రెండు రోజులకు రూ.560. అదే రైలులో నెల రోజులు ప్రయాణించేందుకు రూ.440 చెల్లిస్తే సరి. రెండు రోజుల బస్ చార్జి కంటే చవకగా, ఏకంగా నెలరోజుల పాటు ప్రయాణించే వెసులుబాటును రైల్వే శాఖ కల్పించింది. ఈ నెల మూడో తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జెండా ఊపి ప్రారంభించిన సికింద్రాబాద్–సిద్దిపేట ప్యాసింజర్ రైలు ఆ ప్రాంత వాసులకు కారు చవక ప్రయాణ సౌకర్యాన్ని కల్పించింది. సికింద్రాబాద్–సిద్దిపేట మధ్య 117 కి.మీ. ప్రయాణానికి రైలు టికెట్ ధర కేవలం రూ.60 మాత్రమే. ఇప్పుడు దానిని మరింత చవకగా మారుస్తూ నెలవారీ సీజన్ టికెట్‌ను అందుబాటులోకి తెచ్చింది. మామూలు టికెట్ ప్రకారం.. వెళ్లి రావటానికి రూ.120 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఆ లెక్కన నెల రోజులకు రూ.3,600 అవుతుంది. కానీ, నెల రోజుల సీజన్ టికెట్ కొంటే కేవలం రూ.440తో నెల రోజుల పాటు ఎన్ని ట్రిప్పులైనా తిరగొచ్చు. ఇంతకాలం బస్సులు, ప్రైవేటు వాహనాలకు ఎక్కువ మొత్తం చెల్లిస్తూ ప్రయాణిస్తున్న నిరుపేద వర్గాలకు ఇది పెద్ద వెసులుబాటుగా మారనుంది. స్పెషల్ రైలు సర్వీసుగా సికింద్రాబాద్–సిద్దిపేట మధ్య ఈ రైలు సేవలు ప్రారంభమైనప్పటికీ, సీజన్ టికెట్‌ను జారీ చేయాలని రైల్వే అధికారులు నిర్ణయించారు. ప్రత్యేక రైలులో ఎక్స్‌ప్రెస్ టికెట్ ధరలను అమలు చేస్తారు. దాన్ని రెగ్యులర్ సర్వీసుగా మార్చగానే ఆర్డినరీ టికెట్ ధరలను వర్తింపచేస్తారు. ఈ ప్రకారం ప్రస్తుతం అమలులో ఉన్న టికెట్ ధర రూ.60 నుంచి రూ.50కి తగ్గుతుంది. అయితే దీనితో సంబంధం లేకుండా ఇప్పుడు సీజన్ టికెట్‌ను అందుబాటులోకి తెచ్చారు. 101 కి.మీ. నుంచి 135 కి.మీ. వరకు ప్రయాణ దూరానికి సీజన్ టికెట్ ధర రూ.440 ఉంటుంది. సికింద్రాబాద్–సిద్దిపేట మధ్య రైలు ప్రయాణ దూరం 117 కి.మీ.గా ఉంది. దీంతో ఈ టికెట్ ధరను రూ.440 ఖరారు చేశారు. నెల తర్వాత దానిని మళ్లీ రెన్యూవల్ చేసుకోవచ్చు. సికింద్రాబాద్ –సిద్దిపేట మధ్య ఇతర స్టేషన్ల వరకు కూడా ఈ సీజన్ టికెట్ పొందే వెసులుబాటు కల్పించారు. ఆయా స్టేషన్ల మధ్య దూరం ఆధారంగా ఆ టికెట్ ధర ఉంటుంది.

ట్రిప్పు వేళలు ఇలా..

- సిద్దిపేటలో రైలు (నంబరు:07483) ఉదయం 6.45కు బయలుదేరి సికింద్రాబాద్‌కు 10.15కు చేరుకుంటుంది.
- తిరిగి సికింద్రాబాద్‌లో రైలు (నంబరు:07484) ఉదయం 10.35కు బయలుదేరి సిద్దిపేటకు మధ్యాహ్నం 1.45 గంటలకు చేరుకుంటుంది.
- తిరిగి సిద్దిపేటలో మధ్యాహ్నం 2.05 గంటలకు బయలుదేరి సికింద్రాబాద్‌కు సాయంత్రం 5.20 గంటలకు చేరుకుంటుంది.
- సికింద్రాబాద్‌లో సాయంత్రం.5.45 గంటలకు బయలుదేరి సిద్దిపేట కు రాత్రి 8.45 గంటలకు చేరుకుంటుంది.
- హాల్ట్‌స్టేషన్లు: మల్కాజిగిరి, కేవలరీ బ్యారెక్స్, బొల్లారం, గుండ్లపోచంపల్లి, మేడ్చల్, మనోహరాబాద్, నాచారం, బేగంపేట, గజ్వేల్, కొడకండ్ల, లకుడారం, దుద్దెడ, సిద్దిపేట

అబిడ్స్‌లో రాంజీ గోండ్ మ్యూజియం

నేడు శంకుస్థాపన చేయనున్న కేంద్రమంత్రులు అర్జున్‌ముండా, కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్‌: ఆదివాసీ పోరాట యోధుడు రాంజీగోండ్ పేరిట ప్రత్యేకంగా ఓ మ్యూజియం ఏర్పాటు చేస్తున్నారు. హైదరాబాద్ నడిబొడ్డున అబిడ్స్‌లోని గిరిజన సంక్షేమశాఖ స్థలంలో కేంద్రమంత్రులు అర్జున్‌ముండా, జి.కిషన్‌రెడ్డిల చేతుల మీదుగా సోమవారం శంకుస్థాపన జరిపేందుకు రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ఏర్పాట్లు చేసింది.

రూ.35 కోట్లపైగానే వ్యయం

రాంజీగోండ్ మ్యూజియం ఏర్పాటుకు రూ.35 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభు త్వం రూ.10 కోట్లు విడుదల చేసింది. మరిన్ని నిధులు ఇచ్చేందుకు కూడా సిద్ధంగా ఉంది. రూ.10 కోట్లు ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా అడుగు ముందుకు పడలేదు. మొదట్లో బాపూఘాట్ వద్ద మ్యూజియం ఏర్పాటు చేయాలని భావించారు. కానీ భూ సమస్య కారణంగా ఆదిలోనే ఆగిపోయింది. దీంతో అబిడ్స్‌లో ఏర్పాటు చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఈ మ్యూజియంలో ప్రధానంగా గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల వివరాలు, చరిత్ర, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు సంబంధించిన పూర్తి సమాచారం అందుబాటులోకి తెస్తారు. గిరిజన సంక్షేమశాఖ పరిధిలో ఈ మ్యూజియం నిర్వహణ ఉంటుంది. దీని నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యం కూడా ఉంది.



టీసీఆర్‌టీఐ భవన ప్రారంభోత్సవం కూడా...

మాసాబ్‌ట్యాంక్‌లోని దామోదరంసంజీవయ్య సంక్షేమభవన్ ఆవరణలో గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ సంస్థ (టీసీఆర్‌టీఐ)భవనం నిర్మించారు. దీనికి కేంద్ర ప్రభుత్వమే పూర్తిగా నిధులు విడుదల చేసింది. నాలుగు అంతస్తుల్లో సుమారు 20వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన ఈ భవనానికి కేంద్రం ఇప్పటివరకు రూ.6.5 కోట్లు ఇచ్చినట్టు అధికారులు చెబుతు న్నారు. గిరిజన సంక్షేమశాఖలో టీసీఆర్‌టీఐ ఒక భాగమే అయినా, కేంద్ర గిరిజన సంక్షేమశాఖ ఆధీనంలో కార్యక్రమాలు నిర్వహిస్తారు. సోమ వారం మధ్యాహ్నం 3 గంటలకు ఈ భవనాన్ని కేంద్రమంత్రులు అర్జున్‌ముండా, జి.కిషన్‌రెడ్డి ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొంటారు.

ఉద్యోగులకు కొత్త హెల్త్ స్కీం

▶ మొదటి పేజీ తరువాయి

మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈఓ పలుమార్లు ఉద్యోగసంఘాల ప్రతినిధులతో చర్చలు జరిపారు. వారి ప్రతిపాదనలు పరిశీలించారు. అనంతరం ప్రభుత్వానికి ఓ నివేదిక అందజేశారు. దీని ప్రకారం..

- ఈహెచ్‌ఎస్ అమలుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఈహెచ్‌సీటీ పేరుతో ట్రస్ట్ ఏర్పాటు చేస్తుంది. దీనికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. ప్రభుత్వం తరఫున ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి, వైద్యారోగ్యశాఖ, విద్యాశాఖ, సాధారణ పరిపాలన శాఖల కార్యదర్శులు, హోంశాఖ ముఖ్యకార్యదర్శి, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ), ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈఓ సభ్యులుగా ఉంటారు. ఈహెచ్‌ఎస్ సీఈఓ సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారు.
- ఉద్యోగుల తరఫున ఆరుగురు, పెన్షనర్ల తరఫున ఇద్దరిని ప్రభుత్వం నామినేట్ చేస్తుంది.



- విధాన నిర్ణయాలకు సంబంధించి బోర్డు సభ్యులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేస్తారు.
- ఒక ప్రభుత్వ ఉద్యోగిని ఈహెచ్‌ఎస్ సీఈఓగా నియమిస్తారు.
- ఈహెచ్‌ఎస్ నిర్వహణకు ప్రభుత్వం ఇప్పటికే ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌కు 15 పోస్టులు మంజూరు చేసింది.
- పథకం అమలుకు సంబంధించిన విధివిధానాలు ప్రత్యేకంగా విడుదల చేస్తారు.


ఎంప్లాయి ఫ్రెండ్లీ ప్రభుత్వం




నూతన ఎంప్లాయీస్ హెల్త్‌స్కీమ్ అమలు చేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించడం పట్ల మంత్రి హరీశ్‌రావు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్యసేవలు అందుతాయి.ఉద్యోగులు, పెన్షనర్ల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని, తమది ఎంప్లాయి ఫ్రెండ్లీ ప్రభుత్వమని సీఎం కేసీఆర్ మరోసారి నిరూపించారన్నారు.

– మంత్రి హరీశ్‌రావు

టుడేస్ గ్రాఫిక్





నేను డైయోజినీజ్ అనే కుక్కను. దయగలవారి వద్దకు చేరుతాను, దురాశాపరుల మీద అరుస్తాను, దుష్టులను కొరుకుతాను.
– డైయోజినీజ్

సాక్షి
సోమవారం, 9 అక్టోబర్ 2023

సీన్యో కాల్వీనో

ఇటాలో కాల్వీనో అనే పేరు వినగానే ఆయనో ఇటాలియన్ రచయిత అనిపించడం సహజమే. ఊహకు అందేట్టుగా ఇటాలియనే అయినా కాల్వీనో పుట్టింది క్యూబా రాజధాని హవానాలో. తమ దేశ మూలాలు మర్చిపోకూడదనే ఉద్దేశంతో తల్లి పెట్టిన ఈ పేరు ఆయనకు పెద్దయ్యాక మరీ జాతీయవాదపు పేరులా తోచింది. అయితే వాళ్ల కుటుంబం ఇటలీకి తిరిగి వచ్చాక, తన 20 ఏళ్ల వయసులో కాల్వీనో జాతీయవాద ఫాసిస్టు పార్టీ మీద పోరాడటం దానికి ఒక చిత్రమైన కొనసాగింపు. ఆ పోరాటంలో భాగంగా ఇటాలియన్ కమ్యూనిస్టు పార్టీ సభ్యుడయ్యాడు. కమ్యూనిస్టుగా బతికాడు. అనంతర కాలంలో ఆ పార్టీకి దూరమయ్యాడు. అప్పటికే ఆయన వాస్తవిక చిత్రణ మీద పార్టీ విమర్శించడం మొదలుపెట్టింది. ఇక హంగెరీ మీద సోవియట్ రష్యా దాడి(1956) తర్వాత పార్టీ మీది భ్రమలు పూర్తిగా చెదిరిపోయి రాజీనామా చేశాడు. మళ్లీ ఏ పార్టీలోనూ సభ్యుడు కాలేదు. జర్నలిస్టుగా ఉద్యోగం చేసుకుంటూ; కథలు, నవలలు రాసుకుంటూ; తనకు నచ్చిన రాతలను ప్రమోట్ చేసుకుంటూ, కథల మీద మాట్లాడుకుంటూ బతికాడు. ఆధునిక ఇటాలియన్ సాహిత్యంలో అత్యధికంగా అనువాదం అయిన రచయితగా ప్రసిద్ధి గడించిన ఇటాలో కాల్వీనో శతజయంతి (జననం: 1923 అక్టోబర్ 15) సంవత్సరం ఇది.

ఇటాలో కాల్వీనో ప్రపంచంలో నిచ్చెన వేసుకుని చందమామ మీదికి ఒక్క గెంతులో ఎక్కేయొచ్చు. దాని పాలను లోడుకోవచ్చు. చేయాల్సిందల్లా పొక్కులుగట్టిన చందమామ ఉపరితలం మీదుండే పొలుసులను కొద్దిగా జరిపి అక్కడ గరిట పెట్టడమే. కాకపోతే ఆ మీగడ చిక్కదనపు పాలల్లో 'ఎక్కువభాగం పండ్లు, కప్పల గుడ్లు, శిలాజిత్, అలచందలు, తేనె, పటికలుగా మారిన పిండి, సొరచేపల గుడ్లు, నాచు, పుప్పొడి, చిన్నచిన్న పురుగులు, చెట్ల జిగురు, మిరియాలు, ఖనిజ లవణాలు, బూడిద' ఉంటాయి కాబట్టి వాటిని శుద్ధి చేసుకోవాల్సి ఉంటుంది (ద డిస్టన్స్ ఆఫ్ ద మూన్). ఇంకా, కాల్వీనో లోకంలో చిన్న పిల్లను పోనివ్వడానికి జోర్డాన్ నది తన నీటిని కొద్దిగా వంచి దారి ఇస్తుంది. ఎందుకంటే ఆ నదికి ఇష్టమైన ఉంగరపు ఆకృతి కేకుల్ని ఆ పాప పెడతానంది కదా (ఫాల్స్ గ్రాండ్‌మదర్)! ఆయన సృజించిన నగరానికి ఎప్పటికీ దేనికీ కిందికి దిగే పనిలేదు. అది పొడవాటి ఫ్లెమింగో కాళ్ల మీద నిలబడి ఉంటుంది. అదొక్కటే నగరానికీ, భూమికీ సంబంధం (ది ఇన్విజిబుల్ సిటీ). వెంట వెంటనే కలుసుకుంటున్నట్టుగా వచ్చి, లేచి, విరిగిపడే అలల్లో ఒకదాన్నుంచి ఇంకోదాన్ని ఎలా విడదీయాలో తెలీక అదేపనిగా చూస్తుంటాడు 'మిస్టర్ పాలొమార్'. విలువలు తలకిందులైన ప్రపంచంలో ఒక మనిషి నిజాయితీ కూడా ప్రపంచాన్ని అస్తవ్యస్తం చేయగలదు. అందరూ బుద్ధిగా దొంగతనం చేస్తున్నప్పుడు, ఆయన మాత్రం చేయనంటే ఎలా కుదురుతుంది? (ద బ్లాక్ షీప్).

కాల్వీనో తల్లి ఇటలీలోని సార్దీనీయా ద్వీపానికి చెందినవారు. ప్రపంచంలో శతాధిక వృద్ధులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఇదీ ఒకటి. దీనికి భిన్నంగా కాల్వీనో అరవై ఏళ్లే బతికాడు(మరణం: 1985 సెప్టెంబర్ 19). ఆయన రచనల విషయంలో మాత్రం ఈ మాట అనలేము. 'అవర్ యాన్సెస్టర్స్' ట్రయాలజీ, 'కాస్మికామిక్స్' లాంటి పుస్తకాలను వెలువరించిన కాల్వీనో ప్రపంచంలో అన్నీ అసాధ్యాలే. కొన్నిసార్లు రాస్తున్నప్పుడు నాకు వెర్రెత్తుతుంది అంటాడాయన. ఒక నవలను మళ్లీ మళ్లీ చదవడానికి ఉపక్రమించే పాఠకుడి జీవితం కూడా ఆయనకు నవల అవుతుంది. దీన్ని అత్యంత పోస్ట్ మాడర్నిస్ట్ నవల అంటారు (ఇఫ్ ఆన్ ఎ వింటర్స్ నైట్ ఎ ట్రావెలర్). కానీ ఆయన రచనలు ఎంత ఆధునికమో అంత ప్రాచీనం. ఎంత ప్రాచీనమో అంత ఆధునికం. కొత్త పుంతలు తొక్కడం అనే మాట ఆయనకు బాగా వర్తిస్తుంది. ఇటాలియన్ జానపద గాథలను కూడా ఆయన ప్రచురించాడు. కాల్వీనో రచనా వ్యాసంగంలో ఇదొక ముఖ్యాంశం.

'రాజకీయాల తర్వాత, సాహిత్యానికి రెండో స్థానం ఇవ్వడం అనే ఆలోచన పెద్ద తప్పు. ఎందుకంటే, రాజకీయాలు దాదాపుగా ఎన్నడూ తన ఆదర్శాలను సాధించలేవు. మరోపక్కన, సాహిత్యం దాని రంగంలో అది కొంతైనా సాధించగలదు, దీర్ఘకాలంలో కొంత ఆచరణాత్మక ప్రభావాన్ని కూడా కలిగించగలదు... ముఖ్యమైన విషయాలు నెమ్మదైన ప్రక్రియల ద్వారా మాత్రమే సాధించగలం' అనే కాల్వీనో విదేశీ సంస్కృతులను గురించిన అవగాహన ఏ సంస్కృతికైనా కీలకం అనేవాడు. సొంత సృజన శక్తిని సజీవంగా ఉంచుకోవాలంటే విదేశీ ప్రభావాలకు సిద్ధంగా ఉండాలన్నాడు. ఇద్దరం కలుస్తున్నామంటే, భిన్న ప్రపంచాల్ని వెంట బెట్టుకుని వస్తాం; ఆ కలిసిన బిందువు నుంచి కొత్త కథ మొదలవుతుందంటాడు.

ఒకరోజు– మనకు కవితలు, నవలలు రాసేలా కవికీ, రచయితకూ ప్రత్యామ్నాయం కాగలిగే సాంకేతిక పరిజ్ఞానం వస్తుందని 1967లోనే కాల్వీనో ఊహించిన విషయాన్ని ఛాట్ జీపీటీ నేపథ్యంలో పాత్రికేయుడు రాబెర్టో డి కారో గుర్తుచేసుకుంటారు. విదేశీ మాటలు, ప్రత్యేకించి ఆంగ్లపదం 'ఫీడ్‌బ్యాక్' మీద కాల్వీనో మోజు పడి, దాన్ని ఎలాగైనా 'మిస్టర్ పాలొమార్' ఆంగ్లానువాదంలో చేర్చాలని ఉబలాటపడ్డాడట. 'సీన్యో(మిస్టర్ లాంటి ఒక గౌరవ వాచకం) కాల్వీనో'! ఒక ఇటాలియన్ చెవికి ఆ పదం ఎంత అందంగా వినబడినా, ఆంగ్ల సాహిత్యంలో అదేమంత ఉచితంగా ఉండ'దని కాల్వీనో రచనలకు స్థిర అనువాదకుడిగా పనిచేసిన విలియమ్ వీవర్ తిరస్కరించాడట. అయితే, ఎంతటి కృత్రిమ మేధ వచ్చినా, చంద్రుడి పాలు మీగడలా చిక్కగా ఉంటాయని ఊహించిన కాల్వీనో మెదడును ఏ కంప్యూటరూ అందుకోలేదని మనం ఫీడ్‌బ్యాక్ ఇచ్చి ఆయన్ని ఆనందపరచొచ్చు!

కలవర పెడుతున్న ప్రశ్నలు

కామెంట్



కరణ్ థాపర్

ఇద్దరు మైతేయి విద్యార్థుల హత్యపై దర్యాప్తు జరిపేందుకు కేంద్రం ప్రత్యేక సీబీఐ బృందాన్ని మణిపూర్‌కు పంపింది. సీబీఐ పదకొండు కేసులను దర్యాప్తు చేస్తోంది. వాటి కోసం మణిపూర్ వెళ్లని సీబీఐ బృందం, ఈ కేసు కోసమే ఎందుకు వెళ్లినట్లు? ''మణిపూర్‌లోని ప్రస్తుత సంక్షోభం జాతుల మధ్య ఘర్షణ కాదు. మయన్మార్, బంగ్లాదేశ్‌లలో స్థావరాలు ఏర్పరచుకుని ఉన్న కుకీ మిలిటెంట్‌లు... మణిపూర్ నుంచి పని చేస్తున్న తీవ్రవాద సంస్థల సహకారంతో భారత ప్రభుత్వంపై తలపెట్టిన పూర్తిస్థాయి యుద్ధం'' అని ముఖ్యమంత్రి బీరేన్ అన్నారు. తీవ్రవాద సంస్థలు ఈ రెండు తెగలతోనూ సంబంధాలను కలిగి ఉండి మణిపూర్‌లో ఘర్షణలకు ఆజ్యం పోస్తున్నాయి. బీరేన్ ఎందుకు ఒక వైపే మాట్లాడుతున్నారు?

ఇద్దరు మైతేయి విద్యార్థుల హత్యపై దర్యాప్తు జరిపేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక సీబీఐ బృందాన్ని మణిపూర్‌కు పంపడంలో చూపిన ఉల్లాస పూరితమైన సంసిద్ధతను, ఆ కేసును ఛేదించారని చెబుతున్న సీబీఐ బృందం పని తీరులోని గొప్ప వేగాన్ని అభినందిస్తూనే... విషయాలను క్లిష్టతరం చేయగల కొన్ని ప్రశ్నల్ని కూడా ఇక్కడ పరిగణనలోకి తీసుకోవడం ఒక విలువైన పరిశీలన కాగలదని నేను విశ్వసిస్తున్నాను. ఈ ప్రశ్నల్లో కొన్ని నిస్సందేహంగా కుకీ తెగలవారు లేవనెత్తినవే అయి ఉంటాయన్నది ఆశ్చర్యమేమీ కాదు. అంతమాత్రాన ఆ ప్రశ్నలు చెల్లుబాటు కాకుండాపోతాయని మాత్రం నేనైతే కచ్చితంగా అనుకోను.

మొదటి విషయం ఏంటంటే, సీబీఐ పదకొండు కేసులను దర్యాప్తు చేస్తోంది. కార్-వాష్ స్టేషన్‌లో ఇద్దరు కుకీ మహిళలపై లైంగిక దాడి జరిపి వారిని హత్య చేసినప్పుడు... డేవిడ్ థీక్ తల నరికి చంపినప్పుడు... అంబులెన్స్‌లో ప్రయాణిస్తున్న తల్లినీ, బిడ్డనూ వాహనంతో సహా కాల్చి బూడిద చేసినప్పుడు... దర్యాప్తు కోసం మణిపూర్ వెళ్లని సీబీఐ ప్రత్యేక బృందం... ఇద్దరు మైతేయి విద్యార్థుల హత్యపై విచారణ జరిపేందుకు ఇంఫాల్‌కు ఎందుకు వెళ్లినట్లని మీరడగవచ్చు. మీరు కుకీ తెగకు చెందిన వారైతే కనుక ఇది మీకు మైతేయిల పట్ల కేంద్రం ప్రత్యేకమైన శ్రద్ధను కనబరుస్తున్నట్లుగా అనిపించదా?

రెండో ప్రశ్న కూడా అంతే ముఖ్యమైనది. అజయ్ భట్నాగర్ నేతృత్వంలోని సీబీఐ ప్రత్యేక బృందం సెప్టెంబర్ 27 సాయంత్రం ఇంఫాల్ చేరుకుంది. నాలుగు రోజుల లోపే కొన్ని అరెస్టులు జరిపింది. ఇక్కడే ఐ.టి.ఎల్.ఎఫ్. (ఇండీజనస్ ట్రైబల్ లీడర్స్ ఫోరమ్) ఒక ప్రశ్నను లేవనెత్తింది. ''ఇంత వేగంగా పని చేయగలిగిన సీబీఐ మిగతా హేయమైన కేసులలో ఎందుకని ఒక్కర్నీ అరెస్టు చేయలేదు?'' అని ప్రశ్నించింది.

కుకీ తెగ ప్రజల అత్యున్నత స్థాయి స్వయం ప్రకటిత సంఘం 'కుకీ ఇంపీ' మరింత సూటిదైన ప్రశ్నకు సమాధానం కోరుతోంది. ''కుకీ–జో కమ్యూనిటీకి వ్యతిరేకంగా అనుమానాస్పద కారణాలతో అరెస్టులు చేసినప్పుడు... కుకీ–జో ప్రజలపై ఎంతో అమానుషంగా, అనాగరికంగా శిరచ్ఛేదనకు, అత్యాచారాలకు, గృహ దహనాలకు పాల్పడిన నేరస్థులను అదే తరహాలో ఎందుకు అరెస్టు చేయలేదు?'' అని కుకీ ఇంపీ ప్రశ్నిస్తోంది.



మణిపూర్ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్

ఏమైనా, కుకీలు లేవనెత్తిన ఈ ప్రశ్నలతో పాటుగా ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ చేసిన వ్యాఖ్యల నుంచి తలెత్తిన ప్రశ్నలూ కొన్ని ఆలోచన రేకెత్తించేవిగా ఉన్నాయి. సీబీఐ అరెస్టుల అనంతరం బీరేన్ సింగ్, ''విద్యార్థుల అపహరణ, హత్యకు కారణమైన కొంతమంది ప్రధాన నేరస్థులు ఈ రోజు చురాచాంద్‌పుర్‌లో అరెస్ట్ అయ్యారని చెప్పడానికి నేనెంతో సంతోషిస్తున్నాను'' అని ట్వీట్ చేశారు. కానీ ఆరోపణలు ఎదుర్కొంటున్నవారు నిందితులు మాత్రమే కదా అవుతారు? బీరేన్ ఏ ప్రాతిపదికన నిందితులను దోషులుగా పేర్కొన్నారు? అలా పేర్కొనడం... కోర్టులో నిందితుల అవకాశాలపై ప్రతికూల ప్రభావం చూపకుండా ఉంటుందా?

కుకీలకు ఇది రుచించకపోవడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. ఐ.టి.ఎల్.ఎఫ్. వ్యక్తం చేసిన ఆందోళనే ఇతరులు అనేక మందిలోనూ చోటు చేసుకుంది. ''మహిళలు సహా అభాగ్యులైన కుకీ గిరిజనుల పట్ల కఠినంగా వ్యవహరించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం మైతేయి తెగల ఆగ్రహం నుండి ముఖ్యమంత్రిని రక్షించడానికి ప్రయత్నిస్తున్నట్లుగా కనిపిస్తోంది'' అని వారి అనుమానం.

కనుక మీరిప్పుడు నేనెందుకు ఈ ప్రశ్నల వైపు మీ దృష్టిని మరల్చానో అర్థం చేసుకోవచ్చు. ఈ నిర్దిష్ట ఘటనలో ఇంఫాల్ లోని పరిణామాలు చురాచాంద్‌పుర్ నుండి చూసినప్పుడు పూర్తి భిన్నంగా కనిపిస్తాయి. కచ్చితంగా ఐదు నెలల తర్వాత ఢిల్లీలో మంత్రులకు, అధికారులకు ఈ విషయం తెలిసి తీరుతుంది. అయినప్పటికీ అది వారినేమీ భావోద్వేగానికి గురి చేయదు. ''నేనెందుకు ఆశ్చర్యపోతున్నాను?'' అనే మరొక ప్రశ్నకు ఆ పరిణామం దారి తీస్తుంది.

ఒక భిన్నమైన, అయినప్పటికీ సంబంధం కలిగివున్న ఒక విషయాన్ని లేవనెత్తడంతో ఈ వ్యాసాన్ని ముగిస్తాను. ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ ఇప్పుడు తన రాష్ట్రాన్ని ఇలా చూస్తున్నారు: ''మణిపుర్‌లోని ప్రస్తుత సంక్షోభం జాతుల సమూహాల మధ్య ఘర్షణ కాదు. రాష్ట్ర శాంతి భద్రతల సమస్య కూడా కాదు. మయన్మార్, బంగ్లాదేశ్‌లలో స్థావరాలు ఏర్పరచుకుని ఉన్న కుకీ మిలిటెంట్‌లు... మణిపూర్ నుంచి పని చేస్తున్న తీవ్రవాద సంస్థల సహకారంతో భారత ప్రభుత్వంపై తలపెట్టిన పూర్తిస్థాయి యుద్ధం'' అంటారు ఆయన. ఇది మరిన్ని ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఇది బీరేన్ అభిప్రాయమా? లేక న్యూఢిల్లీ అభిప్రాయమా? న్యూఢిల్లీ అభిప్రాయమే అయితే ఈ విషయాన్ని నెపిడా(మయన్మార్ రాజధాని), ఢాకాల దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందా?

యుద్ధం అని మీరెలా చెప్పగలరు అని ముఖ్యమంత్రిని అడిగితే, ఆయన నిస్సందేహంగా సేమిన్లుమ్ గాంగ్టే అనే కుకీ అరెస్టును చూపుతారు. ఎన్.ఐ.ఎ. (నేషనల్ ఇంటెలిజన్స్ ఏజెన్సీ) అంటున్న దానిని బట్టి గాంగ్టే దేశ సరిహద్దుకు ఆవల ఉన్న తీవ్రవాద సంస్థ సభ్యుడు. అయితే గాంగ్టే అరెస్టుకు కొన్ని రోజుల ముందు నిషేధిత 'పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ' సభ్యుడైన మొయిరాంగ్థమ్ ఆనంద్ సింగ్ అనే మైతేయి తెగ వ్యక్తిని కూడా ఎన్.ఐ.ఎ. అరెస్టు చేసింది. దీనిని బట్టి తీవ్రవాద సంస్థలు ఈ రెండు తెగల వారితోనూ సంబంధాలను కలిగి ఉండి మయన్మార్, బంగ్లాదేశ్‌ల నుండి మణిపూర్‌లో కుకీలు, మైతేయిల మధ్య ఘర్షణలకు ఆజ్యం పోస్తున్నాయని అనుకోవాలి. మరైతే ముఖ్యమంత్రి ఎందుకు ఒక వైపే మాట్లాడుతున్నారు? మళ్లీ ఇదొక కలవరపెట్టే ప్రశ్న.

నా ముగింపు: మణిపూర్ రెండు వైపుల నుంచీ కలవరపరిచే ప్రశ్నలను విసురుతోంది. అందుకే కేవలం ఒక కోణం నుంచి ఇచ్చే సమాధానం పరిస్థితిని మరింతగా దిగజారుస్తుంది. ఎందుకు అని అర్థం చేసుకోడానికి ఈ చిన్న ముక్క మీకు సహాయపడి ఉంటుందని నేను ఆశిస్తున్నాను.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

విశేషమైన క్షణం



చరిత్రలో తొలిసారి ఈ పోరాటంలో పాలస్తీనియన్లు సెటిలర్ల నుంచి పట్టణాన్ని వెనక్కి తీసుకున్నారు. ఇది కొద్ది కాలమే కావొచ్చు, దాన్ని నిలుపుకోలేకపోవచ్చు, కానీ ఇది మానసిక యుద్ధంలో విశేషమైన క్షణం.

– సెమీ హెర్మేజ్, ఆంత్రోపాలజిస్ట్

తూతూ మంత్రమా?



చిత్రమైన పరిస్థితి: ఇండియా–పాకిస్తాన్ మ్యాచ్ జరపడం మాత్రమే జీసీసీఐకీ, ప్రభుత్వానికీ ప్రాధాన్యం; కానీ పాకిస్తానీ అభిమానులు, జర్నలిస్టులను మాత్రం దాన్ని చూడటానికి అనుమతించరా?

– సుహాసినీ హైదర్, జర్నలిస్ట్

చేప కథ



మనిషికి ఒక చేప ఇవ్వండి, అతడు ఆ రోజుకు భోంచేస్తాడు. చేపను పట్టడం ఎలాగో నేర్పండి, అతడు జీవితకాలం తినగలుగుతాడు. కానీ ప్రార్థన చేయడం బోధించండి, అతడు చేప కోసం ప్రార్థిస్తూ చనిపోతాడు.

– ఇంతియాజ్ మహమూద్, నాస్తికుడు

మనుగడ ఉంటుందా?



నిజమైన పోరాటం రైట్, లెఫ్ట్ మధ్య కాదు; మానవ వాదులకూ, వినాశన వాదులకూ మధ్య.

– ఎలాన్ మస్క్, పారిశ్రామికవేత్త

ఇంత అసమానతా?



ప్రపంచంలో ఇప్పుడున్న అసమానతా స్థాయిలు అన్యాయమైనవి. ఒక కాలం వస్తుంది, అప్పుడు జనం వెనక్కి చూసి, మనం ఇంత అసమానతను సహించామా అని దిగ్భ్రమ చెందుతారు; బానిసత్వాన్నీ, దాస్యాన్నీ మన ప్రాచీనులు ఎలా సహించారా అని మనం దిగ్భ్రమ చెందుతున్నట్టుగానే!

– కౌశిక్ బసు, ఆర్థికవేత్త

ఇజ్రాయిల్ వెంటే!



పాలస్తీనా తీవ్రవాద దాడుల నేపథ్యంలో మేము గట్టిగా ఇజ్రాయిల్ వెనక నిలబడతాం. అందరికీ మెరుగైన పరిష్కారం కోసం, శాంతి ఒప్పందం కోసం సౌదీ అరేబియా, ఇజ్రాయిల్ పనిచేస్తుంటే, రక్తదాహపు ఇరానియన్ మిలిటెంట్లు రెచ్చగొట్టడానికి పూనుకున్నారు. ముస్లిం లేదా అరబ్ ప్రపంచంలో అందరూ 'హమాస్'కు మద్దతివ్వడం లేదు. ఇజ్రాయిల్ గెలుస్తుంది.

– అమ్జద్ తాహా, వ్యూహాత్మక రాజకీయాల నిపుణుడు

ఏది లౌకికవాదం?



ఫ్రాన్స్ లౌకికవాదం అణచివేతతో కూడినది. దాని ప్రధానోద్దేశం 'మతం నుంచి రాజ్యాన్ని' కాపాడటమే. ఇందులో మతానికి ఉన్న రక్షణ తక్కువ. కానీ అదే అమెరికాలో లౌకికవాదం అంటే 'చర్చ్‌కూ, రాజ్యానికీ మధ్య విభజన'. రాజ్యం నుంచి మతాన్ని కాపాడటం. అందుకే అమెరికాలో స్వేచ్ఛ ఎక్కువ. అమెరికన్ ముస్లింలు సంతోషంగా ఉండటానికి కారణం అదే.

– ముస్తఫా అక్యోల్, రచయిత

కొండ
దాని శ్వాసని నిలుపుకుంది!

దీర్ఘ శ్వాస తీసుకున్నాక
కొండ అక్కడ నిలుచుంది
తరువాత కొండలు నిలుచున్నాయి అక్కడ
అదిగో అలా అక్కడ కొండలు

క్రింది వైపు
ఇంకా క్రిందికి
వాటిలోకి వాటికవే ఒంగిపోయి
వాటి శ్వాసని నిలుపుకుంటున్నాయి

ఆకాశం సముద్రం
లాలిస్తూ కొడుతున్నా
దాని శ్వాసని కొండ నిలుపుకునే ఉంది

– జాన్ ఫోసే
ఆంగ్లానువాదం: మే–బ్రిట్ అఖెర్హోల్ట్
తెలుగు అనువాదం: ముకుంద రామారావు | 99083 47273



జాన్ ఫోసే

(2023 సంవత్సరానికి నోబెల్ సాహిత్య బహుమతి పొందిన 'జాన్ ఫోసే' (1959) నార్వే లోని హార్డం గెర్ఫోర్డ్ తీరంలో పెరిగాడు. అక్కడి నీరు, గాలి, రాళ్లు, వర్షపు ప్రకృతి దృశ్యం, అతని అన్ని రచనల్లోనూ ఏదో ఒక రూపంలో తొంగిచూస్తుంటాయి. దానికి తోడు జన్మం–మరణం, స్నేహం–ఏకాంతం కూడా పునరావృతమయ్యే ఇతివృత్తాలే. అయినా అవన్నీ అతని ప్రత్యేక శైలిలో, ఒక నిశ్శబ్ద సంగీత స్వరంలా చదువరులకు ధ్వనిస్తాయి. 'ఎరుపు నలుపు' నవలతో 1983లో సాహిత్య రంగప్రవేశం చేసిన ఆయన తన నాటకాల మూలంగా అంతర్జాతీయ ఖ్యాతి అర్జించాడు. అనేక అంతర్జాతీయ బహుమతులు పొందాడు. 40కి పైగా వచ్చిన అతని పుస్తకాలలో 10 గద్యం, 5 పద్యం, 9 పిల్లల కోసం చేసిన రచనలు, 20 నాటకాలు, 6 వ్యాస సంకలనాలు వగైరా వచ్చాయి. అందరూ అంగీకరించిన అతని ప్రముఖ కవితలలో పైది ఒకటి.)

మనసుకూ జబ్బులొస్తాయి!

సందర్భం



డా॥ ఇండ్ల రామసుబ్బారెడ్డి

మన దేశ జనాభాలో దాదాపు రెండు కోట్ల మందికి పైగా పలురకాల మానసిక వ్యాధులతో బాధపడుతున్నారు. ఇతర దేశాలతో పోలిస్తే మనదేశంలో మానసిక వైద్యుల సంఖ్య చాలా తక్కువే. అర్హత పొందిన మానసిక వైద్యులు కేవలం పదివేల మంది మాత్రమే ఉన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో వీరి సంఖ్య నాలుగు వందల లోపే! శరీరంలో ఏదైనా భాగానికి జబ్బు చేస్తే, వెంటనే ఆయా స్పెషలిస్టుల దగ్గరికి వెళ్తాము. కానీ ఒక వ్యక్తి వింతగా ప్రవర్తించినా, మాట్లాడినా, కుంగిపోయినా, అది కూడా ఒక జబ్బేననీ, దానికి కూడా శాస్త్రీయమైన చికిత్స ఉందనీ, వైద్యనిపుణులు కూడా ఉన్నారనీ ఇప్పటికీ చాలామందికి తెలియదు. ఒకవేళ తెల్సినా, మానసిక డాక్టరు దగ్గరికి వెళ్తే పిచ్చిపట్టిందని చులకనగా చూస్తారనే భయంతో తొలి దశలోనే చికిత్స చేయించుకోక, ముదర పెట్టుకుంటారు. ఇంతేకాకుండా, దయ్యం, గాలి సోకిందనో, చేతబడి చేశారనో, మందు పెట్టారనో అపోహలతో, మూఢనమ్మకాలతో నాటు వైద్యులు, మంత్రవైద్యులతో వైద్యం చేయించుకొని వ్యాధి బాగా ముదిరిన తర్వాత డాక్టర్ల దగ్గరకి వెళ్తుంటారు.



ఇతర శరీర భాగాల్లాగా కాకుండా మనసనేది కంటికి కనబడని ఒక ప్రత్యేకమైన అవయవం. మనసనేది మెదడులోని అంతర్భాగమేనని శాస్త్రీయంగా నిర్ధారించిన విషయమే! మెదడు 'హార్డ్‌వేర్' అయితే మనసు 'సాఫ్ట్‌వేర్'. 'కంప్యూటర్‌లో సాఫ్ట్‌వేర్ కనబడకపోయినా, దాని పనితీరు తెలిసినట్లే, మనసనేది కనబడకపోయినా, దాని ప్రవర్తన, ఆలోచనాతీరు, భావోద్వేగాలు, నిర్ణయాత్మక శక్తి లాంటివన్నీ బయటికి తెలుస్తూనే ఉంటాయి. శరీరానికి, మనసుకు అవినాభావ సంబంధముంది. శరీరం ఆరోగ్యంగా ఉంటే మనసు కూడా ఆరోగ్యంగా ఉంటుంది. అలాగే మనసు ప్రశాంతంగా ఉంటే, శారీరక జబ్బులు కూడా మనల్ని ఇబ్బంది పెట్టవు.

మానసిక వ్యాధులు వచ్చే ముఖ్య కారణాల్లో వారసత్వంగా వచ్చేవి, మెదడు లోపాలు, మద్యం, మత్తు, మందుల అలవాటు, సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనే మానసిక స్థైర్యం లేకపోవడం, తల్లితండ్రుల పెంపకంలో లోపాలు ముఖ్యమైనవి. మానసిక వ్యాధులంటే కేవలం 'పిచ్చి' అనే అపోహ చాలామందికి ఉంది. వందల రకాల మానసిక వ్యాధుల్లో 'పిచ్చి' (ఉన్మాదం) కేవలం ఒక రకమే! ఆందోళన, టెన్షన్, నిద్రలేమి, దిగులు, మనోవేదన, లేనిపోని భయాలు, అతిశుభ్రత లాంటి చాదస్తాలు, మద్యపానం, డ్రగ్స్‌కు బానిసలు కావడం, ఆత్మహత్యా ప్రయత్నాలు, మనస్పర్థలతో దంపతులు సర్దుకుపోలేకపోవడం, లైంగిక సమస్యలు. భ్రమలు, భ్రాంతులు, అకారణంగా ఇతరులను అనుమానించడం, దయ్యం–గాలిసోకినట్లు ఊగిపోవడం, ఇంకా చిన్నపిల్లల్లో వచ్చే ఆటిజమ్, హైపరాక్టివిటీ, మొండితనం, అతి కోపంతో తిట్టడం, కొట్టడం లాంటి పలురకాల లక్షణాలన్నీ మానసిక రుగ్మతలే నంటే చాలా మందికి ఆశ్చర్యం కలుగవచ్చు.

మానసిక వైద్యులు కేవలం నిద్రమాత్రలే ఇస్తారనే అపోహ ప్రజల్లో ఉంది. అది పూర్తిగా తప్పు. నిద్ర రావడమనేది ఆ మందుల ఫలితాల్లో ఒక లక్షణమే తప్ప అవి నిద్రమాత్రలు కాదు. ఆ యా జబ్బుల్లో ఉన్న మూల కారణాలను సరి చేసి, ఆ వ్యక్తిని మానసిక ఆరోగ్యవంతుడిని చేస్తాయి. ఒకప్పటి కరెంటు చికిత్సతో పాటు, ఇటీవలే వచ్చిన ఆర్‌టీఎమ్ఎస్ అనే మేగ్నటిక్ చికిత్స కూడా చాలా అద్భుతంగా పనిచేస్తుంది. కౌన్సెలింగ్ పద్ధతుల్లో, కాగ్నిటివ్ బిహేవియర్ థెరపీ, మైండ్‌ఫుల్‌నెస్ థెరపీ, డీబీటీ, సీఆర్‌టీ, వర్చువల్ రియాలిటీ థెరపీ లాంటి ఆధునిక చికిత్సా పద్ధతులు కూడా ఇపుడు అందుబాటులోకి వచ్చాయి. ఎవరికి ఎలాంటి చికిత్స అవసరమన్నది అర్హత గల మానసిక వైద్య నిపుణులే నిర్ణయిస్తారు. ఎంబీబీఎస్ తర్వాత మానసిక వైద్యశాస్త్రంలో మూడేళ్ళు ఎమ్‌డీ లేదా డీఎన్‌బీ కోర్సు చేసిన వారినే 'సైకియాట్రిస్టు' లంటారు. రోగ నిర్ధారణకు తగిన పరీక్షలు చేసి మందులతోపాటు కౌన్సిలింగ్ చేసే శిక్షణ సైకియాట్రిస్టులకే ఉంటుంది. 'సైకాలజిస్టు'లంటే సైకాలజీలో ఎమ్మెస్సీ లేదా ఎమ్‌ఫిల్ క్లినికల్ సైకాలజీ చేసినవారు. వీరు మానసిక రోగులకు కౌన్సెలింగ్‌తో పాటు తెలివితేటల నిర్ధారణ, వ్యక్తిత్వ నిర్ధారణ లాంటి మానసిక పరీక్షలు మాత్రమే చేస్తారు. రోగనిర్ధారణ, మందులు ఇవ్వడం లాంటివి వీరు చేయకూడదు.

మానసిక రోగుల సంక్షేమం కొరకు, కేంద్రప్రభుత్వం 2017లో 'మెంటల్ హెల్త్‌కేర్ యాక్ట్' అనే ఒక కొత్త చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. రాష్ట్ర స్థాయిలో 'స్టేట్ మెంటల్ హెల్త్ అథారిటీ'నీ, జిల్లా స్థాయిలో 'రివ్యూ బోర్డ్స్'ను ఏర్పాటు చేశారు. దేశంలో మానసిక వైద్యం అవసరమైన ప్రతి వ్యక్తికీ చికిత్స చేయించి, ఆ ఖర్చు భరించాల్సిన బాధ్యత ఆ యా ప్రభుత్వాలదేనని ఈ చట్టంలో పేర్కొన్నారు. అలాగే ఆదరణ, కూడు, గూడు లేకుండా వీధుల్లో తిరిగే అనాథ మానసిక రోగులను కూడా చేరదీసి వైద్యం చేయించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే! ప్రతి సంవత్సరం అక్టోబర్ పదవ తేదీన ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవంగా జరుపుకొంటూ, ప్రజల్లో మానసిక ఆరోగ్యంపై మరింత అవగాహన కల్పించే ప్రయత్నాన్ని మానసిక నిపుణులు, స్వచ్ఛంద సంస్థలు చేస్తున్నాయి. ఈ సంవత్సరం 'వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ మెంటల్ హెల్త్' పిలుపు ఇచ్చిన సందర్భంగా, సమాజంలో మానసిక అనారోగ్యంపై, మూఢనమ్మకాలపై పోరాడదామని అందరం ఈ సందర్భంగా ప్రతిన బూనుదాం!

వ్యాసకర్త ప్రముఖ సైకియాట్రిస్ట్
(రేపు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం)

భక్తే ప్రధానం

పండరీపురంలో అయిదు వందల ఏళ్ల క్రితం విద్యానంద బోస్లే అనే పండితుడు ఉండేవాడు. తనకు మించిన పండితుడు మరొకరు లేరు అన్న గర్వం ఆయనకుండేది. అయితే విద్యానందకు పాండురంగడంటే అమితమైన భక్తి. రోజూ ఉదయం నదీతీరానికి వెళ్ళి స్నానసంధ్యాదులు కానిచ్చుకుని పాండురంగడిని దర్శించుకున్న తర్వాతే మిగిలిన పనులన్నీ చేసేవాడు. ఆ నది సమీపంలో ఉన్న గుడిసెలో ఓ కుష్ఠు రోగి నివసించేవాడు. అతను తన గుడిసె బయటికి వచ్చి ఆలయంకేసి చేతులెత్తి నమస్కరిస్తుంటాడు. రోగి కావడం వల్ల అతడిని ఎవరూ ఆలయంలోకి రానివ్వడం లేదు. ఒకరోజు విద్యానంద శిష్యులు 'కార్తీక మాసం ఏకాదశి రోజున



జ్యోతిర్మయం

ఉపవాసం చేసి మరుసటి రోజైన ద్వాదశినాడు సూర్యోదయాని కన్నా ముందరే తులసీ తీర్థాన్ని స్వీకరించి ఆదిత్యుడికి నివేదించి వ్రతం ముగిస్తే పుణ్యమనీ, పాండురంగడే ఈ ఏకాదశినాడు వ్రతమూ చరించినట్లు భక్తిగ్రంథాలు చెప్తున్నాయ'ని అన్నారు. దాంతో అతడు ఏకాదశినాడు నదీ స్నానం చేసి ఆలయానికి వెళ్లేందుకు ప్రయత్నించాడు.

అయితే అప్పటికే విఠలుని దర్శనం కానిచ్చుకున్న విద్యానంద బోస్లే గుడి నుంచి బయటకు వస్తూ తన శిష్యులకు ఆ రోగిని చూపిస్తూ 'వాణ్ణి చూస్తేనే ఏమో అయిపోతోంది. వాడిని ఇక్కడికి రాకుండా తరిమికొట్టండి' అన్నాడు. శిష్యులు గురువుగారి ఆజ్ఞ పాటించారు. ఆ రోజు రాత్రి ఆ రోగి జరిగినదంతా తలచుకుని బాధపడ్డాడు. 'ఏమిటి విఠలా, నాకీ అవస్థ. ఈ జీవితంలో నాకు నీ దర్శనభాగ్యం ఉందా, లేదా?' అని మనసులోనే అడిగాడు. మరుసటి రోజు ద్వాదశి. అతిథులను పిలిచి భోజనం పెట్టడానికి విద్యానంద ప్రయత్నించాడు. కానీ ఆ రోజు ఒక్క అతిథి కూడా అతడికి దొరకలేదు. కానీ ఆ రోగికి ఓ అతిథి దొరకడం చూసిన విద్యానంద బాధపడ్డాడు.

ఆ రోజు రాత్రి విద్యానంద కలలో పాండురంగడు కనిపించాడు. 'విద్యానందా! నీ అహంకారం వల్ల నీ జ్ఞానమంతా వృథా అయింది. కానీ నా భక్తుడేమో తనను అనుగ్రహించమని ప్రాధేయపడ్డాడు. అతనిది స్వచ్ఛమైన పవిత్ర భక్తి, కనుక అతని భక్తికి నేను దాసుడనయ్యాను. అందుకే అతనికి అతిథిగా వెళ్ళాన్నా'డు. మరుసటి రోజు విద్యానందుడు ఆ కుష్ఠురోగి దగ్గరకు వెళ్లి జరిగిందంతా చెప్పి తనను క్షమించమని కోరాడు.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, తిథి: బ.దశమి ప.1.10 వరకు, తదుపరి ఏకాదశి, నక్షత్రం: ఆశ్లేష పూర్తి (24 గంటలు), వర్జ్యం: ప.1.02 నుండి 2.32 వరకు, దుర్ముహూర్తం: ప.12.12 నుండి 12.59 వరకు తదుపరి ప.2.33 నుండి 3.21 వరకు, అమృతఘడియలు: తె.5.16 నుండి 7.01 వరకు (తెల్లవారితే మంగళవారం); రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు, యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు, సూర్యోదయం: 5.55, సూర్యాస్తమయం: 5.41.

క్లుప్తంగా...

'బోర్లాగ్' అంతర్జాతీయ సదస్సుకు కేటీఆర్, నిరంజన్‌రెడ్డి

- ఈనెల 22 నుంచి 29 వరకు అమెరికా పర్యటన




సాక్షి, హైదరాబాద్: బోర్లాగ్ అంతర్జాతీయ సదస్సుకు ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, వ్యవసాయ శాఖమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి వెళ్లనున్నారు. ఈ నెల 22 నుంచి 29 వరకు వీరిద్దరు అక్కడ పర్యటించనున్నారు. పదేళ్ల తెలంగాణ వ్యవసాయరంగ ప్రగతి ప్రస్థానంపై ప్రసంగించాలని మంత్రి కేటీఆర్‌ను 'వరల్డ్ ఫుడ్ ప్రైజ్ ఫౌండేషన్' అధ్యక్షుడు టెర్రీ బ్రాన్ స్టాడ్ ఆహ్వానించారు. తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ అనుకూల విధానాలు, వ్యవసాయంలో సాధించిన పురోగతిని గమనించి బోర్లాగ్ సదస్సుకు తమను ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఈనెల 24 నుంచి 26 వరకు అమెరికాలోని అయోవా రాష్ట్రం డెమోయిన్ నగరంలో జరిగే సదస్సులో కేటీఆర్, నిరంజన్‌రెడ్డి పాల్గొంటారు. ప్రపంచ హరితవిప్లవ పితామహుడు నార్మన్ బోర్లాగ్ పేరు మీద ఏటా ఈ సదస్సులు జరుగుతాయి. వీటికి ప్రపంచ దేశాల నుంచి 1,200 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. మొత్తంగా ఈనెల 22 నుంచి 29 వరకు జరిగే ఈ పర్యటనలో ఇరువురు మంత్రులతో పాటు ఆర్థిక శాఖ కార్యదర్శి రామకృష్ణారావు, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, తెలంగాణ సీడ్స్ ఎండీ కేశవులు బృందం కూడా పాల్గొననున్నారు.

ఆకలితో రోడ్డెక్కిన విద్యార్థినులు

- చిట్యాల ఎస్సీ హాస్టల్ విద్యార్థినుల ధర్నా, రాస్తారోకో



రోడ్డుపై ధర్నా చేస్తున్న విద్యార్థినులు

చిట్యాల: భోజనం పెట్టకపోవడంతో ఆకలితో అలమటిస్తూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల హాస్టల్ విద్యార్థినులు ఆదివారం రోడ్డెక్కారు. ప్లేట్లు ముందు పెట్టుకుని ధర్నా, రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ.. వంట పనివారికి జీతాలు రావడం లేదని తమకు భోజనం పెట్టలేదని వివరించారు. శనివారం రాత్రి భోజనం, ఆదివారం ఉదయం అల్పాహారం పెట్టకపోవడంతో ధర్నా చేసినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేశ్‌గౌడ్, నాయకులు విద్యార్థులకు సంఘీభావం తెలిపారు. సొంత ఖర్చుతో విద్యార్థులకు అల్పాహారం, అరటి పండ్లు అందజేశారు. ఇదే విషయమై డీఎస్‌డీవో సునీతను 'సాక్షి' వివరణ కోరగా.. హాస్టల్‌లో శనివారం భోజనం ఏర్పాటు చేశామని, ఆదివారం ఉదయం మాత్రం విద్యార్థినులు జావ తాగారని తెలిపారు. ఎవరో ఉద్దేశపూర్వకంగానే విద్యార్థినులతో ధర్నా చేయించారని ఆమె స్పష్టం చేశారు.

బాలుడిపై వీధి కుక్కల దాడి

- తీవ్ర గాయాలు.. ఆస్పత్రిలో చికిత్స



ఖమ్మం వైద్యవిభాగం: ఓ బాలుడిపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయ పరిచిన ఘటన ఖమ్మంలోని దానవాయిగూడెం సమీపంలో గల మేకల నారాయణనగర్‌లో జరిగింది. ఆ ప్రాంతానికి చెందిన సాయి–త్రివేణి దంపతుల పెద్దకుమారుడు శ్యామ్ ఒకటో తరగతి చదువుతున్నాడు. శనివారం సాయంత్రం ట్యూషన్‌కు వెళ్లాడు. కుమారుడిని తీసుకొచ్చేందుకు త్రివేణి తన చిన్న కుమారుడు యశ్వంత్ తో కలిసి వెళ్లింది. ఇంటికి తిరిగి వస్తుండగా ఆ వీధిలో ఉన్న కుక్కలు వెంట బడ్డాయి. శ్యామ్ గేటు లోపలికి వెళ్లగా, చిన్న కుమారుడు వెనుకనే ఉండిపోయిన సంగతి గమనించకుండా తల్లి లోపలికి వెళ్లిపోయింది. ఇదే సమయంలో కుక్కలు యశ్వంత్‌పై దాడి చేసి ముఖంపై తీవ్రంగా గాయపరిచాయి. వెంటనే బాలుడిని ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించగా...ప్రాథమిక చికిత్స చేశారు. అయితే పరిస్థితి విషమంగా ఉండటంతో ఎస్ఎన్‌సీయూలో చేర్పించి ప్రత్యేక వైద్యం అందించారు. బాలుడి ముఖానికి ప్లాస్టిక్ సర్జరీ చేస్తే సాధారణ స్థితికి చేరు కుంటాడని వైద్యులు తెలిపారు. కాగా, ఓ డెక రేషన్ సామగ్రి తయారీలో కూలీగా పనిచేస్తున్న తండ్రికి సాయికి ఆర్థికస్తోమత అంతంతమాత్రమే కావడంతో అతడి యజమాని ఆకారపు కృష్ణ బాలుడికి శస్త్రచికిత్స చేయించేందుకు ముందుకు వచ్చారు. బాలుడిని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా రెండు, మూడు రోజుల్లో ఆపరేషన్ చేస్తామని వైద్యులు తెలిపారు.

బాంబ్ సేఫ్టీ రూంలో తలదాచుకున్నాం

- 'హమాస్'దాడులతో భయంభయంగా తెలంగాణ వలసకార్మికులు
- ఇజ్రాయెల్‌లో 1,500 మందికిపైగానే...
- పాలస్తీనా సరిహద్దులో ఉన్నవారిలో టెన్షన్ టెన్షన్



బంకర్లలో తలదాచుకున్న తెలంగాణవాసులు

సాక్షి ప్రతినిధి కరీంనగర్/మోర్తాడ్/ఆర్మూర్: ఇజ్రాయెల్‌లో ఉన్న తెలంగాణ వలస కార్మికుల కుటుంబసభ్యుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. పాలస్తీనా సరిహద్దుకు సమీప ప్రాంతంలో నివసిస్తున్నవారు ఇబ్బందులు పడుతుండగా, టెల్ అవీవ్ వంటి నగరాల్లో ఉన్నవారు క్షేమంగా ఉన్నట్టు తెలిసింది. ఉమ్మడి ఏపీ నుంచి ఐదువేల మంది వరకు ఇజ్రాయెల్‌కు వలస వెళ్లారు. వీరిలో నిజామాబాద్, కరీంనగర్, నిర్మల్, మెదక్, జగిత్యాల తదితర జిల్లాలకు చెందిన సుమారు 1,500 మంది ఉన్నారు. విజిట్ వీసాలపై ఇజ్రాయెల్ వెళ్లిన చాలామంది అక్కడ ఇళ్లలో కార్మికులుగా పనులు చేస్తున్నారు. ఇజ్రాయెల్‌లోని రమద్‌గాన్ పట్టణం తలవిల ప్రాంతంలో చాలామంది తెలంగాణవారు ఉన్నారు. ఈ పట్టణం పాలస్తీనా సరిహద్దుకు 70 కిలోమీటర్ల దూరంలో ఉంది. శనివారం సాయంత్రం నుంచి బాంబుల మోతతో ఈ ప్రాంతం దద్దరిల్లుతోందని తెలంగాణవాసులు 'సాక్షి'కి ఫోన్‌లో తెలిపారు. యుద్ధం కారణంగా ఇజ్రాయెల్ ప్రభుత్వం సెలవు ప్రకటించిందని, ప్రభుత్వం బాంబుల దాడి సమయంలో సైరన్ మోగించడంతో వెంటనే ప్రతి అపార్ట్‌మెంట్‌లో ఉండే బాంబ్ సేఫ్టీ రూంలో తలదాచుకున్నామని చెప్పారు. తెలంగాణవాసులు కార్మికులుగా పని చేసే ప్రాంతంలో శనివారం సాయంత్రం జరిగిన బాంబుదాడిలో ఓ భవనం ఆరో అంతస్తు శిథిలమైందని, ఇప్పటివరకు అందరం క్షేమంగానే ఉన్నామని తెలిపారు. జగిత్యాల జిల్లాకు చెందిన జగిత్యాల రూరల్ మండలం సంగంపల్లికి చెందిన జలపతిరెడ్డి, గుండ సత్తయ్య, అనంతరెడ్డి, హబ్సీపూర్‌కు చెందిన ఏలేటి మల్లారెడ్డి, గుగ్గిల్ల లక్ష్మీనారాయణ, వరికోల నర్సయ్య, ఆదివారం రాత్రి అక్కడి పరిస్థితులను 'సాక్షి'కి వివరించారు.

టెల్అవీవ్‌లో సురక్షితం

తెలంగాణకు చెందిన 600 మంది వలస కార్మికులు ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్ నగరంలో ఉపాధి పొందుతున్నారు. హమాస్ దాడులతో సరిహద్దు ప్రాంతాల్లోని వారికే ఎక్కువ ముప్పు ఉందని, ఇతర ప్రాంతాలకు ఎలాంటి ఇబ్బంది లేదని నిజామాబాద్ జిల్లానుంచి ఇజ్రాయెల్‌కు వలస వెళ్లిన కార్మికులు 'సాక్షి'కి ఫోన్ ద్వారా తెలిపారు. దాడులు మొదలైనప్పుడు కొంత ఆందోళనకు గురయ్యామని, మిలిటెంట్ల ఆగడాలను అరికట్టడానికి ఇజ్రాయెల్ రక్షణ విభాగం రంగంలోకి దిగి సరిహద్దు ప్రాంతాల్లోనే నిలువరించాయని తెలియడంతో ఊపిరి పీల్చుకున్నామన్నారు.

రక్షణ చర్యలు చేపట్టారు



ఇజ్రాయెల్ ప్రభుత్వం పౌరుల రక్షణకు చర్యలు చేపట్టింది. దాడులు జరుగుతున్న ప్రాంతం మా నివాస ప్రాంతాలకు దూరంగా ఉండడం వల్ల తెలంగాణవారు పెద్దగా భయాందోళనలకు గురి కావాల్సిన అవసరం లేదు.

– సోమ రవి, తెలంగాణ ఇజ్రాయెల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు

ఉపాధిపై ప్రభావం ఉంటుంది



కుటుంబాలను పోషించుకోవడానికి కోసం ఇక్కడకు వలస వచ్చాం. కోవిడ్ సమయంలో పనులు లేక ఇబ్బందిపడ్డాం. ప్రస్తుత పరిస్థితుల కారణంగా ఎన్ని సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందోనని భయంగా ఉంది.

– ఓంకార్, ఇజ్రాయెల్‌లో ఉన్న ఆర్మూర్ మండలం పిప్రివాసి

చందానగర్‌లో 6 కిలోల బంగారం పట్టివేత

ముగ్గురి అరెస్టు.. విలువ రూ.3.5 కోట్లు



హఫీజ్‌పేట్: భారీగా బంగారు ఆభరణాలు తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం ముంబై నుంచి లింగంపల్లి తారానగర్ మార్కెట్‌కు తరలిస్తున్న రూ.3.50 కోట్ల విలువ చేసే 6 కిలోల బంగారు ఆభరణాలను మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు విశ్వసనీయ సమాచారంతో పట్టుకున్నారు. దీంతో బంగారు ఆభరణాలు తరలిస్తున్న రితేశ్, నవీన్, ఆనంద్‌లను అదుపులోకి తీసుకుని విచారించారు. ఆభరణాలకు సంబంధించిన రశీదులు అడగ్గా.. వారు చూపించకపోవడంతో బంగారం సీజ్ చేసి వారిని అరెస్టు చేశారు. ముగ్గురిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నల్లగొండ జిల్లా వ్యవసాయ శాఖలో ముగ్గురు అధికారుల సస్పెన్షన్

నల్లగొండ అగ్రికల్చర్: నల్లగొండ జిల్లా వ్యవసాయ శాఖలో ముగ్గురు అధికారులపై సస్పెన్షన్ వేటు పడింది. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో యూరియా స్టాకు లేనప్పటికీ ఉన్నట్లు తప్పుడు రిపోర్టు ఇచ్చినందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ ముగ్గురు అధికారులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. సస్పెండ్ అయిన వారిలో దేవరకొండ ఏడీఈ వీరప్ప, జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో పనిచేస్తున్న టెక్నికల్ ఓఏ గిరిప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ రవికుమార్ ఉన్నారు. గత నెలలో యూరియా కొరత, రైతుల ఇబ్బందులపై 'బ్లాక్‌లో యూరియా' శీర్షికతో సాక్షిలో వచ్చిన కథనానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి జిల్లా నుంచి నివేదిక తెప్పించుకున్నారు. జిల్లాలో 14 వేల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉన్నట్లు ఇక్కడి అధికారులు నివేదిక ఇచ్చారు. అయితే జిల్లాలో కేవలం 2 వేల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే ఉన్నట్లు రాష్ట్ర స్థాయి అధికారులు గుర్తించారు.

పెంబర్తి కళాకారులను ప్రోత్సహించాలి

- దక్కన్ హెరిటేజ్ అకాడమీ చైర్మన్ వేదకుమార్



సాక్షి, హైదరాబాద్: మనకంటూ ప్రత్యేకమైన హస్తకళలను అంతరించిపోకుండా చూడాల్సిన బాధ్యత ఉందని దక్కన్ హెరిటేజ్ అకాడమీ చైర్మన్ వేదకుమార్ అన్నారు. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన పెంబర్తి హస్తకళలలాంటివి భావితరాలకూ అందుబాటులో ఉండాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. ఇటీవల ఉత్తమ గ్రామీణ పర్యాటక ప్రాంతంగా పురస్కారం పొందిన జనగామ జిల్లా పెంబర్తి గ్రామాన్ని ఆయన సామాజిక కార్యకర్త ధనంజయ్య, ల్యాండ్ స్కేప్ ఆర్కిటెక్ట్ శ్రీరామ్‌రాజ్ తదితరులతో కలిసి ఆదివారం సందర్శించారు. ఇత్తడి, కంచు మిశ్రమాలతో అద్భుత కళారూపాలను అలవోకగా రూపొందిస్తూ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన కళాకారులను కలిసి వేదకుమార్ అభినందనలు తెలిపారు. కొందరు కళాకారులను సన్మానించారు. ఇక ముందు కూడా ఆ కళారూపాలను ప్రపంచానికి అందించాలని, అద్భుత కళను అంతరించకుండా చూడాలని వారికి సూచించారు. ఇందుకు కళాకారులకు ప్రోత్సాహం, సహకారం అవసరమని, అందుకు ప్రభుత్వం కూడా ముందుకొచ్చి వారికి సాయం చేయాలని వారు కోరారు. ప్రజలు ఆ కళాఖండాలను కొనటం ద్వారా వారి ఇళ్లకు ఓ ప్రత్యేకత తెచ్చుకున్నట్లు, కళాకారులను ఆదరించినట్లూ అవుతుందని పేర్కొన్నారు. మన సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీకగా భావించే ఈ అద్భుత కళ అంతరించకుండా, ఆ కుటుంబాల తదుపరి తరాలు కూడా వాటిని జీవనోపాధిగా చేసుకోగలిగేలా ప్రజలు ప్రోత్సాహాన్ని అందించాల్సిన అవసరముందని తెలిపారు.

విద్యుదాఘాతంతో వేర్వేరు చోట్ల ముగ్గురు యువకుల మృతి



నాగరాజు

నల్లగొండ క్రైం, మిర్యాలగూడ టౌన్/తాడ్వాయి: నల్లగొండ, కామారెడ్డి జిల్లా ల్లో ఆదివారం ముగ్గురు యువకులు ప్రమాదవ శాత్తు విద్యుదాఘాతానికి గురై మృత్యువాతపడ్డారు. మృతుల్లో నల్లగొండ జిల్లాకు చెందిన ఇద్దరు రైతులు, కామారెడ్డి జిల్లాలో ఒక సబ్‌స్టేషన్ ఆపరేటర్ ఉన్నారు. నల్లగొండ మండలం ముశంపల్లికి చెందిన నరేశ్ (35) వ్యసాయం పొలం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజు వేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మిర్యాలగూడ మండలం సుబ్బారెడ్డిగూడెంలో వంగాల అనిల్‌రెడ్డి(32) రోజు మాదిరిగానే పొలానికి నీళ్లు పెట్టడానికి వెళ్లాడు. మోటారుకు కరెంట్ సరఫరా ఆగిపోవడంతో వైర్ సరిచేస్తుండగా కరెంటు షాక్ తగిలి కిందపడిపోయాడు. సమీపంలో ఉన్న అతడి భార్య, చుట్టుపక్కల రైతులు పరిగెత్తుకొచ్చి వెంటనే అనిల్‌రెడ్డిని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన దుడుపుల నాగరాజు(35) తాడ్వాయి మండల కేంద్రంలోని సబ్ స్టేషన్‌లో ఆపరేటర్. ఉదయం సబ్‌స్టేషన్‌లో ఏర్పడిన సమస్యతో మండల కేంద్రంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో నాగరాజు అల్యూమినియం ఎక్కి మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవ శాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మరణించాడు. అతడికి భార్య భాగ్యలక్ష్మి, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

'పత్తి' కేవలం నూలువస్త్రాల ఉత్పత్తికి వాడే దూదిని అందించే వాణిజ్యపంటగానే సాధారణంగా పరిగణిస్తుంటాం. కానీ, అంతర్జాతీయంగా దీనిని వాణిజ్య పంటగానే కాకుండా ఆహార, చమురుపంటగా కూడా గుర్తిస్తున్నారు. అక్టోబర్ 7వ తేదీన 'ప్రపంచ పత్తి దినోత్సవం' సందర్భంగా అనేక అంతర్జాతీయసంస్థలు వ్యాప్తిలోకి తెచ్చిన సమాచారంలో ఇదొక ముఖ్యాంశం. పత్తి గింజల నుంచి తీసిన నూనెను వంటనూనెగా వాడుతున్నాం. పత్తిగింజల చక్కను పశుదాణాలో కలిపి పాడి పశువులకు మేపుతున్నాం. కొన్ని దేశాల్లో పత్తిగింజల నూనెను జీవ ఇంధనం తయారీకి కూడా వాడుతున్నారు. ఆ విశేషాలు కొన్ని..

పత్తి ఆహారపంట కూడా!



- ప్రపంచంలో అత్యధికంగా పత్తిసాగు చేస్తున్న దేశం భారత్. 23శాతం పత్తి మన దేశంలోనే పండుతోంది. 60 లక్షలమంది పత్తిసాగు చేస్తుండగా, మరో 40–50 లక్షల మంది పత్తి పరిశ్రమల్లో పనిచేస్తూ ఉపాధి పొందుతున్నారు.
- ప్రపంచవ్యాప్తంగా పత్తి రైతులు 3 కోట్ల 20 లక్షలు. ఇందులో దాదాపుగా సగం మహిళారైతులే. వీరిలో ఎక్కువమంది పేద, అభివృద్ధి చెందుతున్న దేశాలవారే. మన దేశంలో 65శాతం పత్తి వర్షాధారంగానే సాగవుతోంది. అప్పుల పాలై ప్రాణాలు తీసుకునే రైతుల్లో మెట్ట ప్రాంతాల పత్తి రైతులే ఎక్కువ.
- 5 ఖండాల్లోని 80 దేశాల్లో 13 కోట్ల మందికి పైగా పత్తి ఆధారిత పరిశ్రమల ద్వారా ఉపాధి పొందుతున్నారు.
- ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ కార్మికసంస్థల సమాచారం ప్రకారం.. కనీసం 18 దేశాల్లో పత్తి పొలాల్లో బాలకార్మికులతో పనులు చేయిస్తున్నారు.
- అంతర్జాతీయ పత్తి సలహామండలి (ఐసీఏసీ) అంచనా ప్రకారం రైతు పండించిన ఒక టన్ను పత్తి ఐదుగురికి ఏడాది పొడవునా ఉపాధి కల్పిస్తోంది.
- కిలో పత్తి పండించడానికి 20,000 లీటర్ల నీరు అవసరమనే భావన ఉంది. అయితే, నిజానికి 1,200–2,000 లీటర్ల నీరు సరిపోతుందని ఐసీఏసీ చెబుతోంది. అందువల్లనే నిస్సారమైన భూములు, కరువులకు ఆలవాలమైన సబ్ సహారన్ ఆఫ్రికాదేశాల్లో సాగు చేయదగిన అతికొద్ది పంటల్లో పత్తి కూడా ఉందని ఐసీఏసీ వాదన.
- పత్తి పంట సాగు వల్ల భూతాపం కూడా పెరగడం లేదని ఐసీఏసీ చెబుతోంది. రసాయనిక సేద్యంలో కిలో పత్తిసాగుకు 1.7 కిలోల కర్బన ఉద్గారాలు వెలువడుతున్నాయని అంచనా. అయితే, దూదిలో 97శాతం సెల్యులోజ్ ఉంటుంది. కాబట్టి, పండే ప్రతి కిలో దూది 2.2 కిలోల కర్బన ఉద్గారాలను పీల్చుకుంటుంది. అంటే.. ప్రతి కిలో పత్తికి 0.5 కిలోల ఉద్గారాలు నిజానికి వాతావరణంలో తగ్గుతున్నట్టేనని ఐసీఏసీ లెక్క చెబుతోంది.
- సేంద్రియ పద్ధతుల్లో సాగయ్యే కిలో దూదికి 0.9 కిలోల ఉద్గారాలు మాత్రమే విడుదలవుతున్నాయని ఐసీఏసీ అంటోంది.
- సింథటిక్ ఫైబర్ బదులు పత్తిని వినియోగించడం ద్వారా భూతాపాన్ని తగ్గించొచ్చని, మైక్రోఫైబర్ కణాల కాలుష్యం నుంచి జలవనరులు, ఆహార చక్రాన్ని రక్షించుకోవచ్చని ఐసీఏసీ సూచిస్తోంది.
- పంటకాలం పూర్తయిన తర్వాత పత్తి చెట్టు మొత్తంలో 3శాతం తప్ప వృథా అయ్యేదేమీ లేదు. పత్తి కట్టెతో బయోచార్ తయారు చేసుకొని సేంద్రియ ఎరువుగా వాడుకోవచ్చని ఐసీఏసీ అంటోంది.
- పెరుగుతున్న భూతాపం వ్యవసాయ రంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలో పత్తి రైతులను ముఖ్యంగా మహిళా రైతులను వాతావరణ మార్పులు బహుముఖంగా ఇబ్బందుల పాలు చేస్తున్నాయని కాటన్‌కనెక్ట్ సంస్థ నిర్వహించిన అధ్యయనం చెబుతోంది. పొలం పనులు, పశుపోషణ, కుటుంబపోషణ సమస్యలతో మహిళా రైతులు సతమతమవుతున్నారు. వాతావరణ మార్పులు తట్టుకునే ఉపాయాలపై మహిళా రైతులకు అవగాహన కల్పించడం ద్వారా సత్ఫలితాలు వస్తున్నాయని కాటన్ కనెక్ట్ నివేదిక తెలిపింది.
- మన దేశంలో సాగవుతున్న పత్తి విస్తీర్ణంలో 95శాతం జన్యుమార్పిడి చేసిన వంగడాలే.

– సాక్షి సాగుబడి డెస్క్



సైనికుడా సెల్యూట్

ఆర్మీ జవాన్ గంగాప్రసాద్ అంత్యక్రియలు



ఆర్మీ అధికారులకు సెల్యూట్ చేస్తున్న గంగాప్రసాద్ సతీమణి శిరీష

బోధన్: సిక్కిం వరదల్లో 5 రోజుల కిందట గల్లంతై మృతిచెందిన నిజామాబాద్ జిల్లా బోధన్ మండలంలోని కుమ్మన్‌పల్లి గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ నీరడి గంగాప్రసాద్ అంత్యక్రియలను ఆదివారం స్వగ్రామంలో నిర్వహించారు. సైనిక లాంఛనాలతో జరిగిన అంత్యక్రియల్లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ సత్యనారాయణ పాల్గొని నివాళులర్పించారు. అంత్యక్రియల్లో వేల సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆర్మీ అధికారులకు జవాన్ భార్య శిరీష కన్నీటితో సెల్యూట్ చేయడం పలువురిని కంటతడి పెట్టించింది.

చంద్రబోస్‌కు గురజాడ విశిష్ట పురస్కారం



విజయనగరం టౌన్: ప్రముఖ సినీ గేయ రచయిత చంద్రబోస్‌కు మహాకవి గురజాడ విశిష్ట పురస్కారం అందజేయనున్నట్లు విజయనగరం గురజాడ సాంస్కృతిక సమాఖ్య ప్రకటించింది. తెలుగు సాహిత్య రంగంలో విశేష కృషి చేస్తున్న వారిని గురజాడ పురస్కారంతో గౌరవిస్తున్నామని పేర్కొంది. నవంబర్ 30న నిర్వహించే గురజాడ సాహితీ చైతన్యోత్సవ కార్యక్రమంలో చంద్రబోస్‌కు ఈ పురస్కారం ప్రదానం చేస్తామని సమాఖ్య ప్రతినిధులు డాక్టర్ ఎ.గోపాలరావు, కాపుగంటి ప్రకాష్ ఆదివారం తెలిపారు.

భీకర యుద్ధం

రెండో రోజుకు చేరిన ఇజ్రాయెల్, హమాస్ ఘర్షణ

- దక్షిణ ఇజ్రాయెల్‌లో పరస్పరం కాల్పులు
- గాజాపై రాకెట్ల వర్షం కురిపించిన ఇజ్రాయెల్ సైన్యం
- ఇజ్రాయెల్‌లో 600 మంది, గాజాలో 370సహా దాదాపు 1,000 మంది మృతి!
- బందీలుగా ఉన్న మహిళలపై సాయుధుల అత్యాచారాలు
- ముష్కరులు మూల్యం చెల్లించుకోక తప్పదని ప్రధాని నెతన్యాహూ హెచ్చరిక



గాజాలో ఇజ్రాయెల్ దాడిలో ధ్వంసమైన భవనం

టెల్ అవీవ్/జెరూసలేం: ఇజ్రాయెల్ సైన్యం, పాలస్తీనా మిలిటెంట్ సంస్థ హమాస్ మధ్య భీకర యుద్ధం కొనసాగుతూనే ఉంది. శనివారం ఉదయం మొదలైన ఘర్షణ ఆదివారం రెండో రోజుకు చేరుకుంది. దక్షిణ ఇజ్రాయెల్‌లో పరిస్థితి భీతావహంగా మారింది. హమాస్ మిలిటెంట్లు, ఇజ్రాయెల్ జవాన్ల మధ్య కాల్పులు కొనసాగుతున్నాయి. గాజా నుంచి ఇజ్రాయెల్ భూభాగంలోకి చొచ్చుకువచ్చిన తీవ్రవాదులు వీధుల్లో జవాన్లతో తలపడుతున్నారు. హమాస్ దుశ్చర్య పట్ల ప్రతీకారంతో రగిలిపోతున్న ఇజ్రాయెల్ సైన్యం పెద్ద సంఖ్యలో రాకెట్లను గాజాపై ప్రయోగించింది. ఈ దాడుల్లో గాజాలో పలు భవనాలు ధ్వంసమయ్యాయి. ఇజ్రాయెల్ వైమానిక దాడుల నుంచి తప్పించుకోవడానికి గాజా పౌరులు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్తున్నారు. ఇప్పటికే 20,000 మంది ఇళ్లు విడిచి వెళ్లిపోయినట్లు అంచనా. దాడులు, ప్రతిదాడుల్లో ఇప్పటిదాకా ఇజ్రాయెల్‌లో 600 మందికిపైగా, గాజాలో 370 మందికిపైగా మొత్తంగా దాదాపు వేయి మంది మరణించినట్లు వార్తలు వెలువడ్డాయి. ఇజ్రాయెల్ యుద్ధ రంగంలో ఉన్నట్లు ప్రధాని నెతన్యాహూ కేబినెట్ ఆదివారం ప్రకటించింది. సంక్షోభ నివారణకు సైనిక పరమైన చర్యలు ప్రారంభించినట్లు వెల్లడించింది.



ఇజ్రాయెల్ మహిళను కిడ్నాప్ చేస్తున్న దృశ్యం

బందీలపై తీవ్రవాదుల అత్యాచారాలు

హమాస్ మిలిటెంట్లు ఇజ్రాయెల్‌లో బీభత్సం సృష్టించారు. ఇజ్రాయెల్ పౌరులను బందీలుగా పట్టుకొని గాజాకు తరలించారు. వీరిలో వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలు కూడా ఉండడం గమనార్హం. ఈ బందీలను అడ్డం పెట్టుకొని పెద్ద బేరమే ఆడబోతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే వేలాది మంది పాలస్తీనావాసులు ఖైదీలుగా ఇజ్రాయెల్ ఆధీనంలో ఉన్నారు. వీరిని విడిపించుకోవడానికి మిలిటెంట్లు ఇజ్రాయెల్ బందీలను పావులుగా ప్రయోగించబోతున్నట్లు సమాచారం. ఇంకోవైపు చాలామంది ఇజ్రాయెల్ పౌరులను మిలిటెంట్లు అపహరించినట్లు ప్రచారం సాగుతోంది.

ఇజ్రాయెల్‌లో వందలాది మంది...

ఇజ్రాయెల్‌లో హమాస్ దాడిలో మరణించిన వారి సంఖ్య ఇప్పటిదాకా 600కు చేరినట్లు మీడియా సంస్థలు వెల్లడించాయి. వీరిలో 44 మంది సైనికులు ఉన్నారని తెలిపాయి. ఇజ్రాయెల్ ఎదురుదాడిలో గాజాలో 370 మందికి పైగా మృతి చెందారని పాలస్తీనా అధికారులు చెప్పారు. ఇరువైపులా 2,000 మంది చొప్పున గాయపడినట్లు సమాచారం. తమ సైనిక దళాలు 400 మంది హమాస్ మిలిటెంట్లను హతమార్చినట్లు ఇజ్రాయెల్ అధికార వర్గాలు తెలియజేశాయి. చాలామందిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నాయి.

భారతీయులు క్షేమం..

ఇజ్రాయెల్, గాజాలో భారతీయులంతా ఇప్పటిదాకా క్షేమంగా ఉన్నట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. వారికి ప్రమాదం ఏమీ లేదని చెప్పారు. ఇజ్రాయెల్‌లో దాదాపు 18,000 మంది భారతీయులు నివసిస్తున్నారు. భారతీయులకు తాము అందుబాటులో ఉంటున్నామని, వారి తగిన సలహాలు సూచనలు ఇస్తున్నామని భారత రాయబార కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పరిస్థితి త్వరలోనే అదుపులోకి వస్తుందని ఆశిస్తున్నట్లు తెలియజేశాయి. మరోవైపు గాజాలో వాతావరణం భయంకరంగా ఉందని అక్కడి భారతీయులు చెప్పారు. ఇంటర్నెట్, విద్యుత్ సౌకర్యం పూర్తిగా నిలిచిపోయిందని పేర్కొన్నారు. ఇలా ఉండగా, ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌కు ఈ నెల 14 దాకా తమ విమానాల రాకపోకలను రద్దు చేస్తున్నట్లు ఎయిర్ ఇండియా ప్రకటించింది.



హమాస్ వద్ద బందీగా ఉన్న కుటుంబం

తల్లిదండ్రుల కళ్లెదుటే పసిబిడ్డ హత్య

హమాస్ తీవ్రవాదులు రాక్షసుల్లాగా ప్రవర్తిస్తున్నారు. వారి ఘాతుకం సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి వచ్చింది. తీవ్రవాదులు ఇజ్రాయెల్‌లో ఓ కుటుంబాన్ని బందీలుగా మార్చారు. తమ అధీనంలో ఉన్న భార్యాభర్తలు, వారి ఇద్దరి కుమార్తెలు, కుమారుడిని హింసించారు. ఒక పసిబిడ్డను ఆమె తల్లిదండ్రుల కళ్లెదుటే మెడు తాడు బిగించి చంపేశారు. అది చూసి బిగ్గరగా రోదిస్తున్న మరో కుమార్తె, కుమారుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మీ సోదరి స్వర్గానికి వెళ్లింది' అని అరుస్తూ చెప్పారు. ఇజ్రాయెల్ జర్నలిస్టు హనాయా నఫ్తాలీ ఈ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేశారు.

దేశాన్నే వణికిస్తున్న బుల్లి సంస్థ!

ఇజ్రాయెల్‌కు చుక్కలు చూపుతున్న హమాస్ • వినాశనమే లక్ష్యంగా చీటికీమాటికీ దాడులు

హమాస్. అత్యాధునిక నిఘాలో, అంతకుమించిన సైనిక సంపత్తిలో ప్రపంచంలోనే తిరుగులేనిదని పేరున్న ఇజ్రాయెల్‌ను మెరుపు దాడులతో నిలువునా వణికించిన పాలస్తీనా మిలిటెంట్ గ్రూప్. పక్కా ప్రణాళిక ప్రకారం భూ, జల, వాయు తలాల గుండా దాడులకు దిగి గుక్కతిప్పుకోనివ్వలేదు. ఇంతకీ ఏమిటీ సంస్థ? ఎందుకు ఈ స్థాయిలో దాడులకు దిగింది? ఇంతటి శక్తి సామర్థ్యాలను ఎలా సంతరించుకుంది...?

పాలస్తీనాలోని గాజా స్ట్రిప్‌ను పాలిస్తున్న సాయుధ సంస్థ హమాస్. ఇజ్రాయెల్ వినాశనం, ఇస్లామిక్ సామ్రాజ్య స్థాపనే లక్ష్యమని ప్రకటించుకుంది. 2007లో గాజాను చేజిక్కించుకున్న నాటి నుంచీ ఇజ్రాయెల్‌తో ఎన్నోసార్లు పోరుకు దిగింది. హమాస్ అంటే హర్కతల్ ముఖవమా అల్ ఇస్లామియా. రాజకీయ పార్టీగా మొదలై సాయుధ సంస్థగా మారింది. 2000లో రెండో తిరుగుబాటులో భాగంగా ఇజ్రాయెల్‌పై భారీ దాడులకు పాల్పడి వందల మందిని బలి తీసుకుంది.

- శనివారం నాటి దాడి ఇజ్రాయెల్‌పై హమాస్ జరిపిన వాటిలో అత్యంత తీవ్రమైనది. ఈజిప్టు, సిరియా ఇలాగే ఇజ్రాయెల్‌పై సరిగ్గా 50 ఏళ్ల కింద, 1973లో మెరుపు దాడికి దిగాయి. అది మధ్యప్రాచ్యంలో తీవ్ర యుద్ధంగా మారింది.
- 2000లో బందీగా దొరికిన ఒకే ఒక్క ఇజ్రాయెల్ సైనికుడిని అడ్డం పెట్టుకుని వేల మంది పాలస్తీనా ఖైదీలను విడుదల చేయించుకుంది. తాజాగా భారీ సంఖ్యలో ఇజ్రాయెల్ సైనికులను నిర్బంధించిన ఆ సంస్థ, ఈసారి ఏ స్థాయిలో బేరం పెడుతుందన్నది తేలాల్సి ఉంది!
- ఇజ్రాయెల్, అమెరికా, యూరోపియన్ యూనియన్ హమాస్‌ను ఉగ్రసంస్థగా ప్రకటించాయి.
- ఈ సంస్థకు ఇరాన్ దన్నుగా నిలుస్తోంది. నిధులు, ఆయుధాలతో పాటు సాయుధ శిక్షణ ఇస్తోంది. తుర్కియే, ప్రవాస పాలస్తీనీయులు, ప్రైవేటు దాతలతో పాటు పలు ఇస్లామిక్ సంస్థలు సాయం చేస్తుంటాయి.

పాలస్తీనా సంగతేంటి?

ఇజ్రాయెల్, పాలస్తీనా ఘర్షణ ఇప్పటిది కాదు. అవి ఆవిర్భవించినప్పటి నుంచీ నిత్య రావణకాష్టంలా రగులుతోంది. వెస్ట్‌బ్యాంక్, గాజాలను కలిపి పాలస్తీనాగా పిలుస్తారు. రోమన్ సామ్రాజ్య కాలంనాటి పాలస్తీనాలో నేటి తూర్పు జెరూసలేం, ఇజ్రాయెల్ కలిసే ఉంటాయి. బైబిల్‌లో వీటిని యూదు రాజ్యాలుగా పేర్కొన్నారు. యూదులు వీటిని తమ పూర్వీకుల భూభాగంగా పరిగణిస్తారు.

- 1948లో ఇజ్రాయెల్ తనను తాను స్వతంత్రదేశంగా ప్రకటించుకుంది. దీన్ని పాలస్తీనా ముస్లింలు మొదటినుంచీ వ్యతిరేకిస్తూ వస్తున్నారు.
- పాలస్తీనియన్లతో పాటు అరబ్ దేశాలు తమ సైనిక చర్యలో పాల్గొని ఇజ్రాయెల్‌ను తుడిచి పెట్టాలని హమాస్ సైనిక కమాండర్ మొహమ్మద్ దెయిఫ్ శనివారం దాడులు మొదలయ్యాక వీడియో సందేశంలో పిలుపునిచ్చాడు.
- అరబ్బు దేశాల మాట అటుంచితే వెస్ట్‌బ్యాంక్, తూర్పు జెరూసలేం పాలస్తీనియన్లు ఆ పిలుపునకు ఏ మేరకు స్పందిస్తారన్నది చూడాలి.
- పాత జెరూసలేంలోని అల్ అక్సా మసీదుపై నియంత్రణ దాడికి ప్రధాన లక్ష్యాల్లో ఒకటి. క్రైస్తవులతో పాటు ముస్లింలు, యూదులకు ఇది అతి పవిత్ర ప్రాంతం. ఇది ఇజ్రాయెల్ అధీనంలో ఉంది. శాంతి ఒప్పందానికి లోబడి అక్కడ ముస్లింల ప్రార్థనలకు అనుమతిస్తూ వస్తోంది. మసీదుకు పహారాగా ఉండే ఇజ్రాయెలీ దళాల దన్నుతో యూదు అతివాదులు అక్కడ హల్‌చల్ చేస్తుండటం హమాస్ ఆగ్రహానికి మరో కారణం



గాజా స్ట్రిప్ కథ ఇదీ..

ఇజ్రాయెల్, ఈజిప్టు, మధ్యధరా సముద్రం మధ్యన ఉండే కేవలం 41 కిలోమీటర్ల పొడవు, 10 కిలోమీటర్ల వెడల్పు భూభాగమిది. అక్కడ జనాభా ఏకంగా 23 లక్షలు!

- గాజా గగనతలమే గాక చాలావరకు సముద్ర తీరం ఇజ్రాయెల్ నియంత్రణలో ఉంది. అంతర్జాతీయ ఒప్పందాలకు లోబడి గాజాలోకి ఆహార పదార్థాలు, నిత్యావసరాల సరఫరాను అనుమతిస్తోంది.

\- సాక్షి, నేషనల్ డెస్క్

అత్యవసర జాతీయ ఐక్య ప్రభుత్వం!

దాడుల నేపథ్యంలో ఇజ్రాయెల్‌లో రాజకీయ పార్టీలన్నీ చేతులు కలుపుతున్నాయి. సంక్షోభాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు వ్యూహాలపై కసరత్తు చేస్తున్నాయి. అన్ని పార్టీల ప్రతినిధులతో కూడిన అత్యవసర జాతీయ ఐక్య ప్రభుత్వ ఏర్పాటుపై సంప్రదింపులు జరుపుతున్నాయి. దీనిపై ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ, విపక్ష నేతలు యాయిర్ లాపిడ్ బెన్నీ గాంట్జ్ ఇప్పటికే చర్చించుకున్నారు. అత్యవసర ప్రభుత్వంలో భాగస్వాములుగా చేరేందుకు విపక్ష నాయకులు సంసిద్ధత వ్యక్తం చేశారు.

ఇజ్రాయెల్ నిఘా వ్యవస్థ కళ్లు గప్పి..

ఇజ్రాయెల్‌కు పకడ్బందీగా ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఉంది. ప్రపంచం నలుమూలల ఎక్కడ చీమ చిటుక్కుమన్నా ఇజ్రాయెల్ నిఘా వర్గాలకే మొట్టమొదట సమాచారం అందుతుంది. అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన ఇజ్రాయెల్ కళ్లు గప్పి హమాస్ మిలిటెంట్లు ముప్పేట దాడులకు తెగబడడం అందరినీ ఆశ్చర్య చకితుల్ని చేస్తోంది. ఇజ్రాయెల్ ఇంటెలిజెన్స్ వ్యవస్థలైన షిన్‌బెట్, మొసాద్‌ల గురించి ఎప్పుడూ ఆ దేశం గర్వంగా చెప్పుకుంటుంది. గాజా సరిహద్దుల్లో భారీగా భద్రతా సిబ్బంది మోహరించి ఉంటారు. నిరంతరం సీసీ కెమెరాలు పని చేస్తూ ఉంటాయి. ఆర్ట్ థర్మల్ ఇమేజింగ్, మోషన్ సెన్సర్లు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌లను దాటుకొని హమాస్ మిలిటెంట్ల దాడులకు దిగారంటే కచ్చితంగా ఇంటెలిజెన్స్ వైఫల్యమేనన్న అభిప్రాయాలున్నాయి.

మోటరైజ్డ్ పారా గ్లైడర్ల సాయంతో

మోటరైజ్డ్ పారా గ్లైడర్ల సాయంతో సరిహద్దుల్లో కంచెలు దాటిన హమాస్ మిలిటెంట్లు ఇజ్రాయెల్ పట్టణాలపై దిగుతూనే విచక్షణారహితంగా కాల్పులు జరిపారు.సరిహద్దులు దాటడానికి పారా గ్లైడర్లు హమాస్ వినియోగిస్తుందని ఇజ్రాయెల్ ఊహకి కూడా అందలేదు. మధ్యధర సముద్రం నుంచి చిన్న చిన్న బోట్లలో గాజా మీదుగా ఇజ్రాయెల్‌లోకి అడుగు పెట్టారు. పికప్ ట్రక్కుల్లో భారీ మిషన్ గన్లతో భూ మార్గంలో చొచ్చుకువచ్చారు. సరిహద్దులు దాటినప్పుడు భారీగా పేలుడు పదార్థాలు వినియోగించారు. కొందరు మిలిటెంట్లు వైర్లను కట్ చేసుకుంటూ కంచెలు అడ్డం తొలగించి లోపలికి వచ్చారు. ఇలా ఏకకాలంలో మూడు మార్గాల ద్వారా దాడులకు దిగడంతో తేరుకొని ఎదురు దాడులకు దిగేలోపుల నష్టం జరిగిపోయింది. హమాస్ మిలిటెంట్లు పకడ్బందీగా దాడులు జరపడానికి పదేళ్ల కిందట నుంచే విదేశాల్లో శిక్షణ తీసుకుంటున్నారు. పారాగ్లైడర్ల దాడికి శిక్షణ తీసుకున్న వీడియోలను హమాస్ సంస్థ సోషల్ మీడియాలో షేర్ చేసింది.

ఐరన్ డోమ్‌ను దాటుకొని మరీ..

ఇజ్రాయెల్ వద్ద శత్రు దుర్భేద్యమైన ఐరన్ డోమ్ రక్షణ వ్యవస్థ ఉంది. దూసుకొచ్చే శత్రుదేశ రాకెట్ల దిశకు తగ్గట్లు ప్రతిగా రాకెట్లను ప్రయోగించి వాటిని ధ్వంసం చేయడంలో ఐరన్‌డోమ్ వ్యవస్థ పేరుగాంచింది. అయితే హమాస్ మిలిటెంట్లు ఆ ఐరన్ డోమ్ వ్యవస్థ తికమకపడేలా లెక్కలుమిక్కిలిగా అంటే 20 నిమిషాల్లో 5 వేల రాకెట్లను ప్రయోగించారు. ఇన్నాళ్లూ 80% సక్సెస్ రేటుతో పని చేసిన ఐరన్ డోమ్ వ్యవస్థ దీంతో ఒక్కసారిగా చేతులెత్తేసింది. ఈ రాకెట్ల దాడిలో ఇజ్రాయెల్‌లో వందలాది భవనాలు నేలమట్టమయ్యాయి.

ఎన్నికల వ్యూహం, కులగణనే ఎజెండా?

నేడే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ భేటీ

న్యూఢిల్లీ: లోక్ సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ వ్యూహాలకు మరింత పదును పెట్టేందుకు కాంగ్రెస్ సిద్ధమవుతోంది. అందులో భాగంగా కీలకమైన పార్టీ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) సమావేశం సోమవారం జరగనుంది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ చీఫ్ సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు, కీలక నాయకులు ఇందులో పాల్గొంటారు. తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, త్రిపుర అసెంబ్లీ ఎన్నికలతో పాటు త్వరలో లోక్‌సభ పోరు కూడా జరగనుండటం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎన్నికలు, కులగణన మీదే భేటీలో ప్రధానంగా చర్చ జరగనుందని సమాచారం. పార్టీ ఎన్నికల సన్నద్ధతను సమీక్షించనున్నారు. జాతీయ స్థాయిలో కులాల వారీగా జనగణనకు కాంగ్రెస్ పట్టుబడుతున్న విషయం తెలిసిందే. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఇప్పటికే కుల గణన చేపడుతోంది. అయితే దీనిపై పార్టీలోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో భేటీలో ఎలాంటి వాదనలు జరుగుతాయోనన్న ఆసక్తి నెలకొంది. పునర్ వ్యవస్థీకరించిన సీడబ్ల్యూసీ తొలి భేటీ సెప్టెంబర్ 16న హైదరాబాద్‌లో జరగడం తెలిసిందే.

రంగంలోకి లెబనాన్ హెజ్బొల్లా మిలిటెంట్లు



ఖాన్ యూనిస్ పట్టణంలో ఇజ్రాయెల్ దాడిలో ధ్వంసమైన మసీదు

టెల్ అవీవ్: ఇజ్రాయెల్, హమాస్ యుద్ధంలోకి లెబనాన్‌కు చెందిన హెజ్బొల్లా మిలిటెంట్ గ్రూప్ కూడా అడుగుపెట్టడం ఆందోళన కలిగిస్తోంది. ఆదివారం దక్షిణ ఇజ్రాయెల్ వీధుల్లో ఇజ్రాయెల్ సైనికులు, హమాస్ తీవ్రవాదుల మధ్య పరస్పరం కాల్పులు జరిగాయి. ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో గాజాలోని పలు భవనాలు నేలమట్టమయ్యాయి. ఉత్తర ఇజ్రాయెల్‌లో హెజ్బొల్లా మిలిటెంట్లు ఇజ్రాయెల్ జవాన్లతో ఘర్షణకు దిగారు. ఇరువర్గాల మధ్య కాల్పులు జరిగాయి. దీనివల్ల ఇజ్రాయెల్–లెబనాన్ సరిహద్దుల్లో అవాంఛనీయ పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఇజ్రాయెల్‌కు బద్ధ శత్రువులైన హెజ్బొల్లా మిలిటెంట్లకు ఇరాన్ అండగా నిలుస్తోంది. ఆయుధ, ఆర్థిక సాయం అందిస్తోంది. హెజ్బొల్లా వద్ద వేలాది రాకెట్లు, ఆయుధాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్–లెబనాన్ సరిహద్దుల్లోని వివాదాస్పద ప్రాంతాల్లో హెజ్బొల్లా మిలిటెంట్లు మకాం వేశారు. ఆదివారం ఒక్కడి నుంచి మూడు ఇజ్రాయెల్ సైనిక స్థావరాలపై పదుల సంఖ్యలో రాకెట్లు ప్రయోగించారు.ప్రతిగా ఇజ్రాయెల్ సాయుధ డ్రోన్లు ప్రయోగించింది. దీంతో లెబనాన్ వైపు ఇద్దరు చిన్నారులు గాయపడ్డారు. ఉత్తర సరిహద్దులో ప్రస్తుతం సాధారణ పరిస్థితులుండగా దక్షిణ ప్రాంతంలో పోరాటం కొనసాగుతోందని ఇజ్రాయెల్ పేర్కొంది.

10, 12 బోర్డు పరీక్షలు ఇకపై ఏడాదిలో రెండుసార్లు

న్యూఢిల్లీ: పది, పన్నెండో తరగతి బోర్డు పరీక్షలను వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఏడాదిలో రెండుసార్లు నిర్వహించాలని కేంద్రం నిర్ణయించింది. రెండు పరీక్షలు రాయాలా, లేదా ఒక్క పరీక్షకే హాజరు కావాలా అన్నది విద్యార్థుల ఇష్టమని స్పష్టం చేసింది. ఈ ఆప్షన్ ఐచ్ఛికమే తప్ప, నిర్బంధం కాదని వివరించింది. విద్యార్థుల్లో పరీక్షంటే భయం దూరం చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఆదివారం పీటీఐకి ఇంటర్వ్యూలో పలు అంశాలను వివరించారు. నూతన కరిక్యులమ్ ఫ్రేమ్‌వర్క్(ఎన్‌సీఎఫ్) సాధాసాధ్యాలపై మంత్రి ప్రధాన్ మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష జేఈఈకి మాదిరిగానే విద్యార్థులకు రెండుసార్లు పరీక్ష రాసేందుకు వీలు దొరుకుతుంది. బెస్ట్ స్కోర్ సాధించొచ్చు. ఈ ఆప్షన్ పూర్తిగా విద్యార్థుల ఇష్టానికే వదిలేశాం. ఇందులో ఎటువంటి నిర్బంధం లేదు. ఏడాదిలో ఒకేసారి పరీక్ష ఉండటం, ఈ చాన్స్ మిస్సయితే ఒక సంవత్సరం కోల్పోతామనే భయం, ఒత్తిడి ఎక్కువమంది విద్యార్థుల్లో ఉంటున్నాయి. దీంతో, వారు పరీక్షలు సరిగా రాయలేకపోతున్నారు. రెండుసార్లు పరీక్షలు రాసే అవకాశమిస్తే ఇలాంటి భయాలు వారిలో ఉండవు. పూర్తిస్థాయిలో ప్రిపేరయి పరీక్ష రాస్తే సంతృప్తికరమైన స్కోర్ సాధించగలుగుతారు. ఒకసారి మంచి స్కోర్ తెచ్చుకున్న విద్యార్థి మరో విడత పరీక్ష రాయాలా వద్దా అనేది ఐచ్ఛికం. ఇందులో ఎటువంటి నిర్బంధం లేదు'అని వివరించారు. 2024 నుంచే ఈ విధానాన్ని అమల్లోకి తెస్తున్నామని తెలిపారు.

డమ్మీ స్కూల్స్ పనిపడతాం

రాజస్తాన్‌లోని కోటాలో పరీక్షలకు శిక్షణ నిమిత్తం వచ్చిన విద్యార్థులు ఈ ఏడాదిలో రికార్డు స్థాయిలో బలవన్మరణాలకు పాల్పడటంపై మంత్రి ప్రధాన్ స్పందిస్తూ.. 'ఇది చాలా సున్నితమైన అంశం. విస్మరించరానిది'అన్నారు. అదేవిధంగా, తమ సొంత రాష్ట్రంలోని స్కూల్‌లో అడ్మిట్ అయిన విద్యార్థులు అక్కడ చదవకుండా, పరీక్షల శిక్షణ కోసం కోటా వంటి చోట్లకు వెళ్తుండటంపై మంత్రి.. ఇటువంటి డమ్మీ స్కూళ్లపై చర్యలకు ఉపక్రమించాల్సిన సమయం వచ్చిందన్నారు. పాఠశాలకు హాజరు కాకపోవడం విద్యార్థుల వ్యక్తిగత ఎదుగుదలకు ఆటంకం కలిగిస్తుందని, వారు ఒంటరితనంతో బాధపడుతూ, ఒత్తిడులకు గురవుతున్నట్లు నిపుణులు చెబుతున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. విద్యా సంబంధ విధాన నిర్ణయాలపై ప్రభుత్వానికి సలహాలిచ్చే సెంట్రల్ అడ్వైజరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్(సీఏబీఈ)ని ఆధునీకరిస్తామని మంత్రి ప్రధాన చెప్పారు.

'ఆదిత్య' మార్గాన్ని చక్కదిద్ది...

కీలక ఘట్టాన్ని పూర్తి చేసిన ఇస్రో

బెంగళూరు: సూర్యశోధనకు ఉద్దేశించిన ఆదిత్య -ఎల్1 ఉపగ్రహ ప్రయోగంలో మరో కీలక దశను ఇస్రో విజయవంతంగా పూర్తి చేసింది. దాని మార్గాన్ని సరిదిద్దే ప్రక్రియను సజావుగా జరిపినట్టు ఆదివారం ప్రకటించింది. అక్టోబర్ 6న 16 సెకన్ల పాటు ఇది కొనసాగిందని వివరించింది. లగ్రాంజ్ పాయింట్1 వైపు ఉపగ్రహం నిర్దేశిత మార్గంలో సాగేలా ఉంచేందుకు ఈ ప్రక్రియ తోడ్పడుతుంది. ఆదిత్య -ఎల్1 సూర్యునిపైకి భారత తొలి ప్రయోగం. దీన్ని సెప్టెంబర్ 2న శ్రీహరికోట నుంచి జరిపారు. తర్వాత దాని గమనాన్ని సెప్టెంబర్ 19న లగ్రాంజియన్ పాయింట్ కేసి నిర్దేశించారు. తాజా ప్రయత్నం ద్వారా దాన్ని మరింతగా సరిచేశారు. 125 రోజుల పాటు భూమి నుంచి 15 లక్షల కిలోమీటర్ల ప్రయాణం తర్వాత ఆదిత్య-ఎల్1ను సూర్యునికి అతి సన్నిహితమైన హాలో కక్ష్యలోకి ప్రవేశపెట్టాలన్నది ఇస్రో లక్ష్యం.

ఐఏఎఫ్ అత్యుత్తమమైందిగా ఉండాలి

ఎయిర్‌చీఫ్ మార్షల్ వీఆర్ చౌధరి పిలుపు

ప్రయాగ్‌రాజ్: ఎప్పటికప్పుడు కొత్తగా ఎదురవుతున్న సవాళ్ల నేపథ్యంలో భారత వైమానిక దళం(ఐఏఎఫ్) అన్ని వేళలా అప్రమత్తంగా ఉండాలని ఎయిర్ చీఫ్ మార్షల్ వీఆర్ చౌధరి పిలుపునిచ్చారు. దేశ ప్రాదేశిక సమగ్రతను పరిరక్షించేందుకు, శత్రువులను దీటుగా ఎదుర్కొనేందుకు ఐఏఎఫ్ కట్టుబడి ఉంటుందని ఆయన నొక్కిచెప్పారు. ఎయిర్ ఫోర్స్‌డేను పురస్కరించుకుని ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఐఏఎఫ్ అవతరించి 2032 నాటికి 100 ఏళ్లు పూర్తవుతుందని చెబుతూ ఆయన ప్రపంచంలోనే అత్యుత్తమ వైమానిక దళాల్లో ఒకటిగా ఐఏఎఫ్ అవతరించాలని అన్నారు. వ్యూహాలను మెరుగుపరుచుకోవడం, సామర్థ్యాలను సమకూర్చుకోవడం వంటివి భవిష్యత్ యుద్ధాల్లో పైచేయి సాధించడంలో ఐఏఎఫ్‌కు ఎంతో కీలకమన్నారు. ఎయిర్ ఫోర్స్ డే సందర్భంగా ప్రధాని మోదీ యుద్ధ వీరులకు శుభాకాంక్షలు తెలిపారు. వారి నిరుపమాన సేవలు, త్యాగాల వల్లే మన గగనతలం సురక్షితంగా ఉందని 'ఎక్స్'లో పేర్కొన్నారు.

24 గంటల వ్యవధిలో.. బిహార్‌లో 22 మంది నీటమునక

పట్నా: బిహార్‌లోని వేర్వేరు ప్రాంతాల్లో 24 గంటల వ్యవధిలో నదులు, చెరువుల్లో స్నానాలు చేసేందుకు వెళ్లిన 22 మంది మృత్యువాత పడినట్లు అధికారులు ఆదివారం తెలిపారు. వీరిలో అత్యధికులు జీవిత్‌పుత్రికా పండుగ సందర్భంగా స్నానాలు చేయడానికి వెళ్లిన మహిళలేనన్నారు. ఈ పండుగ రోజు మహిళలు తమ సంతానం బాగుండాలని దేవుణ్ని కోరుకుంటూ ఉపవాస దీక్షలు, నదీ స్నానాలు ఆచరించడం సంప్రదాయం. భోజ్‌పూర్‌లో బహియారా ఘాట్ వద్ద సోనె నదిలో స్నానాలు చేసేందుకు వెళ్లిన 15-20 మధ్య వయస్కులైన బాలికలు సెల్ఫీ తీసుకుంటూ నీటి ఉధృతికి కొట్టుకుపోయినట్లు అధికారులు వివరించారు. భోజ్‌పూర్‌లో అయిదుగురు, జెహానాబాద్‌లో నలుగురు, పట్నా, రొహతాస్‌ల్లో ముగ్గురు చొప్పున, దర్భంగా, నవడాల్లో ఇద్దరేసి, కైమూర్, మాధెపురా, ఔరంగాబాద్‌ల్లో ఒక్కరు చొప్పున జల సమాధి అయినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది.

వృద్ధుని శవాన్ని ఈడ్చుకెళ్లి... కాల్వలోకి విసిరేశారు!

బిహార్ పోలీసుల నిర్వాకం

పట్నా: రోడ్డు ప్రమాదంలో మరణించిన ఒక వృద్ధుని శరీర భాగాలను పోలీసులు అమాంతంగా ఈడ్చుకెళ్లి కాల్వలోకి విసిరేశారు. ఈ అమానుష ఘటన ఆదివారం బిహార్‌లోని ముజఫర్‌నగర్ సమీపంలో చోటుచేసుకుంది. సంబంధించిన వీడియో వైరల్ కావడంతో పోలీసుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో పోలీసు శాఖ నష్ట నివారణ చర్యలకు దిగింది. 'మీదినుంచి ట్రక్కు దూసుకెళ్లడంతో శరీర భాగాలు కొన్ని చితికి రోడ్డుకు అంటుకుపోయాయి. వాటిని కాల్వలో వేసి మిగతా శరీరాన్ని పోస్టుమార్టం నిమిత్తం పంపాం'అని చెప్పుకొచ్చింది. ఆ వెంటనే పోలీసులు కాల్వలో వేసిన శరీర భాగాలను కూడా వెలికితీసి పోస్ట్ మార్టానికి పంపారు!!

2 వేలు దాటిన అఫ్గాన్ మరణాలు

- మరో 9,240 మందికి గాయాలు
- కొనసాగుతున్న సహాయక చర్యలు

కాబూల్: అఫ్గానిస్తాన్ పశ్చిమ ప్రాంతాన్ని శనివారం కుదిపేసిన పెనుభూకంపంలో మృతుల సంఖ్య రెండువేలు దాటింది. తీవ్ర భూప్రకంపనల కారణంగా మట్టితో నిర్మించిన వందలాది ఇళ్లు నేలమట్టమయ్యాయి. ఆరు గ్రామాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఎటు చూసినా శిథిలాలు దుమ్ము ధూళితో నిండిపోయాయి. గత రెండు దశాబ్దాల్లో ఇలాంటి పెను భూకంపం అఫ్గాన్‌ను కుదిపేయడం ఇదే మొదటిసారి. గత ఏడాది జూన్‌లో అఫ్గానిస్తాన్‌లోని పర్వత ప్రాంతాల్లో సంభవించిన భూకంపంలో కనీసం వెయ్యి మంది చనిపోయారు.అఫ్గాన్‌లో నాలుగో అతి పెద్ద నగరమైన హెరాత్ కేంద్రంగా శనివారం భూకంపం సంభవించిన విషయం తెలిసిందే. మృతుల సంఖ్య 2,100కి చేరువలో ఉందని ఆదివారం తాలిబన్ సమాచార, సాంస్కృతిక శాఖ అధికార ప్రతినిధి అబ్దుల్ వాహిద్ రయాన్ చెప్పారు. మరో 9,240 మందికి తీవ్ర గాయాలయ్యాయని 1,320 ఇళ్లు నేలమట్టమయ్యాయని ఆయన తెలిపారు. డజనుకి పైగా బృందాలు అత్యవసర సహాయ చర్యల్లో మునిగిపోయాయి. కొన్ని గ్రామాల్లోకి సహాయ సిబ్బంది అడుగు పెట్టడానికి కూడా వీల్లేకుండా శిథిలాలతో నిండిపోయాయి. ఎటు చూసినా శిథిలాల్లో చిక్కుకున్న వారి రోదనలే వినిపిస్తున్నాయి. శిథిలాల కింద ఉన్న వారిని కాపాడడానికి సహాయ బృందాలు, చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న ప్రజలు తమ చేతులనే ఆయుధాలుగా చేసుకొని శిథిలాలను తొలగిస్తున్నారు. శిథిలాలు తొలగిస్తున్న కొద్దీ గుట్టలు గుట్టలుగా శవాలు బయటకి వస్తున్నాయి. మరికొందరు స్థానికులు శిథిలాల మీద పాకుతూ వెతుకుతూ వాటిని తొలగిస్తున్నారు. కొన ఊపిరితో ఉన్న వారిని కాపాడుతున్నారు. హెరాత్‌లో నేలమట్టమైన ఓ ఇంటి శిథిలాల్లో నుంచి ఆదివారం ఒక శిశువును అక్కడి వారు కాపాడుతున్న దృశ్యాన్ని అసోసియేటెడ్ ప్రెస్ ప్రసారం చేసింది. అక్కడే శిథిలాల నుంచి ఓ మహిళ చేయి బయటికి కనిపిస్తుండటం కూడా రికార్డయ్యింది. ఆ మహిళ చిన్నారి తల్లేనని స్థానికులు తెలిపారు. ఆమె బతికున్నదీ లేనిదీ స్పష్టం కాలేదు. క్షతగాత్రులకు చికిత్స అందించడానికి వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు.



భూకంపం ధాటికి నామరూపాల్లేకుండా పోయిన మట్టి ఇళ్లు

బాధితులకు అందుతున్న సాయం..

అఫ్గాన్‌లో ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చలి నుంచి భూకంప బాధితుల్ని కాపాడేందుకు యూనిసెఫ్ దుస్తులు, దుప్పట్లు, టార్పాలిన్లు తదితరాలను పంపించింది. ఐరాస వలసల విభాగం నాలుగు అంబులెన్సులు, వైద్యులు, ఇతర సిబ్బందిని అక్కడి ఆస్పత్రికి పంపించింది. మూడు మొబైల్ వైద్య బృందాలను జెందాజన్ జిల్లాకు పంపిస్తున్నట్లు వెల్లడించింది. డాక్టర్స్ వితౌట్ బోర్డర్స్ సంస్థ కూడా 80 మంది రోగులకు సరిపోయే అయిదు మెడికల్ టెంట్లను హెరాత్ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించింది. వరల్డ్ ఫుడ్ ప్రోగ్రాం వంటి సంస్థలు కూడా అత్యవసరాలను అఫ్గానిస్తాన్‌కు అందజేస్తామని ప్రకటించాయి.

ఐవీఎఫ్ హార్మోన్ల బదులు అబార్షన్ బిళ్లలిచ్చారు!

న్యూయార్క్: వైద్యపరమైన నిర్లక్ష్యానికి పరాకాష్ఠ ఈ ఉదంతం. అమెరికాలోని లాస్ ఏంజెలెస్‌లో సంతానం కోసం ఐవీఎఫ్ పద్ధతిని ఆశ్రయించిన థామస్ దంపతులకు మెడికల్ షాపు ఐవీఎఫ్ హార్మోన్ల బదులు పొరపాటున అబార్షన్ మాత్రలు ఇచ్చింది. ఏకంగా ఇద్దరు గర్భస్థ శిశువుల మరణానికి కారణమైంది! పుట్టబోయే బిడ్డలను పొట్టన పెట్టుకున్నారంటూ మెడికల్ షాప్‌పై అమెరికా స్టేట్ బోర్డ్ ఆఫ్ ఫార్మసీకి ఫిర్యాదు చేశారు. ప్రిస్క్రిప్షన్‌లోని డాక్టర్ చేతిరాత అర్థం కాకపోవడం ఈ దారుణ పొరపాటుకు దారి తీసినట్టు విచారణలో తేలింది. 'షాపు సిబ్బంది తప్పు మీద తప్పు చేశారు. ఆ రాతను తమకు తోచినట్టుగా అర్థం చేసుకుని ఈ నిర్వాకానికి పాల్పడ్డారు. పైగా తాము ఏం మందులు ఇస్తున్నదీ, వాటివల్ల ఏం జరుగుతుందన్నది విధిగా చెప్పాల్సి ఉండగా ఆ పని కూడా చేయలేదు'అని బోర్డు తేల్చింది. మెడికల్ షాప్‌కు పది వేల డాలర్ల జరిమానా విధించింది. కానీ దీనివల్ల పుట్టక ముందే కన్ను మూసిన తమ బిడ్డలు తిరిగొస్తారా అంటూ థామస్ దంపతులు విలపిస్తున్నారు. వారికి నలుగురు సంతానం. పెద్ద కుటుంబం కావాలనే కోరికతో మళ్లీ పిల్లలను కనాలని నిర్ణయించుకుని ఐవీఎఫ్ పద్ధతిని ఆశ్రయించారు.

సాక్షి హైదరాబాద్

సోమవారం । 9 । అక్టోబర్ । 2023



...దేశానికే ఆదర్శం

తెలంగాణ వైద్యరంగం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని, ప్రభుత్వ సెక్టార్‌లో ఐవీఎఫ్ సెంటర్ ఏర్పాటు విప్లవాత్మకమని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. -8లో



క్షుద్ర పూజల కోసం...

క్షుద్రపూజల కోసం కస్తూరి పిల్లికి సంబంధించిన అవయవాలను తరలిస్తున్న వ్యక్తిని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో సీఐఎస్‌ఎఫ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారిని అటవీశాఖ అధికారులకు అప్పగించారు. -8లో

నేటి నుంచి పీజీ తరగతులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో సోమవారం నుంచి వివిధ పీజీ కోర్సుల తరగతులు, విద్యార్థుల హాస్టల్స్ ప్రారంభంకానున్నాయి. ప్రథమ సంవత్సరం మొదటి సెమిస్టర్, ద్వితీయ సంవత్సరం మూడో సెమిస్టర్‌కు తరగతులు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. పలు కారణాల చేత చదువును మధ్యలో మానేసిన వివిధ పీజీ కోర్సుల విద్యార్థుల రీ అడ్మిషన్లు ఈ నెల 16 వరకు కొనసాగనున్నట్లు అధికారులు తెలిపారు.

ఫైళ్ల పరుగులు..

ఎన్నికల కోడ్ నేపథ్యంలో హెచ్ఎండీఏ అధికారులపై పెరిగిన ఒత్తిడి

వేగంగా అనుమతులు

- భూ వినియోగ మార్పిడి అనుమతులే ఎక్కువ
- చకచకా పెండింగ్ ఫైళ్ల పరిష్కారం

సాక్షి, సిటీబ్యూరో: హెచ్ఎండీఏలో ఫైళ్లు పరుగులు తీస్తున్నాయి. పెండింగ్ ఫైళ్లపైన అధికారులు దృష్టి సారించారు. ఏ క్షణంలోనైనా ఎన్నికల ప్రకటన వెలువడేందుకు అవకాశం ఉన్న దృష్ట్యా భూవినియోగ మార్పిడి కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఆగమేఘాలపైన అనుమతులను ఇచ్చేస్తున్నారు. ఈ క్రమంలో నిబంధనలను సైతం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ మేరకు ప్రణాళికా విభాగంలోని అధికారులపైన అనూహ్యంగా ఒత్తిడి పెరిగింది. కొన్ని ప్రాంతాల్లో ఉన్నతస్థాయి నుంచి వస్తున్న ఒత్తిడి మేరకు గంటల వ్యవధిలోనే అనుమతులను జారీ చేయడం గమనార్హం. శంషాబాద్, శంకర్‌పల్లి, ఘట్కేసర్, మేడ్చల్ జోన్‌ల పరిధిలో వ్యవసాయ సంబంధమైన భూములను నివాసయోగ్యమైన స్థలాలుగా మార్చుకొనేందుకు చాలామంది దరఖాస్తు చేసుకున్నారు. సాధారణంగా ఉన్నతస్థాయి కమిటీ విచారణ అనంతరం అన్ని విధాలుగా ఆమోదయోగ్యంగా భావిస్తేనే ఇలాంటి భూముల మార్పిడికి ప్రభుత్వం అవకాశం కల్పిస్తుంది. కానీ ప్రస్తుత ఎన్నికల వాతావరణం భూ యజమానులకు చక్కటి అవకాశంగా మారింది. ఉన్నతాధికారులపైన రాజకీయ ఒత్తిడి పెరిగింది. ఈ క్రమంలో నిబంధనలను సైతం పక్కన పెట్టి ఎడాపెడా అనుమతులిచ్చేస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు 111 జీఓ పరిధిలోని పలు గ్రామాల్లో కొనసాగుతున్న ఆంక్షలను తుంగలో తొక్కి నివాస స్థలాలుగా అనుమతులిచ్చేస్తున్నారు. ఇందుకోసం ఈపీటీఆర్ఐ వంటి పర్యావరణ సంస్థల నుంచి అనుమతులను సాకుగా చూపుతున్నారు. 'ఉదయం నుంచి రాత్రి వరకు పని చేయవలసి వస్తుంది. ఏ క్షణంలో ఎలాంటి ఆదేశాలు వస్తాయో తెలియదు. ఉదయం వచ్చిన ఫైల్‌ను సాయంత్రంలోగా పరిష్కరించి అనుమతులను ఇవ్వాల్సి వస్తుంది.' అని ప్రణాళికా విభాగానికి చెందిన అధికారి ఒకరు విస్మయం వ్యక్తం చేశారు.



ఎల్ఆర్ఎస్‌పై నజర్...

గతంలో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకొని ఫీజు చెల్లించిన వారికి ప్రస్తుతం స్థలాలను క్రమబద్ధీకరించి అనుమతులిచ్చేందుకు కార్యాచరణ చేపట్టారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో మున్సిపల్, గ్రామపంచాయతీల పరిధిలో స్థలాలను కొనుగోలు చేసిన వారికి రెగ్యులరైజ్ చేసేందుకు ప్రభుత్వం 2020లో అవకాశం కల్పించింది. ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తులను స్వీకరించింది. ఈ మేరకు సుమారు 5 లక్షలకు పైగా దరఖాస్తులు వెల్లువెత్తాయి. వాటిలో 3.5 లక్షల వరకు హెచ్ఎండీఏ పరిధిలోనే గ్రామపంచాయతీల పరిధిలో ఉన్నట్లు అంచనా. మరో 1.5 లక్షల దరఖాస్తులు మున్సిపాలిటీల పరిధిలో ఉన్నాయి. గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న స్థలాలకు మాత్రమే ప్రస్తుతం హెచ్ఎండీఏ ఎల్ఆర్ఎస్‌లను అందజేస్తుంది.దసఖాస్తుల పరిశీలన, క్షేత్రస్థాయిలో స్థలాలను తనిఖీ చేసి అనుమతులను ఇచ్చేందుకు తాత్కాలిక ప్రాతిపదికపైన జూనియర్ ప్లానింగ్ అధికారి స్థాయిలో 50 మంది ఉద్యోగులను అదనంగా నియమించారు.కంప్యూటర్ సాంకేతిక పరిజ్ఞానం ఉన్న ఈ సిబ్బందికి ఎల్ఆర్ఎస్ పథకం పైన శిక్షణనిచ్చి వారి సేవలను వినియోగించుకోనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం హెచ్ఎండీఏలో ప్లానింగ్ విభాగంలో సిబ్బంది కొరత దృష్ట్యా ఎల్ఆర్ఎస్ అమలు కోసం న్యాక్ సంస్థ నుంచి ఈ అదనపు సిబ్బందిని నియమించారు.

'కోడ్' కూస్తే బ్రేక్..

మరోవైపు హెచ్ఎండీఏ ఇంజనీరింగ్ విభాగంలోనూ పనులు పరుగులు పెడుతున్నాయి. ఇప్పటికే సైకిల్‌ట్రాక్, హుస్సేన్‌సాగర్, కూకట్‌పల్లి రంగధాముని చెరువు లేక్‌ఫ్రంట్ పార్కులను హడావిడిగా ప్రారంభించిన సంగతి తెలిసిందే.అలాగే ఎన్నికలు ముంచుకొస్తున్న దృష్ట్యా మూసీపైన వంతెనల నిర్మాణానికి సైతం మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేయడంతో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. త్వరలో మల్లంపేట్ వద్ద ఔటర్‌పైన నిర్మించిన ఇంటర్‌ఛేంజ్‌ను ప్రారంభించనున్నారు. ఇప్పటికే ప్రతిపాదించిన కొన్ని పనులకు శరవేగంగా టెండర్ నోటిఫికేషన్‌లు విడుదలవుతున్నాయి. ఇందుకోసం రాత్రింబవళ్లు పని చేయవలసి వస్తుందని పలువురు అధికారులు తెలిపారు. కోడ్ వస్తే కొత్త పనులకు బ్రేక్ పడనున్న దృష్ట్యా హెచ్ఎండీఏలోని అన్ని విభాగాలు ఉరుకులు పరుగులు పెడుతున్నాయి.







'సరస్' సందడి

ఎన్టీఆర్ మార్గ్‌లోని హెచ్ఎండీఏ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన 'సరస్ ఫెయిర్–2023' సందడిగా సాగుతోంది. దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన గ్రామీణ ప్రాంతాల్లోని చేతివృత్తిదారులు తయారు చేసిన వస్తువులను ఇక్కడ ప్రదర్శనకు ఉంచారు. ఆదివారం పెద్ద ఎత్తున సందర్శకులు హాజరై తమకిష్టమైన కళాఖండాలు, ఇతర వస్తువులు కొనుగోలు చేశారు. దీన్ని సెర్ప్, హైదరాబాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా..ఈ నెల 16 వరకు ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు వెల్లడించారు.

– సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్

శివార్లకు జలధార!

తీరనున్న ఔటర్ ప్రజల దాహార్తి

- ఇప్పటికే ఓఆర్ఆర్ ఫేజ్ –1 పూర్తి
- ఫేజ్–2 ద్వారా మరిన్ని ప్రాంతాలకు లబ్ధి
- నేడు పలు రిజర్వాయర్లు ప్రారంభించనున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

సాక్షి, సిటీబ్యూరో: ఇక మహానగర శివారు ప్రాంతాల ప్రజల దాహార్తి పూర్తి స్థాయిలో తీరనుంది. జీహెచ్ఎంసీ అవతల, ఔటర్ రింగు రోడ్డు లోపలి మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, గ్రామపంచాయతీలు, గేటెడ్ కమ్యూనిటీలు, కాలనీలకు తాగునీరు అందించేందుకు జలమండలి ఓఆర్ఆర్ ప్రాజెక్టును రెండు దశల్లో చేపట్టింది. ఇప్పటికే ఓఆర్ఆర్ ఫేజ్–1 ప్రాజెక్టును పూర్తి చేసి నీటిని సరఫరా చేస్తోంది. తాజాగా రెండో దశ కింద మరి కొన్ని ప్రాంతాలకు నీటి సరఫరాకు సిద్ధమైంది. ఓఆర్ఆర్ ఫేజ్–2 ప్రాజెక్టు కింద నిర్మిస్తున్న సర్వీసు రిజర్వాయర్లు దాదాపు అన్ని తుది దశకు చేరుకున్నాయి. అందులో సుమారు 23 రిజర్వాయర్లు సోమవారం మంత్రులు, శాసనసభ సభ్యులు చేతులు మీదుగా ప్రారంభం కానున్నాయి.



శివారులో ఏర్పాటు చేసిన మినీ రిజర్వాయర్

ఓఆర్ఆర్ ఫేజ్– 2 ఇలా..

- ఓఆర్ఆర్ ఫేజ్ – 2 ప్రాజెక్టును మొత్తం రూ.1200 కోట్ల వ్యయంతో చేపట్టారు. సుమారు 138 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన 73 సర్వీసు రిజర్వాయర్లు, దాదాపు 2988 కిలో మీటర్ల మేర నూతన పైపులైను నెట్‌వర్క్‌తో నిర్మిస్తున్నారు. ఈ రిజర్వాయర్లు అందుబాటులోకి వస్తే మొత్తం 3.6 లక్షల కుటుంబాలు ప్రయోజనం కలుగుతుంది. ఇందులో 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 18 మున్సిపాలిటీలు, 24 గ్రామ పంచాయతీలు లబ్ధి పొందుతాయి. దీన్ని రెండు ప్యాకేజీల్లో పూర్తి చేస్తున్నారు.+ ప్యాకేజీ – 1లో రూ. 613 కోట్లతో 34 సర్వీసు రిజర్వాయర్లు, 1571 కిలోమీటర్ల మేర పైపు లైను నెట్ వర్క్ నిర్మాణం చేపడుతున్నారు. దీని పరిధిలోకి సరూర్ నగర్, మహేశ్వరం, శంషాబాద్, హయత్ నగర్, ఇబ్రహీం పట్నం, ఘట్ కేసర్, కీసర మండలాలు) వస్తాయి.
- ప్యాకేజీ– 2లో కొత్తగా 41 సర్వీసు రిజర్వాయర్లు, 1293 కిలోమీటర్ల పైపులైను నెట్‌వర్క్ నిర్మాణం చేపడుతున్నారు. దీంతో రాజేంద్రనగర్, శామీర్‌పేట్, మేడ్చల్, కుత్బుల్లాపూర్, పటాన్ చెరు, ఆర్సీపురం, బొల్లారం ప్రజలకు లబ్ధి కలగనుంది.



నేడు రిజర్వాయర్ల ప్రారంభం ఇలా..

ఓఆర్ ఆర్ ఫేజ్–2 కింద పలు రిజర్వాయర్లను సోమవారం ఉదయం మంత్రులు, స్థానిక శాసన సభ్యులు ప్రారంభించనున్నారు. మంత్రి చామకూర మల్లారెడ్డి శ్రీనివాస్ నగర్, రైతుబజార్, పీర్జాదిగూడ, ద్వారకాపురి కాలనీ, అప్పరెట్ పార్కు రిజర్వాయర్లు, మంత్రి సబితా ఇంద్రారెడ్డి తుక్కుగూడ రిజర్వాయర్‌ను ఇబ్రహీం పట్నం ఎమ్మెల్యే మంచి రెడ్డి కిషన్ రెడ్డి తట్టి అన్నారం, సీఎస్ క్రికెట్ స్టేడియం, కావేరి ఫంక్షన్ హాల్, ఆదిభట్ల వద్ద నిర్మించిన రిజర్వాయర్లు..పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి బీరంగూడ, పీజేఆర్ కాలనీ రిజర్వాయర్లు, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ కిస్మత్‌పూర్, అభ్యుదయ నగర్, బైరాగి గూడ, బృందావన్ కాలనీ, నార్సింగి, గండిపేట్ ఎమ్మార్వో కార్యాలయం వద్ద నిర్మించిన రిజర్వాయర్లను ప్రారంభించనున్నారు.



కాంగ్రెస్ ఆశావహుల్లో

టెన్షన్!

- ఢిల్లీలో స్క్రీనింగ్ కమిటీ భేటీ నేపథ్యంలో ఉత్కంఠ
- టికెట్ కోసం అక్కడే మకాం వేసి కొందరి ప్రయత్నాలు

సాక్షి, సిటీబ్యూరో: దేశ రాజధాని ఢిల్లీలో స్క్రీనింగ్ కమిటీ అత్యవసర భేటీ నేపథ్యంలో కాంగ్రెస్ ఆశావాహుల్లో టెన్షన్ నెలకొంది. నగరంలోని పలు అసెంబ్లీ స్థానాల నుంచి టికెట్ ఆశిస్తున్న నేతలు గత రెండు రోజుల నుంచి ఢిల్లీలో మకాం వేసి మొదటి జాబితాలోనే తమ అభ్యర్థిత్వం ఖరారయ్యే విధంగా పడరాని పాట్లు పడుతున్నారు. ఆదివారం ఢిల్లీలోని కాంగ్రెస్ వార్ రూమ్ ముందు తిష్ట వేసి నేతలను కలిసేందుకు తీవ్ర పోటీపడినట్లు సమాచారం. ఒకే అభ్యర్థి ఉన్న నియోజకవర్గాల లిస్టను స్క్రీనింగ్ కమిటీ ఫైనల్ చేస్తుండటంతో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. మొదటి విడతలో భాగంగా అభ్యర్థుల లిస్టును కేంద్ర ఎన్నికల కమిటీకి స్క్రీనింగ్ కమిటీ పంపనున్నది. ఇప్పటికే ఓసారి సమావేశమైన స్క్రీనింగ్ కమిటీ అభ్యర్థుల బలాబలాలను పరిశీలించి పలు స్థానాలపై ఏకాభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. మిగిలిన వాటిలో రెండు, మూడు పేర్లను పరిశీలిస్తోంది. తీవ్ర పోటీ నెలకొన్న స్థానాలపై ఫ్లాష్ సర్వేలు నిర్వహిస్తోంది. ఆ సర్వేల ఫలితాలను క్రోడీకరించి..సామాజిక సమతుల్యతను పరిగణనలోకి తీసుకుని అభ్యర్థుల ఎంపిక కసరత్తు పూర్తి చేయాలని స్క్రీనింగ్ కమిటీ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

ఏకాభిప్రాయం ఇక్కడే...

గ్రేటర్ పరిధిలోని పలు అసెంబ్లీ స్థానాల అభ్యర్థిత్వాలపై అధిష్టానం ఏకాభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఎల్‌బీనగర్‌కు మధుయాష్కీ, శేరిలింగంపల్లికి ఎం.రఘునాథ్ యాదవ్, మల్కాజిగిరికి మైనంపల్లి హన్మంతరావు, ఇబ్రహీంపట్నంకు మల్‌రెడ్డి రంగారెడ్డి, నాంపల్లికి ఫిరోజ్‌ఖాన్, మేడ్చల్ తోటకూరి జంగయ్య, మహేశ్వరానికి చిగురింత పారిజాత, రాజేంద్రనగర్‌కు జ్ఞానేశ్వర్ ముదిరాజ్, పటాన్‌చెరుకు కాటా శ్రీనివాస్‌గౌడ్, కంటోన్మెంట్‌కు వెన్నెల తదితర అభ్యర్థిత్వాలపై ఏకాభిప్రాయం వచ్చినట్లు సమాచారం. తొలి జాబితాలో వీరికి చోటు దక్కే అవకాశాలు లేకపోలేదు.

పలు స్థానాలపై తీవ్ర పోటీ..

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అధికార బీఆర్ఎస్‌కు కాంగ్రెస్ ప్రధాన పోటీగా మారుతున్న నేపథ్యంలో పార్టీ టికెట్లకు తీవ్ర పోటీ నెలకొంది. మరోవైపు బీసీలు, ఇతర సామాజిక వర్గాలు సైతం టికెట్లలో తమ వాటా కోసం అధిష్ఠానంపై ఒత్తిడి పెంచారు. కర్ణాటక ఎన్నికల తరహాలో విజయావకాశాలే ప్రాతిపదికగా అభ్యర్థుల ఎంపిక జరిగే అవకాశాలుండటంతో సామాజిక వర్గాలకు చెందిన ఆశావాహుల్లో ఆశలు చిగురించాయి. ప్రధానంగా ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, కూకట్‌పల్లి, ముషీరాబాద్, గోషామహల్, సనత్‌నగర్, ఉప్పల్, సికింద్రాబాద్ స్థానాలకు తీవ్రపోటీ నెలకొంది.

హోంగార్డులు..

ఎన్ని పాట్లు!

- ఇంకా అందని సెప్టెంబర్ నెల జీతాలు
- కొన్ని నెలలుగా ఆలస్యమవుతున్న వైనం
- కనీస అవసరాలకూ ఇబ్బందే అంటున్న హోంగార్డులు
- ఆధునీకరణ పట్టించుకోని అధికారులు



సాక్షి, సిటీబ్యూరో: రాజధానిలో పని చేస్తున్న హోంగార్డులకు సెప్టెంబర్ నెల గౌరవ వేతనం ఆదివారానికీ అందలేదు. ప్రతి నెలా ఒకటి–రెండు తారీఖుల్లో వచ్చే జీతం కొన్ని నెలలుగా ఆలస్యం అవుతోంది. ఈసారి 8వ తేదీ వచ్చినా ఇప్పటికీ అందకపోవడంతో ఈ చిరుద్యోగులు బ్యాంక్ ఈఎంఐలు చెల్లించలేక ఇబ్బంది పడుతున్నారు. ఫలితంగా తమ సిబిల్ స్కోరు దెబ్బతింటోందని గగ్గోలు పెడుతున్నారు. రాజధానిలో క్షేత్రస్థాయిలో పని చేస్తున్న పోలీసుల సంఖ్యకు సమానంగా హోంగార్డులు ఉన్నారు. పోలీసుస్టేషన్ల వారీగా హోంగార్డ్స్ జీతాల చెల్లింపునకు సంబంధించి బిల్లులు ప్రతి నెలా హోంగార్డ్స్ కమాండెంట్ కార్యాలయానికి చేరుతాయి. ఈ బిల్లుల తయారీ మొత్తం ఇప్పటికీ మాన్యువల్‌గానే జరుగుతోంది. ఆ మధ్యన కొన్నాళ్ళు బయోమెట్రిక్ వ్యవస్థ ప్రవేశపెట్టినా.. అనివార్య కారణాలతో తొలగించారు. హోంగార్డులు పని చేసే ఠాణాలు, కార్యాలయాల్లో ఉండే అటెండెన్స్ రిజిస్టర్లలో సంతకాలతోనే ప్రస్తుతం వీరి హాజరు గణిస్తున్నారు. ప్రతి నెలా 20వ తేదీ నుంచి మరుసటి నెల్లో 19వ తేదీ వరకు పరిగణలోకి తీసుకుంటున్న అధికారులు దీనికి సంబంధించి హాజరుపట్టీ తయారు చేస్తుంటారు. పోలీసు స్టేషన్లు, ప్రత్యేక విభాగాలు, ఇతర కార్యాలయాల నుంచి నుంచి హెడ్–క్వార్టర్స్ లేదా అడ్మిన్ అధికారులకు వెళ్లే ఈ హాజరు ఫైల్ అక్కడ అప్రూవ్ అయ్యాక మాత్రమే హోంగార్డ్స్ కమాండెంట్ కార్యాలయానికి చేరుతుంది. అక్కడ నుంచి సంబంధిత కమిషనర్ ఆఫీస్‌కు వచ్చిన తర్వాతే జీతాలు లెక్కించి బ్యాంకు ద్వారా హోంగార్డుల ఖాతాలో పడాల్సి ఉంది. గతంలో ఒకటో తేదీ నుంచి 30వ తేదీ వరకు నెలగా పరిగణించే వాళ్ళు. మాన్యువల్‌గా జరుగుతున్న పనుల కారణంగా కొన్నేళ్ళ క్రితం వరకు జీతాల చెల్లింపు ఆలస్యమై ప్రతినెలా 15వ తేదీ తరవాతే హోంగార్డులకు అందేవి. అయితే దీనిపై దృష్టి పెట్టిన ఉన్నతాధికారులు నెల లెక్కింపును 20 నుంచి 19వ తేదీ వరకు మార్చారు. అయినప్పటికీ గడిచిన కొన్ని నెలలుగా కాస్త ఆలస్యంగానే జీతాలు వస్తున్నాయని హోంగార్డ్స్ వాపోతున్నారు. ఈ విభాగంలో గడిచిన కొన్నేళ్ళలో అనేక కుంభకోణాలు వెలుగుచూశాయి. వీటికి చెక్ చెప్పడంతో పాటు హోంగార్డులకూ ప్రతి నెలా ఒకటి–రెండు తేదీల్లో జీతాలు ఇచ్చేందుకు అవసరమైన ఆధునిక టెక్నాలజీ వినియోగంపై అధికారులు దృష్టి పెట్టట్లేదు. గతంలో వెలుగులోకి వచ్చిన కుంభకోణాలన్నీ హోంగార్డుల 'హాజరు' ఆధారంగా జరిగినవే. హోంగార్డుల హాజరును నమోదు చేయడానికి పోలీసుస్టేషన్ల వారీగా మరోసారి బయోమెట్రిక్ వ్యవస్థను ఏర్పాటు చేసి, లోపాలకు అధిగమిస్తే మంచి ఫలితాలు ఉంటాయి. కుంభకోణాలకు ఆస్కారం లేకుండా పోవడంతో పాటు జీతాల బిల్లుల తయారీ పేపర్‌తో పని లేకుండా వేగంగా జరుగుతుంది. ఈ బయోమెట్రిక్ సర్వర్ కమాండెంట్ కార్యాలయంలో ఉంచితే... హాజరు అక్కడే నమోదు అవుతుంది. ఫలితంగా కచ్చితత్వం ఉండటంతో పాటు జీతాల బిల్లులు సైతం ఆలస్యం కావు. కేవలం పర్మిషన్లు, ఆన్‌డ్యూటీల్లో ఉన్న హోంగార్డుల వివరాలను మాత్రం ఈ కార్యాలయానికి మాన్యువల్‌గా, నేరుగా పంపితే సరిపోతుంది. ఉన్నతాధికారులు ఈ కోణంపై దృష్టి పెడుతున్న దాఖలాలు కనిపించట్లేదు. ఆలస్యానికి కారణాలు ఏవైనా ఇబ్బందులు పడుతున్నది మాత్రం పోలీసు శాఖలో 'బడుగు జీవులు' అయిన హోంగార్డులే. తమకు గృహరుణాలు, ఇతర లోన్లు ఉన్నాయని, వీటి ఈఎంఐలు ప్రతి నెలా మొదటి వారంలోనే కట్ అవుతాయని చెప్తున్నారు. జీతాల ఆలస్యం కారణంగా ఇది సాధ్యంకాక తమ సిబిల్ స్కోర్లు కూడా దెబ్బతింటున్నాయని వాపోతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు కలగజేసుకుని తమ బాధలు తీర్చాలని హోంగార్డులు వేడుకోంటున్నారు.

పండగ బండికి

ఫుల్ డిమాండ్!

- దసరా నేపథ్యంలో పెరుగుతున్న వాహనాల కొనుగోళ్లు
- కొత్త బండి కోసం వాహనదారులు క్యూ
- ద్విచక్ర వాహనాలకు భారీ డిమాండ్.
- కొద్ది రోజులుగా పెరిగిన అమ్మకాలు
- జీవితకాల పన్ను విధింపుతో తగ్గిన ఈవీల అమ్మకాలు

సాక్షి, సిటీబ్యూరో: దసరా సందర్భంగా వాహనాల కొనుగోళ్లు ఆరంభమయ్యాయి. పండుగ రోజు తప్పనిసరిగా కొత్త బండి నడపాలని కోరుకొనే వాహన వినియోగదారులు ఇప్పటికే పెద్ద ఎత్తున ఆన్‌లైన్ క్యూలో పడిగాపులు కాస్తున్నారు. గత నెల రోజులుగా తగ్గిన వాహనాల అమ్మకాలు ఈ నెలలో క్రమంగా పెరిగినట్లు ఆటోమొబైల్ సంస్థలు తెలిపాయి. సాధారణంగా దసరా, దీపావళి వంటి ముఖ్యమైన పర్వదినాల దృష్ట్యా కొత్త బండ్లకు డిమాండ్ ఉంటుంది. ఈ క్రమంలోనే రెండు, మూడు నెలలుగా కొనుగోళ్ల వాయిదా వేసుకున్నవాళ్లు ప్రస్తుతం కొత్త వాహనం కొనుగోలు కోసం ఆసక్తి చూపుతున్నారు. దీంతో కార్లు, ద్విచక్ర వాహనాల అమ్మకాలు మొదలయ్యాయి. మరో వారం రోజుల్లో వాహనాల అమ్మకాలు ఊపందుకొనే అవకాశం ఉందని రవాణా అధికారులు అంచనా వేస్తున్నారు. 'సెప్టెంబర్‌లో కొత్త వాహనాల నమోదు తగ్గుముఖం పట్టింది. ఈ నెల మొదటి వారంలో క్రమంగా పెరిగింది. అమావాస్య తరువాత మరింత పెరిగే అవకాశం ఉంది.' అని ఆర్టీఏ అధికారి ఒకరు తెలిపారు. మరోవైపు ఆటోమొబైల్ డీలర్లు సైతం దసరా, దీపావళి వేడుకలపైనే ఆశలు పెట్టుకోవడం గమనార్హం. గ్రేటర్‌లో కొంతకాలంగా వ్యక్తిగత వాహనాల వినియోగం గణనీయంగా పెరిగింది. సిటీబస్సులు, మెట్రో, ఆటోలు, క్యాబ్‌లు, ఎంఎంటీఎస్ వంటి ప్రజారవాణా సదుపాయాలు అందుబాటులో ఉన్నప్పటికీ నగరవాసులు సొంత వాహనాల వినియోగానికే ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. ప్రస్తుతం గ్రేటర్‌లో సుమారు 75 లక్షలకు పైగా వాహనాలు నమోదయ్యాయి. ప్రతి సంవత్సరం లక్షలకొద్దీ కొత్త వాహనాలు వచ్చి చేరుతున్నారు. కార్ల కంటే బైక్‌ల వినియోగం బాగా పెరిగింది. ఈ క్రమంలోనే దసరా, దీపావళి అమ్మకాలు బాగా పెరగవచ్చునని ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ నిర్వాహకులు ఒకరు తెలిపారు.

నచ్చిన బండి కోసం ఎదురుచూపులే...

నలుగురు కుటుంబ సభ్యులు ఉన్న మధ్యతరగతి ఇంటికి ఇప్పుడు కారు ఓ తప్పనిసరి అవసరంగా మారింది. కానీ చిరుద్యోగులు మొదలుకొని ఓ స్థాయిలో వేతనాలు అందుకొనే ఉద్యోగ వర్గాలు, వ్యాపారులు, విద్యార్థులు, తదితర వర్గాల్లో బైక్‌ల వినియోగం బాగా పెరిగింది. ప్రస్తుతం కార్ల కంటే బైక్‌లకే ఆర్డర్లు ఎక్కువగా ఉన్నట్లు ఆటోమొబైల్ సంస్థలకు చెందిన ప్రతినిధులు చెప్పారు. గ్రేటర్ హైదరాబాద్‌లో సుమారు 150 ఆటోమొబైల్ షోరూమ్‌లలో కార్లు, ద్విచక్ర వాహనాలను విక్రయిస్తున్నారు. నగరంలోని అన్ని ఆర్టీఏ కేంద్రాల పరిధిలో ప్రతి రోజు 1500 నుంచి 2000 వరకు కొత్త వాహనాలు నమోదవుతాయి. రవాణా వాహనాల కోసం ఎక్కువగా ఎదురు చూడవలసిన అవసరం లేకపోయినా వ్యక్తిగత వాహనాల కేటగిరీలో అన్ని రకాల వాహనాలకు కొంత వరకు వెయిటింగ్ తప్పడం లేదు. హ్యూండాయ్, కియా. టయోటా, నెక్సాన్, మారుతీ, తదితర కంపెనీలకు చెందిన కార్లకు డిమాండ్ ఎక్కువగా ఉంది. అలాగే కొన్ని ప్రీమియం వాహనాలకు సైతం నెలల తరబడి పడిగాపులు కాయాల్సిందే.ద్విచక్ర వాహనాలలో యానికార్న్, హొండా యాక్టీవా 125 వంటి వాహనాలకు ప్రస్తుతం డిమండ్ ఎక్కువగా ఉంది. ఈ అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు వాహనాల అమ్మకాల్లో ఇదే జోరు కొనసాగే అవకాశం ఉన్నట్లు అంచనా.



ఈవీ తగ్గుముఖం...

జీవితకాల పన్ను విధింపుతో ఎలక్ట్రిక్ కార్ల అమ్మకాలు తగ్గుముఖం పట్టినట్లు ఆటోమొబైల్ సంస్థలు తెలిపాయి. నగరంలో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం మొదట కొనుగోలు చేసే 5000 కార్లకు జీవితకాల పన్ను నుంచి మినహాయింపునిచ్చింది. కానీ ఆటోమొబైల్ సంస్థల విజ్ఞప్తి మేరకు మరో 2000 వాహనాలకు ఈ మినహాయింపును పొడిగించారు. గత ఆగస్టు నుంచి ఈ మినహాయింపును ఉపసంహరించారు. మరో 6 నెలల వరకు జీవితకాల పన్ను నుంచి మినహాయింపునిస్తే ఈవీ కార్ల అమ్మకాలు పెరుగుతాయని ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రాంకోటి తెలిపారు.

అవగాహనతోనే కేన్సర్‌కు

చెక్

'గ్లోబల్ గ్రేస్' రన్‌లో వక్తలు



గచ్చిబౌలి: ప్రపంచంలోనే అతిపెద్ద కేన్సర్ అవగాహన రన్ కార్యక్రమం ఆదివారం 'క్యాంబియంట్ గ్లోబల్ గ్రేస్ కేన్సర్ రన్–2023' పేరిట గచ్చిబౌలి ప్రాంతంలో సందడిగా సాగింది. ప్రపంచవ్యాప్తంగా 130 దేశాలలో నిర్వహించిన ఈ రన్‌లో లక్ష మంది వరకు పాల్గొనగా గచ్చిబౌలి రన్‌లో 15 వేల మంది హాజరుకావడం విశేషం. డ్యుయల్ మోడ్–వర్చువల్, ఫిజికల్‌లో ఈ రన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సినీ హీరోయిన్ కాజల్ అగర్వాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలువగా, సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ పాల్గొని రన్‌ను ప్రారంభించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాప కుడు, సీనియర్ కన్సల్టెంట్ రోబోటిక్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ చినబాబు ఆధ్వర్యంలో గ్లోబల్ అండ్ కేన్సర్ ఎడ్యుకేషన్, క్యాంబియంట్ డెవలపర్స్, తెలంగాణ పోలీస్, హైదరాబాద్ రన్నర్స్ సహకారంతో ఈ రన్ కొనసాగింది. ముఖ్యంగా 5కె, 10కె, 21.1కె (హాఫ్ మారథాన్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హీరోయిన్ కాజల్ అగర్వాల్ మాట్లాడుతూ కేన్సర్‌ను ముందస్తుగా గుర్తించడమే నివారణకు ఉత్తమ మార్గమని అభిప్రాయపడ్డారు. కేన్సర్ అవేర్‌నెస్ కోసం నిర్వహించిన అతిపెద్ద మారథాన్‌లో పాల్గొనే అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ మారథాన్‌లో శిక్షణ పొంది విజయవంతంగా పూర్తి చేయడం అంత తేలికైన విషయం కాదన్నారు. జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్, డాక్టర్ చినబాబు, ఏపీ సీఎం మాజీ ఐటీ సలహాదారు జేఏ చౌదరి, మైక్రోసాఫ్ట్ ఇంజనీరింగ్ వైస్ ప్రెసిడెంట్ విజయ్ మంథని, డాక్టర్ పవన్ గోరుకంటి, టీహబ్ సీఈఓ ఎం.శ్రీనివాసరావు, ట్రిపుల్‌ఐటీ ప్రొఫెసర్ రమేష్ లోగనాథన్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ వైద్యరంగం దేశానికే ఆదర్శం

- హోంమంత్రి మహమూద్ అలీ
- ప్రభుత్వ సెక్టార్‌లో ఐవీఎఫ్ సెంటర్ ఏర్పాటు విప్లవాత్మకం
- సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలకు కేరాఫ్ హైదరాబాద్


గాంధీ ఆస్పత్రిలో ఐవీఎఫ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న హోంమంత్రి మహమూద్ అలీ

గాంధీఆస్పత్రి : తెలంగాణ వైద్యరంగం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని, ప్రభుత్వ సెక్టార్‌లో ఐవీఎఫ్ సెంటర్ ఏర్పాటు విప్లవాత్మకమని హోంమంత్రి మహమూద్ అలీ, టీఎస్ఎంఎస్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అన్నారు. సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి ప్రాంగణంలో 200 పడకల మాతాశిశు సంరక్షణ కేంద్రంలోని ఐదవ అంతస్తులో ఇన్ విట్రో ఫెర్టిలిటీ (ఐవీఎఫ్) సెంటర్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ సంతానలేమితో బాధపడుతున్న నిరుపేద దంపతులకు ఐవీఎఫ్ సెంటర్ వరప్రసాదమని, ప్రభుత్వ సెక్టార్‌లో ఐవీఎఫ్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం సీఎం కేసీఆర్, వైద్య శాఖమంత్రి హరీష్‌రావులకే సాధ్యమైందన్నారు. వివాహమై ఏళ్లు గడుస్తున్నా సంతానం కలగని దంపతులు రూ.లక్షలు వెచ్చించి ప్రైవేటు, కార్పొరేట్ ఐవీఎఫ్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారన్నారు. గాంధీలో ఏర్పాటు చేసిన ఐవీఎఫ్ సెంటర్‌లో అన్నిరకాల వైద్యసేవలు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలకు హైదరాబాద్ కేరాఫ్ అడ్రాస్‌గా మారిందని, దేశ విదేశాలకు చెందినవారు వైద్యం కోసం ఇక్కడికే వస్తున్నారని, హైదరాబాద్‌ను మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గాంధీ ఆస్పత్రిలో నిష్ణాతులైన వైద్యులు, అత్యాధునిక వైద్యపరికరాలు అందుబాటులో ఉన్నాయని, ఇటువంటి సేవలను ఉచితంగా అందిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వంపై తెలంగాణ ప్రజలు పూర్తి విశ్వాసంతో ఉన్నట్లు తెలిపారు. మాతాశిశు సంరక్షణకు కేసీఆర్ కిట్, అమ్మ ఒడి, న్యూట్రీషన్ కిట్, ఆరోగ్యలక్ష్మి తదితర సంక్షేమ పథకాలకు ముఖ్య మంత్రి కేసీఆర్ శ్రీకారం చుట్టారని టీఎస్ఎంఎస్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అన్నారు. నిరుపేదలకు ఉచిత ఐవీఎఫ్ సేవలు అందించేందుకు సికింద్రాబాద్ గాంధీ, పేట్లబురుజు, వరంగల్ ఎంజీఎం ఆస్పత్రుల్లో సెంటర్లను ఏర్పాటు చేసేందుకు సుమారు రూ.16 కోట్లు కేటాయించారని, కొత్తగా పెళ్లయినవారిలో 15 శాతం మంది సంతాన లేమితో బాధపడుతున్నట్లు పలు అధ్యయనాలు వెల్లడించాయన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు 30 నుంచి 70 శాతానికి పెరిగాయని, నీతి అయోగ్‌లో 11 నుంచి 3వ స్థానానికి చేరుకున్నామని ఆయన వివరించారు. వైద్య శాఖ మంత్రి హరీష్‌రావు ప్రోత్సాహంతోనే గాంధీ ఆస్పత్రిని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా తీర్చిదిద్దామని, అర్హులైనవారంతా ఐవీఎఫ్ సేవలను ఉచితంగా వినియోగించుకోవాలని గాంధీ సూపరింటెండెంట్ రాజారావు కోరారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ డీఎంఈ ప్రొఫెసర్ వాణీ, గాంధీ, ఉస్మానియా, పేట్లబురుజు, సుల్తాన్‌బజార్ ఆస్పత్రుల సూపరింటెండెంట్లు రాజారావు, నాగేందర్, రాజ్యలక్ష్మీ, మాలతి, గాంధీ మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, ఐవీఎఫ్ సెంటర్ ఇంఛార్జీ వెల్లంకి జానకి, గైనకాలజీ హెచ్ఓడీ శర్మిల, ఆర్ఎంఓ–1 జయకృష్ణ, టీఎస్ఎంఎస్ఐడీసీ ఎండీ చంద్రశేఖర్, ఇంజినీర్లు దేవేందర్ కుమార్, సురేందర్‌రెడ్డి, చలపతి, పాల్‌సుందర్‌రాజ్, అనీల్‌కుమార్, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్ రెడ్డి, కార్పొరేటర్ హేమలత, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


పరికరాలను పరిశీలిస్తున్న దృశ్యం

పీవీ ఎక్స్‌ప్రెస్‌వేపై రోడ్డు ప్రమాదం

ఇద్దరికి గాయాలు

రాజేంద్రనగర్: పీవీ ఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వేపై అతివేగంగా వచ్చిన కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. రాజేంద్రనగర్ పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి..ఆదివారం కారులో మెహదీపట్నం నుంచి శంషాబాద్ వెళ్తున్న ఇద్దరు మైనర్లు కారును నియంత్రించలేక 198 పిల్లర్ వద్ద డివైడర్ ను ఢీకొట్టి ముందు వెళ్తున్న మరో కారు ను ఢీ కొట్టారు. ఈ ఘటనలో ముందు వెళ్తున్న కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఇద్దరు మైనర్లను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

సినీ కార్మికుడి అదృశ్యం

బంజారాహిల్స్: సినీ కార్మికుడు అనుమానాస్పద స్థితిలో అదృశ్యమైన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే... ఎల్లారెడ్డిగూడ, నవోదయ కాలనీలో సుమ రెసిడెన్సీలో నివాసం ఉంటున్న లక్ష్మినారాయణ పుష్ప–2 సినిమాలో పని చేస్తున్నాడు. ఈ నెల 4న ఉదయం ఇంటికి వచ్చే క్రమంలో ఫోన్ కాల్ రావడంతో అటు నుంచి అటే బయటికి వెళ్లిపోయాడు. మర్నాడు ఉదయం ఇంటికి తిరిగి రాకపోవడంతో అతడి సోదరుడు శివ రామకృష్ణ ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఎంత బిజీగా ఉన్నా క్రమం తప్పకుండా తనతో మాట్లాడేవాడని ఎప్పటికప్పుడు తనకు ఎక్కడ ఉన్నాడో తెలిపేవాడని నాలుగు రోజులుగా ఫోన్ స్విచ్ఛాఫ్ ఉండటంతో అనుమానాలు వస్తున్నాయని శివ రామకృష్ణ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

నాంపల్లి: రైలు కిందపడి గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం నాంపల్లి రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలోని లింగంపల్లి–చందానగర్ రైల్వే స్టేషన్ల మధ్య చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గుర్తు తెలియని యువకుడు (30) ఆదివారం లింగంపల్లి–చందానగర్ రైల్వే స్టేషన్ల మధ్య రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి ఒంటిపై నీలం రంగు చుక్కల టీ షర్టు, బ్లాక్ కలర్ నైట్ ప్యాంటు ధరించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ ప్రీమియర్ గోల్ఫ్ టోర్నీ ప్రారంభం


టీపీజీఎల్ ట్రోఫీని ఆవిష్కరిస్తున్న దృశ్యం

గోల్కొండ: గోల్ఫ్ కమ్యూనిటీ కోసం మరో లీగ్ నిర్వహించడం తమకెంతో గర్వంగా ఉందని హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ కెప్టెన్ అజయ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం గోల్కొండ నయాఖిలాలోని హైదరాబాద్ గోల్ఫ్ కోర్స్‌లో 3వ తెలంగాణ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ ప్రారంభమైంది. లీగ్ టైటిల్ స్పాన్సర్, శ్రీనిధి యూనివర్సిటీ చైర్మన్ డాక్టర్ కె.టి.మహితో కలిసి ట్రోఫీని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణలో గోల్ఫ్‌కు ప్రాచుర్యం పెరుగుతుందని లీగ్ నిర్వహించడం వల్ల గోల్ఫ్ పట్ల ఆసక్తి కూడా పెరిగిందన్నారు. టీపీజీఎల్ మూడో సీజన్‌లో 16 జట్లు పాల్గొంటున్నట్లు తెలిపారు. శ్రీనిధి యూనివర్సిటీ వరుసగా మూడో సీజన్‌కు కూడా స్పాన్సర్ చేస్తున్నారన్నారు. అసోసియేషన్ గౌరవ కార్యదర్శి వందిత్‌రెడ్డి మాట్లాడుతూ ఈ లీగ్‌లో పాల్గొనే వారికి ఎంతో అనుభవం, ఆటలోని మెలకువలను నేర్చుకునే అవకాశం ఉందన్నారు. తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్, హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ సహకారంతో హైదరాబాద్ గోల్ఫ్ కోర్స్‌కు బెస్ట్ టూరిజం ఫ్రెండ్లీ గోల్ఫ్ కోర్స్ 2022–23గా నేషనల్ టూరిజం అవార్డు అందుకుందన్నారు. ఈ టోర్నమెంట్‌లో ఆదివారం నేడు మొదటి రౌండ్ జరిగిందని రెండో రౌండ్ అక్టోబర్ 11, 3వ రౌండ్ అక్టోబర్ 14, 4వ రౌండ్ అక్టోబర్ 18, 5వ రౌండ్ అక్టోబర్ 21న నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 25న ఓపెన్ డే ఉంటుందని 29న క్వాటర్ ఫైనల్స్, నంబర్ 1న సెమి ఫైనల్స్ జరుగుతాయని అన్నారు. 4న ఫైనల్స్ జరుగుతాయని ఆయన వివరించారు.

వివాదాస్పదంగా మారిన ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ బదిలీ !

సాక్షి, సిటీబ్యూరో: అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసుల్లో విచారణ ఎదుర్కొంటున్న అధికారిని రాచకొండ పోలీసు కమిషనరేట్‌లో కీలక పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ (స్టేషన్ హౌజ్ ఆఫీసర్)గా నియమించడం వివాదాస్పదంగా మారింది. ఉప్పల్ ఠాణా ఎస్‌హెచ్‌ఓ గోవింద్ రెడ్డిని సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) ఎల్బీనగర్‌కు బదిలీ చేస్తూ రాచకొండ కమిషనర్ దేవేంద్రసింగ్ చౌహాన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో 2009 బ్యాచ్‌కు చెందిన బీ శ్రావణ్ కుమార్‌ను ఉప్పల్ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. ఇప్పటివరకు హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లోని తిరుమలగిరి పీఎస్ ఇన్‌స్పెక్టర్ పని చేసిన శ్రావణ్‌పై ఏసీబీ కేసు ఉంది. లంచం డిమాండ్ చేసిన వ్యవహారంపై ఏసీబీ అధికారులు ఏడాది జులైలో 41–ఏ నోటీసులు కూడా జారీ చేశారు. ఓ షూటర్ గన్ లైసెన్స్ రెన్యూవల్ చేసుకునేందుకు రూ.30 వేలు లంచం డిమాండ్ చేసినట్లు బాధితుడు ఏసీబీకి ఫిర్యాదు చేశాడు. వ్యవహారానికి సంబంధించిన వీడియో సైతం ఏసీబీకి అందించాడు. అప్పట్లో తీవ్ర దుమారం రేపిన ఈ వ్యవహారంపై హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ సీరియస్‌గా పరిగణించి... డీసీపీ స్థాయి అధికారితో అంతర్గత విచారణ చేయించారు. నివేదిక అనంతరం శ్రవణ్ కుమార్‌ను రేంజ్‌కు బదిలీ చేశారు. తాజాగా సీనియర్లు, ఉత్తమ విధులు నిర్వర్తించే వారిని కాదని అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న శ్రవణ్ కుమార్‌ను కీలకమైన ఉప్పల్ ఠాణాకు ఎస్‌హెచ్‌ఓగా నియమించడంపై పోలీసు శాఖలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే బంజారాహిల్స్ పీఎస్ ఇన్‌స్పెక్టర్ నరేందర్‌పై ఏసీబీ కేసుతో సంచలనంగా మారిన వ్యవహారాన్ని మరవకముందే మరో ఏసీబీ కేసు ఉన్న అధికారిని ఎస్‌హెచ్‌ఓగా నియమించడంపై పోలీసు శాఖకు అప్రతిష్టపాలవుతుందని పలువురు సీనియర్ పోలీసు అధికారులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా... ఉప్పల్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ (డీఐ)గా ఉన్న ఉపేందర్ రావును మేడిపల్లి పీఎస్ డీఐగా, ఇక్కడ డీఐగా ఉన్న జీ మన్మధ కుమార్‌ను ఉప్పల్ డీఐగా, వెయిటింగ్‌లో ఉన్న సబ్ ఇన్‌స్పెక్టర్లు (ఎస్ఐ) వీ సుశీలను అబ్దుల్లాపూర్ పీఎస్‌కు, ఏ నరేందర్‌ను ఉప్పల్ పీఎస్‌కు, టీ యాలాద్రిని ఉప్పల్ ట్రాఫిక్ ఠాణాకు బదిలీ చేస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

కస్టమ్స్ సుంకం ఎగ్గొట్టే యత్నం

ప్రయాణికుడి నుంచి 13 యాపిల్ ఫోన్లు స్వాధీనం

శంషాబాద్: కస్టమ్స్ సుంకం ఎగ్గొట్టేందుకు ఓ ప్రయాణికుడు చేసిన ప్రయత్నం విఫలమైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. హైదరాబాద్‌కు చెందిన రాజశేఖర్‌రెడ్డి అనే వ్యక్తి బ్యాంకాక్ నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నాడు. తనిఖీలు పూర్తి చేసుకుని అరైవల్ బయట ఉన్న విలేజ్ టెర్మినల్‌లోకి చేరుకున్న తర్వాత తన తోటి ప్రయాణికుల నుంచి ఫోన్లు సేకరించాడు. దీనిని గుర్తించిన నిఘా అధికారులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. కస్టమ్స్ సుంకం చెల్లించకుండా ఉండేందుకు తాను బ్యాంకాక్‌లో కొనుగోలు చేసిన 13 యాపిల్ ఫోన్లను అదే విమానంలో వచ్చిన సహచర ప్రయాణికులకు ఒక్కొక్కటి అందజేసి వాటిని ఇక్కడ తీసుకున్నట్లు తెలిపాడు. కస్టమ్స్ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విదేశీ కరెన్సీతో ...

అక్రమంగా తీసుకెళుతున్న విదేశీ కరెన్సీ అధికారులు స్వాధీ చేసుకున్నారు. మహ్మద్ ఆరీఫ్ హుస్సేన్ అనే వ్యక్తి కొలంబో వెళ్లేందుకు డిపార్చర్ వద్దకు చేరుకున్నారు. తనిఖీల్లో భాగంగా అతడి వద్ద యూఎస్ డాలర్లతో పాటు థాయ్‌బాట్స్ బయటపడ్డాయి. భారత కరెన్సీలో వాటి విలువ రూ. 10.30 లక్షలు ఉండుందని అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


స్వాధీనం చేసుకున్న ఫోన్లు

లారీ చోరీ కేసులో నిందితుల అరెస్ట్


పోలీసుల అదుపులో నిందితులు

నాగోలు: రోడ్డుపై పార్కు చేసిన లారీని చోరీ చేసి విక్రయించేందుకు చేసి ప్రయత్నాలు విఫలం కావడంతో దానిని విజయవాడకు తీసుకెళ్లి పార్టులుగా విడదీసి విక్రయించేందుకు యత్నించిన ముగ్గురు వ్యక్తులను హయత్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం ఎల్‌బీనగర్ డీసీపీ సాయి శ్రీ వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్ కు చెందిన చహన్ రవి. గుండె అశోక్, మజీద్ అలీ పహాడీ షరీఫ్ ప్రాంతంలో ఉంటూ డ్రైవర్లుగా పని చేస్తున్నారు. సులువుగా డబ్బులు సంపాదించాలన్న ఉద్దేశంతో వారు పార్క్ చేసిన లారీలను చోరీ చేసి విక్రయించాలని పథకం పన్నారు. ఇందులో భాగంగా వనస్థలిపురం, ఆటోనగర్ పరిసర ప్రాంతాల్లో తిరుగుతూ రెక్కీ నిర్వహించారు. గత నెల 26న వారు హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మారెడ్డి పాలెం భారత్ పెట్రోల్ బంకు వద్ద పార్క్ చేసిన లారీని చోరీ చేసి విక్రయించేందుకు అదిలాబాద్ తీసుకెళ్లారు. లారీ యజమాని ఫిర్యాదు మేరకు హయత్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా లారీ అమ్ముడు పోకపోవడంతో వారు దానిని విడదీసి స్పేర్ పార్ట్స్ విక్రయించేందుకు ఆదిలాబాద్ నుంచి విజయవాడకు తీసుకెళుతుండగా మార్గమధ్యలో ఓఆర్ఆర్ రింగ్ రోడ్డు వద్ద పోలీసులు లారీని స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పార్క్ చేసిన లారీని తామే చోరీ చేసినట్లు విచారణలో వెల్లడించారు. లారీని అదిలాబాద్ తీసుకెళ్లి కలర్, నెంబర్ ప్లేట్ మార్చి అమ్మకానికి పెట్టామని, అయినా అమ్ముడు పోకపోవడంతో విజయవాడలో దానిని విడదీసి విడిభాగాలు విక్రయించేందుకు వెళుతున్నట్లు తెలిపారు. వారి నుంచి లారీ, బైక్, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ తెలిపారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, వీరికి ఆర్థికంగా సహకరించిన ఇక్బాల్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ కోటేశ్వరరావు, వనస్థలిపురం ఏసీపీ భీమ్‌రెడ్డి, హయత్‌నగర్ సీఐ వెంకటేశ్వర్లు, డీఐ నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

భవనం పైనుంచి పడి కార్మికుడి దుర్మరణం


మధు(ఫైల్)

సుభాష్‌నగర్: భవనం నాలుగో అంతస్తు నుంచి పడి కార్మికుడు మృతి చెందిన ఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ వెంకటేశ్వరరావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సూరారం మార్కెట్ రోడ్డులో జయప్రకాష్ అనే వ్యక్తి భవనాన్ని నిర్మిస్తున్నాడు. షాపూర్‌నగర్, సంజయ్ గాంధీనగర్ చెందిన సెంట్రింగ్ కార్మికుడు మధు (40) ఆదివారం ఉదయం సెంట్రింగ్ బాక్స్‌లు తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు నాలుగో అంతస్తు పైనుంచి కింద పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో మృతుడి కుటుంబ సభ్యులు, కార్మిక సంఘాల నేతలు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన చేపట్టారు. మృతుని కుటుంబానికి పరిహారం చెల్లించేంత వరకు మృతదేహాన్ని తరలించేది లేదని భీష్మించి కూర్చున్నారు. దీంతో భవన యజమాని రూ.6 లక్షలు, మేస్త్రీ రూ. 5 లక్షలు ఇచ్చేందుకు అంగీకరించడంతో ఆందోళన విరమించారు. మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

ప్రేమ పేరుతో మోసం

నిందితుడి అరెస్ట్


నిందితుడు చినబాబు

అమీర్‌పేట: కంప్యూటర్ శిక్షణ కోసం వచ్చిన యువతిని ప్రేమ పేరుతో నమ్మించి గర్భవతిని చేసి మోసం చేసిన వ్యక్తిని ఎస్ఆర్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ రాంప్రసాదరావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బలకంపేటకు చెందిన యువతి 2022లో కంప్యూటర్ కోర్సు చేసేందుకు అమీర్‌పేట కుమ్మరి బస్తీలోని ఎంబెడెడ్ సిస్టమ్స్ ఇనిస్టిట్యూట్‌లో చేరింది.ఇనిస్టిట్యూట్ నిర్వాహకుడు అందుగల చినబాబు సదరు యువతిని ప్రేమిస్తున్నానని పెళ్లి చేసుకుంటానని నమ్మించడంతో ఇద్దరు కొన్నాళ్లు సహజీవనం చేశారు. 2023 ఏప్రిల్‌లో గర్భం దాల్చిన ఆమె ఈ విషయాన్ని చినబాబుకు చెప్పడంతో పెళ్లికి ముందే గర్భవతి అయ్యిందని తెలిస్తే తన కుటుంబ సభ్యులు పెళ్లికి అంగీకరించరని తన స్నేహితుడు అంజిరెడ్డి సహకారంతో ఆమెకు అబార్షన్ చేయించాడు. ఆ తర్వాత ఆమె పలు మార్లు పెళ్లి ప్రస్తావన తేగా చినబాబు ఆమెను వదిలి వెళ్లి పోయాడు. ఆ తర్వాత అతను మరో యువతితో కలిసి వనస్థలిపురంలో ఉంటున్నట్లు తెలియడంతో బాధితురాలు అక్కడికి వెళ్లి చినబాబును నిలదీసింది. దీంతో అతను ఆమెపై దాడి చేసి బయటికి గెంటివేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన ఎస్ఆర్‌నగర్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అతడికి సహకరించిన అంజిరెడ్డి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ.


పోలీసుల అదుపులో నిందితులు

నాగోలు: పాత కక్షలు మనసులో పెట్టుకుని తన స్నేహితులతో కలిసి తన సమీప బంధువును ఆటోతో ఢీ కొట్టి హత్య చేసిన సంఘటనలో ముగ్గురు నిందితులను అబ్దుల్లాపూర్ మెట్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆదివారం ఎల్‌బీనగర్ డీసీపీ కార్యాలయంలో డీసీపీ సాయిశ్రీ కేసు వివరాలు వెల్లడించారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, మజీద్‌పూర్ గ్రామానికి చెందిన తూర్పాటి శ్రీశైలం, తూర్పాటి దశరథ, తూర్పాటి లింగస్వామి, తూర్పాటి రామచందర్, తూర్పాటి వెంకటేష్ సమీప బంధువులు. శ్రీశైలం, రామచందర్‌ల మధ్య పాత గొడవలు ఉన్నాయి. శ్రీశైలం మజీద్‌పూర్ గ్రామంలో స్క్రాప్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. రామచందర్ గతంలో శ్రీశైలానికి స్క్రాప్ మెటీరియల్ విక్రయించేవాడు. గత కొంతకాలంగా రాంచందర్ అతడికి స్క్రాప్ విక్రయించడం లేదు. దీంతో వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రామచందర్‌పై పగ పెంచుకున్న శ్రీశైలం అతడిని హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇందుకుగాను తన స్నేహితులు దశరథ, లింగస్వామి సహకారంతో పథకం పన్నాడు. ఈ నెల 6 న సాయంత్రం రామచందర్, వెంకటయ్య బైక్ వెళ్తుండగా అదే అదునుగా భావించిన శ్రీశైలం బాట సింగారం సమీపంలోని పేపర్ గోడౌన్ వద్ద వారిని వెనుక నుంచి ఆటోతో ఢీ కొట్టాడు. ఈ ఘటనలో రామచందర్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకటేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. రామచందర్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు ఆదివారం నిందితులు శ్రీశైలం, దశరథ, లింగస్వామిలను అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. వారి నుంచి బైక్, ఆటో, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ కోటేశ్వరరావు, వనస్థలిపురం ఏసీపీ భీమ్‌రెడ్డి, అబ్దుల్లాపూర్ మెట్ సీఐ మన్మోహన్, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్షుద్ర పూజల కోసం కస్తూరి పిల్లి అవయవాల తరలింపు

- ఎయిర్‌పోర్టులో తనిఖీల్లో పట్టివేత
- ముంబై తీసుకెళుతున్న వ్యక్తి అరెస్ట్


కస్తూరి పిల్లి అవయవాలు


నిందితుడు సయ్యద్ అక్బర్ పాషా

శంషాబాద్: క్షుద్రపూజల కోసం కస్తూరి పిల్లికి సంబంధించిన అవయువాలను తరలిస్తున్న వ్యక్తిని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో సీఐఎస్ఎఫ్ అధికారులు అదుపులోకి తీసుకుని అటవీశాఖ అధికారులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆదివారం తెల్లవారు జామున సయ్యద్ అక్బర్ పాషా అనే వ్యక్తి ముంబై వెళ్లేందుకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చాడు. లగేజీ స్క్రీనింగ్‌లో అనుమానిత వస్తువులు కనిపించడంతో సీఐఎస్ఎఫ్ అధికారులు వాటిని విప్పి చూడగా, కస్తూరి పిల్లికి సంబంధించిన అవయవాలు ఉన్నట్లు గుర్తించారు. దీంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా క్షుద్ర పూజల కోసం వాటిని తీసుకెళుతున్నట్లు తెలిపారు. కస్టమ్స్ అధికారులు అతడిని అటవీ శాఖ అధికారులకు అప్పగించడంతో వారు అతడిపై వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే అతడు వీటిని ఎక్కడి నుంచి తీసుకొచ్చాడనే దానిపై దర్యాప్తు చేపట్టారు. కస్తూరి పిల్లి శేషాచలం అటవీ ప్రాంతంతో పాటు హిమాచల్ ప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, టిబెట్ ప్రాంతాల్లో మాత్రమే ఉంటాయని అధికారులు పేర్కొన్నారు. కస్తూరి పిల్ల అవయవాలను సుగంధ పరిమళాల ఉత్పత్తుల తయారీలో.. కొన్ని రకాల ఔషధాల్లో వినియోగిస్తున్నట్లు తెలిసింది.

దూరం పెడుతోందని..

- భార్యను హత్య చేసిన భర్త
- నిందితుడి అరెస్ట్


నిందితుడు బాలకోటయ్య

నాగోలు: ఆస్తి మొత్తం తన పేరున రిజిస్ట్రేషన్ చేయించుకుని, తనను దూరం పెడుతూ ఇతరులతో సన్నిహితంగా ఉంటుందని భార్యపై కోపం పెంచుకుని ఆమెను బండరాయితో మోది హత్య చేసిన కేసులో నిందితుడిని వనస్థలిపురం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆదివారం ఎల్‌బీనగర్ డీసీపీ డీసీపీ సాయిశ్రీ వివరాలు వెల్లడించారు. అబ్దులాపూర్ మెట్ మండలం, మునగనూర్‌కు చెందిన బాల కోటయ్యకు 2008 లో శాలినితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు. కొద్ది రోజులుగా వారు ఇంజాపూర్ గ్రామం, అంజనాపురికాలనీ నివాసం ఉంటున్నారు. కాగా గత కొంత కాలంగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఇరువర్గాల పెద్దలు పంచాయతీ చేసి వారికి సర్ది చెప్పారు. అయితే బాలకోటయ్య ఎప్పుడు భార్య శాలినిని శారీరకంగా వేధించేవాడు. దీంతో ఆమె గత జూలై నెలలో ఇద్దరు కుమారులతో కలిసి వనస్థలిపురం శతవాహననగర్‌లో ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు వచ్చి అక్కడే ఉంటూ పిల్లలను చదివించుకుంటోంది. తనను దూరం పెట్టి, పిల్లలను తన వద్దకు రానివ్వడం లేదని, ఆస్తులు ఆమె పేరునే రిజిస్ట్రేషన్ చేసుకున్నదని భార్యపై కోపం పెంచుకున్న బాలకోటయ్య ఆమెను హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. కొద్ది రోజుల క్రితం శాలిని తల్లిదండ్రులు వారి సొంతూరికి వెళ్లడంతో అదే అదనుగా భావించిన ఈ నెల 6న సాయంత్రం శాలిని స్కూటీపై వస్తుండగా విజయపురి కాలనీలోని సాయిబాబా గుడి సమీపంలో బాలకోటయ్య ఆమెను అడ్డుకుని దాడి చేశాడు. ఆమె బైక్ పైనుంచి కింద పడగానే పక్కనే ఉన్న బండ రాయితో ఆమె తలపై మోది హత్య చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన వనస్థలిపురం పోలీసులు ఆదివారం సూర్యాపేట టౌన్ బస్ స్టాప్‌లో నిందితుడిని అరెస్టు చేశారు. అతడి నుంచి బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో వనస్థలిపురం సీఐ జలేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 11, నల్లవంకాయ 45, పొడుగువంకాయ 23, బెండకాయ 28, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 40, క్యాప్సికం 55, పచ్చి కాకరకాయ 35, పందిరిబీర 35, క్యాబేజీ 18, క్యారెట్ 35, దొండకాయ 23, గుండు బీన్స్ 80, గింజచిక్కుడు 70, గోకరకాయ 35, కీర 25, దోసకాయ 13, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 28, ఆలుగడ్డ 21, చామగడ్డ 40, మొరంగడ్డ 33, కందగడ్డ 40, గుమ్మడికాయ 13, క్యాలీఫ్లవర్ 18, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటికాయ 10, మునగకాయ 4, ఉల్లిపొరక 65 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

మగువల మదిదోచే వస్త్ర ప్రదర్శన


సింగర్ లక్ష్మీప్రతిమ

శ్రీనగర్‌కాలనీ: శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయినిగమాగమంలో జగ్దీశ్వర్ హస్తకళా ఎక్స్‌పో ఆధ్వర్యంలో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో–2023 పేరిట ఏర్పాటు చేసిన వస్త్ర ప్రదర్శనను గాయని లక్ష్మీప్రతిమ సందర్శించారు. నగర ఫ్యాషన్ ప్రియులకు ముఖ్యంగా మహిళలను ఆకట్టుకుంటుందన్నారు. ప్రదర్శనలో తెలంగాణా సాంప్రదాయ వస్త్రాలతో పాటు పలు రాష్ట్రాల చేనేతకారుల ఉత్పత్తులైన సిల్క్, కాటన్, డిజైనరీ చీరలతో పాటు పలు ఫ్యాన్సీ వస్తువులను సుమారు 60 స్టాల్స్‌లో ప్రదర్శిస్తున్నారు. చేనేతకళాకారుల ఉత్పత్తులు నేరుగా వినియోగదారులకు చేరాలనే సదుద్దేశంతో ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశామని నిర్వాహకులు జయేష్‌గుప్తా తెలిపారు. ఈ ప్రదర్శన ఈ నెల 15 వరకు కొనసాగుతుందన్నారు.

పంజగుట్టలో కార్డన్ సెర్చ్


కార్డన్ సెర్చ్‌లో వెస్ట్‌జోన్ డీసీపీ జోయల్ డేవిస్ తదితరులు

పంజగుట్ట: పంజగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం అర్ధరాత్రి తర్వాత పంజగుట్ట పోలీసులు కార్డన్ సెర్చ్‌ను నిర్వహించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు బస్తీలతో పాటు కాలనీల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఏసీపీ మోహన్‌కుమార్ తెలిపారు. కార్యక్రమాన్ని వెస్ట్ జోన్ డీసీపీ జోయల్ డేవిస్ పరిశీలించారు. సుమారు 150 మంది పోలీసులతో ఈ తనిఖీలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 15 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు.

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌దే విజయం

మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి

రహమత్‌నగర్: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మరోసారి విజయం సాధించడం ఖాయమని జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. బోరబండ డివిజన్‌లో టీపీసీసీ నాయకుడు ఖదీర్ నేతృత్వంలో ఆదివారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్‌గాంధీ చేపట్టిన హాత్ సే హాత్ జోడో యాత్రతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతమైందన్నారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఎం.డి.లియాకత్‌అలీ, నేతలు ఎర్ర కృష్ణ, సుశీల్, సురేందర్‌యాదవ్, అశోక్ కుమార్, వినోద్‌కుమార్, తిరుపతి, జావేద్, యూత్ కాంగ్రెస్ నాయకులు మోహిద్, సోఫీ, రజాక్, అలీం, రాములు, చెన్నారెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని పలు ఆలయాల్లో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ట్రైబల్ యూనివర్సిటీలో విద్య ఉపాధి అవకాశాలు కల్పించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ములుగులో త్వరలో ఏర్పాటు చేయనున్న ట్రైబల్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్య, ఉపాధి అవకాశాలు 80 శాతం గిరిజనులకే కల్పించాలని పలువురు నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం ఓయూ క్యాంపస్ దూరవిద్య కేంద్రం ఆడిటోరియంలో గిరిజన శక్తి ఆధ్వర్యంలో ట్రైబల్ డిక్లరేషన్‌ను ప్రకటించారు. గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షులు శరత్‌నాయక్ అధ్యక్షత వహించగా బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నవంబర్ రెండో వారంలో సరూర్‌నగర్ స్టేడియంలో లంబాడీల సింహగర్జన మహాసభను నిర్వహించనున్నట్లు శరత్‌నాయక్ తెలిపారు. అనంతరం 34 అంశాలతో గిరిజన డిక్లరేషన్‌ను విడుదల చేశారు. గిరిజనులు ఎక్కువ శాతం ఉన్న జనరల్ ఎమ్మెల్యే సీట్లలో 10 సీట్లను ఎస్టీలకు కేటాయించాలి, జీవో నంబర్–3ను పునరుద్ధరించాలి, సేవలాల్ మహరాజ్ జయంతి రోజున సెలవు ప్రకటించాలని డిమాండ్ చేశారు.

అలంకారప్రాయమేనా?

కోట్లాది రూపాయలు వెచ్చించి పాదచారుల వంతెనలు నిర్మిస్తున్నా అవి ఉపయోగంలో లేకుండా పోతున్నాయి. పాదచారుల వంతెనలు ప్రకటన బోర్డులకు మాత్రమే ఉపయోగపడుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్డు దాటేందుకు ఏ మాత్రం అనువుగా లేవని పాదచారులు, వాహనదారులు ఆరోపిస్తున్నారు.

- ఫుట్ ఓవర్ బ్రిడ్జిలకు పని చేయని లిఫ్ట్‌లు
- ఇబ్బందులు పడుతున్న పాదచారులు, వృద్ధులు
- సామాజిక మాధ్యమాల్లో ఫిర్యాదుల వెల్లువ


అధికారులకు నగరవాసి 'ఎక్స్'లో ఫిర్యాదు చేసిన దృశ్యం

బంజారాహిల్స్: వృద్ధులు, దివ్యాంగులు రోడ్డు దాటేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలకు లిఫ్టులు ఏర్పాటు చేశారు. అయితే ఎక్కడా ఈ లిఫ్టులు పని చేయడం లేదు. ఎస్కలేటర్లు కూడా మూలనపడ్డాయి.

◆ మెట్లు ఎక్కలేని పరిస్థితుల్లో చాలా మంది సీనియర్ సిటిజన్లు రోడ్డు దాటేందుకు నరకాన్ని చవి చూస్తున్నారు. ఇటీవల చెన్నూరి సీతారాంబాబు అనే వ్యక్తి బంజారాహిల్స్ రోడ్ నెం. 3లోని ముఫకంజా ఇంజినీరింగ్ కాలేజీ వద్ద ఏర్పాటు చేసిన ఫుట్ ఓవర్ బ్రిడ్జికి సంబంధించిన లిఫ్ట్ పని చేయడం లేదని ఎవరిని అడగాలంటే జీహెచ్‌ఎంసీ అధికారులను ప్రముఖ సామాజిక మాధ్యమం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ప్రశ్నించారు.

◆ మంత్రి కేటీఆర్‌కు కూడా పలువురు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలకు ఏర్పాటు చేసిన లిఫ్టులు పని చేయడం లేదంటూ ఎక్స్‌లో ఫిర్యాదులు పంపించారు. అయితే ఈ ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు నిర్మించిన ప్రకటన కర్తలు మాత్రం వీటిపైనే దృష్టిసారించిన పాపానపోవడం లేదు.

◆ ఫలితంగా చాలా మంది మెట్లు ఎక్కలేక డివైడర్ పై నుంచి రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలబారిన పడుతున్నారు.

◆ బంజారాహిల్స్ రోడ్ నెం.2లోని ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి వద్ద ఏర్పాటు చేసిన ఫుట్ ఓవర్ బ్రిడ్జికి చెందిన లిఫ్ట్ పని చేయడం మానేసి అయిదేళ్లు కావొస్తున్నది. ఎస్కలేటర్ పనిచేయక ఆరేళ్లు దాటుతున్నది.

◆ ఈ పాదచారుల వంతెన నామ మాత్రంగా పని చేస్తుండటంతో పెద్దలు మెట్లు ఎక్కలేని పరిస్థితుల్లో అటూ ఇటు రోడ్డు దాటే క్రమంలో ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు.

◆ ఇటీవల ఏర్పాటు చేసిన పలు పాదచారుల వంతెనలకు లిఫ్టులు ఏర్పాటుచేసినా అవి మూన్నాళ్ల ముచ్చటగా మిగిలిపోతున్నాయి.

◆ లిఫ్టులు పనిచేయకుండా వంతెనలు ఉన్నా సంబంధిత అధికారులు మాత్రం చర్యలు తీసుకున్న పాపాన పోవడం లేదు.

◆ ఖైరతాబాద్ జోన్ పరిధిలో అయిదారు చోట్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు దిష్టిబొమ్మల్లా ఉన్నాయి తప్పితే పాదచారులకు ఏ మాత్రం ఉపయోగ పడటం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

◆ ఎఫ్‌వోబీలు నిర్మించినప్పుడే జీహెచ్‌ఎంసీ ఒప్పందం ప్రకారం లిఫ్ట్, ఎస్కలేటర్ల నిర్వహణ బాధ్యతలు సదరు కాంట్రాక్టర్ చేపట్టాల్సి ఉంటుంది.

◆ అయితే ఎఫ్‌వోబీలకు ప్రకటన బోర్డులు ఏర్పాటు చేసుకున్నప్పుడు డబ్బులు దండుకోవడం తప్పితే సదరు కాంట్రాక్టర్లు వీటి నిర్వహణ బాధ్యతలు తీసుకోవడం లేదనడం బహిరంగ రహస్యమే.

కేసీఆర్ మేనిఫెస్టోతో ప్రతిపక్షాల మతిపోవడం ఖాయం


దివ్యాంగులకు పెరిగిన పెన్షన్ ఉత్తర్వులను అందజేస్తున్న ఎమ్మెల్యే దానం

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్: ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలతోనే ప్రతిపక్షాలు ఉక్కిరిబిక్కిరవుతుంటే మరికొన్ని రోజుల్లో కేసీఆర్ ప్రవేశపెట్టనున్న మేనిఫెస్టోతో ప్రతిపక్షాల మతిపోవడం ఖాయమని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దివ్యాంగులకు 3016 నుంచి 4016కు పెరిగిన ఉత్తర్వుల కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... దేశంలో మరే రాష్ట్రంలో లేనన్ని సంక్షేమ పథకాలు తెలంగాణలో అందుతున్నాయన్నారు. ఇతర రాష్ట్రాల వారు కూడా మన రాష్ట్రంలోని పథకాలను అనుసరిస్తున్నాయన్నారు. ఇక ఎన్నికల సమీపిస్తున్న వేళ బస్తీలకు, కాలనీలకు రకరకాల రంగురంగుల జెండాలు పట్టుకొని కొందరు వస్తారని వారు నోటికి ఏది వస్తే అది చెబుతుంటారని వారి మాటలు పట్టించుకోవాల్సిన అవసరం లేదని అన్నారు. గతంలో తాను పని చేసిన పార్టీలో మంత్రిగా పని చేసినప్పటికీ కూడా ఇంత మందికి సంక్షేమ పథకాలు అందించిన దాఖలాలు లేవని అన్నారు. కాంగ్రెస్ హయాంలో ఉన్నప్పుడు రూ. 200 పింఛన్ అందరికీ రావడం కూడా గగనంగా ఉండేదని కానీ ఇప్పుడు దివ్యాంగుగుల, వితంతు, వృద్ధాప్య పెన్షన్లు పెద్ద ఇస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దేనని అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 17 వేల మందికి తాము పెన్షన్లు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో షేక్‌పేట మండల తహసీల్దార్ అనితారెడ్డి, సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీతాయాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నేత మామిడి నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ

వెంగళరావునగర్: రానున్న దసరా వేడుకలను ప్రతి మహిళ ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలన్నదే సీఎం కేసీఆర్ ఆశయమని, అందువల్లనే మహిళలకు బతుకమ్మ చీరలను అందిస్తున్నారని వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య విజయ్ అన్నారు. జవహర్‌నగర్‌లో ఆదివారం ఆమె మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... రానున్న ఎన్నికల్లో మహిళాశక్తిని మరోసారి నిరూపించుకోవాలని సూచించారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం


పాలాభిషేకం చేస్తున్న దివ్యాంగులు

ఫిలింనగర్: రాష్ట్ర ప్రభుత్వం రూ. 3016 నుంచి రూ. 4016కు పెన్షన్‌ను పెంచడంతో దివ్యాంగులు హర్షం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లో పెన్షన్ ఉత్తర్వు కాపీలు అందుకున్న దివ్యాంగులు పెద్ద ఎత్తున కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. తమ కష్టాలు గుర్తించి పెన్షన్‌ను పెంచడం సంతోషంగా ఉందని వారు అన్నారు. మరోసారి కేసీఆర్ సీఎం అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. వికలాంగులు, వితంతువులు, వృద్ధుల మద్దతు సంపూర్ణంగా కేసీఆర్‌కు ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

బంజారాహిల్స్: ఆడ బిడ్డకు పెళ్లి చేసిన కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడొద్దని, వారికి ప్రభుత్వం భరోసాగా ఉండాలనే ఆలోచనతోనే సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను తీసుకొచ్చారని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఆదివారం ఫిలింనగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన షేక్‌పేట మండల పరిధిలోని వివిధ డివిజన్లకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను తహసిల్దార్ అనితారెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో ఆడబిడ్డ పుట్టినప్పటి నుంచి వృద్ధాప్యంలోకి వచ్చేంత వరకు ఎన్నో పథకాలను పకడ్బందీగా అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దేనని అన్నారు. గృహలక్ష్మి పథకం కింద కూడా పెద్ద ఎత్తున దరఖాస్తులు అందాయని అర్హులైన ప్రతి ఒక్కరిని లబ్ధిదారులను చేయించే బాధ్యత తనదేనని ఆయన అన్నారు. ఈ సందర్భంగా 56 మంది లబ్ధిదారులకు చెక్కులను ఆయన అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వనం సంగీతా యాదవ్, స్థానిక బీఆర్ఎస్ నేత మామిడి నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అలమరాలో దాచిన డబ్బులు చోరీ

బంజారాహిల్స్: చీటీ డబ్బులు ఎత్తుకొని అలమరాలో భద్రపరచగా గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారంటూ బాధితుడు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలివీ... జూబ్లీహిల్స్‌లోని గాయత్రిహిల్స్‌లో నివసించే ఎం.ఎ.ఖయ్యూం చారిటబుల్ ట్రస్ట్ నిర్వహిస్తుంటాడు. ఈ నెల 2వ తేదీన రూ. 4.40 లక్షలు చీటీ డబ్బులు పాడుకొని ఇంట్లో భద్రపరిచాడు. అవసరం నిమిత్తం ఈ నెల 7వ తేదీన డబ్బులు తీసుకునేందుకు చూడగా అలమరాలో కనిపించలేదు. దీంతో ఆయన జాషువా అనే వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గతంలో జాషువా తన ఇంట్లో అద్దెకుండేవాడని అలమారా తాళం చెవులు ఎక్కడ ఉంటాయో అతనికి బాగా తెలుసునని తాను రోజూ మసీదుకు వెళ్లే సమయం కూడా తెలుసునని ఆ సమయంలోనే డబ్బులు తస్కరించి ఉంటాడని ఆరోపించాడు.

కాంగ్రెస్ ఆరు హామీలపై ఇంటింటి ప్రచారం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రోహిణ్‌రెడ్డి

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ గ్యారెంటీ కార్డు ఆరు హామీల కార్యక్రమాల కోసం ఇంటింటికీ కాంగ్రెస్ ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే కాలనీలోని తన నివాసంలో గ్యారెంటీ కార్డు పోస్టర్‌ను జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాటూరి రమేష్, బంజారాహిల్స్ డివిజన్ అధ్యక్షుడు గొల్ల్యాల రాజు, శ్యాం, అశోక్‌కుమార్, రమేష్ తదితరులతో కలిసి ఆవిష్కరించారు. కాంగ్రెస్ హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించామన్నారు. ఖైరతాబాద్‌లో రాబోయేది, ఎగిరేది కాంగ్రెస్ జెండాయేనన్నారు. ఈ ఆరు హామీలు బడుగు, బలహీన వర్గాలకు ఎంతగానో ఉపయోగపడతాయని వెల్లడించారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇల్లు, యువ వికాసం, చేయూత కార్యక్రమాలతో ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతామన్నారు.

సిమెంటు బ్రిక్స్ పడి కూలీ మృతి


దత్తు (ఫైల్)

రహమత్‌నగర్: సిమెంటు బ్రిక్స్ పడి గాయపడిన ఓ కూలీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివీ... ఎస్పీఆర్‌హిల్స్ వినాయకనగర్ బస్తీకి చెందిన ఎర్రోళ్ల దత్తు(43)కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ పోషణ నిమిత్తం గృహాల తొలగింపు (కూల్చివేసే) పని చేస్తుంటాడు. ఈ క్రమంలో గత సోమవారం మదాపూర్‌లో ఓ ఇంటిని తొలగించేందుకు దత్తు వెళ్లాడు. ఇంటి కింద భాగాన పనిచేస్తున్న దత్తును గమనించని తోటి కూలీలు సిమెంటు బ్రిక్‌ను పడేయడంతో దత్తు తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతన్ని స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే శనివారం అతని పరిస్థితి విషమించడంతో రాత్రి గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రాత్రి దత్తు మృతి చెందాడు.

'తన హత్యకు కుట్ర.. స్టాంప్ పేపర్లపై సంతకాలు': న్యాయవాది ఫిర్యాదు

ఆరుగురిపై జూబ్లీహిల్స్ పోలీసుల క్రిమినల్ కేసు నమోదు

బంజారాహిల్స్: తనను హత్య చేయడానికి ప్రయత్నం చేయడమే కాకుండా బలవంతంగా నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్లపై సంతకాలు తీసుకునేందుకు యత్నించారని విషమిచ్చి హత్య చేసేందుకు కుట్రలు పన్నారని అడ్వకేట్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు ఆరుగురిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.... యూసుఫ్‌గూడ సమీపంలోని ఎల్ఎన్‌నగర్‌లో నివసించే టి. నారాయణ అనే అడ్వకేట్ ఇంట్లోకి గత నెల 17వ తేదీన సరిత, చంద్రకళ, శ్రీకాంత్‌యాదవ్, శివకృష్ణ యాదవ్, ప్రణవ్, సిద్ధార్థ్, రితిక్ తదితరులు అక్రమంగా ఆఫీస్‌లోకి ప్రవేశించి అసభ్యంగా దూషిస్తూ కత్తితో బెదిరించారని నారాయణ ఆరోపించారు. అలాగే ఓ కత్తితో పాటు రెండు సిరంజీలు విషం నింపి తీసుకొచ్చి తనను హత్య చేసేందుకు యత్నించారని అన్నారు. బీపీ పెరగడంతో తాను వెంటనే ఆస్పత్రిలో చికిత్స కోసం చేరానన్నారు. తన తల్లి అంత్యక్రియల సమయంలో కూడా వీరంతా న్యూసెన్స్ చేశారన్నారు. వారి నుంచి తనకు ప్రాణహాని ఉందంటూ బాధితుడు ఫిర్యాదుచేశారు. వీరందరిపై ఐపీసీ సెక్షన్ 448, 342, 506 కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే సీట్లకు విద్యార్థి జేఏసీ నేతల వినతి

ఉస్మానియా యూనివర్సిటీ: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమ విద్యార్థులకు పది సీట్లు కేటాయించాలని జేఏసీ నాయకులు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. విద్యార్థి ఉద్యమకారులకు రాజకీయంగా అన్ని పార్టీలు తగిన ప్రాధాన్యం కల్పించాలని తెలంగాణ విద్యార్థి జేఏసీ చైర్మన్ డాక్టర్ రుద్రవరం లింగస్వామి, దరువు ఎల్లన్న, పూసల రమేష్, పాపారావు, గాదె వెంకట్, లెనిన్, శేషు కోరారు.

మెరుగైన వైద్యానికి నిరంతర వైద్య విద్య

నిమ్స్ డైరెక్టర్ బీరప్ప వెల్లడి


సీపీడీ: మాట్లాడుతున్న నిమ్స్ డైరెక్టర్ బీరప్ప

లక్డీకాపూల్: మెరుగైన వైద్యానికి నిరంతర వైద్య విద్య కీలక పాత్ర పోషిస్తుందని నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప తెలిపారు. ఈ క్రమంలోనే నిమ్స్ వైద్యులు ఎంతటి సంక్లిష్టమైన శస్త్ర చికిత్సలనైనా సరే విజయవంతంగా చేస్తున్నారని స్పష్టం చేశారు. ఆదివారం నిమ్స్‌లో ప్రొఫెసర్ విజయకృష్ణ మెమోరియల్ 4వ ఆర్థోపెడిక్ అంకాలజీ సీపీడీ–2023 సదస్సును ఆయన ప్రారంభించారు. తొలుత ప్రొఫెసర్ విజయకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీరప్ప మాట్లాడుతూ... ఆర్థోపెడిక్ వైద్యులు రోగులకు నాణ్యతా ప్రమాణాలతో అత్యాధునిక వైద్యసేలను అందిస్తున్నారన్నారు. జాయింట్ రీప్లేస్మెంట్, మోకాలు చిప్ప రీప్లేస్‌మెంట్ లాంటి చికిత్సలను సైతం విజయవంతంగా నిర్వహిస్తున్నారన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో రూ. లక్షల్లో ఖర్చయ్యే ఈ చికిత్సలను పైసా ఖర్చు లేకుండా రోగులకు రోగులకు మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నామన్నారు. సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్యులు సైతం ఉచిత వైద్య సేవలను అందిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆర్థోపెడిక్ విభాగానికి కొత్తగా ఐదు ఆపరేషన్ థియేటర్లను, సరికొత్త పరికరాలను సమకూర్చనున్నట్టు డైరెక్టర్ ఈ సైంటిఫిక్ ప్రోగ్రామ్‌లో పాల్గొన్న ముంబైకి చెందిన ఆర్థోపెడిక్ ఆంకో సర్జన్ కన్సల్టెంట్ డాక్టర్ మనీష్ అగర్వాల్, డాక్టర్ సందీప్ పట్వార్ధన్‌లు బోన్ కేన్సర్ నిర్వహణలో అనుసరించాల్సిన విధానాలను వివరించారు. నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ డీన్ డాక్టర్ లిజా రాజశేఖర్, ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ పట్నాల పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకలను వైభవంగా జరుపుకోవాలి


బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, కార్పొరేటర్లు

వెంగళరావునగర్: ప్రతి డివిజన్‌లో బతుకమ్మ వేడుకలను అంగరంగ వైభవంగా జరుపుకోవాలని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పిలుపునిచ్చారు. యూసుఫ్‌గూడ కృష్ణకాంత్‌పార్కు వద్ద శనివారం రాత్రి బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. పెద్ద ఎత్తున హాజరైన మహిళలు తీసుకువచ్చిన బతుకమ్మలతో పెద్ద సైజు బతుకమ్మను నిర్మించారు. మహిళలు చుట్టూ చేరి ఆటపాటలతో భక్తి శ్రద్ధలతో బతుకమ్మను వేడుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాగంటి మాట్లాడుతూ... మహిళల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ఏర్పాటు చేసి అమలు చేస్తున్నదన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం బతుకమ్మ వేడుకలకు హాజరైన మహిళలకు కుక్కర్‌లను అందజేశారు. కార్పొరేటర్ దేదీప్య విజయ్, జీటీఎస్ ఆలయ కమిటీ చైర్మన్ చిన్న రమేష్ పాల్గొన్నారు.

రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే: విజయారెడ్డి


ఎస్పీటీ నగర్‌లో పాదయాత్ర నిర్వహిస్తున్న విజయారెడ్డి

బంజారాహిల్స్: రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి. విజయారెడ్డి అన్నారు. ఆదివారం ఆమె హాత్ సే హాత్ జోడో కార్యక్రమంలో భాగంగా ఎస్పీటీ నగర్‌లో ఇంటింటికీ పాదయాత్ర నిర్వహించారు. సంక్షేమ పథకాల ముసుగులో అధికార పార్టీ నేతలు పెద్ద ఎత్తున లంచాలు తీసుకుంటున్నారని బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలకు మాత్రమే పెద్ద ఎత్తున పథకాలు అందుతున్నాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తీసుకొచ్చే ఆరు పథకాల గురించి ఇంటింటికీ తిరుగుతూ వివరించారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రూ. 500లకు గ్యాస్ సిలిండర్ అందిస్తామని అన్నారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

పసుపు బోర్డు ఏర్పాటు ప్రకటన హర్షణీయం


వెంగళరావునగర్: తెలంగాణలో పసుపుబోర్డు ఏర్పాటుకు ప్రధాని నరేంద్రమోదీ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం హర్షణీయమని బీజేపీ సీనియర్ నేతలు పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్రంలో పర్యటించిన ప్రధాని మోదీ తెలంగాణ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రకటించడం, గిరిజన యూనివర్శిటీకి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం పట్ల ఆదివారం బీజేపీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ సీనియర్ నాయకులు వెంగళరావునగర్ డివిజన్ కళ్యాణ్‌నగర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బీజేపీ సీనియర్ నాయకులు డాక్టర్ పద్మ వీరపనేని, జూటూరి కీర్తిరెడ్డి, ఆలపాటి లక్ష్మీనారాయణ, అట్లూరి రామకృష్ణ, కిలారి మనోహర్, కుంభాల గంగరాజు, నందికాశి విజయ్, ప్రేమ్, జబ్బార్, చంద్రమోహన్, వెంకటేష్, సుప్రియాగౌడ్, స్వప్న, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

మానవ సంబంధాలను కాపాడుకోవాలి: గజల్స్ శ్రీనివాస్


మాట్లాడుతున్న గజల్స్ శ్రీనివాస్


వెంగళరావునగర్: సమాజంలో నానాటికీ మానవ సంబంధాలు అడుగంటి పోతున్నాయని వాటిని సంరక్షించుకోవాల్సి బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రముఖ గాయకులు గజల్స్ శ్రీనివాస్ అన్నారు. శ్రీబాలేశ్వర సేవా పరిషత్ 5వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం డివిజన్‌లోని మధురానగర్‌కాలనీ సమీపంలో ఉన్న వెస్ట్‌శ్రీనివాస్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో నిర్వహించారు. ముఖ్య అతి థిగా హాజరైన గజల్స్ శ్రీనివాస్ మాట్లాడుతూ... రుగ్మతలు తగ్గించడంతోపాటు మానవ సంబంధాలు మెరుగు పరచాలంటే కమ్యూనిటీ మీటింగ్స్ క్రమం తప్పకుండా జరుగుతూ ఉండాలని చెప్పారు. ఆదిలాబాద్ అడవులకు, సింగరేణి గనులకు మాత్రమే ప్రసిద్ధి కాకుండా అలాంటి ప్రాంతాల నుంచి వచ్చినవారు శ్రీబాలేశ్వర సేవా పరిషత్ ఏర్పాటు చేసి ఆటా, తానా, నాటా లాగానే ఏర్పడి ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. ప్రముఖ సంఖ్యాశాస్త్ర ప్రావీణ్యులు దైవజ్ఞశర్మ మాట్లాడుతూ... సేవా సమితి ద్వారా జరుగుతున్న కార్యక్రమాలు అభినందించదగ్గవని, సభ్యులు భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలను కొనసాగించాలని సూచించారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు నాగబాల సురేష్‌కుమార్ మాట్లాడుతూ... కరోనా సమయంలో వేలాది మందికి నిత్యావసర సరుకులు, ఆహారం అందించి ప్రజలను ఆదుకున్నారన్నారు. సంస్థ అధ్యక్షుడు అశోక్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎస్.రమేష్, కోశాధికారి వేణు, బానుమూర్తి, సత్యప్రియగుప్తా తదితరులు పాల్గొన్నారు. శ్రీనివాస్ ఆలపించిన గజల్స్ సభికులను ఆకట్టుకున్నాయి.

కాలనీల్లో పేరుకుపోతున్న చెత్తకుప్పలు


బంజారాహిల్స్ రోడ్ నెం. 14 ఎమ్మెల్సీ కవిత నివాసిత దారిలో పేరుకుపోయిన చెత్తకుప్పలు

వెంకటేశ్వరకాలనీ: బస్తీల్లో బహిరంగ ప్రదేశాల్లో చెత్త పేరుకుపోకుండా జీహెచ్‌ఎంసీ అధికారులు తగు చర్యలు తీసుకుంటున్నా కొన్ని కాలనీల్లో మాత్రం పెద్ద ఎత్తున చెత్తకుప్పలు కనిపిస్తున్నాయి. బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని ఎమ్మెల్సీ కవిత నివాసానికి దారి తీసే మార్గాల్లో నిత్యం పెద్ద ఎత్తున చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. స్థానికంగా అద్దె నివాసాల్లో ఉండే కొంత మంది రాత్రి వేళల్లో ఈ దారిగుండా వెళ్తూ ఎవరూ చూడని సమయాల్లో చెత్తను విసిరేసిపోతున్నారని స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు. సంబంధిత జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది స్పందించి ఇక్కడ చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలి


మాట్లాడుతున్న కాశీం

ఉస్మానియా యూనివర్సిటీ: చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రొ.సూరజ్ మండల్ (బీపీ మండల్ మనుమడు) అన్నారు. ఆదివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ న్యూ సెమినార్ హాల్లో చట్టసభల్లో (శాసన మండలి, అసెంబ్లీ, పార్లమెంట్) బీసీలకు రిజర్వేషన్లు అనే అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఓయూ అధ్యాపకులు కాశీం అధ్యక్షత నిర్వహించగా ప్రొ.సురజ్‌మండల్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జనాభాలో 60 శాతం ఉన్న బీసీలకు చట్టసభలో వారి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ల ద్వారానే సామాజిక న్యాయం జరిగి అన్ని వర్గాలు అభివృద్ధి చెందుతారన్నారు. ఈ సమావేశంలో ప్రొ.ప్రభంజన్ యాదవ్, వంగ బీఎస్పీ రాష్ట్ర నాయకుడు కంచర్ల భద్రీ, రాములుగౌడ్, నరేందర్‌గౌడ్, నాగేష్‌ముదిరాజ్, రమణ, స్వరూప పాల్గొన్నారు.

బండారు వ్యాఖ్యలపై సుప్రీంకోర్టుకు వెళ్తా

- అతడిలాంటి చీడపురుగుల్ని ఏరివేయాలి: మంత్రి రోజా



మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): టీడీపీ నాయకుడు బండారు సత్యనారాయణమూర్తి తనపై చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్టుకు వెళ్లి న్యాయపరంగా పోరాడతానని ఏపీ మంత్రి ఆర్.కె.రోజా చెప్పారు. బండారు లాంటి చీడపురుగులను ఏరిపారేయాలంటూ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలను ఒకమాట అనాలంటే భయపడే పరిస్థితి రావాలన్నారు. చైనాలో జరుగుతున్న 19వ ఆసియా క్రీడల్లో టెన్నిస్ మెన్స్ డబుల్స్‌లో సిల్వర్ మెడల్ సాధించిన మైనేని సాకేత్‌ను ఆంధ్రప్రదేశ్ లాన్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో ఆదివారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మీడియాతో మాట్లాడారు. స్కిల్ కుంభకోణంలో అవినీతికి పాల్పడిన చంద్రబాబునాయుడును సీఐడీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపడంతో టీడీపీ వారికి పిచ్చెక్కి ఎవరిని తిడదామా.. అని ఆలోచిస్తున్నారని దుయ్యబట్టారు. ఢిల్లీ నుంచి లాయర్లు వచ్చినా చంద్రబాబును జైలు నుంచి బయటకు తీసుకురాలేకపోతున్నారని పేర్కొన్నారు. బండారు సత్యనారాయణమూర్తి తన నియోజకవర్గంలోని, ఇంట్లోని మహిళలకు ఏవిధమైన విలువ ఇస్తారో బహిర్గతమైందని చెప్పారు. తనకు ఊహ తెలిసినంతవరకు ఎవరూ ఇంతలా ఒక మహిళ గురించి మాట్లాడలేదన్నారు. మహిళలను కించపరిచేలా మాట్లాడేవారు చరిత్రహీనులుగా మిగిలిపోతారని చెప్పారు. టీడీపీ, జనసేన నాయకులు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.

మరిన్ని ఏపీ వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

లక్ష్యం.. క్లీన్ స్వీప్

- పార్టీ శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేయనున్న ఏపీ సీఎం వైఎస్ జగన్
- నేడు విజయవాడలో వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల సమావేశం



విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో సిద్ధమైన వేదిక

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 175కు 175 స్థానాల్లో విజయమే లక్ష్యంగా ఎన్నికలకు శ్రేణులను సమాయత్తం చేసేందుకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సన్నద్ధమయ్యారు. అందులో భాగంగా సోమవారం విజయవాడలో ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో పార్టీ ప్రతినిధుల సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు, ప్రాంతీయ సమన్వయకర్తలు, జిల్లా పార్టీ అధ్యక్షుల నుంచి జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, మండల పార్టీ అధ్యక్షుల వరకు 8 వేల మందికిపైగా ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొంటారు. గత 53 నెలలుగా సుపరిపాలన, సంక్షేమాభివృద్ధి పథకాల ద్వారా ప్రతి ఇంటికీ, గ్రామానికీ, నియోజకవర్గానికీ, జిల్లాకు, రాష్ట్రానికీ చేసిన మంచిని మరింత ప్రభావవంతంగా వివరించడం.. ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎక్కడికక్కడ తిప్పికొట్టడంపై ప్రతినిధులకు సీఎం వైఎస్ జగన్ దిశా నిర్దేశం చేయనున్నారు. అధికారంలోకి వచ్చాక విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలు – పరిపాలన వికేంద్రీకరణ ద్వారా రాష్ట్రం సమగ్రాభివృద్ధి దిశగా పరుగులెత్తిస్తున్న తీరును కళ్లకు కట్టినట్లుగా వివరించి.. ప్రగతిపథంలో రాష్ట్రం దూసుకెళ్లాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పాలని సూచించనున్నారు. ఇందుకు 'రాష్ట్రానికి జగనే కావాలి'(వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమాన్ని చేపట్టాల్సిన తీరుపై ప్రతినిధులకు మార్గ నిర్దేశం చేయనున్నారు. ఈ సమావేశానికి హాజరైన ప్రతినిధులు సీఎం సందేశాన్ని గ్రామ స్థాయికి తీసుకెళ్తారు.


రూ.2,300 కోట్లతో.. విశాఖలో భారీ ఐటీ బిజినెస్ పార్క్

- మధురవాడ హిల్ నెంబర్–3లో 19 ఎకరాల్లో అభివృద్ధి
- ఐటీ, ఐటీ ఆధారిత, ఆర్థిక సేవా కార్యకలాపాలకు అనుగుణంగా నిర్మాణాలు
- వీటితో పాటు సమావేశ మందిరాలు, బిజినెస్ హోటల్, సర్వీస్ అపార్ట్‌మెంట్లు, ఓపెన్ ఎయిర్ థియేటర్, ఫుడ్ అండ్ బేవరేజెస్ సౌకర్యాలు కూడా..
- ప్రాజెక్టు వ్యయంలో 40 శాతం ఈక్విటీతో ప్రత్యేక కంపెనీ ఏర్పాటు
- ఈక్విటీగా ఏపీఐఐసీ రూ.239 కోట్లు, భాగస్వామ్య కంపెనీ రూ.681 కోట్లు
- మిగిలిన రూ.1,380 కోట్లు రుణ రూపంలో సమీకరణ
- డీపీఆర్ తయారీ నుంచి నిర్వహణ వరకు భాగస్వామ్య కంపెనీదే బాధ్యత
- ఆసక్తిగల సంస్థల నుంచి బిడ్లు ఆహ్వానించిన ఏపీఐఐసీ

సాక్షి, అమరావతి: ఐటీ, ఐటీ ఆధారిత పరిశ్రమల ఆకర్షణలో విశాఖ నగరం ముందంజలో ఉందని ఇటీవల నీతి ఆయోగ్ ప్రకటించిన నేపథ్యంలో.. ఏపీఐఐసీ (ఏపీ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్) కూడా భారీ ఐటీ బిజినెస్ పార్క్‌ను ఇక్కడ ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. విశాఖలో ఇప్పటికే అదానీ డేటా సెంటర్‌తో పాటు ఐటీ పార్క్, రహేజా గ్రూపు ఇన్‌ఆర్బిట్ మాల్‌తో పాటు ఐటీ పార్క్ ఏర్పాటుచేస్తున్న సంగతి తెలిసిందే. మధురవాడ హిల్ నెంబర్–3 మీద 18.93 ఎకరాల విస్తీర్ణంలో ఐ–స్పేస్ పేరుతో ఈ ఐటీ బిజినెస్ పార్కును పీపీపీ విధానంలో అభివృద్ధి చేయడానికి ఆసక్తిగల సంస్థల నుంచి ఏపీఐఐసీ తాజాగా బిడ్లను ఆహ్వానించింది. ఐటీ, ఐటీ ఆధారిత కార్యకలాపాలు నిర్వహించుకునే సంస్థలకు అనుగుణంగా వాణిజ్య సముదాయాలతో పాటు సమావేశ మందిరాలు, బిజినెస్ హోటల్స్, సర్వీస్ అపార్ట్‌మెంట్స్, ఓపెన్ ఎయిర్ థియేటర్, ఫుడ్ అండ్ బేవరేజెస్ ఫెసిలిటీలతో పాటు తగినంత పార్కింగ్ సదుపాయాలు ఉండే విధంగా ఈ క్యాంపస్‌ను సుమారు రూ.2,300 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయనున్నారు. ఇందుకోసం భాగస్వామ్య కంపెనీతో ప్రత్యేక సంస్థ (ఎస్‌పీవీ)ని ఏర్పాటుచేస్తారు. ఈ ఎస్‌పీవీలో ఏపీఐఐసీ 26 శాతం వాటాను, భాగస్వామ్య కంపెనీ 74 శాతం వాటాను కలిగి ఉంటుంది.

బహుళజాతి సంస్థలను ఆకర్షించేలా..


ఇక మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.2,300 కోట్లలో 40 శాతం ఈక్విటీగా సమకూర్చాల్సి ఉంటుంది. ఈక్విటీ రూపంలో ఏపీఐఐసీ రూ.239 కోట్లు, భాగస్వామ్య కంపెనీ రూ.681 కోట్లు సమకూరుస్తాయి.



మిగిలిన మొత్తం రూ.1,380 కోట్లను రుణ రూపంలో సేకరిస్తారు. ఈ ప్రాజెక్టు డిజైన్ దగ్గర నుంచి నిర్మాణం, బ్రాండింగ్, నిర్వహణ అన్నీ భాగస్వామ్య కంపెనీయే చూడాల్సి ఉంటుంది. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు.. బహుళజాతి సంస్థలను ఆకర్షించేలా ఈ బిజినెస్ పార్క్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు ఏపీఐఐసీ వీసీ ఎండీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పబ్లిక్, ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలో అభివృద్ధి చేస్తున్న ఈ ప్రాజెక్టులో భాగస్వామిగా చేరడానికి ఆసక్తిగల సంస్థల నుంచి బిడ్లను ఆహ్వానించామని, భాగస్వామ్య కంపెనీ ఎన్నిక అనంతరం నిర్మాణ పనులను ప్రారంభించి వేగంగా అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. మరోవైపు.. గడిచిన ఐదేళ్లలో విశాఖ రియల్ ఎస్టేట్ రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని, పలు అంతర్జాతీయ సంస్థలు, రిటైల్ సంస్థలు విశాఖలో ఏర్పాటుకావడంతో స్థిరాస్తి ధరలు 20 శాతం పైగా పెరిగినట్లు ఏపీఐఐసీ అధికారులు వెల్లడించారు. వాణిజ్య సముదాయాలకు భారీగా డిమాండ్ ఉండటంతో ఐ–స్పేస్ బిజినెస్ పార్క్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

నేడు అందరి దృష్టీ కోర్టుల వైపే

- నేడు సుప్రీంకోర్టులో చంద్రబాబు క్యాష్ పిటిషన్ విచారణ
- కస్టడీ, బెయిల్ పిటిషన్లపై ఏసీబీ కోర్టు తీర్పు
- ఇన్నర్ రింగ్ రోడ్డు, అంగళ్లు, ఫైబర్ నెట్ కేసుల్లోనూ హైకోర్టు తీర్పు
- ఇప్పటికే సమర్థవంతంగా వాదనలు వినిపించిన సీఐడీ



సాక్షి, న్యూఢిల్లీ /సాక్షి అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో అరెస్టయి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో సోమవారం విచారణ జరుగనుంది. జస్టిస్ అనిరుద్ధాబోస్, జస్టిస్ బేలా ఎం.త్రివేదిలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించనుంది. ఆరవ నంబర్ కోర్టులో ఐటమ్ 59గా ఈ పిటిషన్‌ను జాబితాలో చేర్చారు. గత విచారణ సందర్భంగా హైకోర్టుకు సమర్పించిన డాక్యుమెంట్లను అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచించిన విషయం విదితమే. ఇదిలా ఉండగా, ఇదే కేసులో చంద్రబాబు కస్టడీ, బెయిల్ పిటీషన్లపై విజయవాడ ఏసీబీ న్యాయస్థానం సోమవారం తీర్పు వెలువరించనుంది. ఈ కేసులో ఇప్పటికే చంద్రబాబుకు రెండ్రోజుల కస్టడీకి న్యాయస్థానం అనుమతించింది. కానీ చంద్రబాబు ఉద్దేశ పూర్వకంగా కాలయాపన చేయడంతో పాటు కస్టడీలో విచారణకు ఏమాత్రం సహకరించలేదని సీఐడీ న్యాయస్థానానికి తెలిపింది. దాంతో పాటు ఈ కేసు దర్యాప్తులో తాజాగా కనుగొన్న కీలక ఆధారాలపై ఆయన్ను సమగ్రంగా విచారించాల్సిన అవసరం ఉందని న్యాయస్థానానికి నివేదించింది. ప్రధానంగా షెల్ కంపెనీల ద్వారా టీడీపీ ఖాతాలో చేరిన అక్రమ నిధుల వ్యవహారంపై ప్రశ్నించాల్సి ఉందని కోర్టు దృష్టికి తీసుకొచ్చింది. అందుకే చంద్రబాబును మరో మూడు రోజుల పాటు కస్టడీకి అనుమతించాలని కోరింది. మరో వైపు చంద్రబాబు తరపు న్యాయవాదులు ఆయన్ను కస్టడీకి ఇవ్వొద్దని, బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ న్యాయస్థానాన్ని కోరారు. దీనిపై సీఐడీ తరఫు న్యాయవాదులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజకీయంగా బలవంతుడైన చంద్రబాబు ఇప్పటికే ఈ కేసులో సాక్షులను బెదిరిస్తున్నారని ఉదాహరణలతో సహా కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో ఆయనకు బెయిల్ ఇస్తే సాక్షులను మరింతగా బెదిరించడంతో పాటు కేసు దర్యాప్తును ప్రభావం చేస్తారని వాదనలు వినిపించారు. కాబట్టి చంద్రబాబు బెయిల్ పిటీషన్ తిరస్కరించాలని న్యాయస్థానాన్ని కోరారు. ఈ పిటీషన్లపై వరుసగా మూడు రోజుల పాటు వాదనలు విన్న న్యాయస్థానం రిజర్వు చేసిన తీర్పును నేడు వెలువరించనుంది. ఈ నేపథ్యంలో విజయవాడ ఏసీబీ న్యాయస్థానం తీర్పుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

హైకోర్టులో బెయిల్ పిటిషన్లపై నేడు తీర్పులు

మరో వైపు హైకోర్టులో చంద్రబాబు దాఖలు చేసిన మూడు బెయిల్ పిటీషన్లపై సోమవారం తీర్పులు వెలువడనున్నాయి. అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు, అంగళ్లు, ఫైబర్ నెట్ కేసుల్లో బెయిల్ కోసం చంద్రబాబు వేర్వేరుగా దాఖలు చేసిన పిటీషన్లపై ఇటీవల వాదనలు ముగియడంతో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కే.సురేష్‌రెడ్డి తీర్పులను రిజర్వు చేసిన సంగతి తెలిసిందే. ఈ మూడు పిటిషన్లపై న్యాయమూర్తి సోమవారం తీర్పులను వెలువరించనున్నారు.

మహిళల వ్యక్తిత్వ హననం దారుణం

మంత్రి రోజాకు సినీనటి మీనా మద్దతు



సాక్షి, అమరావతి: మహిళలు రాజకీయాల్లో ఎదుగుతుంటే వ్యక్తిత్వ హననం ద్వారా అడ్డుకోవాలని చూడటం సిగ్గుచేటని సినీ నటి మీనా అన్నారు. నీచమైన వ్యాఖ్యలు చేసినంత మాత్రాన మహిళలు భయపడి, తలుపులు మూసుకుని ఏడుస్తారనుకోవడం అవివేకమన్నారు. ఇటీవల మంత్రి రోజాపై టీడీపీ నాయకుడు, మాజీ మంత్రి బండారు సత్యనారాయణ అనుచిత వ్యాఖ్యలను మీనా ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఓ వీడియోలో ఖండించారు. 'కాలం మారిపోయింది. సమాజంలో మహిళలు బలమైన శక్తిగా ఎదిగారు. అభద్రతభావం, ఈర్ష్యతోనే మంత్రి రోజాను నీచంగా మాట్లాడి మహిళలపై మీకున్న కుసంస్కారాన్ని ప్రదర్శించారు' అంటూ బండారుపై మండిపడ్డారు. సినీ పరిశ్రమలోకి వచ్చినప్పటి నుంచి రోజా ఎంతో కష్టపడి ఉన్నత స్థాయికి ఎదిగారని, రాజకీయాల్లోనూ తనను తాను నిరూపించుకుంటూ డైనమిక్ లీడర్‌గా గుర్తింపు పొందారని తెలిపారు. అలాంటి వ్యక్తిపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన బండారు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని మహిళల గౌరవాన్ని కాపాడాలని మీనా విన్నవించారు.

'ఈశాన్యం'లో చల్లని కబురు

20 నాటికి ఈశాన్య రుతుపవనాల రాక!

సాక్షి, విశాఖపట్నం: నైరుతి రుతుపవనాలు ఈ ఏడాది ఒకింత నిరాశపరిచిన నేపథ్యంలో ఈశాన్య రుతుపవనాలు ఎలాంటి ప్రభావం చూపుతాయన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది. ఆ ఆందోళనకు తెరదించుతూ భారత వాతావరణ శాఖ(ఐఎండీ) చల్లని కబురు మోసుకొచ్చింది. ఈ ఏడాది ఈశాన్య రుతుపవనాల వల్ల రాష్ట్రంలో సాధారణం కంటే ఒకింత అధిక వర్షపాతం నమోదవుతుందని తాజాగా ప్రకటించింది. దీనిని బట్టి అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు కొనసాగనున్న ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో కురిసే వర్షాలతో రబీ పంటలకు ఎంతో మేలు జరగనుంది. ఐఎండీ అంచనాల ప్రకారం రాష్ట్రంలోని దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ఈశాన్య రుతుపవనాలు సాధారణానికి మించి, ఉత్తర కోస్తాంధ్రలో సాధారణంగాను వర్షాలు కురవనున్నాయి. ఈ రుతుపవనాలు రాష్ట్రంలోకి ఈ నెల 20 నాటికల్లా ప్రవేశించే అవకాశాలు ఉన్నాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు.

నగర వార్తలు

'మనూ' ఐఎంసీ డైరెక్టర్ రిజ్వాన్ అహ్మద్‌కు అరుదైన అవకాశం



రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఇన్‌స్ట్రక్షనల్ మీడియా సెంటర్(ఐఎంసీ) డైరెక్టర్ రిజ్వాన్ అహ్మద్‌కు అరుదైన అవకాశం లభించింది. యునెస్కో ద్వారా ఫ్రాన్స్‌లోని పారిస్‌లో 'శ్రవణ–దృశ్య పరిశ్రమలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)పై ఉన్నత స్థాయి చర్చా కార్యక్రమానికి యునెస్కో ఆహ్వానించింది. అక్టోబర్ 19వ తేదీన ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. రిజ్వాన్ అహ్మద్ ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఫర్ ఫిల్మ్, టెలివిజన్, ఆడియో విజువల్ కమ్యూనికేషన్(ఐసీఎఫ్‌టీ–సీఐసీటీ), ఇంటర్నేషనల్ డాక్యుమెంటరీ అసోసియేషన్, లాస్ ఏంజిల్స్‌లో కూడా సభ్యులుగా కొనసాగుతున్నాడు. మీడియా, టెక్నాలజీపై ప్రపంచ వ్యాప్త ప్రసంగంలో 'మనూ' ప్రొఫెసర్‌కు అవకాశం రావడం విశేషం. .ఈ కార్యక్రమం యునైటెడ్ నేషన్ యొక్క అన్ని ఛానెల్స్, మీడియా సోర్స్‌లలో లైవ్ వెబ్‌కాస్ట్ చేయబడుతుందని రిజ్వాన్ అహ్మద్ తెలిపారు.

విదేశీ విద్య కోసం ఉచిత శిక్షణ

సాక్షి,సిటీబ్యూరో: విదేశాల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ (పీజీ) చదివేందుకు ఆసక్తి గల ఎస్సీ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్టెపిన్ లీడ్స్ అకాడమీ డైరెక్టర్లు వంగూరి బ్రహ్మయ్య, ఉదయ్ కిరణ్ తెలిపారు. 2024లో ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, కెనడా, అమెరికా తదితర దేశాలలో పీజి విద్య అభ్యసించేందుకు ఐఈఎల్‌టీఎస్, టీఓఈఎఫ్ఎల్, పీటీఈ, జీఆర్ఈ, జీఎమ్ఏటీ తదితర అర్హత పరీక్షలకు రాష్ట్ర ఎస్సీ అభివద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ శిక్షణ హైదరాబాద్ సుచిత్ర క్రాస్ రోడ్స్ సమీపంలోని స్టెపిన్ లీడ్స్ ఓవర్సీస్ అకాడమీలో ఉంటుందని మరింత సమాచారం కోసం 90304 63377, 98492 33523 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఎయిర్‌పోర్టులో బంగారం పట్టివేత



శంషాబాద్: అక్రమంగా తరలిస్తున్న బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జెడ్డా నుంచి వచ్చిన ఓ ప్రయాణికుడి లగేజీని తనిఖీ చేయగా రూ.65.92 లక్షల విలువ చేసే బంగారు బిస్కెట్లు బయటపడ్డాయి. దుబాయ్ నుంచి వచ్చిన మరో ఇద్దరు ప్రయాణికులకు తనిఖీ చేయగా ఓట్స్, సర్ఫు ప్యాకెట్లలో పౌడర్‌లా కలిపి తీసుకొచ్చిన 454 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు.

వాతావరణ మార్పులు.. ముసురుతున్న వ్యాధులు

- పెరుగుతున్న శ్వాసకోశ సమస్య బాధితులు
- కోఠి ఈఎన్‌టీ ఆసుపత్రికి రోగుల తాకిడి
- రోజుకి రెండు వేలు దాటుతున్న బాధితుల సంఖ్య



సాక్షి, సిటీబ్యూరో: వాతావరణ మార్పులు నగరవాసులను వ్యాధుల బారిన పడేస్తున్నాయి. ముఖ్యంగా వైరల్ ఇన్‌ఫెక్షన్ల కారణంగా చెవి, ముక్కు, గొంతు సమస్యలతో బాధపడేవారి సంఖ్య పెరుగుతూనే ఉంది. నగరంలో ఈ సమస్యల విజృంభణతో కోఠిలోని ప్రభుత్వ ఈఎన్‌టీ ఆస్పత్రికి రోగులు పరుగులు పెడుతున్నారు. కోఠిలోని ఈఎన్‌టీ ఆసుపత్రికి గత కొన్ని రోజులుగా వేల సంఖ్యలో రోగులు వస్తుండటంతో రోజుకు 2 వేల మార్క్‌ను దాటుతున్న పరిస్థితి కనిపిస్తోంది. దీని ఫలితంగా ఆసుపత్రికి వచ్చిన వారిని పరీక్షించడానికి గంటల తరబడి ఆలస్యమవుతోంది. ఇక్కడకు రోగులు గొంతు, చెవి ఇన్ఫెక్షన్ల వంటి సాధారణ సమస్యలతోనే వస్తారు. వచ్చేవారిలో దాదాపు 80– 85 శాతం మందికి మందులతోనే సరిపోతుంది. అయినప్పటికీ గంటల తరబడి వేచి ఉండాల్సి రావడం రోగులకు ఇబ్బందికరంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో మరిన్ని ఈఎన్‌టీ కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం స్పష్టంగా కనిపిస్తోంది.

వాతావరణ మార్పులే కారణం..

శీతాకాలం ప్రారంభమయ్యే సమయంలో ఇలాంటి వ్యాధులు ప్రబలడం సహజమేనని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కోఠి ఈఎన్‌టీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.శంకర్ భరోసా కల్పిస్తున్నారు. చల్లని పదార్థాలకు దూరంగా ఉండడం వంటి జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుందన్నారు. అయితే రోజుల తరబడి సమస్య ఇబ్బంది పెడితే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. తమ ఆసుపత్రి కరోనాకి ముందు పెద్ద సంఖ్యలో వచ్చేవారని, అదే విధంగా ఇప్పుడు కూడా రోగుల సంఖ్య పెరిగిందన్నారు. ఇక్కడికి వస్తున్న వారిలో జలుబు, దగ్గు తదితర సమస్యలే ఎక్కువగా ఉన్నాయన్నారు. రోగులను పరీక్షించేందుకు ఆలస్యం అవ్వడానికి కొత్తగా ప్రవేశపెట్టిన ఈహెచ్ఎస్ విధానం కొంత వరకూ కారణమవుతోందన్నారు. ప్రతీ రోగికి ఆధార్ తనిఖీతో పాటు రోగి ఆరోగ్య వివరాలను సమగ్రంగా నమోదు చేస్తుండడంతో స్వల్ప ఇబ్బందులు ఎదురైనా ఈ విధానం రోగులకు అనేక విధాలుగా ప్రయోజనకరంగా ఉందన్నారు.

హరితహారం భేష్

బంజారాహిల్స్: కాలనీలు, బస్తీల్లో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో అర్బన్ బయోడైవర్సిటీ అభివృద్ధి చేసిన పార్కులు, ప్రకృతి వనాలను తమిళనాడు ఫారెస్ట్ అకాడమీ, కోయంబత్తూర్ ఫారెస్ట్ రేంజ్, ట్రైనీ అధికారులు మెచ్చుకున్నారు. ఆదివారం బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌తో పాటు సర్కిల్–18 పరిధిలోని పలు కాలనీలు, బస్తీల్లో హరితహారం కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి చేసిన పార్కులను వారు పార్కుల విభాగం డీడీ శ్రీనివాస్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఇక్కడ పార్కుల్లో నాటుతున్న మొక్కలు, అవి ఎదుగుతున్న తీరు, పచ్చదనం పెంచడానికి తీసుకుంటున్న చర్యలను డీడీ వారికి వివరించారు. తక్కువ విస్తీర్ణం ఉన్న ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటిన తీరును అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్–18 యూబీడీ మేనేజర్ బాలయ్య పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కాలనీ పార్కులో పర్యటిస్తున్న అధికారులు

'సీఎం సహాయం'పై సీబీఐతో విచారణ జరిపించాలి



ఆదాయ పత్రాలను చూపిస్తున్న బీజేపీ కార్పొరేటర్లు

కాచిగూడ: ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్)లో అక్రమాలు జరిగాయంటూ ఆరోపిస్తూ వాటిపై సీబీఐతో విచారణ జరిపించాలని బీజేపీ కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. ఆదివారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్పొరేటర్లు వంగ మధుసూదన్ రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, చింతల అరుణ సురేందర్ యాదవ్, బీజేపీ నేతలు వానపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పోరెడ్డి రవీందర్ రెడ్డి, సుంకరి రమేష్ గౌడ్, శ్యాంసుందర్, పాతూరి శ్రీధర్ గౌడ్ మాట్లాడారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో సీఎంఆర్ఎస్‌లో అనేక అవినీతి, అక్రమాలు జరిగాయని, కోటీశ్వరులకు సీఎంఆర్ఎఫ్ సహాయనిధి ద్వారా లక్షలాది రూపాయల అందజేశారని ఆరోపించారు. సీఎంఆర్ఎఫ్ విషయంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి చేసిన అక్రమాలపై విచారణ జరిపిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అత్తమామల పేరుతో తప్పుడు ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తీసుకొని సీఎంఆర్ఎఫ్ పథకం ద్వారా రూ.19 లక్షలు తీసుకున్నారని ఆరోపించారు. నకిలీ ధ్రువీకరణ పత్రాలు ఇచ్చిన అధికారులపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేపై ప్రభుత్వం చర్యలు చేపట్టకపోతే తాము ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

10, 11 తేదీలలో మహిళా రచనలు, సాహిత్య సంస్కృతిపై సమావేశం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో 'ఉర్దూ, దక్కన్‌లో మహిళా రచనలు, సాహిత్య సంస్కృతి'పై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు 'మనూ' మహిళా విద్య, హెడ్, సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ అమీనా తహసీన్ పేర్కొన్నారు. 'మనూ' మహిళా విద్యా విభాగం, అన్వేషి రీసెర్చ్ సెంటర్ ఫర్ ఉమెన్స్ స్టడీస్, డిపార్టుమెంట్ ఆఫ్ లాంగ్వేజ్, తెలంగాణ ప్రభుత్వం సహకారంతో ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. యూనివర్శిటీలోని సయ్యద్ హామీద్ లైబ్రరీ ఆడిటోరియంలో ఈనెల 10,11 తేదీలలో ఈ సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. యూనివర్శిటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ అధ్యక్షతన జరిగే సమావేశంలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. మొదటి రోజు ఉదయం 10.30 గంటలకు జరిగే ప్రారంభ కార్యక్రమంలో ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజ్ యూనివర్శిటీ కల్చరల్ స్టడీస్ విభాగం మాజీ ప్రొఫెసర్ సూసీతరు, హైదరాబాద్ ఫిల్మ్ మేకర్, రీసెర్చ్ స్కాలర్, అనువాదకురాలు డాక్టర్ లలిత పాల్గొంటారని ఉర్దూ విభాగం మాజీ ప్రొఫెసర్ షహనాజ్‌నబీ కీలకోపన్యాసం చేస్తారన్నారు.

పాలమూరు ఎత్తిపోతలతో సస్యశ్యామలం



మంత్రి నిరంజన్‌రెడ్డి

హస్తినాపురం: పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలతో దక్షిణ తెలంగాణ సస్యశ్యామలం అవుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆదివారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని వంగఅనంతరెడ్డి గార్డెన్స్ మణికొండపంచవటి కాలనీలో ఏర్పాటు చేసిన వనపర్తి నియోజకవర్గం ఓటర్ల ఆత్మీయ సమ్మేళనానికి మంత్రి హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో వనపర్తి జిల్లా అన్ని రంగాలలో అభివృద్ధి చెందిందని జిల్లాలో రెండున్నర లక్షల ఓట్లు ఉన్న అతి పెద్ద నియోజకవర్గం అని అందరూ అభివృద్ధిని చూసి తననే గెలిపించాలన్నారు.

కొనుగోలుదారులే దేవుళ్లు

- రెరా చైర్మన్ సత్యనారాయణ

సాక్షి, సిటీ బ్యూరో: తెలంగాణ నరెడ్కో మూడు రోజులపాటు మాదాపూర్ హైటెక్స్ లో ఏర్పాటు చేసిన ప్రాపర్టీ ఎక్స్ పోను తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ (రెరా) చైర్మన్ డాక్టర్ ఎన్. సత్యనారాయణ సందర్శించారు. ఆదివారం ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని నారెడ్కో తెలంగాణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రాపర్టీ ఎక్స్పో స్టాళ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలుదారుడే మన దేవుడు అనే భావనతో మహాత్మా గాంధీ చెప్పిన విధానంతో కష్టమర్లకు నమ్మకంతో కూడిన భరోసాని ఇవ్వాలన్నారు. నమ్మకం కల్పించి కార్యకలాపాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రెరా చట్టాన్ని బిల్డర్లు, ప్రమోటర్లు, ఏజెంట్లు ప్రతి ఒక్కరు తప్పక పాటిస్తూ కొనుగోలుదారులకు భరోసాను ఇవ్వాలన్నారు. రిజిస్ట్రేషన్ లేకుండా ప్రకటనలు, మార్కెటింగ్ చేపట్టడం రెరా చట్టాన్ని ఉల్లంఘించినట్లేనని చట్టంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు.తెలంగాణ నరెడ్కో కొనుగోలుదారుల అవగాహన కోసం పలు ఎక్స్ పో కార్యక్రమాలు చేపట్టడం పట్ల ఆయన అభినందించారు.


ఆర్థరైటిస్‌పై అవగాహన వాక్



వాక్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ భాస్కర్‌రావు

ఖైరతాబాద్: సరైన అవగాహన ఉంటే ఆర్థరైటిస్ వల్ల వచ్చే సమస్యలకు దూరమవుతాయని కిమ్స్ హాస్పిటల్‌కు చెందిన రుమటాలజిస్ట్ డాక్టర్ శరత్ చంద్రమౌళి అన్నారు. ఆదివారం నెక్లెస్ రోడ్డులో నిర్వహించిన ఆర్థరైటిస్‌పై అవగాహన వాక్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్థరైటిస్ ఏ వయస్సు వారికైనా రావొచ్చని, అది వచ్చినా ఎలాంటి భయం అవసరం లేదన్నారు. కేవలం జీవనశైలిలో కొద్దిపాటి మార్పులు చేసుకుంటూ, వైద్యుల సలహా మేరకు మందులు వాడుతుంటే ఆర్థరైటిస్ ఇబ్బందులు చాలా వరకు దూరం అవుతాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కోట్ల మంది ఆర్థరైటిస్‌తో బాధపడుతున్నారని, ఇప్పటికీ దానిపై పూర్తి స్థాయి విజయం సాధించడం సాధ్యం కాలేదన్నారు. చాలామంది దీని గురించి బయటకు చెప్పుకోలేకపోతున్నారని ఈ మౌనాన్ని వీడాలనే ఉద్దేశంతోనే ఈ అవగాహన కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో కిమ్స్ హాస్పిటల్స్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బి.భాస్కర్‌రావు, డైరెక్టర్ మారుతి దాసరి, యాంకర్ సౌమ్య, నటుడు కార్తీక్ రత్నం, నిర్మాత యాదగిరి రాజు, బద్రుకా కళాశాల కార్యదర్శి కృష్ణ బద్రుకా పాల్గొన్నారు.

మంచిమాట



ఏక క్రియా ద్వ్యర్థి కరీ అన్నారు పెద్దలు. రాతి మీద నూరటం కత్తికి పదును కోసం, రాయి నునుపు కోసం కాదు. ఏదైనా ఒక పని చేసేటప్పుడు అనుకున్న దానితో పాటు కొన్ని అవాంతర ఫలితాలు కూడా వస్తూ ఉంటాయి. వాటిలో కొన్ని పనికివచ్చేవి, కొన్ని పనికిరానివి ఉంటాయి. కొన్ని సందర్భాలలో అసలు ప్రయోజనం మర్చిపోయి, ఈ కొసరుదే సరి అనుకునే ప్రమాదం కూడా ఉంది.

అసలు... కొసరు

పిల్లలకి స్నానం చేయించి, శుభ్రమైన యూనిఫారం వేసి, తల దువ్వి, షూస్ బాగా మిలమిలా మెరిసేట్టు పాలిష్ చేసి, పుస్తకాలు సర్ది, బ్యాగులో పెట్టి, ప్రేమతో తినిపించి, డబ్బా కట్టి బడికి పంపటానికి సిద్ధం చేస్తారు. బడికి వెళ్ళటంతో ప్రయోజనం సిద్ధించదు. అసలు ప్రయోజనం అక్కడికి వెళ్ళి చదువుకుంటే కలుగుతుంది. తయారు అవటం క్రమశిక్షణలో భాగం మాత్రమే.

వరి సాగు చేయటం ధాన్యం కోసం. కాని వరిగడ్డి కూడా వస్తుంది. దాని వల్ల లాభం వస్తుంది అని గడ్డి కోసం వరి సాగు చేయరు. అంతే కాదు గడ్డి ఎక్కువగా పెరగటం కోసం ఎరువు వేయరు.వడ్లు బాగా రావాలని తగిన ఎరువులు వేస్తారు.

ఆవులని పాల కోసం పోషిస్తారు. గోమయం, గోమూత్రం కూడా మానవులకి ఎంతగానో ఉపయోగ పడతాయి. ఒకప్పుడు వాటిని పొలాలలో ఎరువుకి వాడేవారు. గోమయంతో పిడకలు చేసి ఇంధనంగా ఉపయోగించేవారు. ఆయుర్వేద ఔషధాల తయారీలో వాడేవారు. ఇప్పుడు వాటిని మరెన్నింటికో ఉపయోగిస్తున్నారు. కాని ఎవరూ ఆవులని పేడకోసమో, మూత్రం కోసమో పెంచరు కదా! అవసరం అనుకుంటే ఆవులున్న వారి దగ్గరకు వెళ్ళి తెచ్చుకుంటారు.

అరవిందాశ్రమంలో శ్రీ మాతగా ప్రసిద్ధి పొందిన మిర్రా సాధన ప్రారంభించిన మొదట్లో అద్భుతమైన అందంతో ప్రకాశించటం మొదలు పెట్టిందిట. శారీరిక, మానసిక ఆరోగ్యాలు ఉండటమే అందం. వెంటనే ఆవిడ ఇది నా ప్రయోజనం కాదు అని ఆ శక్తిని భౌతిక శరీరం నుండి ఉపసంహరించింది. లక్ష్యసాధనలో ఎదురయ్యే ఇటువంటి వాటిని పరమార్థం అనుకోకుండా ముందుకి సాగాలి.

ఖాళీ సీసాలు సేకరించి అమ్ముకునే వాడితో ఒక పెద్దమనిషి "నీకోసమేనయ్యా నేను రాత్రి అంతా కూర్చుని సీసాలు ఖాళీ చేసేది." అన్నాడట! ఆహా! ఏమి సమర్థింపు!! ఈ సందర్భంలో పండిట్ జవహర్లాల్ నెహ్రూగారిని స్మరించక తప్పదు. స్వతంత్రోద్యమంలో ప్రధాన భాగంగా విదేశీ వస్తు దహనం ముమ్మరంగా జరుగుతున్న సందర్భంలో ఎవరో "మీరు విదేశీ సిగరెట్లు కాలుస్తున్నారు. మనం విదేశీ వస్తువులు వాడం కదా!" అన్నారుట. దానికి నెహ్రూ గారు నవ్వుతూ... "అందుకే కదా దహనం చేస్తున్నాను." అన్నారుట.

> క్షీరసాగర మథనం చేసింది అమృతం కోసం. ఆ లోపు పాల సముద్రం నుండి ఎన్నో విశిష్ట వస్తువులు ఉద్భవించాయి - లోకోపద్రవ కారకమైన హాలాహలం నుండి కల్పవృక్షం, కామధేనువు, చంద్రుడు వంటి వారి నుండి లక్ష్మీదేవి వరకు. తెలివిగల వారు దేనిని ఏ విధంగా వినియోగించుకోవాలో, ఆ విధంగా వినియోగించుకున్నారు. తమ లక్ష్యమైన అమృతం సిద్ధించే వరకు పాలసముద్రాన్ని చిలకటం కొనసాగించారు. కల్పవృక్షం వంటి వాటి కోసం మళ్ళీ అటువంటి ప్రయత్నం చేయలేదు.

పేలాల కోసం కుప్పలు తగల బెట్టటం అనే సామెత ఉంది. వరిపేలాల కోసం వడ్లని వేయిస్తారు. కాసిని వడ్లతో సరిపోయేదానికి మొత్తం కుప్పని తగల బెట్టటం తెలివి గల పనేనా?

ప్రధానమైన ప్రయోజనం కోసం ప్రయత్నం చేస్తుంటే కొన్ని అనుకోనివి కూడా లభిస్తాయి. వాటిని పట్టించుకుంటే దృష్టి చెదిరే ప్రమాదం ఉంది.

– డా.ఎన్. అనంతలక్ష్మి

బౌద్ధవాణి

శీల సంపన్నుడు

వారణాసి పట్టణంలో సుప్రబుద్ధి అనే వ్యాపారి ఉన్నాడు. దేశవిదేశాల్లో వ్యాపారం చేసి ఎంతో ధనం సంపాదించాడు. అతనికి సుజాత అనే పెళ్ళీడుకొచ్చిన కుమార్తె ఉంది. సుగుణాల రాశి. అందాల బొమ్మ. అందానికి అందం. సంపదకి సంపద పుష్కలంగా ఉండటంతో ఎందరో ఆమెను పెళ్ళాడలనుకున్నారు. తమ తమ ఆస్తి వివరాలు, చిత్రపటాలూ పంపారు. సుప్రబుద్ధి భార్యకు వారిలో ధనానందుడు నచ్చాడు. ఎందుకంటే ఆ పెళ్ళి కుమారులందరిలో అతనే అందగాడు. రంగూ, రూపం చాలా బాగుంది. "ధనానందుని తల్లిదండ్రులకి కబురు పంపండి" అంది ఆమె.

సుప్రబుద్ధుని తండ్రికి మాత్రం విక్రముడు నచ్చాడు. అతను అవంతీనగర శ్రేష్ఠి కుమారుడు. ధనం, వంశగౌరవం కలవాడు కాబట్టి "విక్రముని కుటుంబంతోనే వియ్యమందుదాం" అన్నాడు పెద్దాయన. ధనం కంటే వంశం కంటే ఆరోగ్యమే మహాభాగ్యం అనుకున్నాడు సుప్రబుద్ధి. కాబట్టి అతనికి ఉజ్జయినీ యువకుడు ఉదయనుడు నచ్చాడు. తన కుమార్తెను చేపట్టేవాడు ఆరోగ్యంతో దీర్ఘాయువుగా ఉండాలి. పెళ్లంటే నూరేళ్ళ పంట. కాబట్టి ఉదయనుడే తనకు అల్లుడైతే చాలు అనుకున్నాడు. అలా ఆ ముగ్గురి అభిప్రాయాలూ వేరు వేరుగా ఉన్నాయి. కాబట్టి తన కుమార్తె అభిప్రాయం అడగాలనుకున్నాడు. వెంటనే పిలిచి తమ తమ అభిప్రాయాలు చెప్పి-

"అమ్మా! సుజాతా! మా ముగ్గురి అభిప్రాయాలు వేరుగా ఉన్నాయి. వీరిలో ఎవరు అయితే నీకిష్టం?" అని అడిగాడు. సుజాత చిరునవ్వు నవ్వింది. మౌనం వహించింది. "సందేహించక చెప్పు తల్లీ!" అన్నాడు.

"నాన్నా! నాకు ఈ మూడు రకాల వారూ వద్దు. గుణవంతుడు, శీలవంతుడు అయితే చాలు" అని లేచి అక్కడి నుంచి మేడ మీదికి పరుగు తీసింది సిగ్గుపడుతూ.



ఆ వచ్చిన వారిలో అలాంటి యువకుడు మగధకు చెందిన శీలభద్రుడున్నాడు. ఈ విషయంపై ఇంట్లో తర్జన భర్జనలు జరిగాయి. ఎటూ తేల్చుకోలేకపోయాడు సుప్రబుద్ధి.

మధ్యాహ్నం దాటాక సారనాథ్‌లోని జింకల వనానికి చేరాడు. అక్కడ వెదురు చెట్ల కింద కూర్చొన్న బుద్ధుని దగ్గరకు వెళ్ళాడు. నమస్కరించి, విషయం చెప్పాడు. అప్పుడు బుద్ధుడు-

"సుప్రబుద్ధీ! ఒకడు చాలా అందగాడు. మంచి శరీర వర్ణం గలవాడు. కన్నూ, ముక్కు తీరు బావుంటుంది. కానీ వాడు ఒక దొంగ అనుకో. అందగాడని దొంగను ఇష్టపడతావా?"

"లేదు భగవాన్!"

"అలాగే.. ఒకడు సోమరి. అజ్ఞాని. కానీ, ఆరోగ్యవంతుడు. అతణ్ణి ఇష్టపడతావా?"

"ఇష్టపడను భగవాన్!"

"ధనవంతుడు, గొప్ప వంశం కలవాడు. కానీ.. వాడు జూదరి. తాగుబోతు. తిరుగుబోతు. అతను నీకు ఇష్టమేనా?"

"కాదు భగవాన్! ఇష్టం కాదు"

"చూశావా! అందగాడైనా, ఆయుష్షు గలవాడైనా, ధనవంతుడైనా ఇష్టం కాదు అనే అంటున్నావు. అవునా! సుప్రబుద్ధీ! వీటన్నిటి కంటే గుణమే ప్రధానం. నీ కుమార్తె కోరినట్లు గుణవంతుడు, శీలవంతుడు నీకు అల్లుడైతే, నీవూ, నీ కుమార్తె, నీ కుటుంబం, నీ బంధువర్గం అందరికీ గౌరవం." అన్నాడు.

"భగవాన్! నా కుమార్తె ఇష్టం ప్రకారమే ఆమె పెళ్ళి చేస్తాను పెద్ద మనస్సుతో అంగీకరిస్తాను" అంటూ సుప్రబుద్ధి సంతోషంతో లేచి వెళ్ళాడు. అలాగే చేశాడు.

– డా. బొర్రా గోవర్ధన్

వాగ్గేయకార వైభవం

సంగీతం.. సనాతనం

సరస్వతీ దేవి వీణ పట్టుకుని పరమశివుని వైభవాన్ని గానం చేస్తుంటే... అమ్మవారు తాంబూల చర్వణం చేస్తూ, తల ఊపుతూ చిరునవ్వుతో వింటూ ఉంటుందట. ప్రవచనం వినేటప్పుడు కదలకుండా కూర్చుని వినాలి, సంగీతం వినేటప్పుడు తల కదుపుతూ మన అంగీకారాన్ని, సంతోషాన్ని ప్రకటించడం సభామర్యాద. సరిగమపదనీరతాం శాంతం మృదుల స్వాంతం... అన్నాడు కాళిదాస మహాకవి. ఉద్వేగం తో ఉండాల్సిన మహాశక్తి అంత ప్రశాంతంగా ఎలా ఉండగలుగుతున్నది అంటే... ఆమె సంగీతంలో అంతగా రమిస్తున్నదట. అసలు ఆ సంగీతంలో రమించే మనసు ఎవరికుంటుందో, దానిలో తడిసిముద్దయిపోయే మనసు ఎవరికుంటుందో వారు పరమ కోమలమైన మనసు కలిగి ఉంటారు. మృదువైన మనసు అంటే.. అవతలివారి కష్టం తమ కష్టం అన్నంత బాధపడిపోతూ, దానిని తీర్చడానికి వారు ముందుకు పరిగెడతారు. ఆ దయ, ఆ కరుణ, ఆ ప్రశాంత స్థితి పొందినప్పుడు తమపట్ల కృతఘ్నులై ఉన్నా పట్టించుకోరు. అమ్మవారే కాదు, అయ్యవారిదీ అదే పరిస్థితి.



'నాదతనుమనిశం శంకరం' అని త్యాగరాజస్వామి ఒక కీర్తన చేశారు. నిజానికి శంకరుడి శరీరం నాదమే. 'సద్యోజాతాది పంచ వక్త్రజ సరిగమపదని వర సప్తస్వరవిద్యాలోలం...'' లౌల్యం అట ఆయనకు .. ఏ సంగీతం మీద... అంటే... అసలు శంకరుడివే ఐదు ముఖాలు. సద్యోజాత, అఘోర, సత్పురుష, వామదేవ, ఈశానములు. సద్యోజాతం పశ్చిమాన్ని చూస్తుంది. అందుకే శివాలయాల్లో... పశ్చిమ ముఖంగా ఉండే శివాలయం గొప్పదంటారు. అఘోర ముఖం– దక్షిణం. సత్పురుష ముఖం – తూర్పు. వామదేవ ముఖం – ఉత్తరం. ఈశాన ముఖం –ఊర్ధ్వ ముఖం. ఇవి ఐదు.. ఐదు శక్తులను కలిగి ఉంటాయి. అందుకే శివుడికి ఎటువైపు అభిషేకం చేసినా ఆయనకు అందుతుంది. ఆ ముఖాలతో ఆయన సరిగమలనబడే వాటియందు ఎప్పుడూ రమిస్తుంటాడు. లౌల్యం అంటే... ఇక ఇప్పటికి చాల్లేండి... అన్న మాట అనకుండా ఎంత అనుభవించినా, ఎంత చేసినా ఇంకా చేయాలనిపిస్తే లౌల్యం అంటారు.

అసలు ఆ స్వరాలు ఎక్కడ పుట్టాయంటే... అవి ఆయన ఐదు ముఖాల్లోంచే పుట్టాయి. సప్త స్వరాలు ఏడయినప్పుడు ముఖాలు ఐదే కదా... అన్నప్పుడు... వీటిలో షడ్జం, పంచమం.. స, ప స్వరాలు. వీటిని ప్రకృతి స్వరాలంటారు. పరమశివుడు ఎంత సనాతనుడో, ఎంత స్వయం భూనో, ఆయనకు ఆద్యంతాలు ఎలా లేవో అలా సంగీతంలో ఈ రెండు ప్రకృతి స్వరాలూ ఆద్యంతాలు లేకుండా ఈశ్వరుడంతటి నిత్యములు, సనాతనాలై ఉన్నాయి. మిగిలినవి వికృతి స్వరాలు. అవి మిగిలిన ఐదు ముఖాల్లో నుంచి వచ్చాయి. అంటే సంగీతం ఎంత శక్తిమంతమో, భారతీయ సంగీతంలో సప్త స్వరాలు అంతే శక్తిమంతమూ, సనాతనమై, నిత్య నూతనమై వెలుగుతున్నాయి.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

సినిమా

కల నెరవేరనుందా?



పూజా హెగ్డేకి బోలెడన్ని కలలు ఉన్నాయి. వాటిలో బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్ సరసన నటించాలన్న కల ఒకటి. 'షారుక్ ఖాన్ రొమాంటిక్ లుక్స్ అంటే నాకిష్టం. అందుకోసమే ఆయన సినిమాలు చూడ్డానికి ఇష్టపడతాను. షారుక్ రొమాంటిక్ కింగ్' అని గతంలో ఓ సందర్భంలో పూజా పేర్కొన్నారు కూడా. షారుక్ సరసన నటించాలనే తన కల నెరవేరే చాన్స్ ఉందని కూడా ఆమె అన్నారు. ఇప్పుడు ఆ సమయం ఆసన్నమైనట్లుంది. ప్రస్తుతం షారుక్ 'డంకీ' చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. 'డంకీ' తర్వాత షారుక్ నటించనున్న చిత్రంలోనే పూజా హెగ్డే ఈ బాలీవుడ్ బాద్‌షా సరసన నటించనున్నారనే వార్త ప్రచారంలోకి వచ్చింది. కాగా, షారుక్ ఖాన్, సల్మాన్ ఖాన్ కాంబినేషన్‌లో రూపొందనున్న 'టైగర్ వెర్సస్ పఠాన్'లోనే పూజా హెగ్డే నటించనున్నారట. ఈ విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

● పూజా హెగ్డే

వేసవిలో 171 షురూ

బ్రేక్ తీసుకునేది లేదు అన్నట్లు రజనీకాంత్ వరుసగా సినిమాలు చేస్తున్నారు. ఆయన హీరోగా నటించిన 'జైలర్' ఇటీవల విడుదలై, బంపర్ హిట్ సాధించింది. ప్రస్తుతం టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో తన 170వ సినిమా చేస్తున్నారు రజనీ. ఇప్పటికే తన కుమార్తె ఐశ్వర్య దర్శకత్వంలో 'లాల్ సలాం' చిత్రంలో కీ రోల్ చిత్రీకరణ పూర్తి చేశారు. ఇక 170వ సినిమా పూర్తయిన వెంటనే 171వ సినిమాతో బిజీ అవుతారు రజనీ. ఈ చిత్ర దర్శకుడు లోకేశ్ కనగరాజ్ వెల్లడించిన ప్లాన్ ప్రకారం వచ్చే ఏడాది వేసవిలో ఈ చిత్రం షూటింగ్ ఆరంభమవుతుంది. ఏప్రిల్‌లో చిత్రీకరణ ఆరంభించేలా లోకేశ్ ప్లాన్ చేస్తున్నారు. ప్రస్తుతం విజయ్ హీరోగా లోకేశ్ దర్శకత్వం వహించిన 'లియో' ఈ నెల 19న రిలీజ్ కానుంది. కొన్ని నెలలుగా 'లియో'తో బిజీగా గడిపిన లోకేశ్ ఈ చిత్రం విడుదల తర్వాత చిన్న గ్యాప్ తీసుకుని, రజనీ 171వ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు ఆరంభిస్తారట. నిజానికి ఈ చిత్రకథను తాను దర్శకత్వం వహించిన 'మానగరం' (2017)కి ముందే రాశారట. ఒక ఫ్రెండ్ కోసం రాసిన ఈ కథను రజనీకాంత్‌కి వినిపించగా ఆయనకు నచ్చిందని లోకేశ్ పేర్కొన్నారు. అలాగే ఈ చిత్రానికి సంబంధించిన కీలక సన్నివేశాల్లో కొన్నింటిని 'ఐమ్యాక్స్ కెమెరా'తో చిత్రీకరించడానికి ప్లాన్ చేస్తున్నామని లోకేశ్ ఓ ఇంటర్వ్యూలో తెలిపారు.



● రజనీకాంత్

ఒక్క ట్వీట్‌తో గుడ్‌బై చెప్పాలనుకున్నా!



● లోకేశ్ కనగరాజ్

"దర్శకుడిగా చిత్ర పరిశ్రమలో ఎక్కువ కాలం ఉండాలనుకోవడం లేదు.. కెరీర్ పరంగా గర్వపడే స్థాయిలో ఉన్నప్పుడు ఒక్క ట్వీట్‌తో దర్శకత్వానికి గుడ్‌బై అని అనౌన్స్ చేయాలనుకున్నా" అన్నారు డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్. దర్శకుడిగా త్వరగా రిటైర్‌మెంట్ తీసుకుంటా అని గతంలో ఓసారి చెప్పిన లోకేశ్.. తాజాగా ఓ ఇంటర్వ్యూలోనూ ఇదే విషయంపై స్పందించారు. "సినిమా ఇండస్ట్రీలో నేను ఎక్కువ కాలం ఉండాలనుకోలేదు. 10 మంచి సినిమాలు చేసి వీలైనంత త్వరగా రిటైర్ అవ్వాలనుకున్నాను. కెరీర్ పరంగా గర్వపడే స్థాయిలో ఉన్నప్పుడు ఒక్క ట్వీట్‌తో గుడ్‌బై అని అనౌన్స్ చేయాలనుకున్నాను. ఆ తర్వాత ఎన్నో ప్రదేశాలకు వెళ్లాలని ప్రణాళిక వేసుకున్నాను. అయితే, ఇటీవల ఓ వేడుకలో దర్శకులందరం కలిశాం. రిటైర్‌మెంట్ ప్రయత్నాలను విరమించుకోవాలని వాళ్లు సూచించారు.. వాళ్ల మాటలపై ఉన్న గౌరవంతో రిటైర్‌మెంట్ గురించి ఇప్పుడే మాట్లాడాలనుకోవడం లేదు" అన్నారు.

లారెన్స్ సినిమా నుంచి వాకౌట్?

లేడీ సూపర్ స్టార్‌గా పేరు తెచ్చుకున్న నయనతార లేడీ ఓరియంటెడ్ మూవీస్‌తో పాటు రెగ్యులర్ కమర్షియల్ చిత్రాల్లో హీరోల సరసన నటిస్తుంటారు. దక్షిణాదిన సక్సెస్‌ఫుల్ హీరోయిన్ అనిపించుకున్న నయన 'జవాన్' వంటి బ్లాక్ బస్టర్ హిట్‌తో హిందీ పరిశ్రమలోనూ విజయవంతంగా కెరీర్ ఆరంభించారు. ఇక ప్రస్తుతం 'ది టెస్ట్' చిత్రంతో పాటు మరో చిత్రంలో కథానాయికగా నటిస్తున్నారు నయనతార. కాగా, రత్నకుమార్ దర్శకత్వంలో లారెన్స్ హీరోగా రూపొందనున్న చిత్రంలో ఈ బ్యూటీ హీరోయిన్‌గా ఖరారయ్యారనే వార్త వినిపించింది. తాజాగా ఈ చిత్రం నుంచి ఆమె తప్పుకున్నారని టాక్. డేట్స్ సర్దుబాటు చేయలేక నయన ఈ నిర్ణయం తీసుకున్నారని సమాచారం.



● నయనతార

వినోదం.. యాక్షన్

త్రిగుణ్ హీరోగా సురేష్ కుమార్ ఆకిరి దర్శకత్వం వహించిన చిత్రం 'గంజామ్'. ప్రణమ్ దేవరాజ్, హ్రితికా శ్రీనివాస్, విస్మయ, దేవరాజ్, రఘు కుంచె, అనితా చౌదరి ముఖ్య పాత్రలు పోషించారు. ఏవీఆర్ ఆర్ట్స్, ఏయు-ఐ బ్యానర్స్‌పై రత్నాజీ నిర్మించిన ఈ చిత్రం టీజర్‌ని హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా త్రిగుణ్ మాట్లాడుతూ– "నేను చేసున్న 23వ సినిమా 'గంజామ్'. ఎప్పుడూ నన్ను ఆదరిస్తూ, అభిమానిస్తున్న తెలుగు ప్రేక్షకులకు థ్యాంక్స్. మా సినిమాకు మీ అందరి సపోర్ట్ కావాలి" అన్నారు. "వినోదం, యాక్షన్‌తో పాటు సామాజిక స్పృహ కలిగిన సినిమా 'గంజామ్'. నాకు అవకాశం ఇచ్చిన రత్నాజీగారికి ధన్యవాదాలు. త్రిగుణ్‌కి ఈ సినిమా మరో మంచి హిట్‌గా నిలుస్తుంది" అన్నారు సురేష్ కుమార్ ఆకిరి. "ఒక మంచి ప్రయత్నం మా 'గంజామ్'. ఈ సినిమా అందర్నీ ఆలోచింపజేసేలా ఉంటుంది" అన్నారు రత్నాజీ. "కథా బలం ఉన్న 'గంజామ్' విజయం సాధిస్తుంది" అన్నారు చిత్ర సంగీతదర్శకుడు, నటుడు రఘు కుంచె. ఈ చిత్రానికి కెమెరా: 'గరుడవేగ' అంజి.



● హ్రితికా శ్రీనివాస్, త్రిగుణ్

ఫైట్.. హైలైట్



● మంచు లక్ష్మి

మంచు లక్ష్మి లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'ఆదిపర్వం'. సంజీవ్ మేగోటి దర్శకత్వం వహించారు. రావుల వెంకటేశ్వర రావు సమర్పణలో అన్విక ఆర్ట్స్–అమెరికా ఇండియా ఎంటర్‌టైన్మెంట్స్‌పై రూపొందింది. కాగా ఆదివారం (అక్టోబర్ 8) మంచు లక్ష్మి పుట్టినరోజుని పురస్కరించుకుని 'ఆదిపర్వం'లోని ఆమె ఫస్ట్ లుక్ విడుదల చేశారు మేకర్స్. ఈ సందర్భంగా సంజీవ్ మేగోటి మాట్లాడుతూ– "1974-1990 మధ్యకాలంలో జరిగిన వాస్తవ ఘటనలతో ఈ చిత్రం రూపొందింది. హై ఓల్టేజ్ యాక్షన్ డ్రామాతో పాటు ఎమోషనల్ లవ్ స్టోరీగా తెరకెక్కిన ఈ చిత్రంలో మంచు లక్ష్మి పాత్ర ఆమె కెరీర్‌లోనే చిరస్థాయిగా నిలిచిపోతుంది. తను చేసిన రెండు ఫైట్స్ సినిమాకి హైలెట్‌గా నిలుస్తాయి. 'అమ్మోరు, అరుంధతి' చిత్రాల తరహాలో కథ, గ్రాఫిక్స్ ఉంటాయి" అన్నారు. "రెట్రో ఫీల్‌తో ఫీల్ గుడ్ లవ్ స్టోరీగా మొదలై కంప్లీట్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం అలరిస్తుంది" అన్నారు చిత్ర ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఘంటా శ్రీనివాస రావ్, సహనిర్మాత గోరెంట శ్రావణి. ఈ చిత్రంలో ఆదిత్య ఓం, ఎస్తేర్, సుహాసిని తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటించారు.

ద్రోహి

సందీప్ కుమార్, దీప్తీ వర్మ జంటగా విజయ్ పెందుర్తి దర్శకత్వం వహించిన చిత్రం 'ద్రోహి'. 'ద క్రిమినల్' అన్నది ఉపశీర్షిక. గుడ్ ఫెలో మీడియా, సఫైరస్ మీడియా, వెడ్‌నెస్ డే ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై విజయ్ పెందుర్తి, డి. శ్రీకాంత రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 13న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆ రోజు నేషనల్ సినిమా డేని పురస్కరించుకుని మల్టీప్లెక్స్‌లో రూ. 112లకే సినిమా టిక్కెట్ ఇస్తున్నట్లు చిత్రబృందం పేర్కొంది. ఈ సినిమా టీజర్‌ని నటుడు త్రిగుణ్ విడుదల చేసి, మాట్లాడుతూ– "సందీప్, విజయ్‌లకు కళ అంటే ప్రాణం. దర్శకుడి పని తీరు టీజర్‌లో కనిపించింది. ఈ చిత్రం విజయం సాధిస్తుంది" అన్నారు. "అద్భుతమైన డ్రామాగా తెరకెక్కిన చిత్రమిది. క్రైమ్, థ్రిల్లర్‌తో పాటు అన్ని అంశాలున్నాయి" అన్నారు సందీప్ కుమార్. "ఈ చిత్రంలో ప్రేక్షకులు మెచ్చే అన్ని అంశాలు ఉన్నాయి.. ఎవర్నీ నిరాశపరచదు" అన్నారు విజయ్ పెందుర్తి. "మా సినిమాని ప్రేక్షకులు ఆదరించాలి" అన్నారు నటి డెబాడాలీ. ఈ చిత్రానికి కెమెరా: అశోక దార్బీరు, సంగీతం: అనంత నారాయణ్.



● సందీప్ కుమార్, దీప్తీ వర్మ



● బీఆర్ సభావత్ నాయక్

చేగువేరా పోరాటం

క్యూబా పోరాట యోధుడు చేగువేరా జీవిత చరిత్ర ఆధారంగా రూపొందిన చిత్రం 'చే'. 'లాంగ్ లివ్' అన్నది ఉపశీర్షిక. బీఆర్ సభావత్ నాయక్ టైటిల్ రోల్ పోషించి, దర్శకత్వం వహించారు. నవ ఉదయం సమర్పణలో నేచర్ ఆర్ట్స్‌పై సూర్య, బాబు, దేవేంద్ర నిర్మించారు. నేడు (అక్టోబర్ 9) చేగువేరా వర్ధంతి సందర్భంగా 'చే' టీజర్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. ఈ సందర్భంగా బీఆర్ సభావత్ నాయక్ మాట్లాడుతూ– "క్యూబా తర్వాత ప్రపంచంలో, తొలిసారి భారతీయ చిత్ర పరిశ్రమలో రూపొందుతున్న చేగువేరా బయోపిక్ 'చే'. విప్లవ వీరుడు, యువతకి స్ఫూర్తి అయిన చేగువేరా జీవిత చరిత్రను సినిమాగా తీయడం చాలా గర్వంగా ఉంది. ఆయన చేసిన పోరాటలు, త్యాగాలు ఈ చిత్రంలో చూస్తారు. 'చే' పోస్టర్‌ను చేగువేరా కుమార్తె డా. అలైదా గువేరా విడుదల చేయడం అదృష్టంగా భావిస్తున్నాం. మా సినిమా ఫస్ట్ కాపీ రెడీ అయ్యింది. నవంబర్‌లో రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం" అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: కల్యాణ్ సమి, జగదీష్, సంగీతం: రవిశంకర్.



తొలిసారి ఇద్దరికి 'మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్' పురస్కారం

ప్రతి ఆసియా క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారుల్లో నుంచి ఒకరికి మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ (ఎంవీపీ) పురస్కారం అందజేస్తారు. 1998 బ్యాంకాక్ ఆసియా క్రీడల్లో తొలిసారి ఈ 'ఎంవీపీ' అవార్డును ప్రవేశపెట్టారు. గత ఆరు ఆసియా క్రీడల్లో ఒక్కరిని మాత్రమే ఈ పురస్కారం కోసం ఎంపిక చేస్తుండగా... ఈ క్రీడల్లో తొలిసారి ఇద్దరికి 'మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్' అవార్డు దక్కడం విశేషం. ఆదివారం హాంగ్జౌలో ముగిసిన 19వ ఆసియా క్రీడలకు సంబంధించి 'ఎంవీపీ' అవార్డు చైనా స్విమ్మర్లు జాంగ్ యుఫె, కిన్ హైయాంగ్‌లకు సంయుక్తంగా లభించింది. 25 ఏళ్ల మహిళా స్విమ్మర్ జాంగ్ యుఫె హాంగ్జౌ ఆసియా క్రీడల్లో ఏకంగా ఆరు స్వర్ణ పతకాలు సాధించింది. పురుషుల స్విమ్మింగ్‌లో 24 ఏళ్ల కిన్ హైయాంగ్ ఐదు పసిడి పతకాలు గెలిచాడు. బ్యాడ్మింటన్ దిగ్గజం లిన్ డాన్ (2010 గ్వాంగ్‌జౌ) తర్వాత ఆసియా క్రీడల్లో 'ఎంవీపీ' అవార్డు గెల్చుకున్న చైనా ప్లేయర్లుగా జాంగ్ యుఫె, కిన్ హైయాంగ్ గుర్తింపు పొందారు.



నగోయాలో కలుద్దాం!


ముగిసిన హాంగ్జౌ ఆసియా క్రీడలు ● వరుసగా 11వసారి పతకాల పట్టికలో చైనాయే 'టాప్'
● మొదటిసారి స్వర్ణాల్లో 'డబుల్ సెంచరీ' దాటిన చైనా
● 2026 ఆసియా క్రీడలకు జపాన్‌లోని నగోయా నగరం ఆతిథ్యం



హాంగ్జౌ: గత 16 రోజులుగా క్రీడాభిమానులను ఆద్యంతం అలరించిన ఆసియా క్రీడా సంరంభానికి ఆదివారం తెర పడింది. సెప్టెంబర్ 23న చైనాలోని హాంగ్జౌ నగరంలో అట్టహాసంగా ప్రారంభమైన 19వ ఆసియా క్రీడలు అక్టోబర్ 8న అంతే ఘనంగా ముగిశాయి. 80 వేల మంది ప్రేక్షకుల సామర్థ్యం కలిగిన 'బిగ్ లోటస్' స్టేడియంలో 75 నిమిషాల పాటు ముగింపు వేడుకలు జరిగాయి. 45 దేశాలకు చెందిన క్రీడాకారులు మైదానంలోకి రాగా... చైనా సాంస్కృతిక వారసత్వాన్ని తెలియజేస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు. చైనా ప్రీమియర్ లీ కియాంగ్ ముఖ్య అతిథిగా విచ్చేసిన ఈ కార్యక్రమంలో ఆసియా ఒలింపిక్ కౌన్సిల్ (ఓసీఏ) తాత్కాలిక అధ్యక్షుడు, భారత మాజీ దిగ్గజ షూటర్ రణ్‌ధీర్ సింగ్ 19వ ఆసియా క్రీడలు ముగిశాయని అధికారికంగా ప్రకటించారు. 'గత 16 రోజుల్లో మనమంతా ఎన్నో చిరస్మరణీయ ఘట్టాలను తిలకించాం. హాంగ్జౌకు ధన్యవాదాలు తెలుపుతున్నాం. అద్భుతంగా ఆతిథ్యం ఇచ్చిన హాంగ్జౌను ఆసియానే కాకుండా మొత్తం ప్రపంచం గుర్తు పెట్టుకుంటుంది. ఈ సందర్భంగా చైనా ప్రభుత్వానికి, చైనా ఒలింపిక్ కమిటీకి, నగర ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నాను' అని రణ్‌ధీర్ సింగ్ వ్యాఖ్యానించారు. తదుపరి 20వ ఆసియా క్రీడలు 2026లో సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జపాన్‌లోని ఐచి రాష్ట్ర రాజధాని నగోయా నగరంలో జరుగుతాయి. ముగింపు వేడుకల్లో ఐచి రాష్ట్ర గవర్నర్ ఒమురా హిడెకి, నగోయా నగర డిప్యూటీ మేయర్ నకాటా హిడియో ఆసియా క్రీడల జ్యోతితోపాటు ఆసియా ఒలింపిక్ కౌన్సిల్ పతాకాన్ని అందుకున్నారు.

- ముగింపు వేడుకల్లో భారత బృందానికి స్వర్ణ పతకం నెగ్గిన పురుషుల హాకీ జట్టు గోల్‌కీపర్ శ్రీజేశ్ పతాకధారిగా వ్యవహరించాడు. చాలా మంది భారత క్రీడాకారులు ఇప్పటికే స్వదేశానికి చేరుకోగా, ముగింపు వేడుకల్లో వంద మంది వరకు క్రీడాకారులు, అధికారులు పాల్గొన్నారు.
- మొత్తం 45 దేశాల నుంచి 40 క్రీడాంశాల్లో 12,407 మంది క్రీడాకారులు హాంగ్జౌలో పోటీపడ్డారని నిర్వాహకులు తెలిపారు.
- మూడోసారి ఆసియా క్రీడలకు ఆతిథ్యమిచ్చిన చైనా మరోసారి తమ ఆధిపత్యం చాటుకొని హాంగ్జౌలోనూ 'టాప్' ర్యాంక్‌లో నిలిచింది. చైనా 201 స్వర్ణాలు, 111 రజతాలు, 71 కాంస్యాలతో మొత్తం 383 పతకాలు సాధించి అగ్రస్థానాన్ని దక్కించుకుంది. 188 పతకాలతో జపాన్ రెండో స్థానంలో, 190 పతకాలతో దక్షిణ కొరియా మూడో స్థానంలో, 107 పతకాలతో భారత్ నాలుగో స్థానంలో నిలిచాయి.









ఓవరాల్‌గా దక్షిణ కొరియా కంటే జపాన్ రెండు తక్కువ పతకాలు గెలిచినా... కొరియాకంటే ఎక్కువ స్వర్ణ పతకాలు గెలిచినందుకు జపాన్ రెండో ర్యాంక్‌లో నిలిచింది.

- హాంగ్జౌ ఆసియా క్రీడల్లో 13 కొత్త ప్రపంచ రికార్డులు, 26 ఆసియా రికార్డులు, 97 ఆసియా క్రీడల రికార్డులు నమోదయ్యాయి.





41 హాంగ్జౌ ఆసియా క్రీడల్లో మొత్తం 45 దేశాలు పాల్గొన్నాయి. ఇందులో 41 దేశాలు కనీసం ఒక్క పతకమైనా సాధించాయి.

4 హాంగ్జౌ ఆసియా క్రీడల్లో ఒక్క పతకం కూడా నెగ్గని దేశాలు (భూటాన్, ఈస్ట్ తిమోర్, మాల్దీవులు, యెమెన్).

2 తొలిసారి బ్రూనై, ఒమన్ దేశాలు ఆసియా క్రీడల చరిత్రలో రజత పతకాలు గెలిచాయి.



4 ఒకే ఆసియా క్రీడల్లో 100 పతకాల మైలురాయిని దాటిన నాలుగో దేశంగా భారత్ గుర్తింపు పొందింది. చైనా, జపాన్, దక్షిణ కొరియా ముందే ఈ జాబితాలో ఉన్నాయి.

201 తాజా ఆసియా క్రీడల్లో చైనా గెలిచిన స్వర్ణ పతకాలు. ఈ క్రీడల చరిత్రలో తొలిసారి పసిడి పతకాల్లో 200 మైలురాయిని దాటిన తొలి దేశంగా చైనా నిలిచింది. 2010 గ్వాంగ్జౌ ఆసియా క్రీడల్లో చైనా అత్యధికంగా 199 స్వర్ణ పతకాలు గెలిచింది.

11 వరుసగా పదకొండోసారి ఆసియా క్రీడల పతకాల పట్టికలో చైనా 'టాప్' ర్యాంక్‌లో నిలిచింది. తొలిసారి చైనా 1982 న్యూఢిల్లీ ఆసియా క్రీడల్లో తొలి స్థానం దక్కించుకుంది. అప్పటి నుంచి చైనా పతకాల పట్టికలో తన నంబర్‌వన్ ర్యాంక్‌ను నిలబెట్టుకుంటోంది.

9 వరుసగా తొమ్మిదోసారి ఆసియా క్రీడల్లో చైనా 100 అంతకంటే ఎక్కువ స్వర్ణ పతకాలు సాధించింది. 1990 బీజింగ్ ఆసియా క్రీడల్లో చైనా స్వర్ణాల్లో తొలిసారి 'సెంచరీ' నమోదు చేసింది.

పతకాల పట్టిక

ర్యాంక్	దేశం	స్వ	ర	కాం	మొ
1	చైనా	201	111	71	383
2	జపాన్	52	67	69	188
3	ద. కొరియా	42	59	89	190
4	భారత్	28	38	41	107
5	ఉజ్బెకిస్తాన్	22	18	31	71
6	చైనీస్ తైపీ	19	20	28	67
7	ఇరాన్	13	21	20	54
8	థాయ్‌లాండ్	12	14	32	58
9	బహ్రెయిన్	12	3	5	20
10	ఉ. కొరియా	11	18	10	39
11	కజకిస్తాన్	10	22	38	80
12	హాంకాంగ్	8	16	29	53
13	ఇండోనేసియా	7	11	18	36
14	మలేసియా	6	8	18	32
15	ఖతర్	5	6	3	14
16	యూఏఈ	5	5	10	20
17	ఫిలిప్పీన్స్	4	2	12	18
18	కిర్గిస్తాన్	4	2	9	17
19	సౌదీ అరేబియా	4	2	4	10
20	సింగపూర్	3	6	7	16
21	వియత్నాం	3	5	19	27
22	మంగోలియా	3	5	13	21
23	కువైట్	3	4	4	11
24	తజికిస్తాన్	2	1	4	7
25	మకావు	1	3	2	6
26	శ్రీలంక	1	2	2	5
27	మయన్మార్	1	0	2	3
28	జోర్డాన్	0	5	4	9
29	తుర్క్‌మెనిస్తాన్	0	1	6	7
30	అఫ్గానిస్తాన్	0	1	4	5
31	పాకిస్తాన్	0	1	2	3
32	బ్రూనై	0	1	1	2
32	నేపాల్	0	1	1	2
32	ఒమన్	0	1	1	2
35	ఇరాక్	0	0	3	3
35	లావోస్	0	0	3	3
37	బంగ్లాదేశ్	0	0	2	2
38	కంబోడియా	0	0	1	1
38	లెబనాన్	0	0	1	1
38	పాలస్తీనా	0	0	1	1
38	సిరియా	0	0	1	1

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం. ర్యాంక్‌ను గెలిచిన స్వర్ణ, రజత, కాంస్య పతకాల ఆధారంగా వర్గీకరించారు.

2036 ఒలింపిక్స్‌కు భారత్ బిడ్ వేయాలి: పీటీ ఉష



హాంగ్జౌ: ఆసియా క్రీడల చరిత్రలోనే భారత క్రీడా బృందం ఈసారి అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి, అత్యధికంగా 107 పతకాలు సాధించడంపట్ల భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలు, దిగ్గజ అథ్లెట్ పీటీ ఉష ఆనందం వ్యక్తం చేసింది. 'ఆసియా క్రీడల్లో రికార్డుస్థాయి ప్రదర్శన తర్వాత భారత క్రీడాకారులు వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్‌పై దృష్టి సారించాలి. మన క్రీడాకారులు, కోచ్‌లు, జాతీయ క్రీడా సమాఖ్యలు శ్రమిస్తే పారిస్ ఒలింపిక్స్‌లో మన పతకాల సంఖ్య కచ్చితంగా రెండంకెలు దాటుతుంది. ఇక మనం కూడా ఒలింపిక్స్ ఆతిథ్యం కోసం బిడ్ వేయాల్సిన సమయం ఆసన్నమైంది. 2036 ఒలింపిక్స్ ఆతిథ్య హక్కుల కోసం భారత్ పోటీపడాలి' అని 59 ఏళ్ల పీటీ ఉష వ్యాఖ్యానించింది. కేవలం ఒకట్రెండు క్రీడాంశాల్లో కాకుండా వేర్వేరు క్రీడాంశాల్లో భారత్‌కు పతకాలు రావడంపట్ల రాజ్యసభ సభ్యురాలైన ఉష ఆనందం వ్యక్తం చేసింది.

తడబడినా... గెలుపు దక్కింది

1/2, 2/2, 3/2... 2 ఓవర్లు ముగిసేసరికి 3 వికెట్లు... ఆస్ట్రేలియాపై 200 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత్‌కు లభించిన ఆరంభమిది... చేపాక్ మైదానంలో అంతా నిశ్శబ్దం... ప్రపంచకప్ తొలి మ్యాచ్‌లో ప్రమాద ఘంటిక వినిపించింది. అయితే ఎప్పటిలాగే కోహ్లి బాధ్యతను తనపై వేసుకోగా కేఎల్ రాహుల్ కూడా తగిన విధంగా సహకరించాడు. ఆసీస్ బౌలర్లకు ఆపై అవకాశం ఇవ్వకుండా సాగిపోయిన ఈ జోడీ చివరకు భారత్‌ను విజయతీరం చేర్చింది. అంతకుముందు పటిష్ట ఆసీస్‌ను తక్కువ స్కోరుకే పరిమితం చేసి భారత బౌలర్లు పైచేయి సాధించారు. నెమ్మదైన చెన్నై పిచ్‌పై మన స్పిన్నర్లను ఆడలేక ప్రత్యర్థి చేతులెత్తేయడంతో టీమిండియా గెలిచేందుకు పునాది పడింది.

- ప్రపంచకప్‌లో భారత్ శుభారంభం
- ఆస్ట్రేలియాపై 6 వికెట్లతో విజయం
- రాణించిన రాహుల్, కోహ్లి
- కట్టడి చేసిన జడేజా, కుల్దీప్
- తర్వాతి మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్‌తో భారత్ 'ఢీ'



చెన్నై: సొంతగడ్డపై వన్డే ప్రపంచ కప్ వేటలో భారత్ శుభారంభం చేసింది. ఆదివారం జరిగిన తమ తొలి మ్యాచ్‌లో భారత్ 6 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాపై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 49.3 ఓవర్లలో 199 పరుగులకు ఆలౌటైంది. స్టీవ్ స్మిత్ (71 బంతుల్లో 46; 5 ఫోర్లు), డేవిడ్ వార్నర్ (52 బంతుల్లో 41; 6 ఫోర్లు) మాత్రమే ఫర్వాలేదనిపించారు. అనంతరం భారత్ 41.2 ఓవర్లలో 4 వికెట్లకు 201 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కేఎల్ రాహుల్ (115 బంతుల్లో 97 నాటౌట్; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), విరాట్ కోహ్లి (116 బంతుల్లో 85; 6 ఫోర్లు) విజయంలో కీలక పాత్ర పోషించారు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 35.4 ఓవర్లలో 165 పరుగులు జోడించారు. భారత్ తమ తదుపరి మ్యాచ్‌ను బుధవారం ఢిల్లీలో అఫ్గానిస్తాన్‌తో ఆడుతుంది.

సమష్టి వైఫల్యం...

ఓపెనర్ మిచెల్ మార్ష్ (0)ను తన రెండో ఓవర్లోనే వెనక్కి పంపి బుమ్రా భారత్‌కు శుభారంభం అందించగా... వార్నర్, స్మిత్ కలిసి ఆసీస్‌ను ఆదుకున్నారు. 10 ఓవర్లలో స్కోరు 43 పరుగులకు చేరింది. రెండో వికెట్‌కు 69 పరుగుల భాగస్వామ్యం తర్వాత భారత స్పిన్నర్ల జోరు మొదలైంది. వికెట్లు తీయడంతో పాటు పరుగులు కూడా ఇవ్వకుండా ఆసీస్‌ను భారత బౌలర్లు కట్టడి చేశారు. కుల్దీప్ చక్కటి బంతితో వార్నర్‌ను అవుట్ చేసి ఈ జోడీని విడదీయగా, తర్వాతి 3 వికెట్లు జడేజా ఖాతాలో చేరాయి. స్మిత్‌ను బౌల్డ్ చేసిన జడేజా... ఒకే ఓవర్లో లబుషేన్ (27), క్యారీ (0)లను వెనక్కి పంపాడు. ఒకదశలో 73 బంతుల పాటు ఆసీస్ బౌండరీ కొట్టలేకపోయింది! కీలక బ్యాటర్ మ్యాక్స్‌వెల్ (15)ను కుల్దీప్ బౌల్డ్ చేయగా, అదే స్కోరు వద్ద గ్రీన్ (8) వికెట్ అశ్విన్ ఖాతాలో చేరింది. అయితే మిచెల్ స్టార్క్ (35 బంతుల్లో 28; 2 ఫోర్లు, 1 సిక్స్) ఇన్నింగ్స్ ఆసీస్‌ను 200 పరుగులకు చేరువగా తీసుకొచ్చింది. కమిన్స్ (15), జంపా (6), హాజల్‌వుడ్ (1 నాటౌట్)లతో చివరి మూడు వికెట్లకు కలిపి స్టార్క్ 59 పరుగులు జోడించడం విశేషం.

భారీ భాగస్వామ్యం...

ఛేదనలో భారత జట్టు అనూహ్య రీతిలో తడబడింది. 'డెంగీ'తో శుబ్‌మన్ గిల్ మ్యాచ్‌కు దూరం కావడంతో ఓపెనర్‌గా అవకాశం దక్కించుకున్న ఇషాన్ కిషన్ (0) దూరంగా వెళుతున్న బంతిని వెంటాడి అవుట్ కాగా, హాజల్‌వుడ్ వేసిన చక్కటి బంతికి రోహిత్ శర్మ (0) వికెట్ల ముందు దొరికిపోయాడు. రోహిత్ రివ్యూ చేసినా లాభం లేకపోయింది. ఆ వెంటనే శ్రేయస్ అయ్యర్ (0) నిర్లక్ష్యపు షాట్‌తో పెవిలియన్ చేరాడు. 19 ఏళ్ల తర్వాత వన్డేల్లో భారత ఓపెనర్లిద్దరు డకౌట్ కాగా, టాప్-4లో ముగ్గురు డకౌట్ కావడం వన్డేల్లో భారత్‌కు ఇదే మొదటిసారి. వీరిద్దరి భాగస్వామ్యంలో జట్టు కోలుకుంది. 10 ఓవర్లలో భారత్ స్కోరు 27/3. లక్ష్యం మరీ పెద్దది కాకపోవడంతో కోహ్లి, రాహుల్ ఎలాంటి సాహసాలకు పోకుండా చక్కటి సమన్వయంతో నెమ్మదిగా పరుగులు రాబడుతూ ఇన్నింగ్స్‌ను నడిపించారు. 75 బంతుల్లో కోహ్లి అర్ధ సెంచరీ పూర్తి చేసుకోగా, భారత్ స్కోరు కూడా 25.3 ఓవర్లలో సరిగ్గా వంద పరుగులకు చేరింది. ఆ తర్వాత 72 బంతుల్లో రాహుల్ హాఫ్ సెంచరీని అందుకున్నాడు. ఈ జోడీని విడదీయడంలో ఆసీస్ బౌలర్లు పూర్తిగా విఫలమయ్యారు. సెంచరీ దిశగా వెళుతున్న కోహ్లి చివరకు విజయానికి 33 పరుగుల దూరంలో వెనుదిరిగాడు. అయితే హార్దిక్ పాండ్యా (11 నాటౌట్)తో కలిసి రాహుల్ ఆట ముగించాడు. గెలిచేందుకు ఐదు పరుగులు అవసరం కాగా, సిక్సర్ కొట్టిన రాహుల్‌కు కూడా సెంచరీ చేసే అవకాశం చేజారింది.



ప్రపంచకప్‌లో నేడు

న్యూజిలాండ్ X నెదర్లాండ్స్
వేదిక: హైదరాబాద్
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఆ క్యాచ్ పట్టి ఉంటే...

భారత్ స్కోరు 20/3... ఆసీస్ బౌలర్లు చెలరేగిపోతున్నారు. హాజల్‌వుడ్ వేసిన బంతిని కోహ్లి పుల్ చేయబోగా బంతి లెగ్ సైడ్ గాల్లోకి లేచింది. కీపర్ క్యారీ, మిడ్ వికెట్ నుంచి మార్ష్ ముందుకు దూసుకొచ్చారు. క్యారీ వెనక్కి తగ్గగా, క్యాచ్‌ను అందుకోగలిగే స్థితిలో ఉండి కూడా మార్ష్ చేతుల్లో పడిన బంతిని వదిలేశాడు. ఆ సమయంలో కోహ్లి స్కోరు 12. ఆ క్యాచ్ మార్ష్ పట్టి ఉంటే పరిస్థితి భిన్నంగా ఉండేదేమో!



స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: వార్నర్ (సి అండ్ బి) కుల్దీప్ 41; మార్ష్ (సి) కోహ్లి (బి) బుమ్రా 0; స్మిత్ (బి) జడేజా 46; లబుషేన్ (సి) రాహుల్ (బి) జడేజా 27; మ్యాక్స్‌వెల్ (బి) కుల్దీప్ 15; క్యారీ (ఎల్బీ) (బి) జడేజా 0; గ్రీన్ (సి) పాండ్యా (బి) అశ్విన్ 8; కమిన్స్ (సి) అయ్యర్ (బి) బుమ్రా 15; స్టార్క్ (సి) అయ్యర్ (బి) సిరాజ్ 28; జంపా (సి) కోహ్లి (బి) పాండ్యా 6; హాజల్‌వుడ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (49.3 ఓవర్లలో ఆలౌట్) 199.** వికెట్ల పతనం: 1-5, 2-74, 3-110, 4-119, 5-119, 6-140, 7-140, 8-165, 9-189, 10-199. బౌలింగ్: బుమ్రా 10-0-35-2, సిరాజ్ 6.3-1-26-1, పాండ్యా 3-0-28-1, అశ్విన్ 10-1-34-1, కుల్దీప్ 10-0-42-2, జడేజా 10-2-28-3.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (ఎల్బీ) (బి) హాజల్‌వుడ్ 0; ఇషాన్ కిషన్ (సి) గ్రీన్ (బి) స్టార్క్ 0; కోహ్లి (సి) లబుషేన్ (బి) హాజల్‌వుడ్ 85; అయ్యర్ (సి) వార్నర్ (బి) హాజల్‌వుడ్ 0; రాహుల్ (నాటౌట్) 97; పాండ్యా (నాటౌట్) 11; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (41.2 ఓవర్లలో 4 వికెట్లకు) 201.** వికెట్ల పతనం: 1-2, 2-2, 3-2, 4-167. బౌలింగ్: స్టార్క్ 8-0-31-1, హాజల్‌వుడ్ 9-1-38-3, కమిన్స్ 6.2-0-33-0, మ్యాక్స్‌వెల్ 8-0-33-0, గ్రీన్ 2-0-11-0, జంపా 8-0-53-0.



29 బంతుల్లోనే సెంచరీ

'లిస్ట్-ఎ' క్రికెట్‌లో ప్రపంచ రికార్డు

అడిలైడ్: సౌత్ ఆస్ట్రేలియా క్రికెటర్ జేక్ ఫ్రేజర్-మెక్‌గర్క్ సంచలన బ్యాటింగ్ ప్రదర్శనతో కొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. ఆస్ట్రేలియా దేశవాళీ వన్డే టోర్నీ 'మార్ష్ కప్'లో టాస్మేనియాతో జరిగిన మ్యాచ్‌లో ఫ్రేజర్ 29 బంతుల్లోనే సెంచరీ నమోదు చేశాడు. 'లిస్ట్-ఎ' క్రికెట్ (అంతర్జాతీయ, దేశవాళీ వన్డేలు కలిపి)లో ఇది ఫాస్టెస్ట్ సెంచరీగా నమోదైంది. 2015లో వెస్టిండీస్‌తో జరిగిన వన్డేలో దక్షిణాఫ్రికా బ్యాటర్ ఏబీ డివిలియర్స్ 31 బంతుల్లో శతకం బాదాడు. ఇప్పుడు ఆ రికార్డును 21 ఏళ్ల ఫ్రేజర్ బద్దలు కొట్టాడు. కరేన్ రోల్టన్ ఓవల్ మైదానంలో జరిగిన ఈ మ్యాచ్‌లో తొలి 18 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సర్లతో 53 పరుగులు చేసిన ఫ్రేజర్... మరో 11 బంతుల్లోనే సెంచరీని అందుకున్నాడు. ఇన్నింగ్స్ 9వ ఓవర్లోనే వచ్చిన అతని శతకంలో 6 ఫోర్లు, 12 సిక్సర్లు ఉన్నాయి. చివరకు 38 బంతుల్లో 10 ఫోర్లు, 13 సిక్సర్లతో 125 పరుగులు చేసి అతను అవుటయ్యాడు. ఫ్రేజర్ రికార్డు కొట్టినా చివరకు టాస్మేనియానే గెలిచింది. 436 లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో సౌత్ ఆస్ట్రేలియా 398 పరుగులకు ఆలౌటైంది.

'కివీస్ తమ స్థాయిని చూపించింది'

కృష్ణమాచారి శ్రీకాంత్

తొలి మ్యాచ్‌లో ఇంగ్లండ్‌పై సాధించిన ఘనవిజయం కారణంగా న్యూజిలాండ్ గురించి ఇప్పుడు ఇతర టీమ్‌ల దృష్టి కోణం మారి ఉంటుంది. ఫేవరెట్‌గా బరిలోకి దిగిన ఇంగ్లండ్‌ను కివీస్ దెబ్బకొట్టింది. వేగంగా లక్ష్యం చేరిన ఆ జట్టు గెలుపుతో పాటు మెరుగైన రన్‌రేట్‌ను కూడా సాధించింది. ఇలాంటి పెద్ద టోర్నీల్లో సెమీస్ చేరేందుకు రన్‌రేట్ కూడా కీలకంగా మారుతుంది. తర్వాతి మ్యాచ్‌లో కివీస్‌కు నెదర్లాండ్స్ పోటీనిచ్చే అవకాశం కనిపించడం లేదు. పాకిస్తాన్‌తో మ్యాచ్‌నూ మెరుగ్గానే ఆరంభించినా 'డచ్' దానిని నిలబెట్టుకోలేకపోయింది. డి లీడ్ అద్భుతంగా ఆడినా ఇలాంటి మ్యాచ్‌లో ఒకరి కంటే ఎక్కువ మంది మంచి ప్రదర్శన ఇవ్వాల్సి ఉంటుంది. ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో కాన్వే, రచిన్ అదే చూపించారు. కాన్వే ఐపీఎల్‌లో ఇప్పటికే సత్తా చాటగా, రచిన్ కొత్తగా వచ్చాడు. రాహుల్, సచిన్ పేర్లను కలిపి పెట్టుకున్న అతను వారిద్దరు గర్వపడేలా ఆడాడు. అతని బ్యాటింగ్‌లో రవీంద్ర జడేజా పోలికలు కనిపిస్తున్నాయి. అతనిలాగే ఇతనూ లెఫ్టార్మ్ స్పిన్నరే. ముగ్గురు టాప్ ఆటగాళ్లు కలగలిసిన వ్యక్తి అంటే అతని ఆట కూడా అంతే స్థాయిలో ఉండాలి కదా. భారతీయ మూలాలు ఉన్న రచిన్ ఆట శైలి కూడా సగటు న్యూజిలాండర్‌లా లేదు. చక్కటి టైమింగ్, పదునైన స్ట్రోక్‌లతో ఇంగ్లండ్ బౌలింగ్‌ను దెబ్బ కొట్టిన అతని ఆట నాకు బాగా నచ్చింది. విలియమ్సన్‌లాంటి పలువురు కీలక ఆటగాళ్లు లేకుండానే బరిలోకి దిగి కూడా న్యూజిలాండ్ 9 వికెట్ల ఘనవిజయంతో టోర్నీ తొలి మ్యాచ్‌లోనే తమ స్థాయిని ప్రదర్శించింది. నేటి మ్యాచ్‌లో నెదర్లాండ్స్ కూడా చివరి వరకు పోరాడవచ్చేమో కానీ కివీస్‌కు మరో రెండు పాయింట్లు రాకపోతే ఆశ్చర్యపోవాల్సిందే.

ఆయుష్ శెట్టికి కాంస్యం

న్యూఢిల్లీ: ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత పోరాటం ముగిసింది. అమెరికాలో జరుగుతున్న ఈ మెగా ఈవెంట్‌లో భారత ప్లేయర్ ఆయుష్ శెట్టి సెమీఫైనల్లో 18-21, 15-21తో నాలుగో సీడ్ అల్వీ ఫర్హాన్ (ఇండోనేసియా) చేతిలో ఓడిపోయి కాంస్య పతకాన్ని సాధించాడు. ఈ టోర్నీ చరిత్రలో భారత్ ఇప్పటి వరకు 11 పతకాలు లభించాయి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
364	108
65,996	19,654

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)		
నాస్‌డాక్	13,431	▲ 212
డోజోన్స్	33,408	▲ 288
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,495	▲ 43
డాక్స్	15,300	▲ 160
షాంఘై (సెప్టెంబర్ 28 ముగింపు)	3,110	▲ 3
నికాయ్	31,031	▽ 22

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.47	84.14
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	98.86	103.18
€	యూరో	ఎస్‌బీఐ	86.29	89.38
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.20	56.92
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.07	54.37
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.97	61.91
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.24	22.87
UAE D	యూఏఈ దిర్హమ్	థామస్‌కుక్	21.77	23.56
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.28	12.35

క్రెడిట్ కార్డ్.. లిమిట్ పెంచుకుంటున్నారా?



▲ బ్యాంక్‌ల నుంచి అదే పనిగా ఆఫర్లు
▲ కార్డ్ అప్‌గ్రేడ్ చేసుకోవాలంటూ సూచనలు
▲ వినియోగం పెరిగినప్పుడే అదనపు లిమిట్
▲ సీయూఆర్ 30 శాతం మించొద్దు
▲ లేదంటే క్రెడిట్ స్కోరుపై ప్రభావం

క్రెడిట్ కార్డ్ వినియోగం మన దేశంలో శరవేగంగా వృద్ధి చెందుతోంది. 2023 ఏప్రిల్ నాటికి దేశవ్యాప్తంగా 8.6 కోట్ల క్రెడిట్ కార్డులు ఉన్నాయి. 2022 ఏప్రిల్ నాటికి ఉన్న 7.5 కోట్లతో పోలిస్తే ఏడాదిలో 15 శాతం పెరిగాయి. 2024 ఆరంభం నాటికి వీటి సంఖ్య 10 కోట్లకు చేరుకుంటుందని ఆర్‌బీఐ గణాంకాలు చెబుతున్నాయి. క్రెడిట్ కార్డులతో షాపింగ్ చేస్తే తగ్గింపులతో పాటు, రివార్డులు, ఉచిత మూవీ టికెట్లు ఇలా ఎన్నో ఆఫర్లు వినియోగాన్ని పెంచుతున్నాయి. క్రెడిట్ కార్డులు తీసుకున్న తర్వాత దాన్ని అప్‌గ్రేడ్ చేసుకోవాలని, క్రెడిట్ లిమిట్ పెంచుకోవాలంటూ బ్యాంక్‌లు కోరుతుండడం చాలా మందికి అనుభవమే. చాలా మంది తమ కార్డును అప్‌గ్రేడ్ చేసుకోవడం లేదంటే క్రెడిట్ లిమిట్ (అప్పు పరిమితి) పెంచుకోవడానికి ఆసక్తి చూపిస్తుంటారు. కార్డ్ అప్‌గ్రేడ్ లేదా క్రెడిట్ లిమిట్ పెంపుతో ప్రయోజనాలున్నట్టే.. కొన్ని రిస్కులు లేకపోలేదు. కంపెనీలు ఇచ్చే ఆఫర్లకు ఓకే చెప్పడానికి ముందు ఇందులో ఉండే చిక్కుల గురించి కూడా తెలుసుకోవాలి. ఆ తర్వాత దీనిపై నిర్ణయానికి రావాలి..

''క్రెడిట్ పరిమితి (లిమిట్) పెంపు లేదా క్రెడిట్ కార్డ్ అప్‌గ్రేడ్ ఆఫర్‌ను, కార్డుదారుడి ఇటీవలి రుణ చరిత్ర ఆధారంగానే బ్యాంక్‌లు ఇస్తుంటాయి. ముఖ్యంగా ప్రస్తుత కార్డుపై ఉన్న పనితీరును చూసిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకుంటుంటాయి. కార్డుదారుడి ఆదాయ స్థాయి పెరిగినట్టు బ్యాంక్ భావించిన సందర్భాల్లోనూ ఈ ఆఫర్లు ఇస్తుంటాయి''అని విష్‌ఫిన్ సీఈవో రిషి మెహ్రా తెలిపారు. బ్యాంక్ నుంచి క్రెడిట్ కార్డ్ అప్‌గ్రేడ్ లేదా లిమిట్ పెంపు ఆఫర్ వచ్చిందంటే అది కచ్చితంగా రుణ పరపతి పెరిగిన దానికి సంకేతంగా చూడొచ్చు. అయితే, సంబంధిత ఆఫర్ లేదా అభ్యర్థనను ఆమోదించే ముందు తప్పకుండా సానుకూలతలు, ప్రతికూలతల గురించి విశ్లేషించుకోవాలని రిషి మెహ్రా సూచించారు.

అప్‌గ్రేడ్ మంచికేనా..?

ఉన్నత శ్రేణి క్రెడిట్ కార్డ్ తీసుకుంటే, దానిపై రుణం రేటు, రివార్డులు, క్యాష్ బ్యాక్, డిస్కౌంట్లు, డీల్స్ కూడా మెరుగ్గానే ఉంటుంటాయి. దీంతో కార్డును అప్‌గ్రేడ్ చేసుకోవడం వల్ల అధిక రివార్డులు, క్యాష్‌బ్యాక్, ఇతర ప్రయోజనాలు లభిస్తుంటాయి. కాకపోతే కార్డ్‌పై నిర్దేశిత వ్యయాలు చేయాలనే నిబంధనలు ఉంటాయని మర్చిపోవద్దు. అప్‌గ్రేడెడ్ కార్డుకు వెళ్లకుండా, ఎన్నేళ్లు గడిచిన అదే పాత కార్డ్‌లోనే కొనసాగే వారు మంచి డీల్స్‌ను కోల్పోవాల్సి రావచ్చు. ''పాతబడిన క్రెడిట్ కార్డ్ ఆధునిక ఫీచర్లు, ప్రయోజనాలు ఇవ్వకపోవచ్చు. నేడు దాదాపు చాలా క్రెడిట్ కార్డ్ సంస్థలు అర్హులైన కస్టమర్లకు ఉచిత ఎయిర్‌పోర్ట్ లాంజెస్ సదుపాయాన్ని ఆఫర్ చేస్తున్నాయి. ప్రతీ లావాదేవీపై డిస్కౌంట్, క్యాష్ బ్యాక్, క్రెడిట్ లిమిట్‌ను పెంచుతున్నాయి. పాత కార్డ్‌లోనే కొనసాగడం వల్ల.. బిల్లులను సకాలంలో చెల్లించడం వల్ల లభించే నూతన, అదనపు ప్రయోజనాలను కోల్పోవాల్సి వస్తుంది''అని బ్యాంక్ బజార్ సీఈవో ఆదిల్ శెట్టి వివరించారు.



అధిక లిమిట్ లాభమేనా?

క్రెడిట్ లిమిట్ కంటే తక్కువ ఖర్చు చేసే వారి పట్ల క్రెడిట్ బ్యూరోలు సానుకూలంగా వ్యవహరిస్తాయి. ''క్రెడిట్ బ్యూరోలు క్రెడిట్ స్కోరును ఎన్నో అంశాల ఆధారంగా లెక్కిస్తుంటాయి. అందులో క్రెడిట్ వినియోగం ఒకటి. తక్కువ క్రెడిట్ వినియోగ రేషియో (సీయూఆర్) అన్నది.. లిమిట్‌ను వినియోగించుకునే విషయంలో ఎంత బాధ్యతగా ఉన్నదీ తెలియజేస్తుంది. క్రెడిట్‌పై ఎక్కువగా ఆధారపడడం లేదని సంకేతం ఇస్తుంది. ఇది ఒకరి క్రెడిట్ స్కోర్‌పై సానుకూల ప్రభావం చూపిస్తుంది''అని ఆదిల్ శెట్టి వివరించారు. కార్డుపై ఉన్న మొత్తం లిమిట్‌లో ఎంత శాతం ప్రతి నెలా వినియోగిస్తున్నారన్నది క్రెడిట్ వినియోగ రేషియో రూపంలో తెలుస్తుంది. ఇది తక్కువగా ఉంటే సానుకూలం అవుతుంది. ''ఉదాహరణకు క్రెడిట్ కార్డుపై క్రెడిట్ లిమిట్ రూ.లక్షగా ఉంటే, ప్రతి నెలా వినియోగిస్తున్నది రూ.50,000గా ఉంటే అప్పుడు సీయూఆర్ 50 శాతం అవుతుంది. అదే క్రెడిట్ లిమిట్ రూ.1,50,000 అయి ఉండి, వినియోగించే మొత్తం ప్రతి నెలా రూ.50,000 స్థాయిలోనే ఉంటే, అప్పుడు వినియోగ రేషియో 33 శాతం అవుతుంది''అని శెట్టి తెలియజేశారు. క్రెడిట్ స్కోర్ సగటున 700–750 మధ్య ఉంటే, దీన్ని పెంచుకునేందుకు అధిక క్రెడిట్ లిమిట్ సాయపడుతుంది. ''సగటు స్కోరులో ఉన్న వ్యక్తి (750లోపు) క్రెడిట్ లిమిట్ పెంచుకోవడం వల్ల అప్పుడు వారి క్రెడిట్ స్కోరు సైతం 750 ఎగువకు చేరుతుంది. అప్పటికే ఎక్కువ స్కోర్‌లో ఉన్న వారు క్రెడిట్ లిమిట్ పెంచుకోవడం వల్ల అదనంగా పొందేదేమీ ఉండదు''అని మెహ్రా సూచించారు. తక్కువ సీయూఆర్ వ్యక్తి ఆర్థిక ఆరోగ్యంపైనా సానుకూల ప్రభావం చూపిస్తుందని ఆదిల్‌శెట్టి సూచించారు. ''సీయూఆర్ తక్కువగా ఉంటే మీరు మీ ఆర్థిక వ్యవహారాలను ఎంతో క్రమశిక్షణగా నిర్వహిస్తున్నట్టు తెలియజేస్తుంది. డిఫాల్ట్ అవకాశాలు దాదాపు తక్కువగా ఉంటాయని సంకేతమిస్తుంది. రుణాల విషయంలో సరైన నడవడిక, సకాలంలో చెల్లింపులు, రుణాల్లో సరైన సమతుల్యం (వివిధ రుణాలు) అనేవి మంచి క్రెడిట్ స్కోరుకు దారితీస్తాయి''అని శెట్టి తెలిపారు.

రిస్కులు ఇవీ..

అధిక క్రెడిట్ లిమిట్‌తో ఉండే అతిపెద్ద రిస్క్ పరిమితికి మించి ఖర్చు చేయడం. ''ఎక్కువ లిమిట్ ఉంటే, అవసరాలు ఏర్పడినప్పుడు ఆలోచించకుండా ఖర్చు చేస్తుంటారు. సకాలంలో చెల్లింపులు చేయలేకపోతే అది భారంగా మారుతుంది. క్రెడిట్ స్కోర్‌ను దెబ్బతీస్తుంది. మీ కార్డ్ నిర్వహణ భద్రంగా లేకపోతే అది దుర్వినియోగం అయ్యే ప్రమాదం లేకపోలేదు. మోసపూరిత లావాదేవీలకు ఆస్కారం ఉంటుంది''అని మెహ్రా పేర్కొన్నారు. కార్డు వినియోగం విషయంలో జాగ్రత్తగా, నియంత్రణతో వ్యవహరించకపోతే అది ప్రతికూలంగా మారే అవకాశం లేకపోలేదు. అధికంగా వినియోగించడం వల్ల అప్పుడు క్రెడిట్ వినియోగ రేషియో (సీయూఆర్) పెరిగేందుకు దారితీస్తుంది. సీయూఆర్ ఎక్కువ అయితే అది క్రెడిట్ స్కోర్‌ను వెనక్కి లాగేస్తుంది. ఒకవేళ ఖర్చులు ఎక్కువగా ఉంటే, అప్పటికే ఉన్న క్రెడిట్ లిమిట్‌లో అధిక శాతం వినియోగించాల్సి వస్తుంటే.. అప్పుడు క్రెడిట్ లిమిట్‌ను పెంచుకోవాలి. సీయూఆర్ 30 శాతం మించకుండా చూసుకోవాలి. దీనితోపాటు క్రమశిక్షణతో కార్డును వినియోగించడం, సకాలంలో చెల్లింపులు చేయడం చాలా కీలకమవుతుంది.

ఆఫర్‌కు ఓకే చెప్పాలా..?

బ్యాంక్‌లు, లేదా క్రెడిట్ కార్డ్ కంపెనీలు తరచుగా కార్డ్ అప్‌గ్రేడ్ లేదా లిమిట్ పెంచుకోవాలంటూ ఆఫర్లు ఇస్తుంటాయి. అప్పుడు తమ వైపు నుంచి సమీక్షించుకోవాలి. ఖర్చు చేసేందుకు అదనపు వెసులుబాటు ఉందా? రివార్డుల పరంగా ఆ కార్డ్ మెరుగైనదా? లేదంటే తమ అవసరాలకు ఉపయోగపడే ప్రత్యేక కార్డా? సెక్యూరిటీ ఫీచర్లు ఏ మేరకు? ఇవన్నీ చూడాలి. ముఖ్యంగా ఒక క్రెడిట్ కార్డ్‌తోనే ఒక వ్యక్తి క్రెడిట్ హిస్టరీ పరిమితం కాదు. ఇతర బ్యాంక్‌ల నుంచి రుణాలు, కార్డులు తీసుకోవాల్సి వస్తే, మీ పరిస్థితి ఏంటన్నది కూడా చూడాలి. మంచి క్రెడిట్ స్కోర్, క్రెడిట్ హిస్టరీ ఉంటే ఇతర కార్డ్ కంపెనీలు సైతం ఆకర్షణీయమైన ఆఫర్లు ఇస్తుంటాయి. ''బ్యాంక్ ఇచ్చిన ఆఫర్ తమ ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగానే ఉందా? ఖర్చు చేసే ధోరణికి అనుకూలంగా ఉందా?మరిన్ని ప్రయోజనాలు లభిస్తున్నాయా? వీటికి అవుననే సమాధానం వస్తే, అప్పుడు ఆ కార్డ్ ఆఫర్‌ను ఆమోదించొచ్చు. తాజా ఆఫర్‌కు సంబంధించి షరతులు మీకు అనుకూలంగా లేకపోతే, మీ లక్ష్యాలకు అనుకూలమైన ఇతర కార్డ్‌ను పరిశీలించొచ్చు''అని ఆదిల్ శెట్టి సూచించారు. క్రెడిట్ కార్డ్ లిమిట్ పెంపు లేదా కార్డ్ అప్‌గ్రేడేషన్ అదనపు సదుపాయాలతో రావడమే కాదు, వార్షిక ఫీజు కూడా అధికంగా ఉంటుంది. అందుకని అప్‌గ్రేడ్‌ను ఎంపిక చేసుకునే ముందు పడే భారం ఎంత, ప్రయోజనాలు ఏ మేరకో చూడాలి. చాలా వరకు బ్యాంక్‌లు కార్డ్‌పై వార్షికంగా ఇంత వ్యయం చేస్తే, వార్షిక నిర్వహణ చార్జీని మాఫీ చేస్తున్నాయి. దీంతో సులభంగానే ఈ భారం పడకుండా చూసుకోవచ్చు.


క్రెడిట్ కార్డ్ సంస్థ నుంచి ఎలాంటి ఆఫర్లు రానప్పుడు.. ఇంతకంటే మెరుగైన కార్డ్‌కు తాను అర్హుడినని భావిస్తే, అప్పుడు కార్డుదారుడే స్వయంగా లిమిట్ పెంచాలని లేదా కార్డ్‌ను అప్‌గ్రేడ్ చేయాలని కోరొచ్చు. ''క్రెడిట్ కార్డ్ తీసుకున్న తర్వాత తమ ఆదాయం పెరిగితే అప్పుడు క్రెడిట్ లిమిట్ పెంపునకు అర్హత లభించినట్టుగా భావించొచ్చు. క్రెడిట్ కార్డ్ కంపెనీతో దీర్ఘకాల బంధం ఉన్నవారు తమ లిమిట్ పెంచుకునే అనుకూలతతో ఉంటారు. కొన్ని ప్రయోజనాలు ప్రీ అప్రూవ్ (ముందే ఆమోదించినది)గా ఉంటాయి''అని శెట్టి వివరించారు.

ఇలా అయితే సమ్మతి..

అప్‌గ్రేడ్ చేసుకోవడం, క్రెడిట్ లిమిట్ పెంచుకోవడం పూర్తిగా అవసరాల ప్రాతిపదికనే ఉండాలన్నది మర్చిపోవద్దు. ఆదాయం పెరిగినప్పుడు, మరింత ఖర్చు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడినప్పుడే క్రెడిట్ లిమిట్, క్రెడిట్ కార్డ్ అప్‌గ్రేడేషన్‌కు వెళ్లాలని మెహ్రా సూచిస్తున్నారు. ''ఒక వ్యక్తి ఖర్చులు ఎప్పుడూ ఒకే మాదిరిగా ఉండవు. కొంత కాలానికి ఇందులో మార్పు వస్తుంటుంది. అలాంటప్పుడు కార్డ్‌ను మార్చుకోవచ్చు. ప్రస్తుత కార్డ్ ప్రయోజనాల్లో మార్పులు చోటు చేసుకున్నప్పుడు, అవి తమకు అనుకూలంగా లేకపోతే కార్డ్ అప్‌గ్రేడేషన్‌ను కోరొచ్చు. ఉదాహరణకు ఒక బ్యాంక్ ఒక కార్డ్‌ను ఉపసంహరించి, దాని స్థానంలో వేరేది ఇస్తున్నట్టు అయితే, అందులో ప్రయోజనాలు అంత ఆకర్షణీయంగా లేవనిపిస్తే అప్పుడు అప్‌గ్రేడ్ చేయాలని కోరొచ్చు''అని మెహ్రా సూచించారు. అప్‌గ్రేడ్ ద్వారా తీసుకునే కార్డులో ప్రయోజనాలు తమకు అనుకూలంగా, ఆకర్షణీయంగా ఉన్నాయేమో చూసుకోవాలి. అంతేకానీ ఆఫర్లు ఆకర్షణీయంగా ఉన్నాయని ఓకే చెప్పాల్సిన అవసరం లేదు.

2024 ఆఖరు నాటికి పూర్తి స్థాయిలో పసిడి ఉత్పత్తి

- జొన్నగిరి ప్రాజెక్టుపై డీజీఎంఎల్ ఎండీ ప్రసాద్ వెల్లడి



న్యూఢిల్లీ: జొన్నగిరి బంగారు గనుల్లో వచ్చే ఏడాది అక్టోబర్–డిసెంబర్ నాటికి పూర్తి స్థాయిలో ఉత్పత్తి ప్రారంభం కాగలదని డెక్కన్ గోల్డ్ మైన్స్ (డీజీఎంఎల్) ఎండీ హనుమ ప్రసాద్ తెలిపారు. ప్రస్తుతం నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని ఆయన వివరించారు. పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే ఏటా 750 కిలోల బంగారం వెలికి తీయొచ్చని ప్రసాద్ తెలిపారు. ఇప్పటివరకు దీనిపై రూ. 200 కోట్లు ఇన్వెస్ట్ చేయగా పైలట్ ప్రాతిపదికన ప్రస్తుతం నెలకు ఒక కేజీ మేర బంగారాన్ని మైనింగ్ చేస్తున్నారు. 2013లో తమకు గనిని కేటాయించగా, ప్రాజెక్టు మదింపును పూర్తి చేసేందుకు 8–10 ఏళ్లు పట్టినట్లు ప్రసాద్ చెప్పారు. అటు కిర్గిజ్‌స్తాన్‌లో తమకు 60 శాతం వాటాలున్న మరో బంగారు గనిలో కూడా 2024 అక్టోబర్–నవంబర్‌లో ఉత్పత్తి ప్రారంభం కాగలదని ఆయన పేర్కొన్నారు. ఆల్టిన్ టోర్ గోల్డ్ ప్రాజెక్టు నుంచి ఏటా 400 కేజీల బంగారం వెలికితీయొచ్చని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలో జొన్నగిరి బంగారు గని ఉంది. బీఎస్‌ఈలో లిస్టయిన ఏకైక గోల్డ్ మైనింగ్ కంపెనీ డీజీఎంఎల్. జొన్నగిరి ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్న జియో మైసూర్ సర్వీసెస్ ఇండియాలో డీజీఎంఎల్‌కు మెజారిటీ (40 శాతం) వాటాలు ఉన్నాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

09-10-2023	
విశాఖ	540–00
చిత్తూరు	553–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	538–00
విజయవాడ	538–00
రిటైల్ ధర (డజను)	72.00
08-10-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	510–00
వరంగల్	512–00
రిటైల్ ధర	5.70

ఇమామీ లిమిటెడ్	ఎమ్‌కే గ్లోబల్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 527
టార్గెట్: రూ. 625



ఎందుకంటే: బిజినెస్ ప్రాస్పెక్ట్స్‌ను మెరుగుపరిచేందుకు కంపెనీ యాజమాన్యం తీసుకుంటున్న చర్యలు సానుకూల అంచనాలకు కారణమయ్యాయి. యాజమాన్యంలో వృత్తినిపుణులను నియమించుకుంటోంది. కీలక విభాగాలను పటిష్టతకు తగిన ప్రణాళికలతో పాటు.. నూతన కార్యకలాపాలకూ తెరతీస్తోంది. చిన్నతరహా డీటూసీ, ప్రాంతీయ బ్రాండ్లతో పోర్ట్‌ఫోలియోను నిర్మించుకుంటోంది. వ్యూహాత్మకంగా దృష్టిని సారించడం ద్వారా పెట్టుబడులను వెచ్చిస్తోంది. ఉత్తరాదికి చెందిన భారీ జనరల్ ట్రేడ్ కంపెనీ యాగ్జియామ్ ఆయుర్వేదలో 26 శాతం వాటాను కొనుగోలు చేస్తున్నట్లు ప్రకటించింది. ఆరోగ్య సంబంధ జ్యూస్‌ల ద్వారా అత్యధిక ఆదాయం ఆర్జిస్తున్న కంపెనీలో వ్యూహాత్మకంగా ఇన్వెస్ట్ చేస్తోంది. కంపెనీ కార్యకలాపాలు వృద్ధి చెందాక వాటాను మరింత పెంచుకునే యోచనలోఉంది. ఫైనాన్షియల్ పెట్టుబడి వ్యూహాలలో భాగంగా ప్రస్తుతం కంపెనీ చేతిలో ఐదు సంస్థలలో వాటాలున్నాయి. ఉమ్మడిగా రూ. 260 కోట్ల అమ్మకాలు నమోదవుతున్నాయి. యాగ్జియామ్‌కంటే ముందు నాలుగు ప్రాంతీయ బ్రాండ్లలో ఇన్వెస్ట్ చేసింది. ఇవి.. హీలియోస్ లైఫ్ స్టైల్(ద మ్యాన్ కంపెనీ), బ్రిల్లారీ, ట్రూనేటివ్, ఫర్ బాల్ స్టోరీ. వీటిలో మిగిలిన వాటా ఆయా మాతృ సంస్థల చేతిలోనే ఉంది. ఏ ఇతర ఇన్వెస్టర్లకూ వాటాలు లేకపోవడం గమనార్హం! అమ్మకాలు పుంజుకున్నాక వీటిలో వాటాలు పెంచుకునేందుకు ఇమామీకి వీలుంది. ప్రత్యర్థి కంపెనీలతో పోలిస్తే ఇమామీ ఫైనాన్షియల్ పెట్టుబడి వ్యూహాలు లబ్ధి చేకూర్చనున్నట్లు భావించవచ్చు.

ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్	హెచ్ఎస్‌బీసీ గ్లోబల్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 631
టార్గెట్: రూ. 790



ఎందుకంటే: ప్రయివేట్ రంగ ఎన్‌బీఎఫ్‌సీ.. ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ లిమిటెడ్ ఈ ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికాని(ఏప్రిల్–జూన్)కల్లా 8.3 బిలియన్ డాలర్ల నిర్వహణలోని ఆస్తుల(ఏయూఎం)ను కలిగి ఉంది. పలు రాష్ట్రాలలో బహుళ బ్రాంచీల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకుంది. ఇటీవల కొన్నేళ్లలో పారిశ్రామిక, జాతీయ సంక్షోభాలు ఎదురైన నేపథ్యంలో బిజినెస్‌ను నాలుగు విభాగాలుగా ఏర్పాటు చేసి పటిష్ట చర్యలు తీసుకుంది. 2016లో లిక్విడిటీకి చెక్ పెట్టిన పెద్ద నోట్ల రద్దు, 2018లో ఫైనాన్షియల్ సిస్టమ్‌ను దెబ్బకొట్టిన ఐఎల్అండ్ఎఫ్ఎస్ దివాలా, 2020–21లో కోవిడ్–19 మహమ్మారి పలు వ్యవస్థలను దెబ్బతీశాయి. అయితే పటిష్ట రిస్క్ మేనేజ్‌మెంట్, పంపిణీ, టెక్నాలజీపై భారీ పెట్టుబడులు, వృద్ధికి వీలుగా భాగస్వామ్యాలు, కొన్ని రుణాలను బ్యాంకులకు విక్రయించే సహరుణ పద్ధతులు వంటివి కంపెనీ చేపట్టింది. ప్రధానంగా రిటైల్ ఏయూఎంలో పటిష్ట వృద్ధి, అతి తక్కువ ఆటుపోట్లను చవిచూసే వీలున్న రుణాల నాణ్యత కంపెనీ రీరేటింగ్‌సహా.. ఆర్‌వోఏ మరింత మెరుగుపడేందుకు తోడ్పాటునివ్వగలవని భావిస్తున్నాం. డివిడెండ్ డిస్కౌంట్(గార్డాన్ గ్రోత్) ప్రాతిపదికన వచ్చే ఆర్థిక సంవత్సరానికి(2024–25) కన్సాలిడేటెడ్ షేరు పుస్తక విలువ (బీవీపీఎస్) అంచనాలను పెంచుతున్నాం. అయితే బిజినెస్‌లలో హెచ్చుతగ్గులు, రుణాల నాణ్యత, సహరుణ నిబంధనలలో సవరణలు, డిజిటల్ రుణాలువంటి కొత్త విభాగాలలోకి ప్రవేశించడం, కఠిన లిక్విడిటీ పరిస్థితులు, ఆర్‌బీఐ రెపో రేటు పెంపు తదితర అంశాలను ప్రధాన రిస్కులుగా పేర్కొనవచ్చు.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

జోయాలుక్కాస్ చైర్మన్‌కు ప్రత్యేక పురస్కారం





జాయ్ అలుక్కాస్

హైదరాబాద్: జోయాలుక్కాస్ గ్రూప్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జాయ్ అలుక్కాస్ ప్రపంచ జ్యువెలరీ సమాఖ్య నుంచి ప్రత్యేక పురస్కారం అందుకున్నారు. వరల్డ్ జ్యువెలరీ కాన్ఫెడరేషన్(సీబీజేఓ) జైపూర్‌లో నిర్వహించిన కాంగ్రెస్ 2023 కార్యక్రమంలో సంస్థ ఎండీ జాన్ పాల్ అలుక్కాస్.. చైర్మన్, ఎండీ జాయ్ అలుక్కాస్ తరఫున ఈ గౌరవాన్ని స్వీకరించారు. సప్లై చైన్‌లో నైతిక పద్ధతులు, సుస్థిరతలకు సాటిలేని కృషిని వరల్డ్ జ్యువెలరీ కాన్ఫెడరేషన్ గుర్తించింది. ''ఈ గుర్తింపును మా సంస్థలో ప్రతి ఒక్క సభ్యునితో భాగస్వామ్యం చేస్తున్నాను'' అని జాయ్‌అలుక్కాస్ తెలిపారు.

ఎఫ్అండ్‌వో ట్రేడ్ అనుకూల సాధనమేనా?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

Q & A

నేను సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో ఈక్విటీ పథకంలో ఇన్వెస్ట్ చేయాలనుకుంటున్నాను. ఇందుకు వారం వారీ సిప్ లేదా నెలవారీ సిప్ ఏది ఎంపిక చేసుకోవాలి? - అమర్ సహాని

నేను ఈ రెండింటిని పోల్చి ఎటువంటి వివరణాత్మక అధ్యయనం చేయలేదు. కానీ ఫలితాలు యాదృచ్ఛికంగా ఉంటాయని తెలుసు. వారం వారీ సిప్‌ను ఎంపిక చేసుకుని ఇన్వెస్ట్‌మెంట్‌ను మరింత క్లిష్టం చేసుకోవడం ఎందుకు? అన్నది నా అభిప్రాయం. వారం వారీ అంటే నెలలో నాలుగు సార్లు పెట్టుబడుల లావాదేవీలు నమోదవుతాయి. దీంతో లావాదేవీల నివేదిక కూడా చాంతాడంత ఉంటుంది. దీన్ని పరిశీలించుకోవడం కూడా ఇబ్బందే. మూలధన లాభాల విషయాన్ని పరిశీలించినా లావాదేవీలు భిన్న ఎన్ఏవీలతో ఉంటాయి. తిరిగి వీటిని వెనక్కి తీసుకునే సమయంలో మూలధన లాభాల పన్ను లెక్కించడం కూడా క్లిష్టంగా మారుతుంది.

డిజిటల్‌గా ఇన్వెస్ట్ చేస్తున్నాం కదా అని అనుకోవచ్చు. కానీ, తక్కువ మొత్తంతో ఎందుకు అంత తరచుగా సిప్ చేసుకోవడం? దీనికి బదులు మేము అయితే నెలవారీ సిప్‌నే సూచిస్తుంటాం. ఇన్వెస్టర్ల నగదు ప్రవాహ కాలాలకు (నెలవారీ ఆదాయం) అనుగుణంగా ఉంటుంది. మన ఆదాయం నెలవారీగా వస్తుంటుంది. అందుకనే నెలవారీగా ఇన్వెస్ట్ చేసుకోవడం సముచితం. కనుక గతం నుంచి అమల్లో ఉన్న నెలవారీ సిప్‌కు వెళ్లమనే నా సూచన.

ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ అంటే ఏమిటి? వాటిల్లో ట్రేడ్ చేయవచ్చా? - యోగేష్

ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ అన్నవి రెండు ప్రముఖ డెరివేటివ్ సాధనాలు. స్టాక్స్‌లో ముందస్తుగా అంగీకరించిన ధరకు, భవిష్యత్తు తేదీపై ట్రేడ్ చేయడం. షేర్లు కొనుగోలు చేయాలంటే విలువ మేర మొత్తం ముందే చెల్లించాలి. కానీ, ఫ్యూచర్స్‌లో అయితే మొత్తం కాంట్రాక్టు విలువలో నిర్దేశిత శాతం ముందు చెల్లిస్తే సరిపోతుంది. ఉదాహరణకు ఫ్యూచర్స్‌లోని స్టాక్ కాంట్రాక్టు విలువలో 20 శాతం అనుకుంటే, అచ్చమైన ఈక్విటీలో కొనుగోలు చేసే విలువతో (క్యాష్ మార్కెట్) ఫ్యూచర్స్‌లో అదే మొత్తంతో ఐదు రెట్లు అధికంగా ట్రేడ్ చేసుకోవచ్చు. ఈక్విటీలో రూ.లక్ష కొనుగోలు చేసుకునేట్టు అయితే, అంతే మొత్తంలో ఫ్యూచర్స్‌లో రూ.5 లక్షల విలువ మేర ట్రేడ్ చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ ప్రధాన ఉద్దేశ్యం మీ పోర్ట్‌ఫోలియో విలువకు హెడ్జ్ చేసుకోవడమే. కానీ, చాలా మంది వేగంగా డబ్బు సంపాదించేందుకు స్పెక్యులేటివ్‌గా దీన్ని చూస్తుంటారు. ట్రేడింగ్ విజయవంతం అయితే గణనీయమైన లాభాలు వస్తాయి. కానీ, ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ ట్రేడింగ్ అన్నది ఎంతో రిస్క్‌తో ఉంటుంది. ఒక్క ట్రేడ్ బెడిసికొట్టినా అప్పటి వరకు ఎన్నో రోజులుగా సంపాదించిన మొత్తాన్ని కోల్పోవాల్సి వస్తుంది. కొన్ని మ్యూచువల్ ఫండ్స్ పథకాలు.. ఆర్బిట్రేజ్ ఫండ్స్, ఈక్విటీ సేవింగ్ ఫండ్స్, డైనమిక్ అస్సెట్ అలోకేషన్ ఫండ్స్ హెడ్జింగ్‌ను ఒక విధానంగా ఉపయోగిస్తాయి. ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ ఆకర్షణీయంగా, సులభంగా డబ్బులు సంపాదించే మార్గంగా అనిపించొచ్చు. కానీ ఇది ఎంతో రిస్క్‌తో ఉంటుంది. గ్యాంబ్లింగ్ కంటే తక్కువేమీ కాదు. ఓ ప్రముఖ ఆన్‌లైన్ బ్రోకర్ సీఈవో సైతం తమ క్లయింట్లలో కేవలం ఒక శాతం కంటే తక్కువ మందే ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్‌లో బ్యాంక్ డిపాజిట్ల కంటే ఎక్కువ రాబడులు సంపాదిస్తున్నట్టు ప్రకటించడాన్ని అర్థం చేసుకోవాలి. రిటైల్ ఇన్వెస్టర్లు ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ ట్రేడింగ్‌కు దూరంగా ఉండడమే సరైనది.

జీఆర్‌టీ జ్యువెలర్స్‌కి ప్రతిష్టాత్మక అవార్డు

'బ్రైడల్ స్టేట్‌మెంట్ జ్యువెలరీ ఆఫ్ ది ఇయర్' గా గుర్తింపు



హైదరాబాద్: జీఆర్‌టీ జ్యువెలర్స్ ప్రతిష్టాత్మక అవార్డు దక్కించుకుంది. ఎఫ్‌యూఆర్ఏ(ఫురా) రిటైల్ జ్యువెలర్ ఇండియా అవార్డ్స్ 2023 కార్యక్రమంలో ''బ్రైడల్ స్టేట్‌మెంట్ జ్యువెలరీ ఆఫ్ ది ఇయర్'' అవార్డు సొంతం చేసుకుంది. ఇటీవల వరల్డ్ గోల్డ్ కౌన్సిల్, సాలిటైర్ జెమోలాజికల్ లేబరేటరీస్ సహకారంతో 18 ఎడిషన్ అవార్డుల వేడుకలు ఘనంగా జరిగాయి. అద్భుతమైన డిజైన్లు మాత్రమే కాకుండా భావోద్వేగాలు ప్రతిఫలించేలా ఆభరణాలను రూపొందించడంలో నిబద్ధతను ఈ అవార్డు ప్రస్ఫుటిస్తోందని సంస్థ ఎండీ శ్రీ ఆనంద్ అనంత పద్మనాభన్ తెలిపారు. భారతీ సంస్కృతిలో వివాహాల వైభవం, ప్రాముఖ్యతను తెలియజేసే కళాఖండాలను తీర్చిదిద్దడంలో జీఆర్‌టీ పూర్తి అంకితభావాన్ని ప్రదర్శిస్తుందని మరో ఎండీ జీఆర్ రాధాకృష్ణన్ పేర్కొన్నారు.




సందడిగా కేన్సర్ అవగాహన పరుగు

గచ్చిబౌలి (హైదరాబాద్): ప్రపంచంలోనే అతిపెద్ద కేన్సర్ అవగాహన పరుగు కార్యక్రమం ఆదివారం 'క్యాంబియంట్ గ్లోబల్ గ్రేస్ కేన్సర్ రన్-2023' పేరిట గచ్చిబౌలి ప్రాంతంలో నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ప్రపంచవ్యాప్తంగా 130 దేశాలలో ఈ రన్ నిర్వహించారు. గచ్చిబౌలి రన్‌లో 15 వేల మంది పాల్గొన్నారు.

రొమ్ము తొలగించకుండానే..

కేన్సర్ కొమ్ము వంచేలా..

ఆంకోప్లాస్టీ పద్ధతిలో మహిళలకు రొమ్ము కేన్సర్ చికిత్స

- ప్రభుత్వ ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రిలో ఉచితంగా ఆధునిక చికిత్సా పద్ధతి
- ఢిల్లీ, ముంబై, పుణే, కోల్‌కతా తర్వాత హైదరాబాద్‌లోనే
- డాక్టర్ మాటూరి రమేష్ నేతృత్వంలోని వైద్యబృందం ఘనత

సాక్షి, హైదరాబాద్

రొమ్ము కేన్సర్ వచ్చిన మహిళా రోగులకు రొమ్ము తొలగించకుండా నిర్వహించే 'ఆంకోప్లాస్టీ' చికిత్స పద్ధతికి ప్రభుత్వ ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి శ్రీకారం చుట్టింది. ఢిల్లీ ఎయిమ్స్, ముంబైలోని టాటా కేన్సర్ ఆస్పత్రి, పుణే, కోల్‌కతాలతో పాటు హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే ఆస్పత్రిలోనే ఈ అధునాతన ఆంకోప్లాస్టీ పద్ధతిలో రొమ్ము కేన్సర్‌కు చికిత్స చేస్తున్నారు. ఎంఎన్‌జేలోని సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ మాటూరి రమేష్ నేతృత్వంలోని వైద్యబృందం ఈ అధునాతన చికిత్స నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు 50 మంది మహిళలకు ఆంకోప్లాస్టీ పద్ధతిలో చికిత్స చేశారు.

పెరుగుతున్న రొమ్ము కేన్సర్ కేసులు

రొమ్ము కేన్సర్లలో 70–80 శాతం మంది వ్యాధి ముదిరిన తర్వాతే మేలుకొంటున్నారు. ఎంఎన్‌జే



కేన్సర్ ఆస్పత్రికి వచ్చే రోగుల్లో ఇలాంటి వారే ఎక్కువగా ఉంటున్నారు. మహిళా కేన్సర్ కేసుల్లో 15 శాతం వరకు రొమ్ము కేన్సర్‌వే ఉంటున్నాయి. అందులో 80 శాతం చాలా అడ్వాన్స్ స్టేజీలో చికిత్సకు వస్తున్నారు. అక్టోబరు నెలను బ్రెస్ట్ కేన్సర్ అవగాహన మాసంగా నిర్వహిస్తున్నారు. రొమ్ము కేన్సర్లకు చికిత్సపరంగా కీమోథెరపీ, సర్జరీ, రేడియేషన్ ఉంటాయి. వ్యాధి రొమ్ము వరకు ఉంటేనే సర్జరీ చేయడానికి అవకాశం ఉంటుంది. అంతకంటే ఎక్కువ ఉండి ఫోర్త్ స్టేజీకు వస్తే నయం చేయలేం. 35 ఏళ్లు దాటిన ప్రతి మహిళ కేన్సర్ స్క్రీనింగ్ టెస్టు చేయించుకోవాలి. ఎంత ముందుగా గుర్తించగలిగితే నయం చేయడానికి అంత ఎక్కువగా అవకాశం ఉంటుంది.

ఆంకోప్లాస్టీ చికిత్స ఇలా..

సాధారణంగా రొమ్ము కేన్సర్‌కు చికిత్సలో మహిళ రొమ్ము మొత్తం తీసేస్తారు. దీనివల్ల వారు మానసికంగా ఆందోళనకు గురవుతారు. అయితే పూర్తిగా రొమ్ము తీసే పద్ధతికి ఎంఎన్‌జే ఆస్పత్రి వైద్యులు చెక్ పెట్టారు. ఆంకోప్లాస్టీ పద్ధతిలో రొమ్ము తొలగించకుండానే సాధారణంగా ఉండేలా చేస్తున్నారు. ఎవరైనా మహిళకు రొమ్ము కేన్సర్‌ను గుర్తించినప్పుడు లేదా ఒకవేళ అది సైజు పెద్దగా ఉంటే కీమోథెరపీ ఇచ్చి గడ్డగా చిన్నగా చేస్తారు. గడ్డ వరకే ఆపరేషన్ చేసినప్పుడు మిగిలిన రొమ్ముపై గుంటలాగా ఉంటుంది. దాన్ని ఆంకోప్లాస్టీ ద్వారా దాన్ని సాధారణ స్థితికి తీసుకొస్తారు. ప్లాస్టిక్ సర్జరీ టెక్నిక్‌ను వాడుకొని ఏడాదిన్నరగా ఈ ఆంకోప్లాస్టీ చేస్తున్నారు. ఆంకోప్లాస్టీ సర్జరీ చేయడానికి నాలుగైదు గంటలు పడుతుంది. రొమ్ము పక్కన చంక సమీపంలోని కండను అంతర్గతంగానే ప్రత్యేక పద్ధతిలో తీసుకొచ్చి రొమ్ములో సర్దుబాటు చేస్తారు. అంటే చంకలో ఉండే అదనపు కొవ్వు, కండ, అవసరమైతే చర్మం కూడా తీసుకొని రొమ్ములో ఎక్కడ అవసరం పడుతుందో అక్కడకు తీసుకొచ్చి కుడతారు. పైకి ఎలాంటి కోత కనిపించకుండా ఆంకోప్లాస్టీ పద్ధతిలో చేస్తారు. ఎంఎన్‌జేలో ఇది పూర్తిగా ఉచితం. అదే కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఆంకోప్లాస్టీ సర్జరీకి ఏకంగా రూ.5 లక్షల వరకు ఉంటుంది.

మూడువారాల్లో సాధారణ స్థితిలోకి..



ఆంకోప్లాస్టీ విధానంపై మేం ప్రత్యేకంగా శిక్షణ పొందాం. ఆంకోప్లాస్టీ సర్జరీ చేశాక మూడునాలుగు రోజుల్లో ఆస్పత్రి నుంచి రోగిని డిశ్చార్జి చేస్తాం. ఈ చికిత్సలో కుట్లు వాటంతట అవే కరిగిపోయేలా ఉంటాయి. కాబట్టి కుట్లు తీయాల్సిన పనిలేదు. మూడువారాల్లో రోగి సాధారణ జీవితం గడపొచ్చు. నొప్పులేమీ ఉండవు. ఇంటికి వెళ్లేప్పుడు డోలో వంటి మాత్రలు మాత్రమే ఇచ్చి పంపిస్తాం.

– డాక్టర్ మాటూరి రమేష్, సర్జికల్ ఆంకాలజిస్ట్, ఎంఎన్‌జే, హైదరాబాద్

రొమ్ము కేన్సర్‌లో ఆంకోప్లాస్టీ ప్రాచుర్యం పొందింది



ఈ నెల 13వ తేదీన ప్రత్యేకంగా రొమ్ము కేన్సర్‌పై అవగాహనకు వాక్ నిర్వహిస్తున్నాం. ఈ మధ్యకాలంలో ఆంకోప్లాస్టీ విధానం ప్రపంచంలో ప్రాచుర్యం పొందుతుంది. ఇండియాలో కొన్నిచోట్ల మాత్రమే ఈ చికిత్స చేస్తున్నారు. అందులో హైదరాబాద్‌లో ఎంఎన్‌జేలో చేస్తున్నాం.

– డాక్టర్ జయలత, డైరెక్టర్, ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి

చుక్కలు చెదిరి.. లెక్కలు మారి..



రాత్రిపూట ఆకాశాన్ని చూస్తే కోట్ల కొద్దీ నక్షత్రాలు కనువిందు చేస్తుంటాయి. అందులో కొన్ని ఆకారాలూ కనిపిస్తుంటాయి. కానీ భవిష్యత్తులో ఆ చుక్కల లెక్కలన్నీ మారిపోతాయని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. నక్షత్రాలన్నీ స్థానం మారిపోతాయని.. ఆకాశాన్ని అత్యంత ప్రకాశవంతమైన వెలుగు ఆక్రమిస్తుందని అంటున్నారు. మరి దానికి కారణం ఏమిటో తెలుసా? మన భూమి, సౌర కుటుంబం ఉన్న పాలపుంత గెలాక్సీ, సమీపంలోని ఆండ్రోమెడా అనే మరో గెలాక్సీ రెండూ ఢీకొని కలిసిపోనుండటమే. ఇప్పటికే ఈ రెండూ ఒకదానికొకటి సమీపంలోకి వస్తున్నాయి. మరో 375 కోట్ల ఏళ్ల తర్వాత ఢీకొనడం మొదలవుతుంది. సుమారు 700 కోట్ల ఏళ్ల తర్వాత రెండూ పూర్తిగా కలిసిపోయి పెద్ద గెలాక్సీగా మారిపోతాయి. ఈ క్రమంలో చాలా నక్షత్రాలు చెల్లాచెదురైపోతాయి. వాటి స్థానాలు మారిపోతాయి. మరి ఇలా రెండూ దగ్గరికి రావడం, కలిసిపోవడం జరుగుతున్నప్పుడు మనకు ఆకాశం ఎలా కనిపిస్తుందనే దానిపై నాసా ఓ వీడియోను రూపొందించింది. చంద్ర ఎక్స్‌రే అబ్జర్వేటరీ తీసిన చిత్రాలు, దాని సాయంతో చేసిన పరిశీలన ఆధారంగా సిద్ధం చేసిన ఈ వీడియోను.. చంద్ర అబ్జర్వేటరీ పేరిట ఉన్న 'ఎక్స్ (ట్విట్టర్)' ఖాతాలో పోస్ట్ చేసింది.

మనం చూసేది పాలపుంతే కాదు..!

మన సౌర కుటుంబం ఉన్న పాలపుంత (మిల్కీవే) గెలాక్సీ అంటూ ఫొటోల్లో, ఇంటర్నెట్‌లో మనం చూస్తున్నది నిజానికి పాలపుంత ఫొటో కానే కాదు. అసలు మనం పాలపుంత మొత్తం చిత్రాన్ని తీయడం సాధ్యమే కాదు. ఎందుకంటే కొన్ని వేల కోట్ల నక్షత్రాలున్న పాలపుంత గెలాక్సీలో మధ్య భాగానికి ఓ పక్కన మన సూర్యుడు, భూమి ఉన్నాయి. పాలపుంత గెలాక్సీ మొత్తాన్ని దాటి బయటికి వెళితే తప్ప దీనిని ఫొటో తీయలేం! ఎలాగంటే.. సముద్రం మధ్య చిన్న పడవలో కెమెరా పట్టుకుని కూర్చున్న మనం వేల కిలోమీటర్లు విస్తరించి ఉన్న సముద్రం మొత్తాన్ని ఫొటో తీయగలమా? ఇదీ అంతే.. మరి మనం చూసే పాలపుంత చిత్రం ఏమిటి అంటారా.. దాదాపుగా పాలపుంతలా ఉండే ఆండ్రోమెడా గెలాక్సీ చిత్రమే. ఈ గెలాక్సీయే భవిష్యత్తులో పాలపుంతను ఢీకొట్టేది.

– సాక్షి సెంట్రల్ డెస్క్

బెంగాల్ మంత్రి నివాసాల్లో సీబీఐ సోదాలు

తృణమూల్ ఎమ్మెల్యే మదన్ నివాసం సహా 12 ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లోని స్థానిక సంస్థల్లో నియామక ప్రక్రియల్లో జరిగిన అవకతవకలు, అవినీతి ఆరోపణలపై సీబీఐ గురిపెట్టింది. రాష్ట్ర పట్టణాభివృద్ధి, మున్సిపల్ వ్యవహారాల శాఖ మంత్రి ఫిర్హాద్ హకీమ్, తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే మదన్ మిత్రాల నివాసాలు సహా రాష్ట్రంలోని 12 ప్రాంతాల్లో సీబీఐ అధికారులు ఆదివారం ఆకస్మిక సోదాలు నిర్వహించారు. మంత్రి హకీమ్ నివాసానికి ఉదయం 9 గంటల సమయంలో వెళ్లిన సీబీఐ అధికారులు సాయంత్రం 6.30 వరకు ఆయనను ప్రశ్నించారు. ఈ సందర్భంగా కొన్ని పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. సీబీఐ అధికారులు హకీమ్ నివాసానికి రాగానే ఆయన అభిమానులు, అనుచరులు భారీ సంఖ్యలో వచ్చి.. సోదాలు నిలిపివేయాలంటూ నిరసనలకు దిగారు. టీఎంసీ పార్టీ వ్యవహారాల్లో అత్యంత కీలకంగా వ్యవహరించే ఎమ్మెల్యే మిత్రాను విచారించిన సీబీఐ.. కామర్తి మున్సిపాలిటీలో నియామకాల్లో ఎమ్మెల్యే పాత్ర ఉన్నట్టు విచారణలో తేలిందని స్పష్టం చేసింది. మున్సిపాలిటీల చైర్మన్‌లు, మాజీ చైర్మన్ల ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. కేంద్ర నిధుల కోసం రాజ్‌భవన్ ఎదుట టీఎంసీ చేస్తున్న ధర్నా నుంచి దృష్టి మరల్చడానికే కేంద్రం సీబీఐని ఉసిగొల్పిందని టీఎంసీ ఆరోపించింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.